సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 166

గురువారం 5-9-2024



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



'టోక్యో'ను దాటేశాం

16లో

పారాలింపిక్స్ క్రీడల చరిత్రలో భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసింది. ప్రస్తుతం పారిస్‌లో జరుగుతున్న పారాలింపిక్స్‌లో భారత్ ఇప్పటి వరకు 22 పతకాలను సాధించింది. గత టోక్యో పారాలింపిక్స్‌లో భారత్ అత్యధికంగా 19 పతకాలను గెల్చుకుంది.

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీ ఎల్జీకి ఫుల్ పవర్స్

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు కేంద్ర ప్రభుత్వం తాజాగా మరిన్ని అధికారాలు కట్టబెడుతూ నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 6లో



అసెంబ్లీ బరిలో ఫొగాట్!

ఒలింపిక్ క్రీడాకారిణి వినేశ్ ఫొగాట్ కాంగ్రెస్ తరఫున హరియాణా శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అవకాశముంది.

- వివరాలు 6లో



ఉ.కొరియాలో 30 మందికి మరణశిక్ష

వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు సరిగా నిర్వహించలేదంటూ 30 మంది అధికారులకు కిమ్ మరణశిక్ష విధించారు.

- వివరాలు 6లో



స్వింగ్ స్టేట్స్‌లో కమల దూకుడు

అమెరికాలో డెమొక్రాట్ల అభ్యర్థి కమలా విజేతగా నిలిచే అవకాశాలు మెరుగవుతున్నట్టు సీఎన్ఎన్ వార్తా సంస్థ సర్వేలో తేలింది.

- వివరాలు 6లో

అన్నిటికీ అదే 'పదివేలు'

కష్టాలు వేనవేలు

సర్వం కోల్పోయాం.. రూ.10 వేల సాయంతో ఉపశమనం ఎంత?

సహాయక శిబిరాల్లోని వరద బాధితుల ఆవేదన



ఖమ్మం రూరల్ మండలంలో నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలోని ఇంట్లో దుర్వాసనతో ముక్కు మూసుకుని సామాన్లు సర్దుకుంటున్న భూక్యా మంగమ్మ, ఆమె కూతురు శిల్ప

- పొద్దున్నే పనులకు వెళ్లిపోవడం, సాయంత్రానికి ఇల్లు చేరి కుటుంబమంతా సంతోషంగా గడపడం.. నిత్యం జరిగేది ఇదే. కానీ ఒక్క రాత్రితో అంతా కకావికలమైపోయింది. మున్నేరు వరదతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, అన్నీ వదిలేసి పరుగులు పెట్టాల్సి వచ్చింది.. వరద తగ్గాక వచ్చి చూస్తే.. బియ్యం, ఉప్పు, పప్పు ఏదీ లేదు.. టీవీ, ఫ్రిడ్జ్, బైక్, ఇతర సామగ్రి ఏదీ మిగల్లేదు.. చేతిలో చిల్లిగవ్వ లేదు.. ఇంట్లో ఏమీ మిగల్లేదు.. పునరావాస కేంద్రాల్లో పెట్టింది తినడం, కన్నీటితో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడటమే మిగిలింది. ప్రభుత్వమేమో 'లెక్క' తేల్చి సాయం చేస్తామంటూ సర్వే మొదలుపెట్టింది. ఇప్పటికే వరద ముంచి మూడు రోజులైంది. సర్వే తేలేసరికి మరో 2,3 రోజులూ అవుతుంది. పైగా ప్రభుత్వం ఇస్తామంటున్నది రూ.10 వేలు. నిండా మునిగిపోయిన తమకు ఈ సాయంతో ఏమాత్రం ఉపశమనం ఉంటుందని బాధితులు నిలదీస్తున్నారు. - 2లో

సర్వేతో సాయానికి జాప్యం

ఇప్పటికిప్పుడు కొంత నగదు ఇవ్వాలి.. కనీసం రూ.50 వేల సాయం చేయాలి..

లేకుంటే వినాయక చవితి పండుగకూ పస్తులే అంటున్న బాధితులు

పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లాక తమను ఎవరూ పట్టించుకోరని ఆవేదన

మరోవైపు మున్నేరు ముంపు ప్రాంతాల్లో వ్యాపించిన దుర్గంధం

వరదలో కొట్టుకొచ్చిన బురద, చెత్తా చెదారం అంతా ఇళ్లలోకి చేరిన వైనం

పారిశుధ్య పనులు సరిపోని దుస్థితి.. పొంచి ఉన్న అంటు వ్యాధుల ముప్పు

జ్వరాలు, చర్మ సమస్యలు, ఎలర్జీలతో ఆస్పత్రులకు వస్తున్న ముంపు బాధితులు

మరో 'దారి' లేకే ముంచేసింది

- మున్నేరు బఫర్‌జోన్ ఆక్రమణలతోనే ఈ విపత్కర పరిస్థితి
- ఆక్రమణలతో కుచించుకుపోయిన ఖమ్మం లకారం చెరువుకు వెళ్లే కాల్వలు -2లో

మేడారం అడవిలో కూలిన చెట్లు



సుడిగాలి మిస్టరీ

మేడారం అడవిలో 500కుపైగా ఎకరాల్లో నేలకూలిన చెట్లు

వాతావరణ మార్పుల ప్రభావమేనంటున్న నిపుణులు

- డ్రోన్ కెమెరాల ద్వారా నష్టాన్ని పరిశీలించిన అధికారులు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన పీసీసీఎఫ్ డోబ్రియాల్
- తల్లుల దీవెనలతోనే బయటపడ్డాం: మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్/సాక్షి, ఏటూరునాగారం/తాడ్వాయి: రాష్ట్రంలో.. ఆ మాటకొస్తే దేశంలోనే అరుదుగా జరిగే బీభత్సం ములుగు అడవుల్లో చోటుచేసుకుంది. ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి మేడారం మీదుగా తాడ్వాయి మండలం గోనెపల్లి వరకు.. దాదాపు 20 కిలోమీటర్ల పరిధిలో 200 హెక్టార్ల (దాదాపు 500 ఎకరాల) విస్తీర్ణంలో 50వేలకుపైగా చెట్లు నేలకూలాయి. ఇది ఎలా జరిగిందనేది మిస్టరీగా మారింది. 4,5 రోజులు ఆగకుండా కురిసిన వర్షాలకు తోడు భారీ సుడిగాలుల (టోర్నడోల)తోనే ఈ ఘటన జరిగినట్టు అంచనా వేస్తున్నారు.

లోతుగా అధ్యయనం అవసరం: టోర్నడోలు చాలా వరకు బహిరంగ ప్రదేశాల్లోనే వస్తాయని.. ఇంత పెద్ద ఎత్తున చెట్లతో నిండి ఉన్న అటవీ ప్రాంతంలో వచ్చే వీలు లేదని వాతావరణ, నీటి వనరుల నిపుణుడు బీవీ సుబ్బారావు తెలిపారు. ములుగు ప్రాంతంలో ఈ పరిణామం చాలా విచిత్రంగా ఉందని.. అయితే మూడేళ్ల క్రితం

మిగతా 13వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రైతులకు సోలార్ పంప్‌సెట్లు



రైతులకు ఉచితంగా సోలార్ పవర్ పంప్‌సెట్లను పంపిణీ చేసి, సౌర విద్యుత్ వినియోగించేలా వారిని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తన సొంత గ్రామం కొండారెడ్డి పల్లెను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు.

- వివరాలు 5లో


వరద నష్టంపై వివరాలివ్వరా?



తెలంగాణలో భారీవర్షాలు, వరదల కారణంగా ఏర్పడిన తీవ్ర నష్టానికి సంబంధించిన వివరాలు అందజేయక పోవడంపై కేంద్ర హోంశాఖ.. రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

- వివరాలు 3లో

వరద బాధితులకు బీఆర్ఎస్ విరాళం



వరద బాధితులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల తరఫున ఒక నెల వేతనం విరాళంగా ఇస్తున్నట్లు ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రకటించారు.

- వివరాలు 3లో

47 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



అత్యుత్తమ ప్రతిభ కనబరచిన అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందించనుంది. ఉపాధ్యాయులు, అధ్యాపకులు కలిపి మొత్తం 113 మందికి ఇవ్వనుంది.

- వివరాలు 14లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

Venco CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	99 kg	Dressed with Skin	175 kg
₹ 68	Retail Live Bird	121 kg	Skin Less	200 kg

Conditions Apply

Issued in the interest of consumers



కేసముద్రం-ఇంటికన్నె మధ్య ప్రయాణికులతో నడుస్తున్న గోల్కొండ ఎక్స్‌ప్రెస్

కూ.. చకచకా..

52 గంటల్లో డౌన్ రైల్వేలైన్ పనులు పూర్తి... కొనసాగుతున్న అప్ లైన్ పనులు

20కి పైగా జేసీబీలతో పనులు.. శ్రమించిన 900 మంది కార్మికులు, 250 మంది సూపర్‌వైజర్లు, 400 మంది రైల్వే ఉద్యోగులు

సాక్షి, మహబూబాబాద్: భారీ వర్షాల తో మహబూబాబాద్ జిల్లాలో కొట్టుకుపోయిన రైల్వే లైన్ల పనులను రైల్వే అధికారులు, సిబ్బంది, కార్మికులు శరవేగంగా పూర్తి చేశారు. మొత్తంగా 52 గంటల్లో పనులు పూర్తి చేసి ట్రయల్‌రన్ నడిపించారు. అంతా సవ్యంగా ఉండడంతో బుధవారం మధ్యాహ్నం విజయవాడ- సికింద్రాబాద్ మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు కదిలింది.

పగలూ.. రాత్రి తేడా లేకుండా...: వరద ఉధృతి పెరిగి తాళ్లపూసపల్లి- కేసముద్రం రైల్వేలైన్‌లోని 432, 433 కిలోమీటరు మార్కు వద్ద 200 మీటర్ల మేర పట్టాల కింద కంకర, మట్టి, సిమెంట్ దిమ్మెలు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇంటికన్నె- కేసముద్రం మార్గంలో 418 కిలోమీటర్ రాయి వద్ద 200 మీటర్ల మేర, మరో నాలుగు చోట్ల పాక్షికంగా లైన్లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో శనివారం అర్ధరాత్రి 2 గంటల నుంచి రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. ఆదివారం కూడా వరద ఉధృతి తగ్గకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి కార్మికులను తీసుకొచ్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

పనులు వేగంగా..: దేశంలోని ప్రధాన పట్టణాలను కలుపుతూ నడిచే రైలుమార్గం దెబ్బతినడంతో ఎక్కడి రైళ్లు అక్కడే నిలిచిపోగా, దీంతో

మిగతా 5వ పేజీలో ▶

'చంద్రబాబు'పై విచారణకు మేం రెడీ

- ఐఎంజీ భారత సంస్థకు అక్రమ భూ కేటాయింపుపై దర్యాప్తు చేస్తాం
- దీనివెనుక ఉన్న వారెవరో తేలుస్తాం
- హైకోర్టుకు తెలిపిన సీబీఐ
- తదుపరి విచారణ నేటికి వాయిదా వేసిన సీజే ధర్మాసనం
- క్రీడాభివృద్ధి పేరిట ఐఎంజీ భారతకు 850ఎకరాల విలువైన భూములను కేటాయించిన బాబు సర్కార్
- పిల్‌లపై కొనసాగుతున్న విచారణ

సాక్షి, హైదరాబాద్: ఐఎంజీ అకాడెమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్)కు అక్రమంగా భూములు కేటాయించడంపై దర్యాప్తునకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ హైకోర్టుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తెలిపింది. కోర్టు ఆదేశిస్తే నాటి సీఎం చంద్రబాబు నాయుడు కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై విచారణ చేపడతామని పేర్కొంది. అక్రమ భూ కేటాయింపు వెనుక ఉన్న వారెవరో తేలుస్తామని స్పష్టం చేసింది. ఈ కేసు దర్యాప్తునకు తాము ఎప్పుడూ వెనకడుగు వేయలేదని, వసతుల లేమి కారణంగా ప్రాథమిక విచారణ సీబీసీఐడీతో చేయిస్తే, తదుపరి దర్యాప్తు తాము చేపడతామని చెప్పామని, అదే విషయం ఈ కోర్టుకు సమర్పించిన కౌంటర్‌లోనూ వెల్లడించామని వివరించింది. 'హైదరాబాద్ పరిధిలో రూ.వేల కోట్ల విలువైన (నేటి విలువ ప్రకారం రూ.లక్ష కోట్లు) 850 ఎకరాల ప్రభుత్వ భూములను కారుచౌకగా ఓ బోగస్ కంపెనీకి నాటి చంద్రబాబు ప్రభుత్వం కేటాయించింది. ఆ కంపెనీకి రూ.వందల కోట్ల రాయితీలు ఇవ్వడమే కాకుండా హైదరాబాద్ లోని స్టేడియాలు కూడా అప్పగించింది. దీని వెనుక చంద్రబాబు సర్కార్ పెద్దలు ఉన్నారు. బోగస్ కంపెనీకి ఇన్ని వందల ఎకరాలు, రూ.వందల కోట్లు ఎందుకు కేటాయించారు? దీని వెనకున్న వారెవరో తేలాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలి..' అని కోరుతూ సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, న్యాయవాది శ్రీరంగారావు 2012లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. నాటి నుంచి ఈ పిటిషన్లపై విచారణ సాగుతూనే వస్తోంది. తాజాగా బుధవారం ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాస్ రావు ధర్మాసనం ఈ వ్యాజ్యాలపై మరోసారి విచారణ చేపట్టింది.



విచారణకు అభ్యంతరం లేదు: సీబీఐ

సీబీఐ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహాశర్మ వాదనలు వినిపిస్తూ.. 'కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేపట్టేందుకు సిద్ధంగా సీబీఐ ఉంది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్

మిగతా 12వ పేజీలో ▶

ఐటీలో మేటిగా తెలంగాణ

ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల ఆధారంగా అభివృద్ధి సాధిస్తాం

బెంగళూరును అధిగమించే దిశగా ప్రయత్నాలు చేస్తాం

ఏఐ టెక్నాలజీని ప్రోత్సహించే దిశగా 'ఏఐ సిటీ' నిర్మాణం

నేటినుంచి జరిగే 'ఏఐ సమ్మిట్'లో ఏఐ నిపుణుల తయారీపైనా చర్చ

14లో

'సాక్షి' ఇంటర్వ్యూలో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు





కలిసి పని చేస్తేనే కలిమి



సింగపూర్‌లో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డోలు వాయిస్తున్న మోదీ

- అభివృద్ధి విధానానికి తాము మద్దతు ఇస్తామని, విస్తరణవాదాన్ని తిరస్కరిస్తామని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. చైనా పేరు ప్రస్తావించకుండా పరోక్షంగా ఆ దేశ వైఖరిని ఎండగట్టారు. ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా మోదీ బుధవారం బ్రూనై సుల్తాన్ హసనల్ బొల్కియాతో సమావేశమయ్యారు. భారతదేశ 'తూర్పు కార్యాచరణ', ఇండో-పసిఫిక్ దార్శనికత విషయంలో బ్రూనై తమకు అత్యంత కీలక భాగస్వామి అని చెప్పారు. అనంతరం మోదీ బ్రూనై పర్యటన ముగించుకొని సింగపూర్ చేరుకున్నారు.

- వివరాలు 6లో

సీఎంగా అర్హుడివేనా?

చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

విజయవాడ విపత్తుకు ముమ్మాటికి తప్పు బాబుదే..



12లో

పాత రాజరాజేశ్వరి పేటలో అవ్వను ఓదారుస్తున్న వైఎస్ జగన్

వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే

వరదలకు ఇప్పటికే 32 మంది బలి.. ఇంకా ఎందరు చనిపోయారో లెక్క తెలియడం లేదు

సహాయక చర్యల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలం

తన తప్పు కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం

బాబు తన ఇంటి కోసమే విజయవాడను ముంచారు

మృతుల కుటుంబాలకు 25 లక్షల చొప్పున ఇవ్వాలి

అత్యధికం ఆకలి చావులే!

పదుల సంఖ్యలో వెలుగు చూస్తున్న మృతదేహాలు

మొన్న 32.. నిన్న 15.. మొత్తం 47..

విజయవాడలో వరద ముంపులో చిక్కుకుని నీరు, తిండి లేక తనువు చాలిస్తున్న అభాగ్యులు

ఆదుకునే దిక్కులేక ఇళ్లలోనే కొందరు మృత్యువాత

తప్పించుకోబోయి నీటిలో గల్లంతై మృతి చెందిన వారు మరి కొందరు

మునిగిన ఇళ్ల గోడలపై వేలాడుతున్న అనాథ శవాలు

'సాక్షి' చెప్పడంతో ఇందిరానాయక్ నగర్‌కు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్.. అనాథగా పడి ఉన్న మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చిన బలగాలు

వరదలో ఇలా చనిపోయి.. లెక్క తేలని వారు ఇంకెందరో.. గల్లంతైన వారి కోసం ఆస్పత్రి మార్చురీలో కుటుంబ సభ్యుల వెదుకులాట

- వివరాలు 12లో

కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండండి

మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదల కారణంగా కష్టాల పాలైన ప్రజలకు అండగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులు, సిబ్బందిని పీఆర్ మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కోరారు. బుధవారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖలపై పీఆర్–ఆర్‌డీ సెక్రటరీ లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్‌లతో కలిసి సీతక్క ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పీఆర్–ఆర్‌డీ జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, రహదారుల పునరుద్ధరణ కోసం తక్షణ అవసరంగా 24 కోట్లు మంజూరు చేశామని, మరిన్ని నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

ఫ్లడ్ మేనేజ్‌మెంట్ కమిటీలు..

విపత్తుల సమయంలో ముందస్తుగా అప్రమత్తం అయ్యేందుకు ప్రతి మండలంలో ఐదుగురు అధికారులతో ఫ్లడ్ మేనేజ్‌మెంట్ కమిటీలు నియమించాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు, వాగులు, కాలువలపై వెలసిన అక్రమ కట్టడాలను గుర్తించి..వాటి వివరాలను ఆయా జిల్లా కలెక్టర్‌కు అందచేయాలని ఆదేశించారు. ఈ కష్టకాలంలో చిత్తశుద్ధితో పనిచేసే సిబ్బందిని గుర్తించి ప్రశంసిస్తామని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

పనికి ఎక్కువ.. పబ్లిసిటీకి తక్కువ ప్రాధాన్యమిస్తాం

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రాక్టికల్ పార్టీ అని, వాస్తవాలకు దగ్గరగా ఉంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. అందుకే తమ పార్టీ నేతలు పనికి ఎక్కువ, పబ్లిసిటీకి తక్కువ ప్రాధాన్యం ఇస్తారని తెలిపారు. కానీ, బీఆర్‌ఎస్ పరిస్థితి అది కాదని, వాళ్లు పబ్లిసిటీకి దగ్గరగా, పనికి దూరంగా ఉంటారని ఎద్దేవా చేశారు. బుధవారం గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బైకాని లింగం యాదవ్‌లతో కలిసి జగ్గారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగమంతా బాధ్యతగా పనిచేస్తోందని చెప్పారు. సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు, పార్టీకేడర్ అంతా క్షేత్రంలోనే ఉండి ప్రజాసేవలో ఉన్నారని తెలిపారు. కానీ పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఆ అధికారం లేకపోయేసరికి తేరుకోలేకపోతోందని, వరదల సమయంలోనూ రాజకీయాలు చేస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీగా ఎలా వ్యవహరించాలో తెలియకపోతే బీఆర్‌ఎస్ నేతలు తమ వద్దకు వస్తే ట్రైనింగ్ ఇస్తామని హితవు పలికారు. ప్రకృతిని ఎవరూ అంచనా వేయలేరని, అయినప్పటికీ తమ ప్రభుత్వం అప్రమత్తమై ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

శిథిలమైన బడిని.. గుడిని చేసి..



పూర్వపు విద్యార్థులు అనంతరెడ్డికి బహుమతిగా ఇచ్చిన బుల్లెట్ బండి

షాబాద్: పల్లె అనంతరెడ్డి.. హైతాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్.. చిన్నప్పుడు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు.. పలక, బలపం కొనిచ్చే పరిస్థితి కూడా లేదు. ఆ సమయంలోనే అతని గురువులు సాయం చేశారు. అన్నీ సమకూర్చారు. దీన్నే అనంతరెడ్డి స్ఫూర్తిగా తీసుకున్నారు. పేద విద్యార్థుల కోసం తన జీతంతోపాటు జీవితాన్ని అంకితం చేశారు. 'నేను విధుల్లో చేరినప్పుడు కొండాపూర్ యూపీఎస్ శిథిలమైన గదుల్లో కొనసాగుతోంది. 1 నుంచి 7వ తరగతి వరకు 150 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో స్కూల్ ఆవరణలో తడకలు వేయించి పాఠాలు చెప్పా. ఆ తర్వాత ప్రభుత్వ నిధులు, దాతల ద్వారా రూ.70 లక్షలతో ఏడు రూమ్‌లు నిర్మించాం. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు వ్యక్తుల సహకారంతో మరో రూ.30 లక్షలు పెట్టి సకల సౌకర్యాలు సమకూర్చాం. కరోనాలో పేద ప్రజలకు రూ.60 లక్షల విలువైన నిత్యావసరాలు పంపిణీ చేశాం. స్మార్ట్ ఫోన్లు, టీవీలు ఇప్పించి విద్యార్థులకు డిజిటల్ బోధన కొనసాగించాను. హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయించా. ప్రస్తుతం అక్కడ 1,100 మంది చదువుతున్నారు' అని అనంతరెడ్డి చెబుతున్నప్పుడు ఆయన కళ్లల్లో అనంతమైన సంతృప్తి కనిపించింది. తర్వాత అక్కడి నుంచి ఆయన హైతాబాద్ పాఠశాలకు బదిలీ అయ్యారు. అంతేకాదు.. నిరుపేద విద్యార్థులకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడూ తన వంతు సాయాన్ని అందిస్తూ అనంతరెడ్డి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



ఆటపాటలతో పాఠాలు..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కవిత టీచర్ క్లాసంటే పిల్లలకు ఎంతో ఇష్టం. ఎందుకంటే.. ఆమె ఆటపాటలతో పాఠాలను చెప్పేస్తారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం పెద్దరాజమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కవిత.. విద్యార్థులకు ఇంటి వద్ద లభించే కాగితం, అట్టముక్కలను తక్కువ ఖర్చుతో వివిధ రూపాల్లోకి మార్చి వాటి ద్వారా క్లాసులు బోధిస్తున్నారు. గణితంలో ఎక్కాల చక్రం, స్నేక్ ల్యాడర్ గేమ్, నంబర్స్, అల్ఫాబెట్స్ కాన్సెప్ట్ గేమ్ పేరుతో విద్యార్థులను ఆకట్టుకుంటూ వారికి అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్నారు. నేలపై చుట్టూరా విద్యార్థులను కూర్చోబెట్టుకొని ప్రతి అంశంపై బొమ్మల ద్వారా బోధిస్తున్నారు. అంతేకాదు.. గణితం, సైన్స్, తెలుగు వంటి సబ్జెక్ట్‌లకు సంబంధించి విద్యార్థులకు బోధిస్తున్న అంశాలను, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఇన్‌స్టా గ్రాం, యూట్యూబ్ చానల్ ద్వారా అందరికీ తెలియజేస్తూ లక్షలాది మంది ఫాలోవర్లను సంపాదించుకున్నారు.



మరో 'దారి' లేకే ముంచేసింది

మున్నేరు బఫర్‌జోన్ ఆక్రమణలతోనే ఈ విపత్కర పరిస్థితి

- కబ్జాలతో కుచించుకుపోయిన ఖమ్మం లకారం చెరువుకు వెళ్లే కాల్వలు
- ఫలితంగా నీరు దారి మళ్లడంతో ఖమ్మంలో కాలనీలను ముంచెత్తిన వరద



మున్నేరు పరీవాహక ప్రాంతంలో నివాసాలను ముంచెత్తిన వరద

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మున్నేరుకు ఒకవైపు ఖమ్మం నగరం..మరోవైపు ఖమ్మం రూరల్ మండల పరిధిలోని గ్రామాలు ఉన్నాయి. రెండువైపులా తొమ్మిది కిలోమీటర్ల చొప్పున 18 కిలోమీటర్ల వరకు మున్నేరు ప్రవహిస్తోంది. ఈ ప్రాంతాల్లోని బఫర్‌జోన్‌లో కొన్నేళ్లుగా అక్రమ కట్టడాలు వెలిశాయి. అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడంతో సహజ సిద్ధంగా మున్నేరు ప్రవాహానికి అడ్డంకులు ఎదురయ్యాయి. ఎగువనుంచి భారీ వరద రావడంతో మున్నేరు తన గమ్యం మార్చుకొని అక్రమ కట్టడాలను ముంచెత్తింది. ఖమ్మం నగరానికి మరోవైపున ఉన్న లకారం నాలాల ఆక్రమణలతో చెరువుల్లోకి నీరు చేరలేదు. దిగువన మున్నేరు తాకిడి.. ఎగువన లకారంలోకి నీరు వెళ్లే మార్గం లేక ఖమ్మం నగరం చుట్టూ ఉన్న కాలనీలను వరద ముంచెత్తింది.

ఇష్టారీతిన నిర్మాణాలు

బఫర్‌జోన్లలో వ్యవసాయం చేయడం తప్ప ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదు. అయితే రెవెన్యూ, విద్యుత్, రిజిస్ట్రేషన్ శాఖలు ఈ నిబంధనలను తుంగలో తొక్కి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో బఫర్‌జోన్ క్రమంగా ఆక్రమణల బారిన పడింది. గత ఏడాది జూలై చివరలో, ఈ నెల 1న మున్నేరుకు వచ్చిన వరద బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేసిన వారికి గుణపాఠంలా నిలిచింది. ఈ ప్రాంతాల్లో విద్యుత్ కనెక్షన్లు, రోడ్ల సౌకర్యం ఇలా మౌలిక వసతులన్నీ కల్పించడంతో ఆక్రమణలు మరింతగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ అధికారులు, అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధుల సహకారంతో బఫర్‌జోన్లలో నిర్మాణాలు చేసుకున్నా.. ప్రకృతి విపత్తులు వేళ కట్టుబట్టలతో నిలబడాల్సిన పరిస్థితులు వస్తాయనే సత్యాన్ని ఈ వరదలు చెబుతున్నాయి.

ముప్పు తప్పాలంటే..

భవిష్యత్‌లో మున్నేరు ముప్పు తప్పాలంటే ఆక్రమణలపై ఉక్కుపాదం మోపడం ఒక్కటే మార్గమనే వాదన వినిపిస్తోంది. రిటైనింగ్ వాల్ నిర్మించినా భవిష్యత్‌లో ఆక్రమణలు మరింతగా పెరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటేనే ఖమ్మం నగరంతోపాటు ఖమ్మంరూరల్ మండలాల్లోని మున్నేరు పరీవాహక ప్రాంతాలు సురక్షితంగా ఉంటాయి. మున్నేరు సమీపంలో నిర్మాణాలు ఏర్పరుచుకున్న వారికి పునరావాసం కల్పించి ఇక్కడి నుంచి ఖాళీ చేయించాలనే చర్చ నగరంలో జరుగుతోంది.

వర్ష సూచనతో భయం.. భయం

బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పలు సార్లు ఆగిఆగి వర్షం పడింది. దీంతో ప్రభుత్వ సహాయక కార్యక్రమాలు, బాధితులు తమ ఇళ్లను శుభ్రం చేసుకునే పనులకు ఆటంకం కలిగింది. ఎగువన ఉన్న మహబూబాబాద్ జిల్లాలో మళ్లీ వర్షాలు పడుతున్నాయన్న సమాచారంతో ముంపు బాధితులంతా ఈనెల 1న తమను ముంచిన కాళరాత్రిని గుర్తు చేసుకుంటూ భయాందోళనలో ఉన్నారు.

కనీవిని ఎరగని నష్టం..

గత ఏడాది జూలై చివరివారంలో మున్నేరుకు 30.7 అడుగుల మేర వరద వచ్చింది. అప్పుడు మున్నేరు పరీవాహకంలోని ఇళ్లు నేలమట్టం కావడంతోపాటు దెబ్బతిన్నాయి. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కుటుంబాలపై ఈనెల 1వ తేదీన మరోసారి వరద పిడుగు పడింది. ఈసారి 36.9 అడుగుల మేర మున్నేరుకు వరద రావడంతో పరీవాహకంలోని కుటుంబాలకు కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలలేదు. వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ పనులు, ఆటో నడుపుకుంటూ జీవనం వెళ్లదీసుకునేవారే ఎక్కువగా ఇక్కడ నివాసమున్నారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏంటంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈసారి వచ్చిన వరదలతో 7వేలకు పైగా ఇళ్లు నీటమునగ్గా.. 10 వేల మంది నిరాశ్రయులయ్యారు.

నాలాల ఆక్రమణతో..

బఫర్‌జోన్ నిర్మాణాలు మున్నేరు పరీవాహక ప్రాంతాన్ని ముంచగా.. నాలాల ఆక్రమణలు నగరాన్ని ముంచెత్తాయి. ఖమ్మం నగరాన్ని ఆనుకొని ఉన్న పలు చెరువులకు వచ్చే అలుగు కాల్వలకు ఇరువైపులా ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బల్లేపల్లి, ఖానాపురం, లకారం గొలుసుకట్టు చెరువులు. అయితే వీటి మధ్య వరద కాల్వల పరిమాణం తగ్గిపోయింది. ఈ వరద కాల్వలను ఆనుకొని నిర్మాణాలు వెలిశాయి. ఈ ఆక్రమణలతో ఇటీవల వచ్చిన వరదలతో నీరు వెళ్లే మార్గం లేక కాలనీలను ముంచెత్తాయి. నగరంలోని పలు కాలనీల్లోకి నీరు వచ్చింది. చెరువులకు వెళ్లే నాలాల వెడల్పును తగ్గించుకుంటూ వెళితే నీరు వెళ్లేందుకు మార్గం లేక ఇళ్లను ముంచెత్తుతున్నాయి. అయితే నాలాలు ఆక్రమణలకు గురికాకపోతే...ఈ నీళ్లన్నీ దిగువన ఉన్న మున్నేరులోకే వెళ్లేవి.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలి

సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: వర్షాలు, వరదలతో ఎక్కడైనా విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతింటే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. పునరుద్ధరణ చర్యల్లో ఎలాంటి సమస్యలొచ్చినా సంబంధిత విద్యుత్ సంస్థల సీఎండీల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఏకధాటిగా భారీ వర్షం కురుస్తున్నా విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ చర్యల్లో పాల్గొన్నారని ఆయన ప్రశంసించారు. పునరుద్ధరణ చర్యల సందర్భంగా అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో రాజీపడరాదని భట్టి సూచించారు. వరద నష్టంపై అంచనాలను రూపొందించాలని సీఎండీలను ఆదేశించారు. సమీక్షలో ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ పాల్గొన్నారు.

ఫాంహౌస్‌లో కూర్చున్న మీరా మమ్మల్ని విమర్శించేది: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: 'గతంలో వరదలు వచ్చినప్పుడు విదేశీ కుట్ర అంటూ మతి లేని ప్రకటనలు చేసి ఫాంహౌస్‌లో కూర్చున్న బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు మమ్మల్ని విమర్శిస్తారా' అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. '2022లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాల కారణంగా వరదలొచ్చాయి. ఆ వరదల నుంచి ప్రజల దృష్టిని మరల్చడంతో పాటు నాటి ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు క్లౌడ్ బరస్ట్ అని, విదేశీ కుట్ర అని కేసీఆర్ మతిలేని ప్రకటనలు చేశారు. నాడు ప్రకృతి పరంగా వచ్చిన వర్షాలను కుట్ర కోణంలో చూసిన బీఆర్‌ఎస్ పెద్దమనిషి, ఆయన అల్లుడు హరీశ్‌రావులు ఇప్పుడు వచ్చిన వర్షాలను కూడా కుట్ర కోణంలోనే చూస్తున్నారా? మేం వారిలాగా మతిలేని ప్రకటనలు చేయం' అని బుధవారం ఒక ప్రకటనలో ఆయన వెల్లడించారు. వరద కష్టాల్లో ఉన్న ప్రజలను పరామర్శించడానికి మాజీ సీఎంకు సమయం లేదా అని నిలదీశారు. ఆయన కుమారుడు కేటీఆర్ అజ్ఞానంతో ఇష్టమొచ్చినట్టు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిరా చుక్క పోయిందో లేదో మొదలు పెట్టారు..

అధికార పార్టీని తిట్టడమే ప్రతిపక్ష పార్టీ పని అని అన్నట్టుగా దాడి చేస్తున్నారని, ఓటు వేసిన వేలుకు పెట్టిన సిరా చుక్క పోయిందో లేదో తమ మీద విమర్శలు మొదలు పెట్టారని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. 'ఊహించని నష్టం వాటిల్లినా ప్రభుత్వం తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల కారణంగా వీలైనంత ప్రాణనష్టాన్ని తగ్గించాం. చినుకు మొదలైనప్పటి నుంచే క్షేత్ర స్థాయిలోకి వెళ్లాం. సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి, సహచర మంత్రులం బాధితులను ప్రత్యక్షంగా కలిశాం. సీఎం రేవంత్‌రెడ్డి రాత్రి ఇక్కడే బసచేసిమరీ ప్రజలను ఆదుకున్నారు. బీఆర్‌ఎస్ బురద రాజకీయాలను మేం పట్టించుకోవడం లేదు' అని ఆ ప్రకటనలో పొంగులేటి స్పష్టం చేశారు.

అన్నిటికీ అదే 'పదివేలు'.. కష్టాలు వేనవేలు

సర్వం కోల్పోయాం.. రూ.10 వేల సాయంతో ఉపశమనం ఎంత? ● సహాయక శిబిరాల్లోని వరద బాధితుల ఆవేదన

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: భారీ వరదలతో ఖమ్మం జిల్లాలో సర్వం కోల్పోయిన మున్నేటి ముంపు బాధితులు తీవ్ర ఆందోళనలో పడిపోతున్నారు. వేలాది మంది పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. వరదల్లో మునిగిన ఇళ్లలో ఏమీ మిగల్లేదు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ముంపు వివరాల లెక్క తేల్చేందుకు సర్వే చేపటింది. అది ముగిశాక బాధితుల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేస్తామని ప్రకటించింది. దీనిపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరదలతో ఇప్పటికే మూడు రోజులు గడిచిందని, సర్వే పూర్తయి, డబ్బులు వచ్చేవరకు మరికొన్ని రోజులు పడుతుందని.. అప్పటివరకు ఎలా బతకాలని వాపోతున్నారు. వినాయక చవితి పండుగకు పస్తులు ఉండేల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేతో నిమిత్తం లేకుండా ఇంటింటికి తక్షణ ఆర్థిక సాయం చేస్తే కొంతైనా ఉపశమనం ఉంటుందని అంటున్నారు. సర్వే చేసి ఇస్తామన్న రూ.10 వేలు ఏమాత్రం సరిపోవని.. కనీసం రూ.50 వేలు అందించాలని కోరుతున్నారు.



ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులు

సర్వేతో సాయం జాప్యం..

వరదలతో మున్నేటి పరీవాహకంలో ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాల్లో 10 వేల మంది నిరాశ్రయులయ్యారు. ఇళ్లలో సామగ్రి మొత్తం కొట్టుకుపోయింది. తడిసి పాడైపోయింది. ఈ క్రమంలో ముంపు వివరాల సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 1నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించింది. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 14 డివిజన్లతోపాటు ఖమ్మం రూరల్ మండలంలో 250 మంది సిబ్బంది నియమించి.. ఒక్కొక్కరికి 60 నుంచి 70 ఇళ్ల వివరాలు సేకరించే బాధ్యతను అప్పగించింది. వారు ఇంటి యజమాని పేరు, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. అయితే సిబ్బంది తక్కువగా ఉండటంతో సర్వే ఆలస్యం అవుతోందని విమర్శలు వస్తున్నాయి.

ఎటు చూసినా చెత్తాచెదారం.. దుర్గంధం

మున్నేటికి రెండువైపులా 9 కిలోమీటర్ల మేర ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాల్లో మున్నేరు ముంపు దుర్గంధమయం చేసింది. ఎగువ నుంచి భారీగా వచ్చిన వరదతో.. బురద, చెత్తాచెదారం, కట్టెలు, వ్యర్థాలు కొట్టుకువచ్చి కాలనీలు, ఇళ్లలో చేరాయి. 8 వేలకుపైగా ఇళ్లలో బురద చేరింది. వరద కాస్త తగ్గుముఖం పట్టాక ముంపు ప్రాంతంలోని ఏ కాలనీలో, ఏ ఇంట్లో చూసినా.. బురద, చెత్తాచెదారంతో దుర్వాసన వస్తోంది. వరదలో కొట్టుకొచ్చిన పాములు, తేళ్లు, కప్పలు, ఇతర జంతువుల కళేబరాలు కుళ్లిపోయి మరింత దుర్గంధం వస్తోంది. వరదకు కొట్టుకొచ్చిన పెద్ద దుంగలు, విరిగిపడిన చెట్లు, కరెంటు స్తంభాలు, రేకులు వంటివాటితో రోడ్లు, వీధులన్నీ నిండిపోయి.. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది.

నెమ్మదిగా పనులు.. నీళ్లు సరిపోక అవస్థలు

మున్నేరు ముంపు ప్రాంతాల్లో బురద, చెత్తను జేసీబీలు, ట్రాక్టర్లతో తొలగిస్తూ.. కాలనీల్లో రోడ్లను శుభ్రం చేసేందుకు ట్యాంకర్లు, ఫైరింజన్లను వినియోగిస్తున్నారు. బాధితులకు నీళ్లు అందించేందుకు ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాతోపాటు నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి 980 మంది పారిశుద్ధ్య కార్మికులను కూడా రంగంలోకి దింపారు. కానీ పారిశుద్ధ్య పనుల వేగం సరిపోవడం లేదు. ఇళ్లు, సామగ్రిని శుభ్రం చేసుకోవాలనుకున్నా.. ట్యాంకర్ల నీళ్లు అందడం లేదని బాధితులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లోనే ట్యాంకర్లు తిరుగుతున్నాయని అంటున్నారు.

ఇప్పటికే ఆరోగ్య సమస్యలు మొదలు!

మున్నేరు లోతట్టు ప్రాంతాలైన.. ఖమ్మం నగరంలోని 14 డివిజన్లలో ఉన్న 40 కాలనీలు, ఖమ్మంరూరల్ మండలంలోని 20 కాలనీల్లో చెత్తాచెదారం మరింత ఎక్కువగా నిండిపోయింది. మురుగు ప్రవహిస్తుండటం, ఇళ్లలో బురద, తడి ఆరకపోవడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ముంపు ప్రాంతాల్లో 13 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయగా.. చాలా మంది బాధితులు ఎలర్జీ, చర్మ సంబంధిత ఇబ్బందులు, జ్వరాలతో వస్తున్నారని వైద్య సిబ్బంది చెప్తున్నారు. సీజనల్ జ్వరాలు, జలుబుకు తోడు ఎక్కువ సమయం కలుషిత నీటిలో గడపడం వల్ల ఎలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఆస్పత్రికి వస్తున్నారని ఇక్కడి ఆరోగ్య కేంద్రంలోని స్టాఫ్ నర్సు మలిదు కృష్ణవేణి వెల్లడించారు.

ప్రాణాలు తప్ప ఏమీ మిగల్లేదు

ఖమ్మం రూరల్ మండలంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కాలనీలోని ఓ ఇంట్లో భూక్యా హుస్సేన్ ఆరేళ్లుగా అద్దెకు ఉంటున్నారు. హమాలీ పనిచేస్తూ జీవిస్తున్నారు. గత ఏడాది మున్నేరు వరదల సమయంలో కూతురి పెళ్లి కోసం దాచిపెట్టిన రూ.2లక్షల నగదు, నగలు చోరీకి గురయ్యాయి. ఈసారి వరదల్లో పూర్తిగా నష్టపోయారు. ప్రాణాలు తప్ప ఏమీ మిగలలేదంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాయం పెంచితేనే ఆదుకున్నట్లు..



ఇంట్లో సమస్తం మున్నేటి పాలయ్యాయి. అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులకు వెళ్లి జీవించేవాళ్లం. ఇప్పుడు కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు వచ్చాం. ఇంటికి వెళ్లి చూస్తే సామాగ్రి ఏదీ కూడా పనికిరాకుండా పోయింది. ప్రభుత్వం తక్షణ సాయం రూ.10 వేలు ఇస్తామని చెప్పింది. ఆ డబ్బు తిండికి అవసరమైన సరుకులు, పాత్రలు కొనేందుకు కూడా సరిపోవు. రూ.10 వేలు ఇచ్చినా మా కుటుంబం పునరావాస కేంద్రంలోనే ఉండి పొట్ట నింపుకోవాల్సిందే. సాయం పెంచి అందిస్తేనే ఆదుకున్నట్టు అవుతుంది.

- బానోతు లక్ష్మి, లాల్‌సింగ్
వెంకటేశ్వరనగర్, ఖమ్మం

ఆర్థిక సాయం త్వరగా ఇవ్వాలి



వరదతో ఇంట్లో ఏమీ మిగల్లేదు. ప్రభుత్వం ఇస్తామన్న రూ.10 వేల సాయం దేనికి సరిపోదు. వరదతో బెడ్లు, బట్టలు, బియ్యం, సరుకులు అన్నీ కొట్టుకుపోయాయి. ఇంటికి వెళ్లిన తర్వాత మమ్మల్ని ఎవరూ పట్టించుకోరు. ప్రభుత్వం ఆర్థిక సాయం త్వరగా అందజేయాలి. బురదతో నిండిపోయిన ఇళ్లను శుభ్రం చేయించాలి.

- మిడిగొడ్డి రాజయ్య, ఆండాళ్లు
గోళ్లబజార్, ఖమ్మం

ఇంత విపత్కర పరిస్థితి ఎన్నడూ చూడలేదు: సర్వే సిబ్బంది

మున్నేటి ముంపులో సర్వం కోల్పోయిన వారి వివరాలను సేకరించేందుకు వచ్చిన సిబ్బంది కూడా అక్కడి పరిస్థితులను చూసి చలించిపోతున్నారు. ఖమ్మంరూరల్, వేంసూరు మండలాల్లో ఏఎస్‌ఓలుగా పనిచేస్తున్న వసంత, మరో ఉద్యోగికి సర్వే డ్యూటీ వేశారు. ముంపు ప్రాంతానికి వచ్చినవారు.. తాము 13 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నా ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు.



వరద బాధిత ప్రాంతంలో సర్వే చేస్తున్న వసంత

వరద బాధితుల దృష్టి మళ్లించేందుకే దాడులు: పువ్వాడ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం నుంచి సాయం కోసం ఎదురుచూస్తున్న వరద బాధితుల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ నేతలు ఖమ్మంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులపై దాడులు చేయించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. బాధితులను ఆదుకోవడంలో ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు విఫలమయ్యారన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి పువ్వాడ అజయ్ బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వరద బాధితులకు సహాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మున్నేరు వరదకు సంబంధించి సీఎం రేవంత్‌కు ఎలాంటి అవగాహన లేదని విమర్శించారు. తాను మంత్రిగా మున్నేరు రిటైనింగ్ వాల్ కోసం రూ.650 కోట్లు మంజూరు చేయించినా.. పనులు ఎందుకు జరగడం లేదని పువ్వాడ ప్రశ్నించారు. కాంగ్రెస్ భౌతిక దాడులను ఎదుర్కొనే సత్తా బీఆర్‌ఎస్ పార్టీకి ఉందని ముఠా గోపాల్ అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల సాయం ఏ మూలకూ సరిపోదని నవీన్‌కుమార్ రెడ్డి విమర్శించారు.

వరద తగ్గినా.. బాధలు తగ్గలేదు

సూర్యాపేట జిల్లాలో ఇంకా కోలుకోని నాలుగు గ్రామాలు



సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కూచిపూడిలో ఇంటికింద మట్టి కొట్టుకుపోవడంతో పిల్లర్లపై నిలిచిన ఇల్లు

కోదాడ రూరల్/అనంతగిరి (కోదాడ): భారీ వర్షాలతో నీట మునిగిన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగర్రాయి, కూచిపూడి, అనంతగిరి మండలంలోని కిష్టాపురం, గోండ్రియా గ్రామాలు ఇంకా కోలుకోలేదు. నాలుగు గ్రామాల్లోనూ ఇళ్లలోని నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు అన్నీ తడిసి పాడైపోయాయి. వరదల కారణంగా ఇళ్లలో బురద చేరింది. తినడానికి సరైన తిండి లేదని, దుప్పట్లు లేక చలికి వణికిపోతున్నామని బాధితులు వాపోతున్నారు. మరోవైపు గడ్డివాములు కొట్టుకుపోవడం, బురద నీటిలో తడిసి పాడైపోవడంతో.. పశువులకు మేత లేని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. తొగర్రాయిలో శివాలయం, గ్రామపంచాయతీ కార్యాలయాలు ఇంకా బురదలోనే ఉన్నాయి. గోండ్రియాల గ్రామంలోని తిరపతమ్మతల్లి, గంగమ్మతల్లి ఆలయం, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ, పునాదుల్లోని పిల్లర్లు తేలిపోయేలా కోతకు గురయ్యాయి.

నేడు గురు పూజోత్సవం

మా'స్టారు'.. శేషగిరి సారు..





మట్టిగణపతులను చేయిస్తున్న శేషగిరి

బషీరాబాద్: నెల జీతం కోసం పనిచేసే వారు కొందరుంటే.. అందులో కొంత మొత్తాన్ని విద్యార్థుల కోసం ఖర్చు పెట్టి పాఠాలు చెప్పే సార్లు అరుదుగా ఉంటారు. అలాంటి కోవకు చెందిన వారే శేషగిరి సారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్‌తండాలో ఉపాధ్యాయుడిగా ఆయన చేసిన సేవలతో విద్యార్థులు, గ్రామస్తుల మనసు గెలుచుకున్నారు. 2018లో మంతన్‌గౌడ్ స్కూల్‌కు వచ్చిన ఆయన గత జూలై వరకూ పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో వేరే పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో మా సారు మాకే కావాలి.. అంటూ గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టర్‌కు వినతిపత్రంఅందజేశారు. ఆయన రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పనిచేసి పాఠశాల రూపురేఖలు మార్చేశారు. స్కూల్ ఆవరణలోనే కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు పండించి, వాటిని మధ్యాహ్న భోజనం కోసం వాడేలా చేశారు. ఆత్మరక్షణ కోసం విద్యార్థులకు కరాటే శిక్షణ ఇప్పించారు. అంతేకాదు.. ఏటా విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లి, చారిత్రక ప్రదేశాలను చూపించారు. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం.. మట్టితో వినాయకులను తయారు చేయించి గ్రామంలో ఇంటింటా మట్టి వినాయకులే ప్రతిష్ఠించేలా మార్పు తీసుకొచ్చారు. సమ్మర్ క్యాంపులు నిర్వహించడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి, పిల్లల విషయంలో జాగ్రత్తలు బోధించేవారు. అందుకే సారు బదిలీ అయ్యారనేసరికి. ఊరంతా కదిలివచ్చింది. కన్నీరు రాల్చింది.

వరద నష్టంపై వివరాలివ్వరా?

'తెలంగాణ'పై కేంద్ర హోంశాఖ అసంతృప్తి

- రాష్ట్రంలో వరద నష్టం వివరాల నివేదికను తక్షణమే పంపించండి
- రోజువారీ పరిస్థితిపై నివేదిక పంపాలంటూ సీఎస్‌కు లేఖ
- ఎస్డీఆర్ఎఫ్ కేంద్ర వాటా విడుదలకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు పంపించండి
- ఇప్పటికే రాష్ట్రంలో ఏడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 2 హెలికాప్టర్లను మోహరించాం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో భారీవర్షాలు, వరదల కారణంగా ఏర్పడిన తీవ్ర నష్టానికి సంబంధించిన వివరాలు అందజేయకపోవడంపై కేంద్ర హోం శాఖ.. రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రకృతి వైపరీత్యాల రోజువారీ పరిస్థితిపై నివేదిక పంపేలా రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం (ఎస్ఈఓసీ)లోని అధికారులను ఆదేశించాలని సీఎస్ శాంతికుమారికి కేంద్ర హోంశాఖ సూచించింది. ఈ మేరకు తాజాగా సీఎస్‌కు కేంద్ర హోంశాఖలోని విపత్తు నిర్వహణ విభాగం డైరెక్టర్ ఆశిష్‌గవాయ్ లేఖ రాశారు.

ఎస్ఈఓసీ నుంచి అందిన సమాచారం ప్రకారం..

తెలంగాణ ఎస్ఈఓసీ నుంచి టెలిఫోన్ ద్వారా ఇటీవల కేంద్ర హోంశాఖకు అందిన సమాచారం ప్రకారం.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ప్రొటోకాల్ ప్రకారం కేంద్ర హోంశాఖ కంట్రోల్ రూమ్‌కు ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం నుంచి అధికారికంగా వరదలకు సంబంధించి తాజా నివేదిక అందలేదని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి సాయం చేసేందుకు రెస్క్యూ రిలీఫ్ ఆపరేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో పడవలు, రక్షించే పరికరాలతోపాటు ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన 7 బృందాలను మోహరించిందన్నారు. వీటితోపాటు రెస్క్యూ అండ్ రిలీఫ్ ఆపరేషన్ కోసం వాయుసేనకు చెందిన 2 హెలికాప్టర్లను అందుబాటులో ఉంచామని పేర్కొంది.

నిధులివ్వాలంటే నివేదిక పంపాలి...

- 2024–25 సంవత్సరానికిగాను రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయ నిర్వహణ కోసం రాష్ట్ర ఎస్డీఆర్ఎఫ్ ఖాతాలో ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి రూ.1345.15 కోట్లు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ నివేదించిందని కేంద్ర హోంశాఖ పేర్కొంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్డీఆర్ఎఫ్ కింద కేంద్ర వాటాను విడుదల చేసేందుకు అవసరమైన సమాచారం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సమర్పించలేదని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది.
- 2022–23 సంవత్సరానికిగాను ఎస్డీఆర్ఎఫ్‌కు చెందిన 2వ విడత కేంద్ర వాటా కింద రూ.188.80 కోట్లు.. 2023 జూలై 10న తెలంగాణకు విడుదలయ్యాయని కేంద్రం తెలిపింది. 2023–24కు సంబంధించి ఎస్డీఆర్ఎఫ్ కేంద్ర వాటా రెండు వాయిదాలను ఒక్కొక్కటి రూ.198 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ఏడాది మార్చి 13న, మార్చి 28న విడుదల చేశామని చెప్పింది.
- 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎస్డీఆర్ఎఫ్ కేంద్ర వాటా మొదటి విడత మొత్తం రూ.208.40 కోట్లు తెలంగాణ ప్రభుత్వానికి ఇంకా విడుదల చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఏడాది జూన్ 1 తర్వాత ఈ రూ.208.40 కోట్లు విడుదల కావాల్సి ఉన్నా, ఈ నిధుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అభ్యర్థన చేయలేదని లేదా ముందుగా విడుదల చేసిన నిధులు, యుటిలైజేషన్ సర్టిఫికెట్ మొదలైన వాటి జమకు సంబంధించిన సమాచారం సమర్పించలేదని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. అందువల్ల ఎస్డీఆర్ఎఫ్ నిధుల విడుదల కోసం నిర్ణీత ప్రొఫార్మాలో అవసరమైన సమాచారం/యుటిలైజేషన్ సర్టిఫికెట్లను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. ఆ తర్వాతే 2024–25కు సంబంధించిన ఎస్డీఆర్ఎఫ్ కేంద్ర వాటా మొదటి విడత నిధులు విడుదల చేస్తామని కేంద్ర హోంశాఖ వెల్లడించింది.

నేడు ముంపు ప్రాంతాల్లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి పర్యటన

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం పర్యటించనున్నారు. వరదలు, అతివృష్టి ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేయనున్నారు. ఈ సందర్భంగా అధికారులతో శివరాజ్‌సింగ్ చౌహాన్ పంట నష్టంపై సమీక్షించనున్నారు. భారీ వర్షాలతో పెద్ద సంఖ్యలో ఆస్తి, ప్రాణ, పంటనష్టం వాటిల్లినందున జాతీయ విపత్తుగా ప్రకటించాలని పీఎం నరేంద్ర మోదీకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేయడం తెలిసిందే.

వరద ప్రాంతాల్లో బీజేపీ బృందాల పర్యటన రేపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు పార్టీపరంగా రెండు బృందాలను కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ నెల 6న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో ఈ రెండు బృందాలు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. సంజయ్‌తో సహా బృందంలోని సభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఖమ్మం, కోదాడ ప్రాంతాల్లో పర్యటిస్తారు. ఈటల రాజేందర్ నేతృత్వంలో మహబూబాబాద్, ములుగు ప్రాంతాలలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే రామారావు పాటిల్ పర్యటించనున్నారు. ఎక్కడికక్కడ వరద ప్రాంతాలలో పర్యటిస్తూ ప్రజలు, రైతులకు ధైర్యం కల్పిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఒక ప్రకటనలో తెలిపారు.

వరద బాధితులకు బీఆర్ఎస్ విరాళం

- పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల ఒక నెల వేతనం సాయంగా ప్రకటన
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి
- విపత్తు నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటలో పంటలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, సిద్దిపేట/ సిద్దిపేట రూరల్: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల తరఫున ఒక నెల వేతనం విరాళంగా ఇస్తున్నట్లు సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. వరదల్లో సర్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు ఇప్పటికే పార్టీ తరఫున సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజల కష్టాల్లో ఎప్పుడూ తోడుగా నిలిచే బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత విపత్తులోనూ వారికి అండగా ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా ముందుకు రావాలని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

విపత్తు నిర్వహణలో ప్రభుత్వం విఫలం

విపత్తు నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న విషయం మరోమారు తేటతెల్లమైందని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో వరద ప్రభావంపై కేంద్రానికి ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇవ్వలేదని కేంద్ర హోం శాఖ లేఖ రాయడాన్ని ఆయన ఉదాహరించారు. ప్రభుత్వ ఖాతాలో ఉన్న రూ.1,345.15 కోట్ల ఎస్డీఆర్ఎఫ్ నిధుల వినియోగంలో రేవంత్ సర్కారు మౌనంగా ఉందన్నారు. విపత్తు నిర్వహణ నిధులున్నా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాదికి సంబంధించి రూ.208 కోట్ల ఎస్డీఆర్ఎఫ్ నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జూన్ నెలలోనే జమ అయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం రాష్ట్ర ప్రజలకు శాపమని ఆయన మండిపడ్డారు.

ఉపాధ్యాయుల తొలగింపు దుర్మార్గం

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 6,200 మంది పార్ట్‌టైమ్ లెక్చరర్లు, టీచర్లను ప్రభుత్వం తొలగించడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారికి మీరిచ్చే కానుక ఇదేనా సీఎం గారూ? అంటూ ప్రశ్నించారు. మూడు నెలలుగా పెండింగులో ఉన్న జీతాలు అడిగిన పాపానికి ఉద్యోగాల నుంచి తొలగించడమే ప్రజాపాలనా అని నిలదీశారు.

ఖమ్మంకు ఆరు లారీల్లో నిత్యావసర సరుకులు

వరద బాధితులకోసం గురువారం సిద్దిపేట నుంచి ఖమ్మంకు ఆరు లారీల్లో నిత్యావసర సరుకులు పంపిస్తామని హరీశ్‌రావు తెలిపారు. బుధవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ, వరదల కారణంగా మృతిచెందినవారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండలంలోని గోపులాపూర్‌లో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను హరీశ్‌రావు పరిశీలించారు. రైతులు నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ. 30 వేలు నష్టపరిహారం అందించాలన్నారు. భక్తరామదాసు, పాలమూరు పంప్‌హౌస్‌లు మునిగిపోతే ప్రభుత్వం వాటి వివరాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. రైతు దేవయ్యకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కాగా, సిద్దిపేటలో పలువురు స్థానికులు వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు విరాళాలు ప్రకటించారు.

రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు

- కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం... దీని ప్రభావంతో ఉత్తర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- వాతావరణ శాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కోస్తా ఆంధ్రా, యానాం పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని, ఈ ఆవర్తనం క్రమంగా బలపడి గురువారం ఉదయం కల్లా పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ.. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ప్రధానంగా ఉత్తర ప్రాంత జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో రానున్న మూడు రోజులు భారీ నుంచి అతిభారీ, అత్యంత భారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలంటూ సూచనలు జారీ చేసింది.

2.06 సెంటీమీటర్ల వర్షపాతం..

బుధవారం రాష్ట్రంలో సగటున 2.06 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 6.38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సిద్దిపేట జిల్లాలో 5.47 సెంటీమీటర్లు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 4.3 సెంటీమీటర్లు, జోగులాంబ గద్వాల జిల్లాలో 3.12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అన్ని జిల్లాల్లో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రంలో ఇప్పటివరకు 59.77 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 83.64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే 40 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళికా శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఆరు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది.







తర్కం మాన్పలేని గాయాలను కేవలం కాలం మాత్రమే మాన్పగలదు.
– సెనెకా

సాక్షి

గురువారం, 5 సెప్టెంబర్ 2024

చట్టాలు చేస్తే చాలా?

దేశాన్ని కదిలించిన 'అభయ' ఉదంతం దెబ్బతో బెంగాల్ కొత్త కఠిన చట్టంతో ముందుకొచ్చింది. అత్యాచార దోషులకు ఏకంగా మరణశిక్ష వేయాలంటూ మమతా బెనర్జీ సర్కార్ అత్యాచార నిరోధక బిల్లు 'అపరాజిత'ను తీసుకొచ్చింది. కోల్‌కతాలో రాష్ట్ర ప్రభుత్వ సారథ్యంలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ మహిళా డాక్టర్ ఒకరిని గత నెలలో దారుణంగా రేప్ చేసి, చంపేసిన ఘటనతో రెండు రోజులు ప్రత్యేకంగా సమావేశమైన బెంగాల్ అసెంబ్లీ మంగళవారం ఏకగ్రీవంగా ఈ బిల్లును ఆమోదించింది. దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వరమే న్యాయాన్ని అందించి, దోషులకు కఠిన శిక్షలు విధించడానికే ఈ కొత్త బిల్లు తెచ్చామని సర్కార్ చెబుతోంది. బాధిత మహిళల బిల్లు గనక ప్రతిపక్షాలన్నీ కాదనే ధైర్యం చేయలేక తలూపుతూనే, మమత రాజీనామా డిమాండ్‌ను విడవకుండా వినిపిస్తున్నాయి. రాష్ట్రపతి ఆమోదం పొందితే కానీ బిల్లు చట్టం కాదు గనక, బాధ్యత కేంద్రం మీదకు నెట్టేసి రాజకీయంగా మార్కులు సంపాదించే పనిలో మమత ముందడుగు వేస్తున్నారు.

అత్యాచారాలు, లైంగిక నేరాల నుంచి మహిళలు, పిల్లలకు మరింత రక్షణ కల్పించే విధంగా చేపట్టిన 'అపరాజిత మహిళా, శిశు రక్షణ బిల్లు–2024'లో మమత సర్కార్ పలు కొత్త అంశాలను పొందుపరిచింది. 21 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసేందుకు వీలుగా అపరాజిత టాస్క్‌ఫోర్స్ పేరిట ప్రత్యేక పోలీసు బలగాన్ని ఏర్పాటు చేస్తుందీ బిల్లు. కేంద్రం ఇటీవల తెచ్చిన కొత్త న్యాయచట్టాలు భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), అలాగే పోక్సో చట్టంలోని అంశాలను మించినవి కొన్ని 'అపరాజిత'లో ఉన్నాయి. పోక్సో కింద 3 నుంచి 5 ఏళ్ళ జైలుశిక్ష, జరిమానా విధించేందుకే వీలుండగా, ఈ సరికొత్త బెంగాల్ అత్యాచార నిరోధక బిల్లు కింద 7 నుంచి పదేళ్ళ శిక్ష తప్పదు. పోక్సో కింద బాధిత చిన్నారి సాక్ష్యాన్ని 30 రోజులలోగా రికార్డ్ చేసి, ఏడాది లోగా విచారణ పూర్తి చేయవచ్చు. అపరాజిత మాత్రం వారం రోజుల్లోనే సాక్ష్యం రికార్డు చేయడం, నెల రోజుల్లో ప్రత్యేక కోర్ట్ విచారణ పూర్తి తప్పనిసరి చేసింది.

బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం అందించేందుకు ఈ బిల్లు ఉపయుక్తమే. అలాగే, అత్యాచార దోషులకు పెరోల్ సైతం లేని యావజ్జీవ కారాగారవాస శిక్ష తప్పదు. రేప్, లేదా గ్యాంగ్‌రేప్ ద్వారా బాధితుల మరణానికో, జీవచ్ఛవంగా మారడానికో కారణమైన దోషులకు ఉరిశిక్ష విధింపు కూడా కోపోద్రిక్త ప్రజానీకానికి కొంత ఊరట. అలా బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్‌లకు మించి కఠినంగా ఈ కొత్త బిల్లును తీర్చిదిద్దడం నేరగాళ్ళకు సింహస్వప్నమే. అందుకే, అపరాజిత బిల్లును కనీవినీ ఎరుగని ప్రయత్నంగా పేర్కొంటూ, ''దేశానికి మార్గదర్శి బెంగాల్'' అనే హ్యాష్‌ట్యాగ్ ఇప్పుడు సోషల్ మీడియా వేదికల్లో ట్రెండ్ అవుతోంది. మహిళలపై నేరాలను ఏ మాత్రం సహించని వ్యక్తిగా, నాయకురాలిగా దీదీని చూపించే ప్రయత్నమూ జరుగుతోంది. కానీ, అదే సమయంలో దిగజారుతున్న ప్రతిష్ఠను నిలబెట్టుకొనేందుకే ఆమె ఈ బిల్లు తెచ్చారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. అభిప్రాయాలు, అనివార్యతలు ఏమైనా... స్త్రీలు, పిల్లల రక్షణకంటూ చేసే ఏ సర్కారీ కొత్త ప్రయత్నాన్ని తీసిపారేయాల్సిన పని లేదు. ప్రతి చర్యనూ స్వాగతించాల్సిందే.

నిజానికి, మహిళల రక్షణ నిమిత్తం 2019లోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చరిత్రాత్మకమైన 'దిశ' చట్టాన్ని తీసుకొచ్చింది. 2020లో మహారాష్ట్ర సైతం అత్యాచార బాధిత స్త్రీల పక్షాన నిలుస్తూ, దోషులకు కఠినశిక్షలతో 'శక్తి' బిల్లు పాస్ చేసింది. శాంతిభద్రతలే కాదు... సాధారణ ప్రజాపరిరక్షణ రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతే గనక స్థానికంగా ఇలాంటి కట్టుదిట్టమైన శాసన నిర్మాణాన్ని తప్పు పట్టలేం. కానీ, ఈ చట్టాలన్నీ గవర్నర్ వద్దో, లేదంటే ఆపైన రాష్ట్రపతి వద్దో ఆఖరి ఆమోదముద్ర కోసం నేటికీ ఎదురుచూస్తూనే ఉండడం విషాదం. తాజా అపరాజితకూ ఆ గతి తప్పకపోవచ్చు. రాష్ట్రస్థాయిలో చేస్తున్న ఈ తరహా చట్టాలకు ఆమోదం తెలపడానికి ఢిల్లీ గద్దె మీది పెద్దలకు అభ్యంతరం ఎందుకో అర్థం కాదు. మహిళా పరిరక్షకులమనే ఘనత తమకే దక్కాలన్న రాజకీయాలే తప్ప, ఇతరేతర కారణాలూ కనబడడం లేదు. దేశానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన మహిళా రెజ్లర్లు సైతం తమపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటూ వీధికెక్కి పోరాడినా, చీమ కుట్టినట్టయినా లేని పాలకుల నుంచి ఇంకేం ఆశించగలం? ఆ మాటకొస్తే స్త్రీలకు అండగా తామున్నామని ఢిల్లీ పెద్దలు ఆచరణలో నమ్మకం కలిగించలేకపోవడం కూడా రాష్ట్రాల్లో కొత్త చట్టాలకు కారణమని విస్మరించలేం.

కఠిన చట్టాలు చేయడం మంచిదే కానీ, కేవలం చట్టాల రూపకల్పనతో లక్ష్యం నెరవేరుతుందా అన్నది బేతాళప్రశ్న. కొన్ని లోటుపాట్లున్నా పాత చట్టాల మొదలు పుష్కరకాలం క్రితపు 'నిర్భయ' చట్టం దాకా మన దగ్గర చట్టాలకు కొదవ లేదు. అమలులో చిత్తశుద్ధి లోపమే సమస్య. అపరిచితులొచ్చి అత్యాచారం జరిపేలా అభద్ర వాతావరణం, అసమర్థ గస్తీ, అధ్వాన్న దర్యాప్తు నెలకొన్నాయంటే ఆ తప్పు పాలకులదేగా! అదే సమయంలో సామాజికంగా, సాంస్కృతికంగా మనుషుల మానసిక కాలుష్యానికి కారణమై, నేరాలకు ప్రేరేపిస్తున్న అంశాలను అరికట్టేందుకు నిజాయతీగా మనందరం చేస్తున్నదేమిటో ఆలోచించుకోవాలి. ఆత్మపరిశీలనా చేసుకోవాలి. ప్రతిపక్ష పాలిత కోల్‌కతాలో 'అభయ' జరిగిందని బీజేపీ, అధికార బీజేపీ పాలిత హాథ్రస్, ఉన్నావ్‌లలో జరిగిందేమిటని విపక్షాలు పరస్పర దూషణలు చేసుకోవడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయంగా పైచేయికై పోరాడే కన్నా సురక్షితమైన పాఠశాలలు, పనిప్రదేశాలు, సత్వరం స్పందించే రక్షక వ్యవస్థ లాంటి ప్రాథమిక అంశాలపై దృష్టి పెడితే అందరికీ మంచిది. అది లేకపోవడమే అసలు సమస్య.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.విదియ ఉ.9.53 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** హస్త పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.2.40 నుండి 4.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.41 వరకు. **అమృత ఘడియలు:** రా.1.14 నుండి 3.01 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

మహిళలే కాదు, అందరం గొంతెత్తాలి!

కోల్‌కతా నుంచి కేరళ వరకు... మహిళలు సురక్షితంగా ఉన్నది ఎక్కడ? 'అభయ'కు కనీసం మరణానంతరమైనా న్యాయం దక్కుతుందా? వ్యవస్థల వైఫల్యాన్ని దాచే రాజకీయాలు ఇందులోకి జొరబడ్డాయి. జస్టిస్ కె. హేమ కమిటీ నివేదికతో మలయాళ చిత్ర పరిశ్రమలోని చీకటి కోణాలు బట్టబయలయ్యాయి. ఈ అంశాల మీద అందరూ మాట్లాడాలి. మాట్లాడేవారు ఒంటరిగా లేరని తెలిసేలా, నిజం చెప్పే భారం మహిళలపై మాత్రమే పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత 'మన'ందరిపైనా ఉంది. లైంగిక వేధింపులకు ప్రత్యేకమైన నేరాలుగా ప్రతిస్పందించడం మానేయాలి. మహిళలకు వ్యతిరేకంగా అసమానమైన శక్తి కొనసాగిస్తున్న విస్తృత దాడుల్లో భాగంగా వీటిని చూడాలి.

కోల్‌కతా నుంచి కేరళ వరకు...

అభిప్రాయం



బర్ఖా దత్

కేరళతో మొదలుపెట్టి కోల్‌కతా దాకా... దేశంలో ఎక్కడ చూసినా మహిళలపై దాష్టీకపు వార్తలే. ఇవన్నీ దేశంలో మహిళల స్థితిని ఎత్తిచూపుతున్నాయి. అదే సమయంలో రాజకీయాల నిర్లిప్తత, వ్యవస్థల వైఫల్యమూ కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి.

మలయాళ చిత్ర పరిశ్రమ చీకటి కోణాలు కాస్తా హేమ కమిటీ రిపోర్టుతో బట్టబయలయ్యాయి. నటులు, దర్శకులు, సినీ రంగంలోని అన్ని వర్గాల ప్రతినిధులపై లైంగిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వార్తలను చూస్తే, 'అయ్యో' అనిపిస్తోంది. అధ్వాన్నమైన విషయం ఇంకోటి ఉంది. మహిళకు సమానత్వం, మర్యాద, స్వేచ్ఛ, భద్రత అన్న సిద్ధాంతాన్ని నమ్మిన ఒక్క రాజకీయ పార్టీ లేకపోవడం! ఇదే విషయం మిత్రుడైన ఓ రాజకీయ నేతతో చెబితే... ''మహిళలపై దౌర్జన్యం విషయాల్లో వాళ్లు, వీళ్లు అని ఏమీ లేదు. సొంత ప్రయోజనాలే వారికి పరమావధి'' అని సమాధానమిచ్చాడు. నిత్యం కించపరిచే వ్యాఖ్యలు వింటూండే మహిళ రాజకీయ నేతలు కూడా పార్టీ అగ్రనేతల హుకుంలకు కట్టుబడ్డారేమో తెలియదు కానీ... గట్టిగా మాట్లాడతారని ఆశించినవాళ్లు కూడా నోళ్లు మెదపలేని స్థితిలో ఉన్నారు. బాధితులకు రక్షణగా ఉండటం కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని అనిపించిందేమో వారికి!

కోల్‌కతా 'అభయ'కు న్యాయం దక్కుతుందని నాకైతే అనిపించడం లేదు. ఇలా చెప్పేందుకూ నాకు చాలా ఇబ్బందిగా ఉంది. ఈ కేసులో అక్కడి ఘోరకలి సమగ్రంగా ప్రపంచానికి తెలుస్తుందన్న నమ్మకమూ సన్నగిల్లుతోంది. కాలేజీ అధికారులు బాధితురాలి తల్లిదండ్రులకు చేసిన మూడు ఫోన్ కాల్స్‌వివరాలు మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. దీన్నిబట్టే ఈ కేసు వివరాలపై గోప్యత ఎంతన్నది స్పష్టమైంది.

ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా సందీప్ ఘోష్ చలాయించిన అధికారాన్ని అర్థం చేసుకుంటే.. ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఈయన వేధింపులు తట్టుకోలేక ఇద్దరు కాలేజీ ఇంటర్న్‌లు ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నారంటేనే అర్థం చేసుకోవచ్చు. కాలేజీ మాజీ అధికారి అఖ్తర్ అలీ ఆరోపణల ప్రకారం సందీప్ ఘోష్ మృత దేహాలతో వ్యాపారం చేసేవాడు. అవయవాల రాకెట్‌నూ నడిపేవాడు. ఈ నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వాన్ని అడగాల్సిన ప్రశ్న ఒకటి ఉంది. ఒక వ్యక్తిని కాపాడేందుకు ఇన్ని పనులు ఎందుకు చేస్తున్నారు? సందీప్ ఘోష్ తరఫున వాదించేందుకు ప్రభుత్వం న్యాయవాదిని నియమించడం ఏమిటి?



ఈ ఘటనను రాజకీయంగా వాడుకోలేదా? అందరూ వాడుకున్నారు. రాళ్లు రువ్వడంతో దేబాశీష్ చక్రవర్తి లాంటి పోలీసు కనుచూపు కోల్పోయే పరిస్థితి వచ్చింది. బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ మధ్య మాటా మాటా నడుస్తోంది. ఇందుకేనేమో... ఆందోళన చేస్తున్న వైద్యులు ఈ రెండు పార్టీల వారు ఎవరూ తమ పరిసరాల్లో లేకుండా జాగ్రత్త పడ్డారు.

'అభయ'లాంటి ఘటన జరిగిన తరువాత చేసిన వ్యాఖ్యలు తప్పేనని తృణమూల్ పార్టీ హుందాగా తమ తప్పు ఒప్పుకుని ఉండాల్సింది. కొద్ది రోజులపాటు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండి... ఆ తరువాత ఒక్క పళంగా విరుచుకుపడింది. ఒకరి ద్దరు పార్టీ ప్రతినిధులు నోటికి ఏదొస్తే అది మాట్లా డేశారు. ఈ క్రమంలోనే ఓ ఎంపీని నా కార్యక్రమం నుంచి వెళ్లిపొమ్మని అడగాల్సి వచ్చింది. ముప్ఫై ఏళ్ల నా వృత్తి జీవితంలో నేను ఇలా ఎన్నడూ చేయలేదు.

పశ్చిమ బెంగాల్ ఘటనకు బాధ్యత టీఎంసీదైతే... హేమ కమిటీ నివేదిక పుణ్యమా అని కేరళ సినీ రంగం లేవనెత్తుతున్న ప్రశ్నలకు అక్కడి లెఫ్ట్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. జస్టిస్ కె.హేమ కమిటీ తన నివేదికను సిద్ధం చేసేందుకు ఏకంగా ఐదేళ్ల సమయం పట్టింది. ఈ నివేదిక బయటపడటంతో చాలామంది మహిళా ఆర్టిస్టులు ఇప్పుడు పోలీసులకూ, టాస్క్‌ఫోర్స్‌కూ ఫిర్యాదు చేయడం మొదలుపెట్టారు. ఈ మలయాళ 'మీ టూ' ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న నటీమణులు రేవతి, పార్వతి చెప్పిన దాని ప్రకారం... ఈ కేసులో అటు రాజకీయ నేతలు, ఇటు సినిమా శక్తులు వాస్తవాలను తొక్కి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రెండు వర్గాలూ కలిసిపోయే అవకాశమూ లేకపోలేదని వాళ్లు అంటున్నారు. హేమా కమిటీ నివేదికలోని 11 పేరాలను ప్రభుత్వం ఎందుకు తొలగించిందో ఇప్పటివరకూ ఎలాంటి వివరణ లేదు.

గుజరాత్ ప్రభుత్వ పుణ్యమా అని బిల్కిస్ బానో రేపిస్టులు మెడలో పూలదండలతో జైల్లోంచి బయట కొచ్చారు. అభయ విషయంలో మమత ప్రభుత్వం మితిమీరిన అహంకారంతో వ్యవహరించింది. 2012 నాటి నిర్భయ ఘటనలో కాంగ్రెస్‌వాళ్లూ నానా చెత్తా మాట్లాడారు. ఇవన్నీ మనకు చెబుతున్నది ఏమిటి? రాజకీయ నేతలు పట్టించుకోవాలంటే, మహిళలు ఒక ఓటుబ్యాంకుగా సంఘటితం కావాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మన సమస్యకు మనమే పరిష్కర్తలం!

అభిప్రాయం



నమితా భండారే

అరుదుగానైనా సరే, తలలు కూలుతున్న శబ్దం మధురంగా వినిపిస్తుంది. మలయాళ చలనచిత్ర పరిశ్రమలో మహిళలపై ప్రబలంగా జరుగుతున్న లైంగిక, ఇతర వేధింపులపై సంచలన నివేదిక విస్ఫోటనం తర్వాత మొదటి వేటు నటుడు సిద్దిక్, నిర్మాత రంజిత్‌లపై పడింది. సిద్దిక్‌పై లైంగికదాడి అభియోగాలు మోపారు. ఇకపోతే సీపీఎం ఎమ్మెల్యే, నటుడు ముఖేష్ అరెస్టు నుండి తప్పించుకోవడానికి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

కొందరు దీనిని మలయాళ చిత్రపరిశ్రమలో 'మీ టూ' ఉద్యమంగా అభివర్ణిస్తున్నారు. కచ్చితంగా, మాలీవుడ్‌లో మహిళల పని పరిస్థితులపై జస్టిస్ కె.హేమ కమిటీ నివేదిక విడుదలైన తర్వాత నెలకొన్న సంఘటనలు పరిశ్రమ నియంత్రణను దాటిపోయాయి. 2019 డిసెంబరు నుండి నివేదికను తొక్కిపట్టి ఉంచిన పినరయి విజయన్ ప్రభుత్వం కూడా ఈ నివేదిక పేర్కొన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తామని ప్రకటించింది.

కోల్‌కతాలో ట్రెయినీ డాక్టర్ ఘోర హత్యాచారంపై చెలరేగుతున్న ఆగ్రహ జ్వాలలకు ప్రతిస్పందనగా కొచ్చిలో రణగొణధ్వనులు వినిపిస్తున్నప్పుడు మనం ఒక పెను మార్పు మలుపులో ఉన్నాము. బద్లాపూర్(మహారాష్ట్ర)లో ప్రజల ఆగ్రహం బాంబే హైకోర్టు విచారణకు దారితీసినప్పుడు, అబ్బాయిల లింగపరమైన సున్నితత్వంతో సహా కొన్ని సూచనలు చేయమని హైకోర్టు ఒక కమిటీని కోరింది.

ఇదంతా స్వాగతించదగినదే. అయితే ఇదంతా మనం ఇంతకు ముందే విన్నాం. 2018లో, భారత దేశంలో మీ టూ ఉద్యమం సమయంలో, లైంగిక దాడి ఆరోపణలు తగ్గుముఖం పట్టడంతో మనం ఒక అవకాశాన్ని కోల్పోయాము అని ఉద్యమకారులు అంటారు. ఎందుకంటే ఆరోపణలకు సంబంధించి పెద్ద పేర్లు ఎన్నడూ బయటపడలేదు. దానికి తోడుగా, లైంగిక దాడి గురించి మాట్లాడిన వారిపై క్రిమినల్ పరువు నష్టం దావాలు తీవ్ర ప్రభావం చూపాయి.

2013లో, మగవారి మనస్తత్వాలను మార్చే పనిపై గట్టిగా కృషి చేయకుండా, కఠినమైన చట్టాన్ని ఆమోదించడం ఒక్కటే సమస్యను పరిష్కరిస్తుందని భావించిన ప్పుడు మనం మళ్లీ పోరాటాన్ని కోల్పోయాము.

ఇప్పుడు మనకు మరో అవకాశం వచ్చింది. కానీ తరువాత ఏమి జరుగుతుందనేది 'మన'పైనే ఆధార పడి ఉంటుంది. లైంగిక ఆరోపణలకు గురైన వారి సినిమాలను ప్రేక్షకుల్లోని 'మన'వారే విమర్శనారహితంగా ఆబగా చూస్తున్నారు. నిశ్శబ్దాన్ని బద్దలుగొట్టి నోరెత్తే వారిని ట్రోల్ చేసి బెదిరించేవారు కూడా సోషల్ మీడియాలోని 'మన'వారే. శక్తిమంతులకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేసే మహిళలను చట్టాన్ని అమలు చేసే వ్యవస్థలో ఉన్న 'మన'వారు కష్టపెడుతున్నారు. చలనచిత్ర విడుదలకు సంబంధించి సమయానుకూలంగా పీఆర్–ఆధారిత సమాచారాన్ని అందజేసే మీడియాలోని 'మన'వారు జర్నలిజానికి సంబంధించిన క్లిష్టమైన ప్రశ్నలు వేటినీ అడగరు.

మాట్లాడేవారు ఒంటరిగా లేరని తెలిసేలా, నిజం చెప్పే భారం మహిళలపై మాత్రమే పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత 'మన'పైనే ఉంది. అలాగే మహిళ లను లైంగికంగా వేటాడేవారిని జాతీయ చర్చల నుండి, బాక్సాఫీస్ నుండి, సాహిత్య వేడుకల నుండి మాత్రమే కాకుండా మన డ్రాయింగ్ రూముల్లో చర్చల నుండి కూడా దూరంగా ఉంచాలి.

కోల్‌కతాలోని వైద్యులకు ఆగ్రహించే హక్కు ఉంది. అయితే నిరసనలు రాజకీయ రంగు పులుముకున్నాయి. లైంగికదాడి చేసిన వారిని నెలాఖరులోగా ఉరిశిక్ష విధించాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ చేసిన ప్రకటనలు పరిష్కారాన్ని కనుగొనే లక్ష్యంతో కాకుండా, ప్రజల ఆగ్రహాన్ని చల్లబర్చడం కోసమే చేసినట్లున్నాయి.

తెగులు లేదా కుళ్లు అనేది వ్యవస్థాగతంగా ఉన్నప్పుడు, దానికి పరిష్కారం అనేది 'ఇక్కడో రాజీనామా', 'అక్కడో కమిటీ ఏర్పాటు' వంటి రూపాల్లో పాక్షికంగా, అవ్యవస్థీకృతంగా ఉండకూడదు. లైంగిక వేధింపులకు మనం ప్రత్యేకమైన, భిన్నమైన నేరాలుగా ప్రతిస్పందించడం మానేయాలి. మహిళలకు వ్యతిరేకంగా అసమానమైన శక్తి కొనసాగిస్తున్న విస్తృత దాడుల్లో భాగంగా వీటిని చూడాలి.

మనకు అసమానతలపై పోరాడే ఉద్యమం అవసరం: బహిరంగ ప్రదేశాల్లో, పార్లమెంటులో, పోలీసు స్టేషన్లలో, పని ప్రదేశాల్లో, న్యాయవ్యవస్థలో ఎక్కువ మంది మహిళలు భాగం కావలసి ఉంది. సోదరీమణులు, కుమార్తెలుగా మాత్రమే ఉండిపోకుండా, మనం సమాన పౌరులం అనే ఆలోచనను సాధారణీకరించాల్సి ఉంది. మనకు ప్రస్తుతం ఒక అవకాశం ఉంది. దానిని స్వాధీనం చేసుకోవడం మనపైనే ఉంది.

వ్యాసకర్త జెండర్ అంశాల రచయిత

('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కోపం వచ్చినా...



ఒక షో లేదా సినిమా అనేది ఒకరి సొంత వ్యక్తీకరణ. అదెప్పుడూ నియమాలకు కట్టుబడాలని లేదు. సృజనను గౌరవించండి. కోపం తెప్పించినా సరే! అసలైన ఆలోచనలు వర్ధిల్లాలి. లేదంటే మనం ఏ నవీకరణ, సంస్కరణ లేకుండా బానిన దేశంగా ఉండిపోతాం. ('ఐసీ 814: ద కాందహార్ హైజాక్' వివాదం నేపథ్యంలో.)

– చేతన్ భగత్, రచయిత

అరాచక బంగ్లా



బంగ్లాదేశ్‌లో జమాత్‌కు స్వేచ్ఛ వచ్చింది. అంటే నిషేధం ఎత్తేశారు. హిందూ ప్రొఫెసర్లను బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. (టాగూర్ రాసిన) జాతీయ గీతాన్ని మార్చాలనే డిమాండ్ వస్తోంది. తర్వాతి అడుగు: షరియా చట్టం. అంగీకరించనివారికి శిక్ష. ఏ నోబెల్ గ్రహీతా దీన్ని పరిష్కరించలేడు.

– సీమా సిరోహి, కాలమిస్ట్

అక్కడ కూడానా?



ఆఫ్రికా వ్యవసాయంలో తేవాల్సిన తీవ్ర మార్పుల గురించి ఇథియోపియా ప్రధానితో చర్చించడానికి బిల్ గేట్స్ వెళ్లారు. సంప్రదాయ పద్ధతుల నుంచి, రసాయనిక ఎరువులు, ఏకపంట విధానం అవసరమయ్యే జీఎంఓ విత్తనాలకు మళ్లించాలనేది వారి పథకం.

– రమణ్‌దీప్ సింగ్ మాన్, రైతు ఇంజినీర్

జీవితాలను దిద్దేవాడు

సందర్భం



పరిమి శ్యామలా రాధాకృష్ణ

బాల్యం, కౌమారం యవ్వనం, ఆ తరువాత, ముదిమి వయసు మానవ జీవితంలో సహజ పరిణామాలు! బాల్య యవ్వనాల్లో గురువు పాత్ర అత్యంత కీలకమైనది. తరువాతి దశల్లో మనిషి ఉత్తమ ప్రపంచ పౌరునిగా, సామాజిక జీవిగా పరిణామం చెందడానికి ఉపాధ్యాయుని పాత్ర ఎనలేనిది. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఏడాదికి ఒక్కసారైనా వైద్యులను పిలిపించి అవగాహనా కార్యక్రమం నిర్వహించాలి. వయసు పెరిగే కొలదీ మానవునిలో వచ్చే శారీరక మార్పులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేలా చర్యలు తీసుకోవాలి. అలాగే పిల్లల తల్లిదండ్రులకు కూడా ఒక సీనియర్ ఉపాధ్యాయుని సహాయంతో, వీలైతే లేడీ టీచర్‌తో అవగాహన కల్పించాలి. ఫలితంగా టీనేజ్‌లో హార్మోన్ల ప్రభావం వల్ల పిల్లలలో కలిగే మార్పుల పట్ల అవగాహన కలుగుతుంది. క్షణికోద్రేకాలకు లోనై అకృత్యాలకు పాల్పడకుండా ఈ అవగాహన పిల్లలను కాపాడుతుంది. తల్లిదండ్రులు కూడా వారు ఎటువంటి జాగరూకత వహించాలో తెలుసుకోగలుగుతారు.

భారతీయ సమాజంలో గురువును దేవునిగా పూజించే సంప్రదాయం ఉంది. 'గురు దేవోభవ!' అన్న మాటలు అందుకే ఉనికిలోకి వచ్చాయి. గురువు పాత్ర కేవలం పాఠాలు చెప్పడంతోనే అయిపోదు. పిల్లలకు కర్తవ్యాన్ని, ధర్మాచరణనూ నూరిపోయడం; దానం, సహనం, సహానుభూతి, సత్వగుణం, నిరహంకారం, నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా పనిచేయాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలి. వ్యాయామం, యోగ, ధ్యానం వంటివి గురు సముఖంలోనే రాణింపు కొస్తాయి.

నిరాడంబరులై వినుతికెక్కిన సర్వేపల్లి రాధాకృష్ణ, గాంధీజీ, వివేకానందుడు, అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల గురించి మన పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఉపాధ్యాయులు చెప్పాలి. యువతను వజ్ర సంకల్పంతో దేశానికి ఉత్కృష్ట వనరులుగా మార్చగలిగినవారు ఉపాధ్యాయులు! వారికి గురుపూజోత్సవ శుభాకాంక్షలు!

గురువులు సమాజ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, బోధనా విధానంలో నూతన దారులు తొక్కాలి. నిష్ఠ, అంకితభావం, విద్యార్థుల పట్ల వాత్సల్యం, ఆదరణ కలిగి ఉండటం మంచి గురువు లక్షణాలు. వారిలో ప్రశ్నలడిగే జిజ్ఞాస, ఉత్సుకతలను నలిపివేయకుండా ఉండాలి. విద్యార్థుల్లో శీల నిర్మాణానికి కృషి చేయడం ముఖ్యమైన విధి. ఆత్మ విమర్శ, ఆత్మ విశ్లేషణ, ఆత్మ గౌరవం, ఆత్మ నిగ్రహాలను ప్రోది చేసుకుని ఎవరి జీవితాన్ని వారు తీర్చిదిద్దుకునేలా పిల్లలను తీర్చిదిద్దే వాడు గురువు. మన భారతీయ గురు పరంపరకు ప్రణామాలు!

వ్యాసకర్త బీఈడీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్, మదనపల్లె, అన్నమయ్య జిల్లా

గురుతర బాధ్యత

సందర్భం



వై.వి. రామిరెడ్డి

నేడు భారతదేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో దాదాపు 15 లక్షల పాఠశాలలు, 58 వేల కళాశాలలు, 1,500 విశ్వవిద్యాలయాలు ఉండగా వీటిలో దాదాపు 27 కోట్ల మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. దాదాపు 1 కోటి 14 లక్షల మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. అనాదిగా ప్రపంచంలోని అనేక దేశాలతో పోలిస్తే భారతదేశంలో విద్యకు, ఉపాధ్యాయులకు ఒక ప్రత్యేక గుర్తింపు, గౌరవాలు ఉన్నాయి. దీనికి నిదర్శనం తక్షశిల, నలందా వంటి విశ్వ విద్యాలయాలలో ప్రపంచంలోని అనేక దేశాల నుండి విద్యార్థినీ విద్యార్థులు వచ్చి విద్యను అభ్యసించి తిరిగి వెళ్లి తమ విద్యార్థినీ విద్యార్థులకు విద్యను బోధించిన విషయం చారిత్రక సత్యం. మనం ఆరాధ్య పురు షులుగా భావిస్తున్నటువంటి రాముడు, కృష్ణుడు, ప్రహ్లాదుని నుంచి గౌతమ బుద్ధుడి వరకు గురుకులాలలో గురువులకు సేవ చేస్తూ విద్యాబుద్ధులను అభ్యసించిన వారే. విదేశీయుల పాలన కింద శతాబ్దాలు తరబడి ఉన్న మన భారతదేశం అనాది నుంచి ఉన్న శ్రేష్ఠమైన విద్యా వ్యవస్థను కోల్పోయింది.



నేడు ఉపాధ్యాయ దినోత్సవం

స్వాతంత్ర్యానంతరం మన విద్యా వ్యవస్థను గాడిన పెట్టే ప్రయత్నాలు అనేకం జరిగినప్పటికీ విద్యార్థుల్ని సౌశీల్యం, క్రమశిక్షణ కలిగిన ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే సరైనటువంటి విధానాలు విద్యా వ్యవస్థలో కొరవడినాయి. నేడు యువతలో ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులలో పెద్దల ఎడల గౌరవం, కుటుంబ విలువలు, నైతిక విలువలు, కఠోర శ్రమ, పరస్పర గౌరవం, దయ, సౌశీల్యం, ఐకమత్యం వంటి మానవీయ విలువలు క్రమంగా తగ్గుతున్నాయి. ఫలితంగా వారు వ్యక్తిగత జీవితాలను కోల్పోతు న్నారు. అదే సమయంలో భారతదేశానికి అనాదిగా ఉన్న కీర్తి ప్రతిష్ఠలు కూడా పోతున్నాయి. అనేక విద్యాలయాలలో విద్యార్థులు మాదకద్రవ్యాలు, మద్యం, ధూమపానం వంటి వ్యసనాలకు బానిసలు కావడమే కాకుండా తమ అమూల్యమైన సమయాన్ని సోషల్ మీడియాకు బలి చేస్తున్నారు. అలాగే ఈమధ్య స్త్రీలపై అత్యాచారాలు పెరిగిపోవడమూ గమనార్హం.

కావున కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థినీ విద్యార్థులకు విద్యతో పాటు బుద్ధిని కూడా నేర్పించవలసిన గురుతర బాధ్యత నేటి అధ్యాపకులపై ఉంది. గతంలో ప్రతి అధ్యాపకుడు సబ్జెక్టుతో సంబంధం లేకుండా పెద్ద బాలశిక్ష, చిన్న బాలశిక్ష వంటి వాటి నుండే కాకుండా సుమతి, వేమన, భాస్కర శతకాల నుండి విద్యార్థినీ విద్యార్థులకు సందర్భానుసారంగా నీతి వాక్యాలను, జ్ఞానాన్ని, శీలాన్ని, ఐకమత్యాన్ని బోధించేవారు. నేటి ఆధునిక అధ్యాపకులు కూడా విద్యార్థులను పరిపూర్ణమైన పౌరులుగా తీర్చిదిద్దడా నికి అన్ని విధాలా కృషి చెయ్యాలి.

వ్యాసకర్త తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యులు

స్థిరచిత్తం జ్ఞానానికి సంకేతం

కురుక్షేత్ర సంగ్రామం చివరి రోజున భీముడితో జరిగిన ద్వంద్వ యుద్ధంలో దుర్యోధనుడు హతుడవడంతో అన్యాయం ఓడిపోయి, పాండవులు కోరుకున్న న్యాయానికి విజయం లభించి నప్పటికీ, యుద్ధానంతరం అందరి మనసులలోనూ నిస్తేజం ఆవరించింది. అంతటా విచారమే రాజ్యమేలింది. అది చూడలేని ధర్మరాజు యుద్ధం ముగిసిన మరసటి రోజు నుండీ అడవులకు వెళ్ళి కందమూలాలను తింటూ శేష జీవితం గడపడానికి వెళ్ళిపోతానంటాడు. దుర్యోధనుడు గెలిచి పాండవులు ఓడిపోతే చూసి ప్రశాంతంగా కళ్ళు మూద్దామనుకున్న ధృతరాష్ట్రుడు, అప్పుడిక చేసేదేమీ లేక అడవుల బాట పట్టాడు. జనంతో కళకళలాడిన హస్తినలోని రాజమహల్, యుద్ధం ముగిసిన తరువాత మనుషుల్లేక భూతగృహంలా మిగిలింది. ఎటువైపు చూసినా మృత వీరుల భార్యల రోదనలు అంతరంగాన్ని కలచి వేయగా 'అందరిని అంతమొందించి గెలిచినది ఇందుకోసమా?' అని ధర్మరాజు మౌనంగా దుఃఖించాడు. ధర్మరాజు రాజయ్యాక శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోయాడు. కణ్వాది మహామునుల శాపం కారణంగా పుట్టిన ముసలం యదువంశ వినాశనానికి దారితీసింది. శ్రీకృష్ణుడు ఉండగా అంత వినాశనం ఎలా సంభవమైందని వ్యాసులవారిని అర్జునుడు అడగగా 'విధిచే జరగాల్సి నదిగా నియతమైన పనిని జరగనివ్వకుండా అడ్డుకోవడం దేనికని శ్రీకృష్ణుడు ఉపేక్షించి ఊరుకున్నాడు గాని, తాను తలుచుకుంటే కణ్వాది మునుల శాపాన్ని పక్కకు మళ్ళించే శక్తి లేనివాడా శ్రీకృష్ణుడు? యదువంశం నశించడం ఒక తప్పని పరిణామం అని తెలిసినవాడు కాబట్టే అలా జరిగింది అని గ్రహించడం మంచిది!' అని అర్జునుడికి సమాధానమిచ్చాడు వ్యాసుడు. కాల విపర్యయాలను తట్టుకుని నిలబడడాన్ని గురించి మౌసలపర్వంలోని ఈ క్రింది పద్యంలో ఇలా విశదపరిచాడు.

కం. బలమును బుద్ధియు జేవయు / నలఘుమతీ! యుల్లసిల్లు నగు కాలమునం
బొలయుం గాలవిపర్యయ / కలనంబున, బుధుల కుబ్బు గలకయు గలవే!

'కాలం కలిసిరావడం అంటే దైవబలం తోడై బుద్ధి, బలము, ఉత్సాహము ద్విగుణీకృతమై ప్రకాశిస్తాయి. కాలం కలిసిరానప్పుడు దైవబలం తోడుగా లేని కారణంగా ప్రయత్నములన్నీ విఫలమై బాధిస్తాయి. కాలం కలిసిరావడమనే ఆనందకరమైన పరిణామానికి పొంగిపోవడం, కాలం కలిసిరానప్పుడు కలిగే బాధాకరమైన పరిణామాలకు దిగులు పడడం జ్ఞానులైన వ్యక్తుల జీవితాలలో కనిపించవు!' అని పై పద్యం భావం. ఎల్లవేళలా స్థిరచిత్తంతో ఉండగలగడాన్ని అవలంబించడం సాధుత్వానికి లక్షణం!

– భట్టు వెంకటరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

దంతెవాడ ఎన్‌కౌంటర్ మృతుల్లో మావో అగ్రనేత రణదేవ్

- మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చిన దంతెవాడ ఎస్పీ
- కేంద్ర మిలిటరీ ఇన్‌చార్జి, మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ బార్డర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు
- మావోయిస్టు పార్టీలో అంచలంచెలుగా ఎదిగిన తొలితరం నాయకుడు
- ఆయన స్వగ్రామం టేకులగూడెంలో విషాదఛాయలు



రోదిస్తున్న ఏసోబు కుటుంబ సభ్యులు. (ఇన్‌సెట్‌లో) రణదేవ్

మడికొండ: దంతెవాడలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ (70) మృతి చెందాడని దంతెవాడ ఎస్పీ.. ఏసోబు కుటుంబ సభ్యులకు బుధవారం సమాచారమిచ్చారు. మంగళవారం దంతెవాడ–బీజాపూర్ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 9 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిలో ఏసోబు కూడా అన్నాడు. ఆయనపై రూ.25లక్షల రివార్డు ఉంది. ఏసోబు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో బయలుదేరారు.

రైతుకూలీ సంఘం సభ్యుడిగా చేరి...: మావోయిస్టు పార్టీ కేంద్ర మిలిటరీ ఇన్‌చార్జ్, మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ బార్డర్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న రణదేవ్ (ఏసోబు)స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టెకులగూడెం. తల్లిదండ్రులు మాచర్ల మల్లమ్మ–చంద్రయ్యలది వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఏసోబు 1980లో రైతు కూలీ సంఘం సభ్యుడిగా చేరి..అంచలంచెలుగా ఎదిగి మావోయిస్టు కేంద్ర పార్టీలో కీలక స్థాయికి చేరుకున్నాడు.

5వ తరగతి వరకే చదువు..: స్వగ్రామంలో ఏసోబు 5వ తరగతి వరకు చదివాడు. కుటుంబ ఆర్థికపరిస్థితి దృష్ట్యా గ్రామంలో ఓ యజమాని వద్ద జీతం ఉన్నాడు. 1988–89లో రైతుకూలీ సంఘంలో పనిచేస్తూ దొరల ఆధిపత్యంపై, కూలీలకు గిట్టుబాటు ధర చెల్లించాలని పోరాటం చేశారు. నాటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన విద్యను గ్రామస్తులకు బోధించేవాడని గ్రామస్తులు తెలిపారు. 1990లో రైతు కూలీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికై అదే ఏడాది మే 5, 6 తేదీల్లో వరంగల్ జిల్లా ప్రకాశ్‌రెడ్డిపేటలో నిర్వహించిన మహాసభకు లక్షలాది మందిని తరలించి విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషించాడు.

రైతులకు సోలార్ పంప్‌సెట్లు

- పైలట్ ప్రాజెక్టుగా కొండారెడ్డిపల్లె
- అటవీ భూములు, ఖాళీ స్థలాల్లో సౌర విద్యుదుత్పత్తికి చర్యలు
- మహిళలకు ఎల్పీజీకి బదులు సోలార్ సిలిండర్లు
- విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



సమీక్షలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రైతులకు ఉచితంగా సోలార్ పవర్ పంప్‌సెట్లను పంపిణీ చేసి, సౌర విద్యుత్ వినియోగించేలా వారిని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తన సొంత గ్రామం కొండారెడ్డి పల్లెను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. సోలార్ పవర్‌తో వచ్చే విద్యుత్‌ను రైతు పంప్‌సెట్లకు వాడుకోగా మిగిలే విద్యుత్‌తో వారికి ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ఒక బిజినెస్ హబ్‌గా మారబోతోందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఇందుకు గాను ఐటీ, పరిశ్రమల శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా చర్య లు తీసుకోవాలని చెప్పారు. వివిధ శాఖలకు సంబంధించిన వినియోగంలో లేని ఖాళీ భూములతో పాటు అటవీ భూముల్లో సౌర విద్యుదుత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌కు బదులుగా మహిళలు సోలార్ సిలిండర్ వినియోగించేలా ప్రోత్సహించాలని చెప్పారు. మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వడం ద్వారా సోలార్ సిలిండర్ వ్యాపారం వైపు వారిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా నిమిషం కూడా విద్యు త్ సరఫరాలో అంతరాయం కలగకూడదని, ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే నియామకాలు పూర్తి చేయండి

టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని కలిసిన మందకృష్ణ బృందం

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కోరారు. బుధవారం నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డితో మందకృష్ణ బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సానుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రం ప్రభుత్వం భర్తీ చేసే ఉద్యోగ నియామకాలన్నీ వర్గీకరణ ప్రకారమే చేపట్టాలన్నారు. ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్లతో పాటు త్వరలో ఇవ్వనున్న నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ వర్తింపజేయాలని విన్నవించారు. ప్రస్తుతం భర్తీ కానున్న ఉద్యోగ నియామకాల మీద మాదిగ విద్యార్థులు ఎంతో ఆశ పెట్టుకున్నారని, వర్గీకరణ ప్రక్రియ చేపట్టకుండా భర్తీ చేస్తే వారంతా తీవ్ర అన్యాయానికి గురవుతారని మందకృష్ణ తెలిపారు. వర్గీకరణపై మహేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మార్పీఎస్ తెలిపింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడ గోవిందు నరేశ్, ఎమ్మెస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లూం క్లస్టర్‌ను మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు బండి సంజయ్ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సిరిసిల్లలో పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. నేషనల్ హ్యాండ్లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ముడిసరుకు (యార్న్) డిపోను ఏర్పాటు చేయాలని కోరారు. ముడిసరుకు ఖర్చుల కారణంగా నేతన్నలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని కోరారు. బుధవారం ఢిల్లీలో గిరిరాజ్ సింగ్‌ను కలిసిన సంజయ్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పవర్ లూం క్లస్టర్‌ను ఏర్పాటు చేయడంవల్ల వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని, ముఖ్యంగా యంత్రాల ఆధునీకరణతోపాటు ఉత్పాదకతను, కార్మికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతుందన్నారు. కాగా, జైనూర్‌లో ఉద్రిక్త పరిస్థితులకు కారణాలేంటి? 31న ఆదివాసీ మహిళపై లైంగిక దాడి యత్నం జరిగితే ఆలస్యంగా వెలుగులోకి రావడానికి కారణాలేంటి? అని మంత్రి బండి సంజయ్ తెలంగాణ డీజీపీ జితేందర్‌ను ఆరా తీశారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (hmda)
HGCL ఆఫీస్ బిల్డింగ్, 2వ అంతస్తు, ఖాజాగూడ రోడ్, ORR ప్రక్కన, నానక్‌రాంగూడ, హైదరాబాద్–500104, ఇమెయిల్: cgmhgcl@gmail.com

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

టెండరు నోటీస్ నం. 17/CGM(T)/HGCL/DGM-IV/2024-25 తేది:03-09-2024

రావిర్యాల వద్ద ఔటర్ రింగ్ రోడ్ ఇంటర్‌ఛేంజ్ నుండి ఆమనగల్ వద్ద రీజినల్ రింగ్ రోడ్ వరకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ నిర్మాణం కొరకు సవివరమైన ప్రాజెక్ట్ రిపోర్టు తయారుచేయుట కొరకు కన్సల్టెన్సీ సర్వీసుల పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై బిడ్లు కోరబడుతున్నవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ కోసం ప్రారంభ తేది: 04-09-2024. బిడ్ దాఖలు కోసం ఆఖరి తేది, సమయం: 19-09-2024న మ.3:00 గం. వరకు, సాంకేతిక బిడ్ తెరచు తేది, సమయం: 19-09-2024న మ.3:30 గం.లకు. ప్రీబిడ్ సమావేశం తేది: 09-09-2024. తదుపరి వివరాల కోసం http://www.hmda.gov.in (లేదా) https://tender.telangana.gov.in కు లాగాన్ కావలెను (లేదా) ఈ కార్యాలయాన్ని సంప్రదించవలెను. ఈ బిడ్ నోటీస్‌కు సంబంధించి ఏవేని సవరణలు, అప్‌డేట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో మరియు వెబ్‌సైట్ http://www.hmda.gov.in లో మాత్రమే ప్రచురించబడును.

సం/– చీఫ్ జనరల్ మేనేజర్ (Tech), HGCL

DIPR RO No.3732-PP/CL/Advt/1/2024-25, Dt:04-09-2024

సీఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోనే బీఆర్‌ఎస్ నేతలపై దాడి

అడిషనల్ డీజీ మహేశ్ భగవత్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఖమ్మంలో సీఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోనే బీఆర్‌ఎస్ నేతలపై దాడి జరిగిందని, వెంటనే నిందితులను అరెస్టు చేయాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీజీపీ కార్యాలయంలో అడిషనల్ డీజీ మహేశ్ భగవత్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు కలిసి ఖమ్మంలో బీఆర్‌ఎస్ నేతలపై జరిగిన దాడి ఘటనను వివరించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ దాడులకు పాల్పడిన వారి వివరాలను పోలీసులకు అందజేశామని, అయినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. దాడిలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలకు పోలీసులు అండగా నిలిచారని ఆరోపించారు. ఈ దాడి సీఎం కార్యాలయం పర్యవేక్షించిందని, రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందనడానికి ఖమ్మంలో బీఆర్‌ఎస్ నేతలపై జరిగిన దాడులే నిదర్శనమని ధ్వజమెత్తారు. వరద బాధితులకు బీఆర్‌ఎస్ అండగా నిలుస్తుందనే ఖమ్మంలో రౌడీ షీటర్లను పురమాయించారని ఆరోపించారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

Lr.No.MCG/E1/140/2024-25 తేది: 04-09-2024

ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిల్‌లో మున్సిపల్ జనరల్ ఫండ్స్ క్రింద రూ. 190.00 లక్షలతో CC రోడ్స్ పనులు, BT పని మరియు SWG పైప్ డ్రైనేజ్ మరియు ఇతర పనులను చేపట్టడం కోసం నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం https://tender.telangana.gov.in పై ఆన్‌లైన్ టెండర్స్ కోరబడుచున్నవి. మరియు దిగువ తెలిపిన షెడ్యూల్ తేదీలలో సైట్‌ను దర్శించవలెను.

1. బిడ్ ప్రారంభ తేది: 05-09-2024న మ॥ 12.00 గం॥లు
2. బిడ్ ముగింపు తేది: 11-09-2024న మ॥ 1.00 గం॥లు
3. బిడ్ మూల్యాంకనం తేది: 11-09-2024న మ॥ 3.01 గం॥లు

మీరు ఏవైనా ఇతర వివరాల కోసం క్రింది సంతకందారును ఆఫీసు పనివేళలలో సంప్రదించవలెను.

సం/– కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ.

DIPR RO No.3693-PP/CL/Advt/1/2024-25, Dt: 04.09.2024

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी संयंत्र (मणुगूरु) HEAVY WATER PLANT (MANUGURU)

निविदा सूचना Tender Notice

भारत के राष्ट्रपति के लिए और उनकी ओर से महाप्रबंधक, भारी पानी संयंत्र (मणुगूरु), द्वारा निम्नलिखित कार्य के लिए मुहरबंद निविदाएं आमंत्रित की जाती है। For and on behalf of President of India, General Manager, HWP(M) invites online item rate tender on two bid system for following work.

Tender No.: **HWPM/EP/NIT/EBP/24/02**, Name of the work: '**Revamping of Transformers for Pit type electrical furnace in EBP at HWPM including supply of spares**, Estimated Cost: Rs. **23,22,000/-**, Earnest Money Deposit : Rs. **46,440/-**, Duration of work: **03** months, Date of online availability of e-tender for view and download: **From 28.08.2024 (14:00 hrs) to 05.09.2024 (17:00 hrs)**, Last date & time for online submission of bid: **17:00 Hrs on 06.09.2024.** Date & time of technical bid opening : **On 12.09.2024 after 14:30 Hrs.** The bid forms and other details can be obtained from the website **https://eprocure.gov.in** The press notice is also available on **www.hwb.gov.in**.

Sd/-
(निविदा आमंत्रित प्रधिकारी के हस्ताक्षर)
(Signature of Tender inviting authority)

HWPM/Admn/G/NIT/13/2024/563 Dt. 03/09/2024

కూ.. చకచకా..

మొదటి పేజీ తరువాయి

మరమ్మతుల పనుల్లో అధికారులు వేగం పెంచారు. ముందుగా డౌన్‌లైన్ పనులు తాళ్లపూసపల్లి– కేసముద్రం మధ్యలో ఏడు జేసీబీలు, 300 మంది కార్మికులు, 100 మంది సూపర్‌వైజర్లు, 100 మంది వివిధ కేటగిరీకి చెందిన రైల్వే ఉద్యోగులు ఇలా మొత్తంగా 500 మంది పని చేశారు.

- ఇంటికన్నె– కేసముద్రం మార్గంలో 13 జేసీబీలు, 150 మంది సూపర్‌వైజర్లు, 300 మంది రైల్వేస్టాఫ్, 550మంది కార్మికులు మొత్తం కలిసి 1000 మందితో పనులు ప్రారంభించారు. పనులకు వరద ప్రవాహం అడ్డురావడంతో బండరాళ్లు, ఇసుక బస్తాలతో వరదను కట్టడి చేసి పనులు వేగవంతం చేసినట్టు అధికారులు తెలిపారు. అయితే అప్‌లైన్ (సికింద్రాబాద్–విజయవాడ) లైన్ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

ఎట్టకేలకు.. కదిలిన రైళ్లు

కేసముద్రం: రైల్వే ట్రాక్ పనులు పూర్తి కావడంతో ముందుగా తాళ్లపూసపల్లి– మహబూబాబాద్ మధ్య ట్రయల్ రన్‌గా గూడ్స్ రైలును నడిపారు. ఇంటికన్నె–కేసముద్రం మధ్య కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నిలిచిన సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలును ట్రయల్ రన్‌గా నడిపారు. ఆ తర్వాత నాలుగు గూడ్స్ రైళ్లను అప్‌లైన్‌లో పంపించారు. ఇక ప్రయాణికులతో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో కేసముద్రం–ఇంటికన్నె మధ్య 418 కిలోమీటర్ మీదుగా వేగాన్ని తగ్గించి 5 కిలోమీటర్ల వేగంతో నెమ్మదిగా నడిపించారు. రైల్వేట్రాక్ మరమ్మతులు చేసిన చోట కొంతవరకు కుంగిపోయింది. కాగా ట్రాక్ కుంగిపోయిన చోట జాకీలతో పైకి లేపి మరమ్మతు పనులు చేశారు. వర్షం కురుస్తున్నా, పనులను మాత్రం ఆపకుండా వేగవంతంగా చేస్తున్నారు.

ICMR - National Animal Resource Facility For Biomedical Research
Department of Health Research,
Ministry of Health and Family Welfare, Govt of India
Genome Valley, Kolthur (PO), Shamirpet (M), Hyderabad, Telangana - 500101

VACANCY NOTIFICATION

Advertisement No. NARFBR/Consultant/01/2024 dated 03.09.2024

Applications are invited to fill up one post of full time Consultant on contract basis. For essential qualification, experience, age, other terms and conditions along with Application Form visit **www.icmr.nic.in**, **www.narfbr.org**. Interested candidates may download application form and send duly filled application form along with self-attested copies of credentials through email addressed to **ao-narfbr@icmr.gov.in on or before 19.09.2024 till 05:30 PM.** Corrigendum, if any, shall be published on the Institute's website only.

Sd/-
Administrative Officer

తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ గణేష్ దేవాలయము, స్టేషన్ రోడ్, సికింద్రాబాద్

అనుబంధం–I, G.O.Rt.No.299, రెవెన్యూ (ఎండోమెంట్స్–II) శాఖ, తేది : 23.08.2024
ఫారం - I (రూల్ 4 (1) చూడండి)

యాక్ట్ 33/2007 ద్వారా సవరించబడిన విధంగా తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రెలిజియస్ ఇన్స్టిట్యూషన్స్ & ఎండోమెంట్స్ యాక్ట్ 1987 (యాక్ట్ 30/87)లోని సెక్షన్ 15లోని సబ్ సెక్షన్ (1) క్రింద ఈ నోటీసు తేదీ నుండి (20) రోజుల తరువాత ప్రభుత్వం ద్వారా శ్రీ గణేష్ దేవాలయం, స్టేషన్ రోడ్, సికింద్రాబాద్‌కు వంశపారంపర్యంకాని ట్రస్ట్ బోర్డులు ఏర్పాటు చేయబడతాయని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఆసక్తిగల వ్యక్తులు చట్టంలోని సెక్షన్ 17లోని సబ్–సెక్షన్(3) క్రింద రూల్స్‌లోని ఫారం–II ప్రకారం నిర్ణీత ప్రొఫార్మాలో ట్రస్టీషిప్ కొరకు తమ దరఖాస్తులను ఈ నోటీసు తేదీ నుండి ఇరవై రోజులలోగా డైరెక్టర్, ఎండోమెంట్స్, హైదరాబాద్ మరియు జాయింట్ కమిషనర్, ఎండోమెంట్స్, హైదరాబాద్, డిప్యూటీ కమిషనర్, ఎండోమెంట్స్, హైదరాబాద్, అసిస్టెంట్ కమిషనర్, ఎండోమెంట్స్, సికింద్రాబాద్‌కు పంపవలెను.

సం/– ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

DIPR RO No.3720-PP/CL/Advt/1/2024-25, Dt: 04.09.2024

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
అన్సారీ నగర్, న్యూఢిల్లీ - 110 608
ఎగ్జామినేషన్ సెక్షన్

అడ్మిషన్ నోటీస్ నం. 107/2024

F.No.AIIMS/Exam.Sec./Advt./4-5/(INI-CET-PG-Jan-25)/2024 తేది: 10.08.2024

జనవరి-2025 సెషన్ కొరకు PG కోర్సులలో అడ్మిషన్ కోసం INI-CET

దిగువ షెడ్యూల్ ప్రకారం AIIMS, న్యూఢిల్లీ మరియు ఇతర AIIMS, JIPMER పుదుచ్చేరి, NIMHANS బెంగళూరు, PGIMER చండీగఢ్ & SCTIMST త్రివేండ్రంలలో PG కోర్సులు [MD/MS/M.Ch.(6 సంవత్సరాలు)/DM(6 సంవత్సరాలు)/MDS] లో అడ్మిషన్ కొరకు జనవరి–2025 సెషన్ కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రన్స్ టెస్ట్ (INI-CET) కొరకు AIIMS, న్యూఢిల్లీ ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

అర్హతా ప్రమాణాలతో పాటు ప్రాస్పెక్టస్ పార్ట్–A అప్‌లోడింగ్ తేది: 05-09-2024

దరఖాస్తు కొరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్	ప్రారంభ తేది	ముగింపు తేది
• రిజిస్ట్రేషన్ మరియు సాధారణ సమాచారం	05.09.2024	05.10.2024 (సా.5.00 గం.లోగా)
• ఎగ్జామినేషన్ యూనిక్ కోడ్ (EUC) యొక్క జనరేషన్ • దరఖాస్తు ఫారం పూర్తిచేయుట	26.09.2024	18.10.2024 (సా.5.00 గం.)
AIIMS వెబ్‌సైట్‌లో అడ్మిట్ కార్డ్ అప్‌లోడింగ్	04 నవంబర్, 2024 (సోమవారం)	
ఎగ్జామినేషన్ తేది	10 నవంబర్, 2024 (ఆదివారం)	

తాజా అప్‌డేట్లు మరియు సవివర సమాచారం అన్నింటి కొరకు తరచుగా వెబ్‌సైట్ www.aiimsexams.ac.inను దర్శిస్తుండవలెను.

PAAR CBC 17112/11/0032/2425 అసిస్టెంట్ కంట్రోలర్ (ఎగ్జామ్స్)

జైనూరులో ఉద్రిక్తత

- మహిళపై అత్యాచారయత్నం ఘటనపై బాధిత వర్గం నిరసన
- నిందితుడి ఇల్లు, ఆటోతో పాటు 50కి పైగా దుకాణాలకు నిప్పు
- పలు వాహనాలు, బైకులు ధ్వంసం
- పట్టణంలో కర్ఫ్యూ..నిషేధాజ్ఞలు: డీజీపీ



గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

సాక్షి, ఆసిఫాబాద్/సాక్షి, హైదరాబాద్: గత ఆదివారం ఓ మహిళపై ఆటోడ్రైవర్ అత్యాచారయత్నం చేయడంతో పాటు హత్యకు ప్రయత్నించిన ఘటన మంగళవారం వెలుగులోకి రావడం, బాధిత వర్గం పెద్దయెత్తున ఆందోళనకు దిగడంతో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. నిరసనకారులు బుధవారం ఉదయం నిందితుడి ఇళ్లు, ఆటోను తగలబెట్టడంతో మొదలైన విధ్వంసం సాయంత్రం వరకూ కొనసాగింది. పట్టణంలో బంద్‌కు పిలుపునిచ్చిన బాధిత వర్గం మరో వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగింది. వారికి చెందిన రెండు ప్రార్థనా మందిరాల్లో ఫర్నిచర్ కొందరు ధ్వంసం చేశారు. నాయకులపై దాడి చేయడమే కాకుండా వారి ఇళ్లపై రాళ్ల వర్షం కురిపించారు. ఇళ్లల్లోకి చొరబడి సామాగ్రి పగులగొట్టారు. కార్లు, మాక్సీ క్యాబ్‌లు, బైక్‌లను ధ్వంసం చేసి నిప్పుపెట్టారు. 100కు పైగా దుకాణాలను తగులబెట్టారు. నిందితుడికి చెందిన వర్గం జైనూరు వదిలి మైదాన ప్రాంతానికి తరలి పోవాలని డిమాండ్ చేశారు. వేలాది మంది బాధిత వర్గం వారు పట్టణంలోకి చేరుకుని ఒక్కసారిగా విధ్వంసానికి పాల్పడడం, ఇంకోవైపు మరోవర్గం కూడా కొన్నిచోట్ల దాడులకు దిగడంతో వారిని నిలువరించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. కాగా జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు నేతృత్వంలో బాధిత వర్గాన్ని శాంతింప జేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇరువర్గాల వారు సంయమనం పాటించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో కోరారు.

1,000 మంది పోలీసులు, ఆర్‌ఏఎఫ్‌తో బందోబస్తు: డీజీపీ

జైనూరులో జిల్లా యంత్రాంగం కర్ఫ్యూ, 144 సెక్షన్ విధించిందని డీజీపీ జితేందర్ తెలిపారు. మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం ఘటనతో జైనూరులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినట్లు బుధవారం ఒక ప్రకటనలో ఆయన వెల్లడించారు. దాడులు, ప్రతిదాడులతో పరిస్థితి చేయి దాటుతుండడంతో ఆదిలాబాద్, మంచిర్యాల, సిరిసిల్ల, జగిత్యాల, తెలంగాణ స్పెషల్ పోలీసు ప్లాటూన్స్ కలిసి మొత్తం 1,000 మంది పోలీసులను, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను రంగంలోకి దింపినట్లు తెలిపారు. జైనూరులో పరిస్థితిని తనతో పాటు అదనపు డీజీ (శాంతిభద్రతలు), నార్త్ జోన్ ఐజీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నెట్‌పై నిషేధం విధించామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీజీపీ వెల్లడించారు.

బాధితురాలికి మంత్రి సీతక్క పరామర్శ

గాంధీ ఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జైనూరు బాధితురాలిని మంత్రి సీతక్క పరామర్శించారు. మరింత మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్థానిక యువత సంయమనం పాటించాలని కోరారు. కాగా కాలేయ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం షాపెల్లి గ్రామానికి చెందిన ముద్రబోయిన రఘును కూడా మంత్రి పరామర్శించారు.

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी संयंत्र (मणुगूरु) HEAVY WATER PLANT (MANUGURU)

निविदा सूचना Tender Notice

भारत के राष्ट्रपति के लिए और उनकी ओर से महाप्रबंधक, भारी पानी संयंत्र (मणुगूरु), द्वारा निम्नलिखित कार्य के लिए मुहरबंद निविदाएं आमंत्रित की जाती है। For and on behalf of President of India, General Manager, HWP(M) invites online item rate tender on two bid system for following work.

Tender No.: **HWPM/EP/NIT/EBP/24/01, Dated : 22.08.2024**, Name of the work: '**Complete revamping of Pit furnace Heating elements in EBP at HWPM including supply of spares**', Estimated Cost: Rs. **15,05,000/-**, Earnest Money Deposit : Rs. **30,100/-**, Duration of work: **03** months, Date of online availability of e-tender for view and download: **From 28.08.2024 (10:00 hrs) to 05.09.2024 (17:00 hrs)**, Last date & time for online submission of bid: **17:00 Hrs on 06.09.2024.** Date & time of technical bid opening : **On 12.09.2024 after 14:30 Hrs.** The bid forms and other details can be obtained from the website **https://eprocure.gov.in** The press notice is also available on **www.hwb.gov.in**.

Sd/-
(निविदा आमंत्रित प्रधिकारी के हस्ताक्षर)
(Signature of Tender inviting authority)

HWPM/Admn/G/NIT/13/2024/538 Dt. 03/09/2024

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी बोर्ड HEAVY WATER BOARD

ई - निविदा आमंत्रत सूचना Notice Inviting e-Tenders

भारत के राष्ट्रपति के लिए और उनकी ओर से, निदेशक (प्रचालन), भारी पानी बोर्ड से "भारी पानी संयंत्र (मणुगुरु), पोस्ट: गौतमीनगर, अश्वापुरम भद्राद्री-कोत्तागुडेम जिला, तेलंगाना राज्य - 507116" पर कार्य निष्पादन के लिए मुहरबंद निविदाएं आमंत्रित की जाती हैं।

For and on behalf of President of India, Director (O), Heavy Water Board invites Online tender through e-tendering mode in two bid system, for work execution at "HWP (Managuru), Gautami Nagar Post, Aswapuram, Bhadradri-Kothagudem Dist. Telangana State - 507116" for the following work.

निविदा सूचना संख्या : भापासंम/एम-पी/सीटी/30/2023, कार्य का नाम: भारी पानी संयंत्र, मणुगुरु, के मेनप्लांट में मेन कूलिंगटॉवर के सीटी सेल नम्बर्स एफ पूरी तरह से रिवाम्पिंग और सीटी सेल नम्बर्स ई, जि और एच, की आंशिक सेलिंग की रिवाम्पिंग। अनुमानित : ₹ **6,19,00,000/-**, (जिएसटी समेत), अनुबंध की अवधि : **12** महिने (बारह कैलेंडर माह), बयाना : ₹ **12,38,000/-**, निविदा दस्तावेजों को देखने और डाउनलोड करने की निर्धारित दिनांक : **02.09.2024, (09:00 बजे)** से **30.09.2024, (18:55 बजे)** तक, ऑन लाइन निविदाओं को जमा करने की अंतिम तिथि एवं समय : दिनांक: **30.09.2024** के **18:55** बजे या उससे पहले।

NIT No.: **HWPM/M-P/CT/30/2023**, Name of work : **Complete revamping of Cooling tower cell No. F and partial revamping of Cell Nos. E, G and H of Main cooling tower in Main Plant of Heavy Water Plant (Manuguru)**, Estimated cost : ₹ **6,19,00,000/-**, (Inclusive of GST), Earnest Money : ₹ **12,38,000/-**, Period of completion : **12 months** (Twelve calander months), Date of online availability of E-tender for view and download ; From **02.09.2024 (09:00 hrs)** to **30.09.2024 (18:55 hrs)**, Last date & time for online submission of bid : **18:55 hrs of 30.09.2024**.

निविदा अधिसूचना एवं दस्तावेज़ वेबसाइट **https://eprocure.gov.in** पर उपलब्ध हैं।

The bid forms and other details can be obtained from the website **https://eprocure.gov.in**

विस्तृत एनआईटी के लिए कृपया **www.hwb.gov.in** देखें।

Detailed NIT can be viewed at **https://www.hwb.gov.in**

Sd/-
(निविदा आमंत्रित प्राधिकारी के हस्ताक्षर)
(Signature of tender inviting authority)

HWPM/Admn/G/NIT/2024/554 Dt. 03/09/2024

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SHRI P KRISHNA	SMT NEELI UDAY KUMAR SARALA DEVI D/o P KRISHNA W/o NEELI SRI HARI UDAY KUMAR	PNO 13/GF/FF/SF NEW VASAVI COLONY KAKGUDA	GIFT SETTLEMENT DEED NO 906/2022, DT 12/05/2022 (LINK DOCUMENT)
2	SMT CHERUKURI RAMA KOWMUDI	SHRI DHEERAJ AGARWAL S/o RAMESH AGARWAL	PNO 9/GF KOUSALYA COLONY KARKHANA	SALE DEED NO 1393/2024, DT 09/08/2024
3	SMT CHERUKURI RAMA KOWMUDI	SHRI DHEERAJ AGARWAL S/o RAMESH AGARWAL	PNO 9/FF KOUSALYA COLONY KARKHANA	(LINK DOCUMENT)
4	SHRI MAJ K RANGA RAO	1.SHRI VIJAYKUMAR VISHNU GARDE S/o VISHNU K GARDE 2.SMT KALPANA GARDE W/o NILESH K PARMAR 3.SHRI NILESH K PARMAR S/o KESHAVJI K PARMAR	FNO 12-A/GF/TYPE 4-B AWHO GOUTHAM NAGAR SIKH ROAD	SALE DEED NO 646/2024, DT 15/04/2024 DEATH CERTIFICATE OF MAJ K RANGA RAO (LINK DOCUMENT)
5	1.SHRI ANAND BHOSALE PATIL 2.SMT VAISHALI BHOSALE PATIL	1.SHRI SUCHITKUMAR TEJMALBHAI JAIN S/o TEJMALBHAI JAIN 2.SMT NAGORI ANITA W/o SUCHIT JAIN	FNO G3/GF, PNO 76/A AJAY RESIDENCY JYOTHI COLONY, KAKAGUDA	SALE DEED NO 546/2024, DT 26/03/2024 (LINK DOCUMENT)
6	1.SHRI S MALAKONDAIAH 2.SMT D SUVARNA	SMT DASARI SUVARNA D/o S MALA KONDAIAH W/o LATE DASARI ANKULU	PNO 130/GF, SARASWATHI NAGAR VENT III, LOTHUKUNTA	RELEASE DEED NO 1260/2024, DT 18/05/2024 (LINK DOCUMENT)
7	SHRI K PULLA REDDY	SHRI D RAMESH CHANDER S/o LATE D V LINGAM	FNO 16/FF,SYNO 26 MAITRI APARTMENTS TRIMULGHERRY	SALE DEED NO 1893/2004, DT 10/09/2004 DEATH CERTIFICATE OF D GIRIJA (LINK DOCUMENT)
8	SHRI C R K PRASAD (HUF)	1. SHRI ANAND JAISWAL S/o LATE HANUMAN PRASAD JAISWAL 2. SMT SANDHYA W/o ANAND JAISWAL	PNO 18/GF/FF CANTONMENT CHS SIKH ROAD	SALE DEED NO 289/2022, DT 08/02/2022 (LINK DOCUMENT)
9	1. ASHWINI KUMAR MERANI 2. SMT GEETU MERANI	SMT BELLAMKONDA VIMALA W/o BELLAMKONDA GNANA SUNDER RAO	PNO 21/P & 22/302/SF SHOBANA CHS MARREDPALLY	SALE DEED NO 1049/2024 DT 15/06/2024 (LINK DOCUMENT)
10	SHRI N RAMALINGA RAJU	1.SHRI TUNK KRISHNA S/o LATE TUNK LAKSHMAN SHA 2.SMT TUNK VANISREE W/o TUNK KRISHNA 3.SHRI TUNK NIKHIL S/o TUNK KRISHNA 4.SHRI TUNK AKSHAY S/o TUNK KRISHNA	PNO 22 RADHASWAMY CHS, SIKH ROAD	SALE DEED NO 1279/2024 DT 24/07/2024 (LINK DOCUMENT)
11	SHRI T ANJI REDDY	1.SHRI JITTA RAJASHEKAR REDDY S/o LATE J ANJI REDDY 2.SHRI JITTA SURENDER REDDY S/o LATE J ANJI REDDY	FNO 201/SF, ADITYA ARCADE, KAKAGUDA	RELEASE DEED NO 1210/2009, DT 17/09/2009 DEATH CERTIFICATE OF J ANJI REDDY & FAMILY MEMBER CERTIFICATE (LINK DOCUMENT)
12	SHRI P VEERESWARA MANOHAR	SMT NISHA THAKUR W/o THAKUR SUDHEER SINGH	PNO 43/GF TEACHERS COLONY TRIMULGHERRY	SALE DEED NO 1611/2022 DT 02/09/2022 (LINK DOCUMENT)
13	SMT M KALPANA ALIAS RAMIDI KALPANA REDDY	1. SHRI G M R SREEKANTH BABU S/o MUNIRAMAIAH GANGARI 2. SMT G SWATHI W/o G M R SREEKANTH BABU	PNO 98/GF TEACHERS COLONY TRIMULGHERRY	RECTIFICATION DEED NO 183/2024, DT 29/01/2024 SALE DEED NO 158/2024 DT 24/01/2024 (LINK DOCUMENT)
14	SHRI JAGJIT SINGH	SHRI AVVARI VENKATESWAR S/o LATE A DATTATREYA SARMA	PNO 27-A/GF/FF PAD AOC EC CHS KARKHANA	SALE DEED NO 2111/2023 DT 01/12/2023 (LINK DOCUMENT)
15	SHRI L SIVIAH	MR MD MAHMOOD S/o ABDUL WAHAB	HNO 2-6-114 SIKH VILLAGE	SALE DEED NO 864/2009 DT 08/07/2009 (LINK DOCUMENT)
16	SHRI L NARAYANA SWAMY	MR MD MAHMOOD S/o ABDUL WAHAB	HNO 2-6-113 SIKH VILLAGE	SALE DEED NO 864/2009 DT 08/07/2009 (LINK DOCUMENT)
17	SHRI K V SAMUEL & 2 OTHERS	STEWARDS ASSOCIATION IN INDIA CHARITABLE TRUST	PNO 47/GF VASAVI COLONY-VENT B.KAKAGUDA	SALE DEED NO 827/1989, DT 28/02/1989 (LINK DOCUMENT)
18	SHRI M JEETMAL BETALA	SHRI GOUTAM BETALA S/o M JEETMAL BETALA	PNO 10/GF LIC CHS CHANDULAL BOWLI SIKH VILLAGE	SALE DEED NO 122/1999 DT 04/12/1998 DEATH CERTIFICATE OF M JEETMAL BETALA (LINK DOCUMENT)
19	SMT GORAK LAXMI BAI	SHRI GORAK MAHENDER S/o GORAK LAXMINARAYANA	SYNO 121/A/GF THOKATTA VILLAGE BOWENPALLY	REGISTERED WILL DEED 123/II/2021 DT 30/07/2021 DEATH CERTIFICATE OF
20	SMT GORAK LAXMI BAI	SHRI GORAK MAHENDER S/o GORAK LAXMINARAYANA	SYNO 121/A/FF THOKATTA VILLAGE BOWENPALLY	GORAK LAXMIBAI (LINK DOCUMENT)
21	SHRI M S MIHAN RAO	DINGARI SRIRAM S/o DINGARI SRINIVAS	FNO 107/GF, MARUTHI APARTMENTS, BOWENPALLY	SALE DEED NO 1781/2021 DT 17/09/2021 (LINK DOCUMENT)
22	SHRI V PANDU	SMT K SUGUNA W/o LATE K SATYANARAYANA	HNO 3-7-195 & 196 KAKAGUDA VILLAGE	SALE DEED NO 1065/2019 DT 24/05/2019 (LINK DOCUMENT)
23	SHRI SYED MUZAFURUDDIN	SMT PADAKANTI BALAMANI W/o PADAKANTI MAHADEV	FNO 6/PNO 7 SREE NAGAR COLONY TRIMULAGHERRY	SALE DEED NO 688/2005 DT 27/04/2005 (LINK DOCUMENT)
24	SMT G ANURADHA	SHRI M J KALYANA CHAKRAVARTHY S/o M VENKATESWARA RAO	PNO 8/C/GF/FF PROGRESSIVE CHS HASMATHPET	SALE DEED NO 793/2008 DT 05/06/2008 (LINK DOCUMENT)
25	SMT G ANASUYA	MRS SHAIK ZABEEN RUKSANA ABDUL HAFIZ W/o SYED ZAHIRUDDIN	PNO 3/FNO G-1PLAZA SADANSRI MALANI COLONY BOWENPALLY	SALE DEED NO 883/2024 DT 22/05/2024 (LINK DOCUMENT)

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

Sd/-
D. Madhukar Naik
Chief Executive Officer, Secunderabad Cantonment Board.

No. SCB/Tax branch/1590, Office of the Cantonment Board, Court House Compound, S.P. Road, Secunderabad - 500 003. Date : 04-09-2024

మొబైల్ ఫోన్‌తో బ్రెయిన్ క్యాన్సర్ రాదు

- ఫోన్‌కు, క్యాన్సర్‌కు సంబంధం లేదు
- అంతర్జాతీయ పరిశోధకుల బృందం స్పష్టీకరణ
- 5 వేలకు పైగా అధ్యయనాల సమగ్ర విశ్లేషణ



న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ వినియోగిస్తే బ్రెయిన్ క్యాన్సర్ సోకుతుందున్న ఆందోళన ప్రపంచవ్యాప్తంగా చాలా ఏళ్లుగా ఉంది. అయితే, ఇది అపోహ మాత్రమేనని, ఎంతమాత్రం నిజం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఫోన్‌కు, బ్రెయిన్ క్యాన్సర్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటున్నాయి. ఈ అంశంపై జరిగిన 5 వేలకుపైగా అధ్యయనాలను ఆస్ట్రేలియన్ రేడియేషన్ ప్రొటెక్షన్, న్యూక్లియర్ సేఫ్టీ ఏజెన్సీ(అర్పాన్సా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ పరిశోధకుల బృందం నిశితంగా సమీక్షించింది. ఇందులో 63 అధ్యయనాల వివరాలు 1994 నుంచి 2022 వరకు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా వైర్‌లెస్ టెక్నాలజీ వినియోగం విపరీతంగా పెరిగింది. కానీ, బ్రెయిన్ క్యాన్సర్ కేసులు మాత్రం పెరగలేదని పరిశోధకులు గుర్తించారు. అధ్యయనాల్లో తేలిన ఫలితాల ఆధారంగా వారు ఈ నిర్ధారణకు వచ్చారు. ఇది తగిన సాక్ష్యాధారాల ఆధారంగా జరిగిన చాలా సమగ్రమైన విశ్లేషణ అని చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) సూచనతో జరిగిన ఈ విశ్లేషణ వివరాలను ఎన్విరాన్‌మెంట్ ఇంటర్నేషనల్ పత్రికలో ప్రచురించారు. ఫోన్ వాడకంతో తలకు, మెడకు సైతం క్యాన్సర్ సోకుతున్నట్లు ఆధారాలు లేవని వెల్లడించారు. ఒక వ్యక్తి మొబైల్ ఫోన్‌ను పదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం ఉపయోగిస్తే బ్రెయిన్ క్యాన్సర్ సోకుతుందని చెప్పలేమని స్పష్టంచేశారు. సాధారణంగా ఫోన్ల నుంచి రేడియో తరంగాలు వెలువడుతాయన్న సంగతి తెలిసిందే. ఫోన్ చెవి దగ్గర పెట్టుకొని మాట్లాడుతుంటాం కాబట్టి బ్రెయిన్ క్యాన్సర్ సోకుతుందన్న ప్రచారం దశాబ్దాల క్రితమే మొదలైంది. దీనిపై ప్రజల్లో రకరకాల భయాందోళనలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఫోన్ల నుంచి వెలువడే రేడియో తరంగాల వల్ల బ్రెయిన్ క్యాన్సర్ వస్తుందంటూ కొన్ని అధ్యయనాలు సైతం చెప్పాయి. 2011లో డబ్ల్యూహెచ్‌ఓ అనుబంధ విభాగమైన ఇంటర్నేషన్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్(ఐఏఆర్‌సీ) సైతం ఇదే విషయం వెల్లడించింది. అయితే, ఈ సంస్థ చాలా పరిమితమైన సమాచారంపై ఆధారపడి ఈ నిర్ధారణకు వచ్చిందని, సమగ్రమై అధ్యయనం చేయలేదని అంతర్జాతీయ పరిశోధకులు తాజాగా తేల్చిచెప్పారు. ఫోన్లతో క్యాన్సర్లు వస్తాయన్న అపోహ వీడాలని సూచించారు.

ఢిల్లీ ఎల్జీకి ఫుల్ పవర్స్

కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ: ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు కేంద్రం తాజాగా మరిన్ని అధికారాలు కట్టబెట్టింది. రాష్ట్ర పరిధిలో ఎలాంటి బోర్డు, కమిషన్, అథారిటీ తదితర చట్టబద్ధమైన సంస్థలనైనా ఏర్పాటు చేసే అధికారాలు కల్పించింది. అంతేగాక ఆయా సంస్థల్లో అధికారులను కూడా ఇకపై ఎల్జీయే నియమించవచ్చు. ఈ మేరకు ఆర్టికల్ 239, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంత చట్టం-1991 ప్రకారం కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటిదాకా ఈ అధికారాలన్నీ రాష్ట్రపతి వద్ద ఉండేవి. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ)లో ప్రతిష్టాత్మకమైన అంతర్గత ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ మోదీ సర్కారు ఈ చర్యకు దిగడం విశేషం. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ ప్రభుత్వానికి, కేంద్రానికి పదేళ్లుగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుండటం తెలిసిందే. ఢిల్లీపై ఆధిపత్యం కోసం ఇరు వర్గాల కుమ్ములాటలు తరచూ కోర్టుల దాకా వెళ్తున్నాయి. పలు కేసుల్లో తీర్పులు ఆప్‌కు అనుకూలంగా వచ్చినా చట్ట సవరణల ద్వారా కేంద్రం వాటిని పూర్వపక్షం చేస్తూ వస్తోంది.


ఎంసీడీ వార్డు కమిటీల ఎన్నికల్లో ఆప్‌కు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)లో వార్డు కమిటీల ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. జోనల్ స్థాయి వార్డు కమిటీల్లో చైర్మన్, డెప్యూటీ చైర్మన్ పదవులను బీజేపీ కైవసం చేసుకుంది. 12 జోన్లకుగాను ఏడు జోన్లలో బీజేపీ విజయం సాధించింది. ఆప్ గెలుపును బీజేపీ కేవలం ఐదు జోన్లకు పరిమితం చేసింది. అయితే తన నిర్ణయాన్ని కాదని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా.. డెప్యూటీ కమిషనర్లను ప్రిసైడింగ్ అధికారులుగా నియమించి చేపట్టిన ఈ ఎన్నికలను చెల్లనివిగా పరిగణిస్తామని ఎంసీడీ మేయర్, ఆప్ నాయకురాలు షెల్లీ ఒబెరాయ్ చెప్పడం గమనార్హం.

ముప్పుపై హెచ్చరించలేదని...! ఉత్తర కొరియాలో 30 మందికి మరణశిక్ష

ప్యాంగ్యాంగ్: దారుణ దండనలకు చిరునామాగా నిలిచే ఉత్తర కొరియా నియంత కిమ్ జాంగ్ ఉన్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఉ.కొరియాను ముంచెత్తిన వరద ధాటికి ఓవైపు అక్కడి ముంపు ప్రాంతాల వాసులు బాధలు పడితే మరోవైపు కిమ్ ఆగ్రహానికి ఆ ప్రాంత అధికారులు బలి పశువులయ్యారు. చైనా సరిహద్దులోని చగాంగ్ ప్రావిన్స్‌లో జూలైలో సంభవించిన భారీ వరదల్లో వేలాది మంది ప్రజల మరణానికి కారకులు మీరేనంటూ అధికారులకు కిమ్ మరణశిక్ష విధించారు. ప్రావిన్షియల్ గవర్నర్లు సహా దాదాపు 30 మంది ఉన్నతాధికారులకు గత నెల చివర్లో మరణ శిక్ష విధించారని దక్షిణకొరియా చోసన్ టీవీ ఛానల్ పేర్కొంది. 2019 నుంచి చగాంగ్ ప్రావిన్స్ ప్రావిన్షియల్ పార్టీ కమిటీ కార్యదర్శిగా ఉండి ఇటీవల పదవి కోల్పోయిన కాంగ్ బాంగ్ హూన్‌కు సైతం శిక్ష వేసిందని చోసన్ టీవీ ఛానల్ వెల్లడించింది. మరణదండనలు ఉత్తర కొరియాలో సర్వసాధారణం. కోవిడ్ ముందు వరకు ఏటా కనీసం 10 మందికి మరణశిక్షలు అమలయ్యేవి. 2023లో ఉత్తర కొరియాలో కనీసం 100 మందికి మరణశిక్ష అమలు చేశారని కొరియా టైమ్స్ వార్తాసంస్థ పేర్కొంది.

కలిసి పని చేస్తేనే కలిమి



మోదీకి సింగపూర్ ప్రధాని విందు

భారత ప్రధాని నరేంద్ర మోదీ గౌరవార్థం సింగ్‌పూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ బుధవారం రాత్రి విందు ఇచ్చారు. ఇరువురు నేతలు గురువారం చర్చలు జరుపనున్నారు. అంతకముందు బ్రూనై పర్యటన ముగించుకొని సింగపూర్ చేరుకున్న మోదీకి ఘన స్వాగతం లభించింది. సింగపూర్ హోం, న్యాయ శాఖ మంత్రి కె.షణ్ముగంతోపాటు ప్రవాస భారతీయులు స్వాగతం పలికారు. మోదీ రెండు రోజులపాటు ఇక్కడ పర్యటిస్తారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన

- బ్రూనై సుల్తాన్ హసనల్ బొల్కియాతో ద్వైపాక్షిక చర్చలు
- కీలక రంగాల్లో పరస్పరం సహరించుకోవాలని నిర్ణయం
- అభివృద్ధికే తప్ప విస్తరణ వాదానికి మద్దతు ఇవ్వబోమని చైనాకు మోదీ చురకలు
- భారత్‌లో పర్యటించాలని బ్రూనై సుల్తాన్‌కు ఆహ్వానం

బందర్‌సెరీ బెగవన్/సింగపూర్: అభివృద్ధి విధానానికి తాము మద్దతు ఇస్తామని, విస్తరణవాదాన్ని తిరస్కరిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. చైనా పేరు ప్రస్తావించకుండా పరోక్షంగా ఆ దేశ వైఖరిని ఎండగట్టారు. ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా మోదీ బుధవారం బ్రూనై సుల్తాన్ హసనల్ బొల్కియాతో సమావేశమయ్యారు. భారత్–బ్రూనై మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతోపాటు రక్షణ, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఆహార భద్రత, విద్య, ఇంధనం, అంతరిక్ష సాంకేతికత, ఆరోగ్యం, సంస్కృతి, ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాల వంటి కీలక అంశాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి చేర్చాలని, వివిధ నూతన రంగాల్లో పరస్పరం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. కలిసి పని చేస్తేనే ఇరు దేశాలకు మేలు జరుగుందని స్పష్టంచేశారు. సమావేశం అనంతరం మోదీ, సుల్తాన్ హసనల్ బొల్కియా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. భారత్, బ్రూనై మధ్య లోతైన చరిత్రాత్మక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. రెండు దేశాల నడుమ దౌత్య సంబంధాలకు 40 ఏళ్లు నిండుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించామన్నారు. ఆగ్నేయ ఆసియా దేశాల కోసం ఒక ప్రవర్తనా నియామవళిని ఖరారు చేసుకోవాలని నిర్ణయానికి వచ్చామని వివరించారు. యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ–1982(అన్‌క్లాస్) తరహాలో ఆగ్నేయ ఆసియా ప్రాంతంలో నౌకలు, విమానాల స్వేచ్ఛా విహారానికి ఒక తీర్మానం ఆమోదించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, భద్రతకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

బ్రూనై అత్యంత కీలక భాగస్వామి

భారతదేశ 'తూర్పు కార్యాచరణ', ఇండో–పసిఫిక్ దార్శనికత విషయంలో బ్రూనై తమకు అత్యంత కీలక భాగస్వామి అని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. బ్రూనై సుల్తాన్‌తో సమగ్ర చర్చలు జరిపామని, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, వ్యూహాత్మక రంగాల్లో పరస్పరం సహరించుకోవాలని తీర్మానించామని చెప్పారు. ఫిన్‌టెక్, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, ఫార్మాస్యూటికల్, ఆరోగ్యం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. తనకు ఘనమైన ఆతిథ్యం ఇచ్చిన బ్రూనై రాజ కుటుంబానికి నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. భారత్‌లో పర్యటించాలని సుల్తాన్‌ను ఆహ్వానించారు. ఉపగ్రహాలు, ఉపగ్రహ ప్రయోగ వాహనాల కోసం టెలిమెట్రీ, ట్రాకింగ్, టెలికమాండ్ స్టేషన్ నిర్వహణ విషయంలో సహకరించుకోవడానికి భారత్, బ్రూనై ఒక అవగాహనా ఒప్పందం(ఎంఓయూ)పై సంతకాలు చేశాయి.



బ్రూనై సుల్తాన్ హసనల్ బొల్కియాతో ప్రధాని మోదీ

అమెరికా స్కూల్లో కాల్పుల మోత

నలుగురి మృతి

- 9 మందికి గాయాలు
- అదుపులో 14 ఏళ్ల టీనేజర్

విండర్: అమెరికాలో మళ్లీ కాల్పుల మోత వినిపించింది. జార్జియా రాష్ట్రంలోని విండర్ పట్టణంలో అపలాచీ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 9 మంది గాయపడ్డారు. అయితే 30 మంది గాయపడినట్లు తొలుత వార్తలొచ్చాయి. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 9.30 గంటలకు స్కూల్లో కాల్పులు మొదలయ్యాయి. దీంతో విద్యార్థులు ప్రాణభయంతో దగ్గర్లోని ఫుట్‌బాల్ స్టేడియంలో తలదాచుకునేందుకు పరుగులుపెట్టారు. కాల్పుల విషయం తెల్సి పోలీసులు నిమిషాల్లో పాఠశాలను చుట్టుముట్టారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించారు. కాల్పుల్లో ఎంతమంది చనిపోయారు, ఎందరు గాయపడ్డారనే వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. కాల్పులు జరిపింది 14 ఏళ్ల టీనేజర్ అని మీడియాలో వార్తలొచ్చాయి. అతను ఆ స్కూల్ విద్యార్థేనా అనేది తెలియాల్సి ఉంది. కాల్పులకు కారణాలను పోలీసులు వెల్లడించలేదు. '' తుపాకీ శబ్దాలు వినిపించినపుడు రసాయనశాస్త్ర తరగతి గదిలో ఉన్నా. ఒక టీచర్ పరుగున వచ్చి కాల్పులు జరుగుతున్నాయి. గడియ పెట్టుకోండి అని చెప్పి వెళ్లిపోయారు. తర్వాత ఎవరో వచ్చి తలుపు తెరవండని గట్టిగా పలుమార్లు అరిచారు. మేం తీయలేదు. తర్వాత కాల్పుల శబ్దాలు, అరుపులు వినిపించాయి. మేం తర్వాత దగ్గర్లోని ఫుట్‌బాల్ మైదానంలోకి పరుగులు తీశాం' అని ప్రత్యక్ష సాక్షి, 17 ఏళ్ల విద్యార్థి సెర్గియో కాల్డెరా చెప్పారు. విషయం తెల్సి విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తరలివచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి. అమెరికాలో తుపాకీ సంస్కృతికి ఏటా పెద్దసంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోతున్న విషయం విదితమే. ఘటనపై దేశాధ్యక్షుడు బైడెన్ స్పందించారు. ''అమెరికా విద్యార్థులు చదవడం, రాయడం అనే వాటితోపాటు దాక్కోవడం, తమను తాము కాపాడుకోవడం అనేవి నేర్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది. అమెరికాలో కాల్పులు మామూలే అనే ధోరణిని ఆమోదించబోం'' అని ఆయన వ్యాఖ్యానించారు.



రాహుల్‌తో పునియా, వినేశ్

ఎన్నికల బరిలో వినేశ్ ఫొగాట్!

- జులానా నుంచి వినేశ్
- బాద్లీ నుంచి పునియా?

సాక్షి, న్యూఢిల్లీ: ఒలింపిక్ క్రీడాకారిణి, మల్లయోధురాలు వినేశ్ ఫొగాట్ రాజకీయ రంగప్రవేశం దాదాపు ఖాయమైంది. కాంగ్రెస్ తరఫున హరియాణా శాసనసభ ఎన్నికల్లో జులానా స్థానం నుంచి ఆమె పోటీచేసే అవకాశముందని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు బుధవారం వెల్లడించాయి. మరో ప్రముఖ మల్లయోధుడు భజరంగ్ పునియా సైతం బాద్లీ స్థానం నుంచి పోటీచేసే అవకాశముంది. ఈ ఇద్దరు రెజ్లర్లు బుధవారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. దీంతో హస్తం పార్టీలో వీరిద్దరి చేరిక ఖాయమైందని వార్తలొచ్చాయి. రాహుల్‌తో వినేశ్, పునియాలు దిగిన ఫోటోను కాంగ్రెస్ తన అధికారిక ఖాతా 'ఎక్స్'లో పోస్ట్ చేసిన అనంతరం వీరి పోటీ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. వీరిద్దరి అభ్యర్థిత్వాన్ని గురు లేదా శుక్రవారం జరగబోయే కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఖరారుచేస్తారని తెలుస్తోంది. వీరిద్దరి పోటీపై గురువారం నాటికి స్పష్టత వస్తుందని హరియాణా రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపక్ బాబరియా మంగళవారం పేర్కొనడం తెల్సిందే.

ఇంత కాఠిన్యమా?

- నిందితులకు వాళ్ల సొంత డాక్యుమెంట్లు కూడా ఇవ్వరా?
- ఈడీకి సుప్రీంకోర్టు అక్షింతలు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ (పీఎంఎల్‌ఏ) కేసుల దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అవసరానికి మించిన కాఠిన్యం చూపుతోందంటూ సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుల నుంచి జప్తు చేసే డాక్యుమెంట్లను వారికిచ్చేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారంటూ తలంటింది. ''కేవలం సాంకేతిక కారణాలు చూపుతూ డాక్యుమెంట్లను నిరాకరించడం సబబా? ఇది జీవించే హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కును హరించడం కాదా?'' అంటూ అక్షింతలు వేసింది. పీఎంఎల్‌ఏకు సంబంధించిన ఒక కేసును న్యాయమూర్తులు జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ ఎ.అమానుల్లా, జస్టిస్‌ఏజీ మసీతో ధర్మాసనం బుధవారం విచారించింది. ''నిందితునికి సంబంధించిన వేలాది డాక్యుమెంట్లు మీరు జప్తు చేయొచ్చు. అతనికి అవన్నీ గుర్తుండాలని లేదు కదా! అడిగితే ఇవ్వడానికి ఇబ్బందేమిటి? వేలాది పేజీల డాక్యుమెంట్లనైనా నిమిషాల్లో స్కాన్ చేసిన అందుబాటులోకి తేవచ్చు. దర్యాప్తు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడలేరా?'' అని ప్రశ్నించింది. ''క్లిష్టతరమైన విచారణ ప్రక్రియను ఎదుర్కొంటున్న నిందితునికి సొంత డాక్యుమెంట్లే ఇవ్వకపోవడం న్యాయమా? అత్యంత హీనం, అమానుషమని భావించిన కేసుల్లోనూ నిందితులను బెయిల్ దొరికిన సందర్భాలు బోలెడు! కానీ ఈ రోజుల్లో అమాంబాపతు కేసుల్లో కూడా బెయిల్ రావడం గగనంగా మారుతోంది. కాలం మారుతోంది. ఈ పరిస్థితుల్లో ఇలాంటి కేసుల్లో మేం (ధర్మాసనం) కఠినంగా ఉండొచ్చా? అది భావ్యమేనా?'' అంటూ ఈడీని జస్టిస్ ఓకా నిలదీశారు. బెయిల్ కోసం, లేదా కేసే తప్పుడుదని నిరూపించేందుకు డాక్యుమెంట్లపైనే ఆధారపడే పరిస్థితుల్లో వాటిని పొందే హక్కు నిందితునికి ఉంటుందని స్పష్టం చేశారు.

స్వింగ్ స్టేట్స్‌లో కమల దూకుడు

రెండింట్లో స్పష్టమైన ఆధిక్యం

- ఒక్క రాష్ట్రంలోనే ట్రంప్ పైచేయి
- మూడింట్లో ముమ్మర పోరు
- ఫలితాన్ని తేల్చనుంది ఆ మూడే!
- సీఎన్ఎన్ తాజా సర్వేలో వెల్లడి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది. డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్ విజేతగా నిలిచే అవకాశాలు నానాటికీ మెరుగవుతున్నట్టు సీఎన్ఎన్ వార్తా సంస్థ తాజా సర్వేలో తేలింది. ఎన్నికల ఫలితాలను నిర్ణాయక రీతిలో ప్రభావితం చేసే అతి కీలకమైన ఆరు స్వింగ్ స్టేట్స్‌లో ఆమె హవా సాగుతోందని వెల్లడించింది. ఆ రాష్ట్రాల్లో విస్కాన్సిన్, మిషిగన్‌ల్లో ఉపాధ్యక్షురాలు స్పష్టంగా ముందంజలో ఉన్నారు. అరిజోనాలో మాత్రం ఆమె ప్రత్యర్థి, రిపబ్లికన్ల అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ది పైచేయిగా ఉంది. ఇక జార్జియా, నెవెడా, పెన్సిల్వేనియాల్లో ఇద్దరి మధ్యా హోరాహోరీ నెలకొంది. దాంతో ఈ మూడూ ఎవరివైపు మొగ్గితే వారే అధ్యక్ష పీఠమెక్కడం దాదాపుగా ఖాయమంటున్నారు. ఎందుకంటే ఆరు స్వింగ్ స్టేట్స్ మినహా అమెరికాలో మిగతా రాష్ట్రాలన్నీ సాంప్రదాయికంగా రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల్లో ఏదో ఒకవైపు ఉండేవే. జార్జియా, నెవెడా, పెన్సిల్వేనియాల్లో ఏకంగా 15 శాతం ఓటర్లు తామెవరికి ఓటేయాలో ఇంకా నిర్ణయించుకోలేదని చెప్పడం విశేషం. కనుక హారిస్, ట్రంప్ భాగ్యరేఖలను వీరే నిర్దేశించవచ్చని విశ్లేషకులు జోస్యం చెబుతున్నారు. దాంతో రానున్న రోజుల్లో జార్జియా, నెవెడా, పెన్సిల్వేనియాల్లో అభ్యర్థులిద్దరి ప్రచార హోరు మిన్నంటడం ఖాయంగా కన్పిస్తోంది.

'స్వింగ్' మహిళలంతా హారిస్ వైపే...

కొంతకాలంగా దాదాపుగా అన్ని సర్వేల్లోనూ హారిసే ముందంజలో కొనసాగుతుండటం తెలిసిందే. సీఎన్ఎన్ తాజా సర్వే కూడా అదే ధోరణిని ప్రతిబింబించింది. విస్కాన్సిన్‌లో 50 శాతం మంది హారిస్‌కు ఓటేస్తామని చెప్పగా ట్రంప్‌కు 44 శాతం మద్దతు దక్కింది. మిషిగన్‌లో 48 శాతం హారిస్‌కు, 43 శాతం ట్రంప్‌కు జైకొట్టారు. జార్జియా, నెవెడాల్లోనూ హారిసే స్వల్ప పై చేయి సాధించారు. ఆ రెండు రాష్ట్రాల్లో ఆమెకు 48 శాతం, ట్రంప్‌కు 47 శాతం ఓటర్లు మద్దతిచ్చారు. అరిజోనాలో మాత్రం ట్రంప్ 49 శాతం మద్దతు దక్కగా హారిస్ 44 శాతానికి పరిమితమయ్యారు. పెన్సిల్వేనియాలో ఇద్దరికీ చెరో 47 శాతం ఓట్లు దక్కాయి. ఆరు స్వింగ్ స్టేట్స్‌లోనూ ట్రంప్‌తో పోలిస్తే మహిళల్లో హారిస్ 27 శాతం అధిక ఓట్లు సాధించారు! ట్రంప్ విధానాలు అమెరికా భద్రతకే ముప్పు కలిగించేంత ప్రమాదకరమైనవని ఆరు రాష్ట్రాల ఓటర్లూ అభిప్రాయపడ్డారు.



ఎకానమీ, వలసల్లో ట్రంప్ పైచేయి

ఆర్థికాంశాలను డీల్ చేసే సామర్థ్యం విషయంలో ఎప్పట్లాగే తాజా సర్వేలోనూ ట్రంపే పైచేయి సాధించారు. ఈ విషయంలో ఆయనకు 8 శాతం ఎక్కువ ఓట్లొచ్చాయి. అక్రమ వలసలను అడ్డుకోవడంలో ట్రంప్‌కు, అబార్షన్ తదితరాలపై హారిస్‌కు ఓటర్లు జైకొట్టారు. దేశం ముందున్న అతి ముఖ్యమైన అంశం ఏదన్న ప్రశ్నకు 39 శాతం మంది ఎకానమీకే ఓటేశారు.

బుల్డోజర్లకు బుర్ర ఉండదు: అఖిలేశ్



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో కొన్ని నెలలుగా పతాకశీర్షికలకెక్కుతున్న బుల్డోజర్ అంశంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మరోసారి పరస్పర విమర్శలు గుప్పించుకున్నారు. యూపీలో నిందితుల ఇళ్లను ఏకపక్షంగా నేలమట్టం చేస్తూ బుల్డోజర్ల సంస్కృతిని పెంచి పోషిస్తున్న యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌ను సుప్రీంకోర్టు తాజాగా తలంటిన నేపథ్యంలో అఖిలేశ్.. యోగిపై విమర్శలు సంధించారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో భేటీలో అఖిలేశ్ మాట్లాడారు. '' ముఖ్యమంత్రి యోగి ఇంటి మ్యాప్‌కు అనుమతి ఉందా?. బుల్డోజర్లను యోగి ప్రభుత్వం తమ సొంత ప్రయోజనాలకు దుర్వినియోగం చేస్తోంది. బుల్డోజర్లకు బుర్ర ఉండదు. కేవలం స్టీరింగ్ ఉంటుంది. బుల్డోజర్లతో నిందితుల ఇళ్లను కూల్చడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కోర్టు యూపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించాక ఇప్పటికైనా యోగి సర్కార్ తన తప్పు తెల్సుకుని క్షమాపణలు చెబుతుందా?. కేంద్రంలో స్టీరింగ్ ఎవరికి ఇవ్వాలనేది, యూపీలో స్టీరింగ్ ఎవరి చేతుల్లో పెట్టాలనేది ప్రజలే నిర్ణయిస్తారు. 2027లో యూపీలో ఎస్పీ గెలిస్తే రాష్ట్రంలోని అన్ని బుల్డోజర్లు యోగి సొంత జిల్లా గోరఖ్‌పూర్ వైపు దూసుకెళ్లొచ్చు'' అని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. కొత్త పార్టీ పెట్టి యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బుల్డోజర్ గుర్తుపై గెలిచి చూపించాలని సవాల్ విసిరారు.


దమ్మున్న వాళ్లే వాటిని నడపగలరు: యోగి



ప్రయాగ్‌రాజ్: అధికారం చేతికొస్తే సరిపోదని, బుల్డోజర్‌ను నడపాలంటే నడిపే వ్యక్తులకు బుల్డోజర్ లాంటి దమ్ము ఉండాలని సీఎం యోగి వ్యాఖ్యానించారు. సీఎం సొంత జిల్లా మీదకు బుల్డోజర్లను తీసుకొస్తామని అఖిలేశ్ వ్యాఖ్యలపై యోగి దీటుగా బదులిచ్చారు. 1,334 మంది జూనియర్ ఇంజనీర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫోర్‌మెన్లకు నియామకపత్రాలు బుధవారం లక్నోలో అందజేసిన సందర్భంగా యోగి మాట్లాడారు. బుల్డోజర్‌లాగా ధైర్యంతో, చిత్తశుద్ధితో పనిచేసే వాళ్లకే ఆ బుల్డోజర్‌ను నడపగల సత్తా ఉంటుంది. నిరసనకారులు, మాఫియా ముందు సాగిలపడే వ్యక్తులకు బుల్డోజర్(ప్రభుత్వాన్ని) నడిపేంత ధైర్యం ఉండదు. టిప్పు(అఖిలేశ్) మళ్లీ సుల్తాన్ కావాలనుకుంటున్నారు. మళ్లీ ఎస్పీ చేతికి అధికారం రావడం కల్ల'' అని యోగి అన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నో పింఛన్

హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారు బిల్లు



సిమ్లా: ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలకు పెన్షన్ ఇవ్వరాదని హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శాసనసభ (అలవెన్సులు, సభ్యుల పెన్షన్) సవరణ బిల్లు-2024ను ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సభలో ప్రవేశపెట్టారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూలులో పేర్కొన్న మేరకు ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటుకు గురైతే పింఛను ప్రయోజనాలు కోల్పోతారని బిల్లులో పేర్కొన్నారు. దాన్ని సభ ఆమోదించింది. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుధీర్ శర్మ, రవి ఠాకూర్, రాజిందర్ రాణా, ఇందర్ దత్ లఖన్‌పాల్, చేతన్య శర్మ, దేవిందర్ కుమార్ గత ఫిబ్రవరిలో రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతిచ్చారు. అనంతరం బడ్జెట్ తీర్మానంపై ఓటింగ్‌కు గైర్హాజరవడం ద్వారా పార్టీ విప్‌ను ధిక్కరించారు. దాంతో వారిపై అనర్హత వేటు పడింది. ఫలితంగా జరిగిన ఉప ఎన్నికల్లో సుధీర్, ఇందర్‌దత్ గెలవగా మిగతా నలుగురు ఓడిపోయారు.

మేకప్ లేకుంటే కంగనను గుర్తుపట్టరు

హిమాచల్ ప్రదేశ్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



మండీ: హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై ఆ రాష్ట్ర రెవిన్యూ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే జగత్‌సింగ్ నేగీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర శాసనసభలో చర్చ సందర్భంగా జగత్ సింగ్ కంగన అంశాన్ని ప్రస్తావించారు. '' జూన్ చివర్లో ముంచెత్తిన వర్షాలు, వరదలతో మన రాష్ట్రం అతలాకుతలమైంది. నేతలంతా వరద ప్రభావితకాలంలోనే పర్యటించి బాధితులను ఓదార్చారు. కంగన ప్రాతినిధ్యం వహిస్తున్న మండీ నియోజకవర్గం సైతం వర్షం, వరద బారిన పడింది. కానీ కంగన వరదసమయంలో పర్యటించలేదు. ఇప్పుడు వర్షాలు తగ్గుముఖం పట్టి అంతా సర్దుకున్నాక తీరిగ్గా కంగన పర్యటించారు. వర్షాల కాలంలో ఆమె బయటకు రాదు. ఎందుకంటే వర్షం కారణంగా ఆమె వేసుకున్న మేకప్ పోతుంది. మేకప్ లేకుంటే కంగనను ఎవరూ గుర్తుపట్టలేరు. ఎదురుగా ఉన్నది కంగననా? లేక ఆమె తల్లినా? అనేది కూడా ఎవరూ పోల్చుకోలేరు'' అని అన్నారు. దీంతో బీజేపీ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి కులేబా రాజీనామా



కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అతిత్వరలో తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించబోతున్నారు. కొందరికి ఉద్వాసన పలికి, కొత్తగా పలువురిని కేబినెట్‌లో చేర్చుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి దిమిత్రో కులేబా(43) బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. అయితే, ఆయన తన రాజీనామాకు గల కారణాలు బహిర్గతం చేయలేదు. నలుగురు కేబినెట్ మంత్రులు మంగళవారం రాత్రి పదవుల నుంచి తప్పుకున్నారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ సూచన మేరకే వారు పదవీ త్యాగం చేసినట్లు తెలుస్తోంది. అయితే, మంత్రుల రాజీనామాలను పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంది. రష్యాతో యుద్ధం కీలక దశకు చేరుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గంలో మార్పులు చేర్పులు తప్పవని జెలెన్‌స్కీ గత వారమే సంకేతాలిచ్చారు.

రష్యా దాడిలో ఏడుగురి మృతి

పశ్చిమ ఉక్రెయిన్‌లోని లెవివ్ నగరంపై రష్యా సైన్యం బుధవారం విరుచుపడింది. డ్రోన్లు, క్షిపణులతో దాడికి దిగింది. ఈ ఘటనలో 14 ఏళ్ల బాలిక సహా మొత్తం ఏడుగురు మరణించారని, మరో 25 మంది గాయపడ్డారని లెవివ్ మేయర్ తెలిపారు.

భారత భూభాగాలతో నేపాల్ కొత్త నోట్లు



కఠ్మాండూ/న్యూఢిల్లీ: భారత్, నేపాల్ మధ్య భూ వివాదం క్రమంగా ముదురుపాకాన పడుతోంది. భారత భూభాగాలైన కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా తమవేనని నేపాల్ వాదిస్తుండటం తెలిసిందే. వాటిని నేపాల్ భూభాగాలుగా పేర్కొంటూ 2020లోనే కొత్త పొలిటికల్ మ్యాప్‌ను రూపొందించుకుంది. పార్లమెంటు కూడా దానికి ఆమోదముద్ర వేసింది. భారత్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినా నాటినుంచీ అధికారిక వ్యవహారాల్లో కొత్త మ్యాప్‌నే ఉపయోగిస్తూ వస్తోంది. తాజాగా కొత్త కరెన్సీ నోట్లపై కూడా కొత్త మ్యాప్‌ను ముద్రించడానికి నేపాల్ సిద్ధమవుతోంది. మేలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఆ నోట్లు ఆర్నెల్లలో చెలామణీలోకి రానున్నాయి. సిక్కిం, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో నేపాల్ 1,850 కిలోమీటర్ల మేర సరిహద్దును పంచుకుంటోంది.

కన్జర్వేటివ్ రేసు నుంచి ప్రీతి పటేల్ ఔట్



లండన్: కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వం కోసం పోటీపడ్డ భారతీయ సంతతికి చెందిన ప్రీతి పటేల్ తొలిరౌండ్‌లోనే నిష్క్రమించారు. జూలై 4న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయం తర్వాత నాయకత్వం నుంచి తప్పుకుంటానని మాజీ ప్రధాని రిషి సునాక్ ప్రకటించారు. సునాక్ స్థానంలో కన్జర్వేటివ్ పార్టీ పగ్గాలు చేపట్టడానికి మొత్తం ఆరుగురు పోటీపడ్డారు. బుధవారం తొలిరౌండ్ ఓటింగ్ జరగ్గా.. అందరి కంటే తక్కువగా మాజీ హోంమంత్రి ప్రీతి పటేల్‌కు 14 ఓట్లు మాత్రమే వచ్చాయి. దాంతో ఆమె ఎలిమినేట్ అయ్యారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



ఫిట్ 'టెక్నిక్'
క్రికెటర్ కోహ్లి నుంచి హీరో మహేష్‌బాబు దాకా అందరూ వినియోగించే ఎక్విప్‌మెంట్‌ను ఐ జిమ్‌లో అందుబాటులోకి తెచ్చారు.
- సిటీ ప్లస్‌లో



వీకెండ్ ఆర్ట్..
వీకెండ్‌లో యువత ఏదో ఒక కళలో ప్రావీణ్యం కోసం ప్రయత్నిస్తోంది. విభిన్న ఆర్ట్స్‌పై శిక్షణ అందించే వేదికల వైపు అడుగులేస్తోంది.
- సిటీ ప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.0/23.0
నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 28, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



రీల్స్ సరే.. జారి పడేరు!

నగర శివారు ఓఆర్ఆర్ సమీపంలోని పెద్ద అంబర్‌పేట్ కత్వాను వీక్షించేందుకు సిటీ నుంచి యువత పెద్ద సంఖ్యలో వచ్చి సెల్ఫీలు, వీడియో రీల్స్ తీసుకుంటున్నారు. నాచు పట్టి ఉన్న రాళ్లపై నుంచి జారిపడే ప్రమాదం పొంచి ఉంది. గతంలో ఇక్కడ ప్రమాదాల బారినపడి కొందరు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలూ ఉన్నాయి. జలపాతం (కత్వ) వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పోలీసులు పెట్రోలింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. - ఫొటోలు: సోమ సుభాష్, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్





అంటువ్యాధులకు ప్రత్యేక ఓపీ

నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



లక్డీకాపూల్: నిమ్స్‌లో అంటువ్యాధుల చికిత్స కోసం ప్రత్యేక ఓపీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లో అంటువ్యాధులకు జనరల్ మెడిసిన్ విభాగం నిపుణులు వైద్య సేవలందిస్తున్నారని చెప్పారు. సేవలను మరింత మెరుగుపరిచేందుకు అంటువ్యాధుల కోసం డాక్టర్ కె.భాను ప్రసాద్‌ను విధుల్లోకి తీసుకున్నామన్నారు. రోగులకు చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా 150 పడకలను కేటాయించినట్లు బీరప్ప తెలిపారు. ఓపీ సేవలు మంగళ, గురువారాల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు.

హైడ్రా పేరుతో దందా

నిర్మాణాలపై బ్లాక్‌మెయిలర్ల బెదిరింపులు

- అమీన్‌పూర్‌లో ఓ నిందితుడి అరెస్టు
- వసూళ్లకు పాల్పడితే జైలుకే: కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పేరుతో కొందరు దందాలకు పాల్పడుతున్నారు. జలవనరుల్లోని అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్లు ప్రయోగిస్తున్న హైడ్రా ప్రభుత్వ స్థలాల్లోని వాటినీ విడిచిపెట్టేదిలేదని స్పష్టం చేస్తోంది. దీంతో కబ్జాకోరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ భయాన్ని క్యాష్ చేసుకోవడానికి కొందరు బ్లాక్‌మెయిలర్లు రంగంలోకి దిగారని తమ దృష్టికి వచ్చినట్లు బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. ఇలాంటి దందాలు చేసిన వారికి కటకటాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే అమీన్‌పూర్ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారన్న రంగనాథ్... మరికొందరి వ్యవహారంపై సమాచారం ఉందన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

ప్రధానంగా రెండు రకాల దందాలు జరుగుతున్నట్లు హైడ్రా దృష్టికి వచ్చింది. కొందరు వ్యక్తులు సామాజిక కార్యకర్తల ముసుగులో బిల్డర్లను బెదిరిస్తున్నారు. వివిధ జలవనరుల ఫుల్ ట్యాంక్ లెవల్స్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడుతున్న వారినే వీళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆ అంశంపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని, మీడియాకు ఉప్పందిస్తామని బిల్డర్లను భయపెడుతున్నారు. అలా కాకుండా ఉండాలంటే భారీ మొత్తం చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క ఆయా అధికారులతో దిగిన ఫొటోలను చూపిస్తున్న కొందరు మరో దందా మొదలెట్టారు. ఆ ఫొటోల ఆధారంగా సదరు అధికారులతో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయంటూ ప్రచారం చేసుకుంటున్నారు. వారితో మాట్లాడి నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విషయం సెటిల్ చేస్తామని వసూళ్లకు పాల్పడుతున్నారు.

అప్రమత్తమైన అధికారులు..

- బహుళ అంతస్తులు నిర్మిస్తున్న వారితో పాటు వ్యక్తిగత గృహాలు కట్టుకుంటున్న వాళ్లూ టార్గెట్‌గా మారుతున్నారు. ఇలా భయపెట్టి డబ్బు డిమాండ్ చేస్తున్న వారిలో ఇతర విభాగాలకు చెందిన వాళ్లూ ఉంటున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ రాజధానిలోని మూడు కమిషనరేట్లతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, కమిషనరేట్ల అధికారులను అప్రమత్తం చేశారు.

ఫిర్యాదుల కోసం :
18005990099
040-29560509
040-29560596
040-29565758
040-29560593

చర్యలు తప్పవు..

- 'హైడ్రాను నీరుగార్చే ప్రయత్నాలు చేసినా, తప్పు దోవ పట్టించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విభాగం పేరుతో ఎవరైనా బెదిరింపులు, డబ్బు వసూళ్లకు పాల్పడితే వారిపై చట్టపరమైన తీసుకుంటాం. ఇతర ప్రభుత్వ విభాగాలైన రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదల విభాగాలతో పాటు హైడ్రాకు చెందిన అధికారులు, సిబ్బంది సైతం బెదిరింపులకు పాల్పడితే తక్షణం స్థానిక పోలీసుస్టేషన్, ఎస్పీ, పోలీసు కమిషనర్, ఏసీబీ లేదా హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేయండి' అని రంగనాథ్ అన్నారు.
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ ప్రాంతానికి చెందిన విప్లవ్ సామాజిక కార్యకర్త ముసుగులో స్థానిక బిల్డర్‌ను హైడ్రా పేరుతో బెదిరించి, డబ్బు డిమాండ్ చేశాడు. దీనిపై ఆ బిల్డర్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీన్ని పరిశీలించిన ఆయన తగిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎస్పీని కోరారు. బిల్డర్ నుంచి ఫిర్యాదు తీసుకున్న ఎస్పీ.. అమీన్‌పూర్ ఠాణాలో కేసు నమోదు చేయించారు. బుధవారం విప్లవ్‌ను అరెస్టు చేశారు.

'డబుల్' గుబుల్

- లిఫ్టులు పాడయ్యాయి.. జనరేటర్లు జామయ్యాయి..
- దొంగలపాలైన కరెంటు వైర్లు, శానిటరీ ఉపకరణాలు
- డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టి వదిలేశారు
- నష్టం విలువ రూ.35 కోట్లు
- లబ్ధిదారుల గోడు వినే నాథుడెవరు?
- శివారులోని 35 వేల గృహాల్లో సమస్యల తాండవం

కరెంటు లేదు.. తాగునీరు రాదు

సాక్షి, సిటీబ్యూరో: పేదల కోసం గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు నిరుపయోగంగా మారాయి. ఏకంగా 35 వేల గృహాలు నివాస యోగ్యంగా లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేటర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి దాదాపు 70 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసింది. 65 వేల ఇళ్ల వరకు లబ్ధిదారులకు పంపిణీ చేసింది. కానీ.. వాటిలో తాగునీరు, కరెంటు లేక ప్రజలు ఉండటం లేదు. సదుపాయాలు కల్పించాల్సిందిగా లబ్ధిదారులు ఎంతోకాలంగా మొత్తుకుంటున్నా, ప్రజావాణి కార్యక్రమాల్లో మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న నాథుడే లేకుండాపోయారు.

ఇళ్లు కట్టినా ఫలితం లేదు..

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంతో పాటే విద్యుత్, తాగునీరు, రహదారులు, వీధి దీపాల వంటి కనీస మౌలిక సదుపాయాలతో పాటు ఆస్పత్రులు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, పోస్టాఫీసు, ఆటస్థలాలు తదితర సదుపాయాలు కూడా కల్పిస్తామన్నారు. కానీ.. సంబంధిత ప్రభుత్వ విభాగాలు డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో సదుపాయాలు సమకూరలేదు. ముఖ్యంగా, కనీస నిత్యావసరాలైన తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కూడా అందుబాటులోకి రాలేదు. అవసరమైన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు తదితర పనులకు జీహెచ్ఎంసీ నిధులు చెల్లించినప్పటికీ సదుపాయాలు కల్పించలేదు. తాగునీటి వసతినీ మరిచారు.



విలువైన ఉపకరణాలు..

దీర్ఘకాలం వాడుకలో లేనందున ఇళ్ల లిఫ్టుల్లోని బ్యాటరీలు, కంట్రోల్ బోర్డులు పాడయ్యాయి. విద్యుత్ వైర్లు ఎలుకలు కొరికేశాయి. నీటి సంపులకు సంబంధించిన జనరేటర్లు వాడకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. బోర్ల జనరేటర్లదీ అదే దుస్థితి. బోర్ల మోటార్ పంపులు జామ్ అయ్యాయి. ఇళ్లకు కాపలా లేక చాలా ప్రాంతాల్లో విలువైన విద్యుత్ వైర్లు, బాత్‌రూమ్‌లలోని వాటర్‌ట్యాప్స్, తదితర శానిటరీ ఉపకరణాలు దొంగల పాలయ్యాయి. దీంతో తిరిగి వాటిని ఏర్పాటుచేసేందుకు, మరమ్మతులు నిర్వహించేందుకు రిపేర్లు, రీకండిషనింగ్‌ల పేరిట దాదాపు రూ.35 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇది ప్రభుత్వంపై అదనపు భారం.

అధికారుల మాటలు నమ్మి..

తాగునీటి వంటి సదుపాయాలు సత్వరమే కల్పిస్తామన్న అధికారుల మాటలు నమ్మి ఇళ్లలో చేరిన కొన్ని కాలనీల లబ్ధిదారులు అవి సమకూరక లబోదిబో మంటున్నారు. బాచుపల్లి, బహదూర్‌పల్లి, బైరాగిగూడ, కర్దనూర్ తదితర ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది. .

మరో 14వేలకు పైగా ఇళ్లలో సదుపాయాల్లేక..

- దుండిగల్‌లో 3996 ఇళ్లకు విద్యుత్, వాటర్ సరఫరా లేక ఆక్యుపెన్సీ పెండింగ్‌లో ఉంది.
- రాంపల్లిలో 6240 ఇళ్లకు నీటి సదుపాయం లేదు. ఆక్యుపెన్సీ పెండింగ్‌లో పడింది.
- అహ్మద్‌గూడలో 4280 ఇళ్లకు సైతం నీటి సదుపాయం లేక ఆక్యుపెన్సీ పెండింగ్‌లోఉంది.
- ఫరూఖ్‌నగర్, బండ్లగూడ, తట్టిఅన్నారం, జవహర్‌నగర్-3, మాన్‌సాన్‌పల్లి, తూముకుంట, మురహరిపల్లి, హట్టిగూడ, మంఖాల్, ధూల్‌పేట, నిజాంపేట, కైసర్‌నగర్‌లలో విద్యుత్ వెలుగుల్లేవు.
- ఉప్పల్ శ్రీరామ్‌నగర్, చర్లపల్లి, చైతన్యనగర్, బహదూర్‌పల్లి, ప్రతాపసింగారం, డి.పోచంపల్లి, కొర్రెముల, ఈదుల నాగులపల్లిల్లోని డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలకు తాగునీటి సరఫరా జరగడం లేదు.
- కొల్లూరు-2 కాలనీలో తాగునీటి సదుపాయం లేక ప్రజలు ఇళ్లలో చేరలేదు.
- దుండిగల్‌లో, విద్యుత్, తాగునీరు లేక ప్రజలు ఆక్యుపై చేసుకోలేదు.
- రాంపల్లిలో నీటి సదుపాయం లేక చేరలేదు.
- అహ్మద్‌గూడలోనూ నీటి సదుపాయం లేక ప్రజలు చేరలేదు.

సీఎం ప్రారంభోత్సవం చేసినా..

అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా ప్రారంభోత్సవం చేసినప్పటికీ, కొల్లూరు-2 (కేసీఆర్ కాలనీ) లోని 15,560 ఇళ్లకు సైతం తాగునీటి సదుపాయాలు సమకూరలేదు. సదరు ప్రారంభ ఉత్సవానికి దాదాపు కోటి రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, ఘనంగా టౌన్‌షిప్ అని పేర్కొన్నప్పటికీ, నీరు లేక ప్రజలు ఇళ్లలో చేరలేదు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని, చెరువులు సరస్సులు కలుషితం కాకుండా చూడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. బుధవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు మట్టి గణేష్ విగ్రహాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన విగ్రహాలతో చెరువులు కలుషితం కాకుండా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ పి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ముగ్గురు టీచర్లు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. గెజిటెడ్ హెడ్ మాస్టర్ కేటగిరీలో నాంపల్లిలోని నయా బజార్ జీహెచ్ఎస్ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ ఏవీ సత్యవతి, రాయదుర్గం జెడ్పీహెచ్ఎస్ హెడ్‌మాస్టర్ ఎస్‌కే బాబు, ఎస్‌జీటీ కేటగిరీలో కీసరగుట్ట టీజీఆర్ఎస్ ఆర్ట్ టీచర్ శ్రీనివాస్ ఉన్నారు.

జిల్లాస్థాయిలో సురేందర్‌కు..



బంజారాహిల్స్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్ ఫిజిక్స్ టీచర్ ఎస్.సురేందర్‌కు ప్రకటించారు. గత 17 సంవత్సరాలుగా ఆయన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ అవార్డు రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

మహా గణపతి పూజలకు రండి సార్



ఖైరతాబాద్: మహా గణపతి తొలి పూజకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానిస్తూ బుధవారం ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్, చైర్మన్ సింగరి రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పూజా కార్యక్రమానికి గవర్నర్ హాజరవుతారని వారు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ హడ్‌హాక్ కమిటీ సభ్యులు కృష్ణయాదవ్, బాక్సర్ అశోక్, లక్ష్మణ్ యాదవ్, మహేందర్‌బాబు, మహేష్ యాదవ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

రూ.500 కోట్లు హాంఫట్

- నెలకు 8 నుంచి 14% వడ్డీ ఇస్తామని బురిడీ
- 60 వేల మంది నుంచి డబ్బులు వసూలు
- ఇటీవల బోర్డు తిప్పేసిన సంస్థ నిర్వాహకులు
- సీసీఎస్‌లో బాధితుల ఫిర్యాదు

స్కీముల పేరుతో డీకేజెడ్ టెక్నాలజీస్ ఎర



సీసీఎస్ వద్ద బాధితుల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: రాజధాని కేంద్రంగా మరో భారీ ఇన్వెస్టిమెంట్ స్కామ్ చోటుచేసుకుంది. డీకేజెడ్ టెక్నాలజీస్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసిన కొందరు.. పెట్టుబడులు పేరుతో అధిక వడ్డీ ఇస్తామంటూ ఎర వేశారు. కొన్నాళ్లు సజావుగా చెల్లించడంతో వీరిపై నమ్మకం పెరగడంతో పాటు పెట్టుబడి పెట్టేవారి సంఖ్య భారీగా పెరిగింది. ఇలా దాదాపు 60 వేల మంది నుంచి రూ.500 కోట్ల మేర వసూలు చేసిన నిర్వాహకులు ఇటీవల బోర్డు తిప్పేశారు. మాదాపూర్‌లోని సంస్థ కార్యాలయానికి తాళం పడటంతో బాధితులు బుధవారం నగర నేర పరిశోధన విభాగంలో (సీసీఎస్) ఫిర్యాదు చేశారు. ఈ సంస్థ మల్టీ లెవల్ మార్కెటింగ్‌కు కూడా పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం వివరాలు..


మాదాపూర్‌లోని సమృద్ధి వశ్యం మూడో అంతస్తులో ఉన్న డీకేజెడ్ టెక్నాలజీస్ సంస్థను మహ్మద్ ఇక్బాల్, రాహిల్ నిర్వహించేవారు. తమ సంస్థ డికోజో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుబంధమని ప్రచారం చేసుకున్నారు. డీకేజెడ్ టెక్నాలజీస్‌లో బిలాల్, రమేష్, భాగ్యశ్రీలు వివిధ హోదాల్లో పని చేశారు. ఆహార ధాన్యాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు తదితరాలను స్టోర్స్ ద్వారా, ఈ-కామర్స్ రూపంలో విక్రయిస్తుంటామని ప్రచారం చేసుకున్న డీకేజెడ్ టెక్నాలజీస్ నిర్వాహకులు.. దీనికోసం ప్రత్యేక వెబ్‌సైట్, యాప్స్‌ను రూపొందించారు. తమ వద్ద పెట్టుబడి పెట్టిన వారి మొత్తాన్ని వీటిలో ఇన్వెస్ట్ చేస్తామని, వచ్చే లాభాలతోనే రిటర్న్స్ ఇస్తామంటూ నమ్మబలికారు. ప్రతి నెలా 8 నుంచి 10 శాతం వడ్డీ చెల్లిస్తామని చెప్పారు. దీంతో అనేక మంది తొలుత చిన్న మొత్తాలను పెట్టుబడిగా పెట్టారు. వీరికి ప్రతి నెలా చెల్లింపులు జరగడంతో మరికొందరు కూడా భారీ మొత్తాలు ఇన్వెస్ట్ చేశారు.


మరో వ్యవహారానికి తెర లేపారు..

బక్రీద్, రంజాన్ పండుగల నేపథ్యంలో ప్రత్యేక ఆఫర్ల పేరుతో డీకేజెడ్ టెక్నాలజీస్ మరో వ్యవహారానికి తెర లేపింది. ఈ సందర్భంలో ఆరు నెలల, ఏడాది పాటు నిర్ణీత మొత్తాలను పెట్టుబడిగా పట్టే వారికి ప్రతి నెలా 12 నుంచి 13.5 శాతం వరకు వడ్డీ చెల్లిస్తామని ప్రచారం చేశారు. ఇన్వెస్ట్ చేసే మొత్తం పెరిగే కొద్దీ వడ్డీ కూడా పెరుగుతుందని చెప్పారు. తమ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో వస్తువులు ఖరీదు చేసిన వారికి 10 నుంచి 15 శాతం ప్రత్యేక రిబేట్ ఉంటుందని నమ్మించారు. తమకు వివిధ రెస్టారెంట్లు, స్కూళ్లు, బ్రాండెడ్ షూస్ తయారు చేసే సంస్థలు, ఫుడ్ చెయిన్స్, ఆన్‌లైన్ పోర్టల్స్‌తో ఒప్పందాలు ఉన్నాయనీ నిర్వాహకులు పేర్కొన్నారు. తమ పెట్టుబడిదారులు వాటి నుంచి ప్రత్యేక డిస్కౌంట్లు సైతం పొందవచ్చని చెప్పారు. వీటిని నమ్మిన దాదాపు 60 వేల మంది రూ.500 కోట్ల వరకు పెట్టుబడిగా పెట్టారు. దాచుకున్నది, ఉన్నది అమ్మేసి, అప్పులు చేసి, పరిచయస్తుల నుంచి తీసుకుని కనిష్టంగా రూ.లక్ష నుంచి రూ.కోట్ల వరకు పెట్టుబడిగా పెట్టారు.

వడ్డీ చెల్లింపులు ఆగిపోవడంతో..

- సదరు సంస్థ నిర్వాహకులు పెట్టుబడులు పెట్టినవారికి రూ.100 బాండ్ పేపర్‌పై గ్యారంటీ అగ్రిమెంట్ రాసిచ్చారు. మాదాపూర్, కొండాపూర్‌ల్లో రెండు వాక్ ఇన్ స్టోర్స్ కూడా పెట్టి ఆహారధాన్యాలతో పాటు అనేకం విక్రయించారు. వీటిలో పెట్టుబడులకు ప్రత్యేక డిస్కౌంట్లు ఇచ్చారు. గత రెండు నెలలుగా వడ్డీ చెల్లింపులు ఆగిపోవడంతో బాధితులు కార్యాలయానికి ఫోన్లు చేశారు. తాము భారీ మొత్తం వడ్డీలు చెల్లిస్తుండటంతో ప్రభుత్వ బ్యాంకులను నష్టం వస్తోందని, అందుకే రిజర్వ్ బ్యాంక్ తగ్గించాలని చెప్పిందని సమాధానం ఇచ్చారు.
- ఆ ప్రక్రియ జరుగుతుండటంతోనే చెల్లింపులు ఆపినట్లు కాలం వెళ్లబుచ్చారు. కొందరు పెట్టుబడిదారులకు ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. కొన్ని రోజుల క్రితం ఆ కార్యాలయం వద్ద ధర్నా చేసిన బాధితులతో ఉద్యోగులు దురుసుగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో జరిగిన తోపులాటలో ఓ ఉద్యోగిని కిందపడ్డారు. దీన్ని ఆసరాగా చేసుకున్న డీకేజెడ్ నిర్వాహకులు తమ కార్యాలయానికి తాళం వేశారు. అక్కడే 'ఇటీవల తమ ఉద్యోగినిపై దాడి జరగడంతోనే భద్రతా కారణాలతో కార్యాలయానికి తాళం వేస్తున్నాం. త్వరలోనే మళ్లీ తెరుస్తాం' అంటూ నోటీసు అంటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.





తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



సాక్షి,సిటీబ్యూరో: స్పెషల్ సమ్మరి రివిజన్ -2025లో భాగంగా తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు.ఈ మేరకు బుధవారం స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, క్వాలిఫైయింగ్ తేదీలైన జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 వరకు 18 ఏళ్లు నిండేవారు కొత్త ఓటరుగా జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చునన్నారు. వారితో పాటు అర్హులైనప్పటికీ ఇంతవరకు జాబితాలో పేరు నమోదు చేసుకోని వారు కూడా తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. బీఎల్ఓల ఇంటింటి సర్వే, ఓటరు జాబితాలో తప్పుల సవరణ, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, పోలింగ్ స్టేషన్ల సరిహద్దులు సరి చేసే కార్యక్రమాలు అక్టోబర్ 18 వరకు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సమగ్ర డ్రాఫ్ట్ రోల్స్ , తదితర కార్యక్రమాలు అక్టోబర్ 19 నుండి 28 వరకు పూర్తి చేస్తామన్నారు. సమగ్ర డ్రాఫ్ట్ రోల్ అక్టోబర్ 29న వెలువడనుండగా, నవంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, జనవరి 6 న తుది జాబితా వెలువడనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల ప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందిస్తామన్నారు.

పోచారం మున్సిపల్ చైర్మన్‌పై కేసు నమోదు

పోచారం: అన్నోజిగూడలోని మీర్కాను కుంటలో మట్టి పోయించినందుకు బీఆర్ఎస్ నాయకుడు ఎన్.శేఖర్‌తో పాటు పోచారం మున్సిపల్ చైర్మన్ బి.కొండల్‌రెడ్డిపై ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరమేష్ బుధవారం పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరిగేషన్, వాల్టా చట్టాలకు విరుద్ధంగా బతుకమ్మ రేవు ఏర్పాటు కోసం మీర్కాను కుంటలోని ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా మీర్కాన్ కుంటను పరిరక్షించేందుకు ఒకవైపు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండగా, మరోవైపు మట్టి నింపే పనులు కొనసాగాయని తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఫిర్యాదు చేశారు.

చిక్కిన ముఠాల్లో... ఒక్కొక్కరు జైల్లో!

- ఆల్ఫాజోలం, ఎంఫిటమైన్ ముఠాల్లో విచిత్రం
- అంజిరెడ్డి దొరకడానికి ముందే సాయి అరెస్టు
- అనుచరులు పట్టుబడే నాటికే అంజి కటకటాల్లో
- సూత్రధారులు ఎవరనే కోణంపై పోలీసుల దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: నగరంతో పాటు శివార్లలోని ఖాయిలాపడ్డ పరిశ్రమలు, ఖాళీ కోళ్ల ఫారాలను అడ్డాగా చేసుకుని ఆల్ప్రాజోలం, ఎంఫెటమైన్ తదితర మాదకద్రవ్యాలు తయారు చేస్తున్న ముఠాలు వ్యవస్థీకృతంగా పని చేస్తున్నాయి. ఈ కారణంగానే ఒకే వ్యక్తి వివిధ కేసుల్లో నిందితుడిగా ఉంటున్నాడు. రూ.8.5 కోట్ల విలువైన డేట్ డ్రగ్... ఎంఫెటమైన్‌తో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులకు చిక్కిన గోసుకొండ అంజిరెడ్డి ముఠా అరెస్టు దీనికి తాజా ఉదాహరణగా నిలిచింది.



పోలీసుల అదుపులో అంజిరెడ్డి గ్యాంగ్ (ఫైల్)

లీజుకు తీసుకున్న కోళ్ల ఫారంలో రియాక్టర్...

బొరంపేటకు చెందిన అంజిరెడ్డి సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదలలో చంద్రారెడ్డి గార్డెన్స్ పేరుతో ఫంక్షన్ హాల్, గుమ్మడిదల స్విమ్మింగ్ పూల్ నిర్వహించేవాడు. ఇతడికి అనంతారం గ్రామానికి చెందిన సాయికుమార్ గౌడ్, పంచలింగాలకు చెందిన రాకేష్‌లతో పరిచయం ఉంది. కొన్నాళ్ల క్రితం ఫార్మా కంపెనీల్లో పని చేసిన రాకేష్‌కు కెమికల్ ప్రాసెసింగ్‌పై పట్టు ఉండటంతో అతడితో ఒప్పందం చేసుకున్న అంజిరెడ్డి కొత్తపల్లిలో అద్దెకు తీసుకున్న కోళ్ల ఫారంలో రియాక్టర్ ఏర్పాటు చేయించాడు. ఇక్కడే రాకేష్ ఆల్ప్రాజోలం, ఎంఫెటమైన్ తయారు చేశాడు.

అప్పట్లో వెలుగులోకి రాని అంజిరెడ్డి పేరు...

ఈ డ్రగ్స్ దందాలో కీలకంగా వ్యవహరించిన సాయికుమార్ గౌడ్‌పై 2021లోనే ఓ కేసు ఉంది. అప్పట్లో 3 కేజీల సరుకుతో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకు (ఎన్సీబీ) చిక్కాడు. కొత్తపల్లి అడ్డాగా రాకేష్ రెండు రకాలైన డ్రగ్స్ తయారు చేయడం మొదలెట్టాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మరో వ్యక్తితో కలిసి సాయి కుమార్ గౌడ్ ఆల్ప్రాజోలం ఖరీదు చేయాలని భావించాడు. రాకేష్ నుంచి కేజీ సరుకు కొనుగోలు చేసిన అతను దానిని తీసుకెళ్తూ జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో టీజీ ఏఎన్‌బీ అధికారులకు చిక్కాడు. అప్పట్లో అంజిరెడ్డి పేరు వెలుగులోకి రాలేదు. ఈ వ్యవహారంపై జినోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ ముగ్గురూ చిక్కడంతో...

అంజిరెడ్డి అరెస్టు కావడం.. జైలుకు వెళ్లి రెండు నెలలు దాటినా అతను బయటికి రాకపోవడంతో నాగరాజు కంగుతిన్నాడు. తన వద్ద ఉన్న సరుకును తొలుత గ్రామం నుంచి నగరానికి చేర్చి, ఆపై ఖరీదు చేయడానికి ఆసక్తి చూపిన వారికి విక్రయించాలని భావించాడు. ఇందుకుగాను తన స్నేహితులైన వినోద్‌కుమార్ గౌడ్ (గుమ్మడిదల) శ్రీశైలంలను (దుండిగల్) సంప్రదించాడు. ఈ ముగ్గురూ కలిసి వినోద్‌కు చెందిన వాహనంలో ఎంఫెటమైన్ సిటీకి తీసుకువస్తూ బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద హెచ్-న్యూ పోలీసులకు చిక్కారు. దీనిపై బోయిన్‌పల్లి ఠాణాలో కేసు నమోదైంది. వీరి విచారణలోనే అంజిరెడ్డి చేసిన ఎంఫెటమైన్ దందా వెలుగులోకి వచ్చింది.

తాపీ మేస్త్రీని డ్రగ్ డీలర్‌గా..

కోళ్లఫారంలో రియాక్టర్ నిర్వహణపై సమాచారం అందుకున్న టీజీ ఏఎన్‌బీ అధికారులు ఈ ఏడాది జూన్‌లో దాడి చేసి అక్కడ 2.6 కేజీల సరుకు స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీగా ముడిపదార్థాలు పట్టుకున్నారు. అప్పట్లో అంజిరెడ్డితో పాటు జినోమ్ వ్యాలీ ఠాణా కేసులో వాంటెడ్‌గా ఉన్న రాకేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై గుమ్మడిదల ఠాణాలో కేసు నమోదైంది. టీజీ ఏఎన్‌బీ అధికారులకు చిక్కడానికి పది రోజుల ముందే అంజిరెడ్డి ఆ రియాక్టర్‌లో తయారైన 8.5 కేజీల ఎంఫెటమైన్‌ను తాపీ మేస్త్రీగా పని చేసే కంచెల నాగరాజుకు అప్పగించి వేరే చోటుకు మార్చేశాడు.

పీటీ వారెంట్ల పరంపర...

కొన్ని సందర్భాల్లో ఓ కేసులో అరెస్టు అయిన వ్యక్తి జైల్లో ఉండగానే మరో కేసులోనూ నిందితుడిగా చేరతాడు. అలాంటప్పుడు కొత్త కేసులో అతడిని అరెస్టు చేయడానికి పోలీసులు ప్రిజనర్స్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్ వినియోగిస్తారు. జినోమ్ వ్యాలీ కేసులో పోలీసులు రాకేష్‌పై పీటీ వారెంట్ తీసుకున్నారు. అలాగే గుమ్మిడిదల పోలీసులు తమ కేసులో సాయి కుమార్ గౌడ్‌పై ఈ వారెంట్ తీసుకున్నారు. ఇప్పుడు బోయిన్‌పల్లి పోలీసులు అంజిరెడ్డిపై పీటీ వారెంట్ తీసుకుని తమ కేసులో అరెస్టు చేయనున్నారు. అతడి విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా అవసరమైతే ఈ కేసులో రాకేష్, సాయి కుమార్ గౌడ్‌లను నిందితులుగా చేర్చనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేని ఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టులో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు ఉండాలన్నారు. ఎన్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇంగ్లిష్-1, తెలుగు-1, అరబిక్-2, ఎకనామిక్స్ -1 (ఇంగ్లీష్ మీడియం), రాజనీతిశాస్త్రం-2 (ఇంగ్లీష్ మీడియం), పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ -1(ఇంగ్లీష్ మీడియం), చరిత్ర -1 (ఉర్దూ మీడియం), కామర్స్-3, బయోటెక్నాలజీ -1(ఇంగ్లీష్ మీడియం), మైక్రో బయాలజీ-1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు గురువారం సాయంత్రం 4.30 గంటల్లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

క్యాబ్ ఢీకొని మహిళ మృతి

రహమత్‌నగర్(బోరబండ): క్యాబ్ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సెక్టార్ ఎస్సై మనోజ్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సనత్‌నగర్‌లో నివాస ముండే భాస్కర్, నాగవల్లి దంపతులు కుమార్తె లక్షితతో కలిసి తూర్పుగోదావరి జిల్లాలోని తన సొంత ఊరుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో భాగంగా బుధవారం ఉదయం గోకుల్ టాకీస్ వద్ద బస్సు దిగారు. సనత్‌నగర్ వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అదే సమయంలో వేగంగా వస్తున్న క్యాబ్ వారు ముగ్గురిని వేగంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగ వల్లి (25) అక్కడికక్కడే మృతి చెందింది. భాస్కర్, లక్షితలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అమీర్‌పేట: హోటల్‌లో పిండి గ్రైండ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కార్మికుడు మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన అమిత్ పాశ్వాన్ (23) తన ఇద్దరు సోదరులు వికాస్,నితీష్‌తో కలిసి అమీర్‌పేట అమోఘ హోటల్‌లో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం గ్రైండర్‌లో పిండి మిక్స్ చేసి పని పూర్తయ్యాక గ్రైండర్‌ను కడిగేందుకు నీళ్లు పోశాడు. దీంతో కరెంట్ షాక్ తగలడంతో కిందపడిన అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు వికాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. హోటల్ యజమాని గంగాధర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

బ్యాంకులో దాచుకున్న నగదు మాయం

వెంగళరావునగర్: తన అనుమతి లేకుండా నగదును ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని ఓ మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధురానగర్‌కు చెందిన వనజ వ్యాపారం చేస్తుంది. గత కొన్నేళ్లుగా ఆమె కోటక్ మహేంద్ర బ్యాంకులో ఖాతా నిర్వహిస్తుంది. అందులో రూ.11. 50 లక్షలు దాచుకుంది. ఈ నెల 2న తన ఖాతా నుంచి రూ.11 లక్షలు వినోద రెడ్డి అనే మహిళ అకౌంట్‌కు బదిలీ అయినట్లుగా మెసేజ్ వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన ఆమె బ్యాంక్ అధికారులను సంప్రదించగా నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు తెలిపారు. వినోద రెడ్డి సోదరుడు నగదును విత్‌డ్రా చేసుకున్నట్లు తెలియడంతో తనకు తెలియకుండా నగదును ట్రాన్స్‌ఫర్ చేసుకున్న వినోద రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్త్రీ పెట్టెతో మోది.. గొంతుకు వైర్ బిగించి..

- భర్తను హత్య చేసిన భార్య
- కుమారుడితో కలిసి ఘాతుకం

మోతీనగర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ కుమారుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేసిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సామల వెంకటరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్, పర్వత్‌నగర్‌లో ఉంటున్న వడ్యానం పరమేశ్వర్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య భారతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భారతి తన భర్త పరమేశ్వర్‌ను హత్య చేయాలని నిశ్చయించుకుంది. ఈ నెల 1న రాత్రి వారిద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో కొట్టుకున్నారు. దీంతో భారతి తన కుమారితో కలిసి పరమేశ్వర్ తలపై ఇస్త్రీ పెట్టెతో మోదడమే గాక, వైర్‌తో మెడకు బిగించి హత్య చేసింది. ఈ విషయాన్ని కుమార్తె చూడటంతో భారతి అతడని మాదాపూర్‌లోని శ్రావణి హాస్పిటల్‌కు తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు పరమేశ్వర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో భారతి, కుమారుడితో సహా పారిపోయింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలు భారతి, అమె కుమారుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.



పరమేశ్వర్ (ఫైల్)



నిందితురాలు భారతి

ఎన్ఆర్ఐ ప్లాటు కబ్జా

- రూ.1.5 కోట్లు డిమాండ్
- ఏడుగురు నిందితుల అరెస్టు

మణికొండ: హైదరాబాద్ నగర శివారులో భూముల ధరలు పెరిగిపోతుండటంతో వాటిపై వివాదాలు సృష్టించి రూ.కోట్లు దండుకునేందుకు కొన్ని ముఠాలు యత్నిస్తున్నాయి. ఇటీవల నార్సింగి రెవెన్యూ పరిధిలోని బృందావన్ కాలనీలో ఓ ప్లాట్ వివాదం ఏకంగా ఎమ్మార్పీఎస్ నాయకుడి కిడ్నాప్ సంఘటన మరువకముందే మరో ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఓ ప్లాటు ప్రహరీ కూల్చి దానిని కబ్జా చేయటంతో పాటు అది ఖాళీ చేయాలంటే రూ.1.50 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసిన ముఠాను నార్సింగి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంచిరేవులలో ఎస్. మాధవీలత 2003లో 1200గజాల స్థలాన్ని కొనుగోలు చేసింది. 2017లో దాని చుట్టూ ప్రహరీ నిర్మించి తను అమెరికాలో ఉండటంతో తన తల్లి అరుణకు జీపీఏ ఇచ్చింది. ఈనెల 1న పెంజర్ల సుమన్, ఉప్పరి ముత్యాలు అనే వ్యక్తులు ప్రహరీని కూల్చి సదరు స్థలంలో కంటైనర్ ఏర్పాటు చేసి కబ్జాకు పాల్పడ్డారు. కంటైనర్ తొలగించి తాము తప్పుకోవాలంటే రూ.1.50 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఎస్. అరుణ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సదరు ప్లాట్ వద్ద ఉన్న పెంజర్ల సుమన్, ఆదిరాల గౌతమ్, మేడిపల్లి గణేష్, జంగం ప్రశాంత్, ఈడిగ శివకుమార్, పెంజర్ల జయప్రకాశ్, జంగం శంకర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

న్యాయవిహార్ సమీపంలోనే బ్లాస్టింగ్‌లా?

సాక్షి, హైదరాబాద్: జడ్జిల నివాసాల సమీపంలో బ్లాస్టింగ్‌లు చేపడుతున్నా ఏమి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ.. వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. జడ్జిల గృహాలతో పాటు సమీపంలోని ఇతర ఇళ్లు దెబ్బ తింటున్నాయని ఓ పత్రికలో వచ్చిన కథనంపై హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణ చేపట్టేందుకు స్వీకరించింది. ఈ కథనం ఆధారంగా ప్రధాన న్యాయమూర్తికి న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక లేఖ రాశారు. రోజుకు పది బ్లాస్టింగ్‌లు జరుగుతున్నాయని, ఈ అంశంపై సుమోటోగా విచారణ చేపట్టాలని కోరారు. జడ్జి విజ్ఞప్తిని సమ్మతించిన సీజే విచారణకు స్వీకరిస్తూ.. నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. గనులు-భూగర్భ, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శులకు, కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శి, హైదరాబాద్ కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది.

అక్క, ఇద్దరు తమ్ముళ్ల కిడ్నాప్

- గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్ట్

గచ్చిబౌలి: స్కూల్‌కు వెళుతున్న అక్క, ఇద్దరు తమ్ముళ్లకు మాయ మాటలు చెప్పి కిడ్నాప్‌నకు యత్నించిన ఓ ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మసీద్‌బండకు చెందిన వ్యక్తికి కుమార్తె (14), ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం ఉదయం వారు ముగ్గురు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు నడిచి వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కిరణ్ ప్రసాద్ మాయ మాటలు చెప్పి వారిని ఆటోలో ఎక్కించుకుని గుల్మోహర్ పార్క్ వైపు తీసుకెళ్లాడు. దీనిని గుర్తించిన సాంబయ్య అనే ఆటో డ్రైవర్ చందానగర్ పోలీసులకు సమాచారం అందించాడు. అప్రమత్తమైన చందానగర్ పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా ఆటోను గుర్తించి చిన్నారులతో పాటు నిందితుడిని పీఎస్‌కు తీసుకెళ్లారు. పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించి తల్లిదండ్రులను రప్పించి చిన్నారులను అప్పగించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి ముఠా ఆటకట్టు

- 243 కిలోల గంజాయి పట్టివేత
- నలుగురు నిందితుల రిమాండ్

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్, బాలానగర్ ఎస్ఓటీ, శామీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పేట్‌బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తెలంగాణ మీదుగా గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సైబరాబాద్, బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు శామీర్‌పేట్ పోలీసులతో కలిసి బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటి సామగ్రిని తీసుకువెళ్తున్న బొలారోను ఆపి సోదాలు చేయగా 243 కిలోల గంజాయి పట్టుబడింది. బోయిన్‌పల్లికి చెందిన ప్యాకర్స్ అండ్ మూవర్స్ నిర్వహించే భజరంగ్, న్యూబోయిన్‌పల్లికి చెందిన గజేందర్‌సింగ్, హరియాణాకు చెందిన నరేష్ చింగ్లాలను అదుపులోకి తీసుకున్నారు, హరియాణాకు చెందిన కపిల్ శర్మ, మహారాష్ట్రకు చెందిన రాకేష్, ఒడిస్సాకు చెందిన సుభాష్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

స్నేహితులే ముఠాగా ఏర్పడి..

హరియాణాకు చెందిన భజరంగ్, గజేందర్ సింగ్, నరేష్ కుమార్ చింగ్లా, కపిల్ శర్మ స్నేహితులు. భజరంగ్‌కు సన్నిహితుడైన బలరామ్ గతంలో సాహిల్ అనే వ్యక్తితో కలిసి గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ క్రమంలో అతడికి ఒడిశాకు చెందిన గంజాయి సరఫదారు సుభాష్ అలియాస్ శ్యామూల్‌తో పరిచయం ఏర్పడింది. గత జులైలో భజరంగ్, బలరామ్ ఒడిశా నుంచి 300 కేజీల గంజాయిని హరియాణాకు రవాణా చేశారు. ఈ క్రమంలో బలరామ్ పోలీసులకు పట్టుబడటంతో అతను తన మొబైల్‌ఫోన్‌ను భజరంగ్‌కు ఇచ్చాడు. అందులోని కాల్స్ ఆధారంగా భజరంగ్ గంజాయి సరఫరాదారు సుభాష్, విక్రయదారులు లాతూరుకు చెందిన రాజేష్‌తో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. నరేష్‌కుమార్ చింగ్లా, కపిల్ శర్మ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రాగా గత నెల 29న భజరంగ్, గజేందర్‌సింగ్, నరేష్‌కుమార్ చింగ్లా, కపిల్ శర్మ ఒడిశాలోని మల్కాన్‌గిరికి వెళ్లి సరఫరాదారు సుభాష్‌కు రూ.3.8 లక్షలు చెల్లించి 243 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. బొలేరోలో పాత సామాన్ల చాటున గంజాయిని లోడ్ చేసి మహారాష్ట్రకు తరలించేందుకు పథకం వేశారు. దీనిపై సమాచారం అందడంతో మాటు వేసిన ఎస్ఓటీ పోలీసులు తనిఖీలు చేపట్టి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బొలెరో వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని, వాటి విలువ రూ.95,75,000 ఉంటుందని డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన ఎస్ఓటీ టీమ్ సభ్యులను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



స్వాధీనం చేసుకున్న గంజాయి

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D&B-ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు. ఫోన్.8866977112,339 [HA-16389]

Real Estate

PLOT FOR SALE

■ షాద్‌నగర్ @ కేశంపేట్‌లో DTCP లేఅవుట్‌లో, ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 40 EMI పద్ధతిలో 75 గజాల ఓపెన్ ప్లాట్స్ కలవు. నెలకు 10 వేలు మాత్రమే డైరెక్ట్ కంపెనీ ఆఫర్ సైట్ విజిట్ కొరకు, ఫోన్: 9849695027 [H-796195]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్.9100329739 [H-800444]

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్:పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-2157]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న. మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9398709618 [H-796629]

CHITS & DEPOSITS

■ కవీంద్ర, శ్రీరామ్ చిట్ ఫండ్‌లో 1 లక్ష నుండి 25 లక్షల Vacant & ఫ్రెష్ చిట్స్ కలవు. ఫైనాన్స్ సౌకర్యం కలదు. ఫోన్: 9492027245, 6309527694 [H-782722]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Mujibar Rahaman Molla R/o H.No. 3-3-67/V/106, Vijaya Residency, GKR Enclave, Turkapally, Bolaram, Sec-bad. 500010, T.G., have changed my name from Mujibar Rahman Molla to Mujibar Rahaman Molla, Vide Affidavit Dt.04-9-2024 [SCA24000231]

■ I, Abdul Khuddus S/o Mohammed Abdul Raheman R/o. 11-3-266/40/B, Shabazguda, Parsigutta, Secunderabad, Hyderabad-500061, have changed my name to Mohammed Abdul Khuddus [HA-46777]

■ I, PURNIMA RAO (Before Marriage) W/o T.E. VIJAY KUMAR Resident of 12-10-590/33, Old Post Office Lane, Warasiguda, Secunderabad, Hyderabad - 500061, Telangana State, changed my name as T. V. PURNIMA (After Marriage) for all records purpose [HA-98379]

LOST

■ I, India Mary Luke W/o Rauri Clement, I Lost My House Sale Deed Doc No. 962/1992 While travelling in Saidabad If Anybody Find Call: 8500814164 [H-783070]

OLD AGE HOME

■ వృద్ధులు, Rtd ఎంప్లాయిస్ విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, 24/7 మెడికల్ సర్వీస్. ఉప్పల్ మరియు ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 9515474083 [H-778845]

Wanted

■ అన్నపూర్ణ హోమ్ కేర్ ముసలివారికి సేవ చేయుటకు, కేర్ టేకర్స్ బేబి కేర్, ఆయాలు, పేషెంట్ కేర్ కి స్త్రీ / పురుషులు కావలెను. జీతం: 16000 to 30000/-+ రూం,భోజనం ఫ్రీ. ఫోన్: 9390427694 [HA-585]

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ:18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796272]

■ నాచారం లోని ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూంలో హెల్పర్స్ (బాయ్స్) అర్జెంట్‌గా కావలెను. & కోకాపేట, మణికొండ, నస్‌సిటీ ఏరియాలకు హౌస్ కీపింగ్ (లేడీస్) కావలెను. 9 గం॥ డ్యూటీ 4 W/O. ESI+PF. సంప్ర: 9032153413 [H-796687]

■ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్, రూమ్ భోజన సౌకర్యం కలదు. కల్వకుర్తి, బేగంపేట, యాదాద్రి, జూబ్లీహిల్స్‌లో హౌస్ కీపింగ్ Male / Female కావలెను. ఫోన్: 8639110999, 9398915299 [HA-14569]

■ Need Rtd. Govt / Pvt Employees, Homemakers For Kotak. P/F Jobs. 35K PM Inc + Foreign Trips. Ph:6304994315 [HA-98375]

■ Wanted Male and Female work for MNC Company Qul: 10th to Degree, Sal: 15k to 25k cont: 9502712418 (work from home facility is available) [G-9022]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
అత్తాపూర్	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-24/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Syndicate

ఎస్.ఎస్. రోడ్ బ్రాంచ్, డి.నం. 5-3-1062, వీరజీ టవర్స్, ఉస్మాన్‌గంజ్ ఏరియా, ఓల్డ్ పిఎస్ దగ్గర, బేగంబజార్, హైదరాబాద్ - 500001.

ఇ-వేలం కొరుట ద్వారా చరాస్తుల అమ్మకం ప్రకటన

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ చార్జ్ చేసిన దిగువ వివరించిన చరాస్తులు కెనరా బ్యాంక్, ఎస్.ఎస్. రోడ్ బ్రాంచ్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక / భౌతిక స్వాధీనంలోకి తీసుకోబడినవి, శ్రీ నిహార్ ఇండస్ట్రీస్, ఇ.నం.7 2 6/డిజి/10, ఫ్లాట్ నం. 405, శ్రీ సాయి జగత్ టవర్స్, దుర్గా నగర్ కాలనీ, కర్మన్‌ఘాట్, హైదరాబాద్, తెలంగాణ-500 079, యార్లగడ్డ యమున భర్త వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, డి.నం. 11-76, మచిలీపట్నం రోడ్, పామర్రు, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521157 నుండి కెనరా బ్యాంక్, ఎస్.ఎస్.రోడ్ బ్రాంచ్‌కు చెల్లించాల్సిన బకాయి రూ. 63,32,877.33 (31-08-2024 నాటికి కాంట్రాక్చువల్ బకాయిలు) రాబట్టుకునేందుకు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ ఆ విధంగానే", "ఉన్నవి ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నవో అవే" స్థితిలో 25-09-2024న విక్రయించబడతాయని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(ల)కు మరియు గ్యారంటార్(ల)కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

వేలం తేది మరియు సమయం : 25-09-2024న ఉ.11:30 గం. నుండి మ.12:30 గం.

బయానాను 23-09-2024న లేదా ఆలోగా సా.5.00 గం.లోగా డిపాజిట్ చేయాలి

మెషినరీ వివరాలు దిగువ విధంగా ఉన్నాయి

ఐటమ్ వివరణ	పరిమాణం	వసూలు కాదగిన విలువ రూపాయలలో
సి1 రఫ్ (క్యాస్టింగ్స్)(ఐఎస్‌జి)	1405	56546
అనీలింగ్ ఫర్నేస్	1	475636
కటింగ్ మెషీన్ సర్కిల్ కటింగ్ మెషీన్ సిఐ మాడ్యూల్స్	లాట్	1170796
స్టార్టర్‌తో పాత మోటార్	1	23416
పవర్ ప్రెస్ 30 టన్నులు	1	256112
స్పిన్నింగ్ మెషీన్స్	2	58540
రోలింగ్ మిల్ పార్ట్స్	లాట్	182937
రోలింగ్ మిల్ పార్ట్స్	లాట్	2838466
అల్యూమినియం మెల్టింగ్ మెషీన్	2	439762
	మొత్తం	5502211

ఆస్తి రిజర్వు ధర రూ.55,02,000/- మరియు బయానా రూ. 5,50,200/-

* బ్యాంకుకు తెలిసిన మేరకు తాకట్టు రుణభారాలు లేవు.

తదుపరి వివరాల కోసం సంప్రదించండి శ్రీ రవీందర్ గుగులోతు, ఎస్.ఎస్.రోడ్ బ్రాంచ్, హైదరాబాద్, కెనరా బ్యాంక్, ఫోన్ నం.9440905000, 9036126456, ఇ-మెయిల్ ఐడి : cb13000@canarabank.com (or) M/s. PSB Alliance (Ebkray), మొబైల్ నం. 8291220220, ఇ-మెయిల్ : support.ebkray@psballiance.com, వెబ్‌సైట్ : https://ebkray.in/

ఇతర నియమ నిబంధనలు: a) వెబ్‌సైట్ https://ebkray.in/ ద్వారా "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్" ద్వారా మాత్రమే వేలం/బిడ్డింగ్ ఉంటుంది. బిడ్డర్లు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనే ముందు సవివరమైన నిబంధనల కోసం వెబ్‌సైట్ చూడవలసిందిగా సూచించబడుచున్నారు. b) **మెషినరీని అధీకృత అధికారి ముందస్తు అనుమతితో 23.09.2024న ఉ.11.00 గం. నుండి మ.3.00 గం. మధ్య తనిఖీ చేసుకోవచ్చును.** c) రిజర్వు ధరలో 10% బయానా మొత్తమును Authorized Officer, Canara Bank, NS Road Branch పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో లేదా Canara Bank, NS Road Branch, A/c No. 209272434, IFSC Code: CNRB0013000 ఖాతాకు జమ అయ్యేలా RTGS/NEFT/Fund Transfer ద్వారా 23.09.2024న లేదా ఆలోగా సా.5:00 గం.లోగా డిపాజిట్ చేయాలి. d) కృతార్థుడైన బిడ్డరు అమ్మకం ధరలో 25% (ఇంతకుముందే చెల్లించిన బయానాతో సహా) అతనిని/ ఆమెను కృతార్థుడైన బిడ్డరుగా ప్రకటించిన వెంటనే మరియు మిగిలిన మొత్తాన్ని సెక్యూర్డ్ క్రెడిటార్ అమ్మకం నిర్ధారించిన తేదీ నుండి 15 రోజులలోగా డిపాజిట్ చేయాలి. ఒకవేళ గెలుపొందిన బిడ్డరు అమ్మకం ధర చెల్లించుటలో విఫలమైతే, అతను డిపాజిట్ చేసిన మొత్తం ఎటువంటి నోటీసు లేకుండా అధీకృత అధికారిచే జప్తు చేసుకోబడుతుంది మరియు చరాస్తులు మరోసారి అమ్మకానికి ఉంచబడతాయి. e) పైన తెలిపిన విధంగా రిజర్వు ధరలో వేలం ప్రారంభమవుతుంది. బిడ్డర్లు రూ.50,000/- గుణకాలలో తమ ఆఫర్లను పెంచుకోవచ్చును. ఆన్‌లైన్ వేలం ముగిసిన మీదట అత్యధిక బిడ్ (రిజర్వు ధరకు ఎక్కువగా) దాఖలు చేసిన బిడ్డరు గెలుపొందిన బిడ్డరుగా ప్రకటించబడతారు. అమ్మకం సెక్యూర్డ్ క్రెడిటార్ నిర్ధారణకు లోబడి గెలుపొందిన బిడ్డరు పేరున ఖరారు చేయబడుతుంది.

తేది : 03-09-2024, ప్రదేశం: హైదరాబాద్ — అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఆరోగ్యకర జీవనశైలి అవసరం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఎరయా ఫెర్టిలిటీ సెంటర్‌ను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మారుతున్న జీవన శైలి ఎన్నో మార్పులకు దారితీస్తుందన్నారు. ఆరోగ్యకర జీవనశైలిని అనుసరిస్తే ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ఈ క్రమంలోనే ఫెర్టిలిటీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వైద్యులు ధ్రువీకరిస్తున్నట్లు చెప్పారు. మెరుగైన, ఉన్నత సేవలు అందించి ప్రజల మన్ననలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎరయా ఫర్టిలిటీ డైరెక్టర్ డాక్టర్ ఐశ్వర్య నుపూర్, డాక్టర్ కాశీప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పెయింటింగ్ ఈవెంట్


గోడపై చిత్రం గీస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: డివిజన్‌లోని శ్రీరాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో వెల్స్ ఫార్గో సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పెయింటింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని పాఠశాల గోడలపై చిత్రాలు గీసి విద్యార్థులను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయింటింగ్ ఒక అద్భుతమైన కళ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది కళాకారులు పాల్గొని పాఠశాల ఆవరణలోని గోడలపై వైవిధ్య భరితమైన చిత్రాలు గీశారు. రహమత్ నగర్ డివిజన్‌లోని మిగతా పాఠశాలల్లోనూ చిత్రాలు వేయాలని సీఎన్ రెడ్డి సంస్థ నిర్వాహకులను కోరారు.

'బీఆర్ఎస్ నేతలపై దాడి దారుణం'


మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్: ఖమ్మంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రుల వాహనాలపై దాడిని ఆ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఖండించారు. ఎమ్మెల్యే కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాజీ మంత్రులు హరీష్‌రావు, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు వాహనాలపై దాడి చేయడం కాంగ్రెస్ అసహనానికి నిదర్శనమన్నారు. ఇలాంటి ఎన్ని దాడులు చేసినా సరే ప్రజల వద్దకు బీఆర్ఎస్ శ్రేణులను వెళ్లకుండా ఆపలేరన్నారు. కాంగ్రెస్ చేతగాని దద్దమ్మ పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

నేడు అవార్డుల ప్రదానం

లిబర్టీ: విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న నిష్ణాతులకు గురువారం అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ తెలిపారు. విద్యా రంగంలోనూ ఇతర రంగాలను ఎంతగానో సేవలు అందిస్తున్న వారిని ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ అవార్డులను ఇస్తున్నామన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ ఎస్.రాధాకృష్ణ మెమోరియల్ అవార్డు 2024 పేరిట అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు అవార్డులను తెలంగాణ భవన్‌లో ప్రదానం చేస్తామన్నారు.

పోషకాహారంతోనే చిన్నారుల ఎదుగుదల


చిన్నారుల ఎత్తు పరిశీలిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఫిలింనగర్: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందించడమే కాకుండా పోషక పదార్థాలు అందజేసే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధి కిందికి వచ్చే 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు పోషణ మాసం పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు బలవర్ధక ఆహారం అందజేయడం, వారి బరువు తెలుసుకోవడం, తక్కువ బరువు ఉన్న వారిని గుర్తించడం, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, బాలామృతం పంపిణీ చేసే కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఎత్తు, బరువును పరీక్షించారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన జీవీఆర్ విద్యార్థులు

కాచిగూడ: మేడ్చల్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన 40 మంది విద్యార్థులు సత్తాచాటారు. కటా, కుమితి విభాగాలలో 27 బంగారు పతకాలు, 17 రజత పతకాలు, 22 కాంస్య పతకాలు సాధించి చాంపియన్‌షిప్ కప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ విజయలక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ డా. జీఎస్ గోపాల్‌రెడ్డి, అమృతరెడ్డి, గణ సంతోషిణిరెడ్డి, షైనీ, అవిజ్ఞ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కాచిగూడ: భారత్ సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మణికొండలోని కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ అడప వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ అర్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.99593 63083లో సంప్రదించాలని కోరారు.

మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ షురూ..

- గుర్తించిన కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని 14 కేంద్రాల ఏర్పాటు
- ఈ నెల 6 సాయంత్రం వరకు అందుబాటులో కేంద్రాలు


జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న హెచ్ఎండీఏ అధికారులు

బంజారాహిల్స్: పర్యావరణహిత గణనాథులను పూజించడానికి హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా మట్టి గణపతుల పంపిణీకి శ్రీకారం చుట్టాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో బుధవారం గుర్తించిన ప్రాంతాల్లో మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాల పంపిణీని చేపట్టారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మట్టి విగ్రహాల పంపిణీ జరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు వెల్లడించారు. ఎక్కడెక్కడ మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నారో పర్యవేక్షణ అధికారుల వివరాలు కూడా సంబంధిత శాఖ స్పష్టం చేసింది.

- లక్ష మట్టి విగ్రహాలు పంపిణీ చేయాలని హెచ్ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి రోజున బుధవారం అన్ని కేంద్రాల వద్ద మంచి స్పందన లభించింది.
- ప్రజలు చాలామంది మట్టి విగ్రహాలను తీసుకోవడానికి ఆసక్తి కనబరిచారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వైపు గత ఏడెనిమిది సంవత్సరాలు పౌరులు దృష్టిసారించడం లేదు.
- పర్యావరణహిత విగ్రహాల వైపే మొగ్గుచూపుతుండటంతో ప్రభుత్వం ఉచితంగా మట్టి పంపిణీ చేస్తుంది.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, సోమాజిగూడ, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో ఉచిత మట్టి గణనాథుల విగ్రహాల పంపిణీ కేంద్రాలను ఏర్పాటుచేసింది.

మట్టి గణపతులు పంపిణీ చేసే కేంద్రాలివే...

- ఆరోగ్యశ్రీ సైలెంట్ వ్యాలీ హిల్స్, జూబ్లీహిల్స్ (అధికారి రాజ్‌మోహన్, ఫోన్:99498 71088)
- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10 ఐఏఎస్ క్వార్టర్స్ (నరేష్ ఫోన్: 84989 84054)
- బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు మెయిన్‌గేటు (రవీందర్: 91330 59867)
- గ్రీన్‌ల్యాండ్స్ హిందూ న్యూస్‌పేపర్ సమీపంలో... (డి.విద్యాసాగర్: 96182 94411)
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ (అషితోష్‌వర్మ: 73311 85146)
- జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయం (గౌతమి: 88973 41954)
- జూబ్లీహిల్స్ టూప్స్ రెస్టారెంట్ (మీనాక్షి: 94406 81468)
- అమీర్‌పేట మైత్రీవనం (ఆర్వై నాయుడు: 99893 36923)
- సెక్రటేరియట్ (గణేష్: 79893 71104)
- ఎన్టీఆర్ గార్డెన్, (నగేష్-75694 55875)
- మెల్కొటే పార్కు, నారాయణగూడ, (అభిలాష్: 88854 85253)
- మైండ్‌స్పేస్ జంక్షన్, మాదాపూర్ (సంజయ్: 98499 09848)
- కుందన్‌బాగ్ ఐఏఎస్‌కాలనీ, (రామారావు: 94410 15552)

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో...

బంజారాహిల్స్: పర్యావరణాన్ని కాపాడాలంటూ, ప్రతి ఒక్కరూ మట్టి గణనాథులనే పూజించాలంటూ హెచ్ఎండీఏ అధికారులు ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బుధవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కుతో పాటు జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని పెద్దమ్మ గుడి వద్ద గణపతి విగ్రహాలను అధికారులు పంపిణీ చేశారు. పండగ రోజు వరకు అధికారులు ఎంపిక చేసిన కూడళ్ల వద్ద ఉచితంగా గణనాథులను పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు. కేబీఆర్ పార్కు వద్ద 800, జూబ్లీహిల్స్‌లో తొలిరోజు 1200 విగ్రహాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎవరైనా కాలనీవాసులు, అపార్ట్‌మెంట్ వాసులు మట్టివిగ్రహాలు కావాలంటే తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఒకేసారి ఎన్ని విగ్రహాలు కావాలన్నా ఇస్తారని అధికారులు తెలిపారు.

అందుబాటులో కేన్సర్ స్క్రీనింగ్ మొబైల్ సేవలు

స్టేట్ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్‌లో ఉచిత జీఐ క్లినిక్


క్లినిక్‌లో డిజిటలైజేషన్ పద్ధతిలో పరీక్షిస్తున్న డాక్టర్ విమలాకర్ రెడ్డి

బంజారాహిల్స్: రోజురోజుకూ పెరుగుతున్న జీర్ణకోశ సంబంధ వ్యాధులను, క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు మొదటిసారిగా ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ మొబైల్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఇ.విమలాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం టీం విమలాకర్ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో క్లినిక్‌ను నిర్వహించారు. క్లినిక్‌కు వచ్చినవారికి ఈసీజీ, 2డి ఎకో, అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీ, ఎక్స్‌రే, మామోగ్రామ్, ఎల్ఎఫ్‌టీ, సీబీపీ, సీరం క్రియాటిన్, ఆర్‌బీఎస్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఆధునిక డిజిటలైజేషన్ పద్ధతిలో పలువురికి డాక్టర్ విమలాకర్ రెడి నేతృత్వంలో డాక్టర్ గౌరంగ్ ష్రాఫ్, డాక్టర్ కె.వి.దినేష్‌రెడ్డి, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ పి.రోహన్‌రెడ్డిలు పరీక్షించి సలహాలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉచిత జీర్ణవ్యవస్థ కేన్సర్ స్క్రీనింగ్ మొబైల్ క్లినిక్ సేవలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని విమలాకర్ రెడ్డి తెలిపారు. ఈ క్లినిక్‌కు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్, టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిజాస్టర్ క్రైసిస్ మేనేజ్‌మెంట్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగాల ఎస్పీలు, డీఎస్పీలు, అడిషనల్ ఎస్పీలతోపాటు ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ సిబ్బంది 400 మంది పాల్గొన్నారు.

21న టీఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభ


పోస్టర్‌ను విడుదల చేస్తున్న టీఎంఆర్‌పీఎస్ నాయకులు

బంజారాహిల్స్: ఎస్సీ వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఈ నెల 21న విజయోత్సవ సభను నిర్వహించనున్నట్లు టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజుమాదిగ తెలిపారు. బంజారాహిల్స్‌లో గురువారం ఆయన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇటుక రాజుమాదిగ మాట్లాడుతూ... 21వ తేదీన ఉదయం 11.30 గంటలకు నారాయణపేట జిల్లా మరికెల్ మండల కేంద్రంలోని సూర్యచంద్ర కన్వెన్షన్ హాల్‌లో విజయోత్సవ సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 57 మాదిగ ఉపకులాల వ్యవస్థాపక అధ్యక్షులు చింతల రాజలింగం, టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సిరిసిల్ల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ లెవల్ పార్కింగ్ స్థలం పరిశీలన


పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

బంజారాహిల్స్: పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేయబోయే మల్టీలెవల్ పార్కింగ్ స్థలాన్ని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బుధవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. దీని గురించి పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతనే ఇది మొదలవుతుందని తెలిపారు. గత ఆగస్టు 22వ తేదీన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు కోరిన మేర వారు బుధవారం ఈ స్థలాన్ని పరిశీలించారు.

ఫౌంటెన్ కాదు.. పైప్‌లైన్ లీకేజీ...

బంజారాహిల్స్: పంజగుట్ట ఫ్లై ఓవర్‌పై బుధవారం సాయంత్రం మొక్కలకు నీళ్లు పెట్టే వాటర్ లైన్ లీకేజీ కావడంతో భారీ ఎత్తున నీళ్లు ఎగిసిపడ్డాయి. పెద్ద ఎత్తున పైప్‌లైన్ నీళ్లు ఎగిసిపడుతుండటంతో వాహనదారులు, స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయగా వెంటనే అక్కడికి చేరుకున్న సర్కిల్-17 యూబీడీ అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి లీకేజీని ఆపారు.


పంజగుట్ట ఫ్లై ఓవర్‌పై పైప్‌లైన్ లీకేజీతో ఎగిసిపడుతున్న నీరు

నిమజ్జన శోభాయాత్ర రూట్లను పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ


మార్గాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరగనున్న వినాయక ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర మార్గాలను బుధవారం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే పరిశీలించారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఆయన జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-5 నుంచి వెంకటగిరి, శ్రీకృష్ణానగర్, కమలాపురికాలనీ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శోభాయాత్రలో విగ్రహాలకు అడ్డుగా ఉండే చెట్ల కొమ్మలు, కేబుల్ వైర్లను గుర్తించారు. ఎక్కడెక్కడ రోడ్లపై గుంతలు ఉన్నాయో వాటిని పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఇప్పటికే సమన్వయ సమావేశం నిర్వహించామని, తమ పరిశీలనకు వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నామని, నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించే దిశలో ట్రాఫిక్ ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశామన్నారు.

గోల్డ్ మెడలిస్టుకు సన్మానం


వంశీని సన్మానిస్తున్న రమేశ్ నాయక్

రహమత్‌నగర్(బోరబండ): మాల్టాలో జరిగిన వరల్డ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన వంశీని బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యాలయ కార్యదర్శి, హైద్రాబాద్ జిల్లా స్పోర్ట్స్ విభాగం వైస్ చైర్మన్ రమేష్ నాయక్ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని కోరారు.

నిలోఫర్ కేఫ్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

బంజారాహిల్స్: ఎక్స్‌పైర్ అయిన చీజ్.. పాడైన పల్లీలు.. డేట్ అయిపోయిన చీజ్.. లేబుల్ లేని కేక్.. నిబంధనలను అతిక్రమించి వ్యాపారం చేస్తున్న నిలోఫర్ కేఫ్ నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని నిలోఫర్ కేఫ్, రాజా డీలక్స్ రెస్టారెంట్, హైకు రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. నిలోఫర్ కేఫ్‌లో డేట్ అయినప్పటికీ ఉపయోగిస్తున్న ఐదు కిలోల పల్లీలు, అరకిలో పాడైపోయిన చీజ్ లభించాయి. లేబుల్ లేకుండా కేక్‌లు అమ్ముతున్నట్లు గుర్తించారు. ఇక మీదట ఇలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. రాజా డీలక్స్ రెస్టారెంట్ మాంసాహార ఉత్పత్తులను చాలాకాలంగా ఫ్రిడ్జ్‌లో ఉంచినట్లు గుర్తించారు. ఆహార పదార్థాల్లో సింథటిక్ రంగులను ఉపయోగిస్తున్నట్లు తేలింది. హైకు రెస్టారెంట్‌లో వంట గదిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు శుభ్రత పాటించడం లేదని గుర్తించారు. వంటలో ఉపయోగించే ఆవాలు, జీలకర్ర తదితర పదార్థాలకు ఎక్స్‌పైరీ తేదీలు అయిపోయినా ఉపయోగిస్తున్నట్లు తేలింది. నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

ఈ విద్యుత్ తీగలు సరిచేయరూ...

రహమత్‌నగర్: ఎస్పీఆర్ హిల్స్ ఆరోగ్యనగర్‌లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ గాంధీ నగర్ బస్తీకి విద్యుత్ అందించే తీగలు స్థానిక మదర్‌థెరిసా విగ్రహం ముందున్న చెట్టు కొమ్మల కింద ఉన్నాయని వారు వాపోయారు. కొమ్మలు విరిగి పడితే తీగలు కింద పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కాగా ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల మూలంగా ఎప్పుడు చెట్టు కొమ్మలు విరిగి పడి ఏ ప్రమాదం ముంచు కొస్తుందని బస్తీ వాసులు భయపడుతున్నారు.

స్టడీ సెంటర్ భవనం ప్రారంభమెప్పుడో?


కింద పడిన సీలింగ్

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని దళిత్ స్టడీ సెంటర్ భవనం పెచ్చులూడుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి భవనంలోని మొదటి అంతస్తులోని సీలింగ్ పొరలుగా విడిపోయి కింద పడింది. భవనం ముందు భాగంలోని డిజైనింగ్‌కు రంధ్రాలు పడ్డాయి. దళిత సాధికారత కోసం ఎస్పీఆర్‌హిల్స్‌లో రూ.21 కోట్లతో దళిత అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ భవనం పనులు దాదాపు పూర్తి అయ్యాయి. ఇంతలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడింది. ఇప్పటికీ ఈ భవనం ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఎంతో విశిష్టత కలిగిన ఈ భవనాన్ని ప్రారంభించి ఉపయోగంలోకి తేవాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

అదుపుతప్పి డివైడర్ ఎక్కిన కారు

కాచిగూడ: హైదర్‌గూడలో ఓ కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కి భీభత్సం సృష్టించింది. ఈ సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హైదర్‌గూడ నుంచి హిమాయత్‌నగర్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి తెలుగు అకాడమీ ఎదురుగా అదుపు తప్పి డివైడర్ పై ఎక్కింది. స్వల్ప గాయాలతో కారులో ఉన్న ఇద్దరు యువకులు బయటపడ్డారు. నిర్లక్ష్యంగా కారు నడిపిన కారులో ఉన్న యువకులను అటుగా వెళ్తున్న వాహనదారులు చితకబాదారు. సంఘటన స్థలానికి చేరుకున్న నారాయణగూడ పోలీసులు కారులో ఉన్న వారిని అదుపులోకి తీసుకుని, కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విచారణలో కారు నడిపింది మైనర్ అని తేలడంతో తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలపై దృష్టి సారిస్తాం:దేదీప్య విజయ్


కార్పొరేటర్‌ను కలిసిన కాలనీ నేతలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ కాలనీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలిపారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన వెంగళరావునగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు బుధవారం కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కాలనీలోని సమస్యలను ఆమెకు వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల సమీపంలో పాడైపోయిన రోడ్లు, టీ-జంక్షన్ సమీపంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యల గురించి చెప్పారు. దీనిపై కార్పొరేటర్ స్పందించి తక్షణమే జీహెచ్ఎంసీ, విద్యుత్ ఏఈలతో చర్చించారు. సాధ్యమైనంత త్వరగా రోడ్లు నిర్మించడం, నూతనంగా విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ నేతలు చిలకల వెంకటేశ్వరరావు, పిహెచ్ఎస్ ప్రసాద్, శౌరి రాజు, అర్జున్, డి.ధనుంజయ్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్‌చారి, తిరుమలేష్, శ్రీధర్, సంతోష్, రఘురాములు, సునీత తదితరులు ఉన్నారు.

వ్యాపారం పేరుతో మోసగించిన వ్యక్తిపై మహిళ ఫిర్యాదు

వెంగళరావునగర్: వ్యాపారం పేరుతో మహిళ నుంచి నగదు, నగలు తీసుకుని పారిపోయిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడెంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పల్లె సరిత అనే మహిళ ఉంటుంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉండే మధుసూదన్‌రావు తాను జ్యోతిష్యంతో పాటు అనేక వ్యాపారాలు చేస్తుంటానని ఆమెకు తెలిపాడు. ఓఆర్ఎస్ వ్యాపారం చేస్తున్నానని అందులో పెట్టుబడులు పెడితే లాభం వస్తుందని నమ్మించాడు. దీంతో ఆమె రూ. 2 లక్షలను మధుసూదన్ రావుకు ఇచ్చింది. లక్షకు రూ. 10 వేల చొప్పున ప్రతి నెల అందజేస్తానని నమ్మించాడు. అయితే తీసుకున్న నగదు తిరిగి ఇవ్వలేదు. అంతే కాకుండా విశాఖపట్నంలో ఫ్లాట్ కొనుగోలు చేయాని మరో రూ. 2 లక్షలు తీసుకున్నాడు. స్థానికంగా డబుల్‌బెడ్‌రూం ఇప్పిస్తానని ఇంకో రూ. 4 లక్షలు తీసుకున్నాడు. ఆమె నుంచి నగలు కూడా తీసుకుని వాడుకున్నాడు. తీసుకున్నవి ఏవీ తిరిగి ఇవ్వకపోవడంతో అతన్ని నిలదీసింది. మధుసూదన్ రావుతో పాటు ఆదే ఇంట్లో నివసించే సుమాంజలి, సంతోష్ కుమార్, రాజేష్‌లు కూడా ఆమెను నమ్మించారు. జులై 26వ తేదీన ఇంటికి తాళం వేసి వెళ్లిపోయిన వారు ఫోన్‌కు స్పందించకపోవడంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి కార్పొరేటర్ పావని వినతి



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి నిధులను కేటాయించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని బుధవారం కార్పొరేటర్ పావని వినతి పత్రం సమర్పించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచనల మేరకు వినతి పత్రాన్ని అందజేశామని ఆమె తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి డివిజన్ అభివృద్ధికి నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల న్యాయమైన డిమాండ్లు తీర్చాలి

గాంధీఆస్పత్రి : బీసీల హక్కులపై కాలయాపన చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే నష్టమని బహుజన సమాజ్ పార్టీ ఏపీ కోఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డాక్టర పూర్ణచంద్రరావు హెచ్చరించారు. కులగణన, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కోసం హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ చేపట్టిన ఆమరణ దీక్ష బుధవారం సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో కొనసాగింది. సిద్ధేశ్వర్‌ను పరామర్శించి సంఘీభావం ప్రకటించారు.

అంబేడ్కర్ భవనం నిరుపయోగంగా ఉండటం సరికాదు

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- లోయర్ ట్యాంక్‌బండ్‌లోని భవన్‌లో ఆకస్మిక తనిఖీలు
- అధునాతన వసతులతో డిజిటల్ తరగతులను అభివృద్ధి చేస్తాం

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. అంబేడ్కర్ భవన్‌లో మూసేసిన స్టడీ హాల్, భవన పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అంబేడ్కర్ భవన్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం అధునాతన వసతులతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. నగరం నడిబొడ్డున విశాలమైన భవనం నిరుపయోగంగా ఉండటం సరికాదన్నారు. కొన్నేళ్లుగా అంబేడ్కర్ భవన్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా డిజిటల్ తరగతులను అందుబాటులోకి తెస్తామని ఆయన వెల్లడించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

రాజ్‌భవన్ స్కూల్‌లో గ్రీన్ ప్లాంటేషన్



రాజ్‌భవన్ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఆర్‌బీఐ జీఎం అనూజ్ రంజన్ తదితరులు

బంజారాహిల్స్: సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బుధవారం నిర్వహించిన ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఆర్‌బీఐ జీఎం అనూజ్ రంజన్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీజీఎం జగదీష్ కుమార్, ఉపాధ్యాయులు సురేందర్, లత, రాజు, శ్రీలత, రజిత తదితరులు పాల్గొన్నారు.

మల్లారం నీటిశుద్ధి కేంద్రాన్ని సందర్శించిన ఈడీ



సాక్షి,సిటీబ్యూరో: సిద్దిపేట జిల్లా మల్లారంలో ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రాన్ని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ బుధవారం సందర్శించారు. టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్ తో కలిసి ఆయన పంప్‌హౌస్, సబ్‌స్టేషన్ ను పరిశీలించారు. నీటిశుద్ధిలో అవలంబించే పలు ప్రక్రియల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీజీఎం రవీందర్ రెడ్డి, జీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు ఘనస్వాగతం



ఎయిర్‌పోర్టులో ఉమ్రా యాత్రికులకు స్వాగతం

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన యాభై మంది యాత్రికులు మక్కా మజీద్ సందర్శన నిమిత్తం ఉమ్రా యాత్రకు వెళ్లి బుధవారం సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలతో సత్కరించారు. యాత్రను అల్ మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.

వడ్డాణం శ్రీనివాస్‌కు బెస్ట్ టీచర్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సోషల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ డీన్, హిస్టరీ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్ రావుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈఎంఆర్ అండ్ ఆర్సీ విభాగానికి, సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ విభాగానికి డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్ వడ్డాణం సూర్యాపేట జిల్లా మద్దిరాల గ్రామానికి చెందినవారు. పాఠశాల విద్య స్వగ్రామంలో, డిగ్రీ వరకు ఖమ్మంలో, పీజీ నుంచి పీహెచ్‌డీ వరకు ఉస్మానియా వర్సిటీలో చదువుకున్నారు. 'తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రసార మాధ్యమాల పాత్ర' అనే టాపిక్ పై పీహెచ్‌డీ చేశారు. డాక్టర్ శ్రీనివాస్‌కు హిస్టరీ, ఎడ్యుకేషన్, ఫిలాసఫీ వంటి సబ్జెక్టుల్లో దాదాపు పాతిక సంవత్సరాల బోధన అనుభవం ఉంది.

జైనూర్ హింసాకాండను ఖండించిన అసదుద్దీన్

సాక్షి, సిటీబ్యూరో: ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో జరిగిన హింసాకాండను ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు. బుధవారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జైనూర్ ఘటనపై స్పందించారు. హింసాకాండపై డీజీపీతో మాట్లాడానని, అదనపు బలగాలను పంపిస్తున్నామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కొందరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తగదన్నారు. మహారాష్ట్రలో ముస్లిం వృద్ధుడిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ప్రజలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. హర్యానా ప్రభుత్వం జునైద్ నసీర్ హత్యలో నిందితులను అరెస్టు చేసి ఉంటే సాబీర్ హత్య జరిగి ఉండేది కాదని వ్యాఖ్యానించారు.

బయోటెక్నాలజీలో సవాళ్లను అధిగమించాలి

హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు



వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: బయోటెక్నాలజీలో ఇతర దేశాలను మన దేశం అధిగమించాలని, ఇది ఒక సవాలు లాంటిదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోసిస్(సీడీఎఫ్‌డీ) సంయుక్తంగా బుధవారం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో బయోఈ3 పాలసీపై ఇన్ఫర్మేటివ్ సెషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయో ఎకానమీ జీడీపీ లక్ష్యాలను చేరుకోవడానికి ఒక ఎజెండాను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సీడీఎఫ్‌డీ డైరెక్టర్ మాట్లాడుతూ బయోఈ3 విధానం వాతావరణాన్ని తట్టుకోగల వ్యవసాయం, సముద్ర, అంతరిక్షంలో పరిశోధనల కోసం కూడా చొరవ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆనంద్ కొండపి, ప్రొఫెసర్ ఎస్.రాజగోపాల్, హెచ్‌సీయూ ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్, పలువురు యువ పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పథకాల అమలులో మీడియా కీలకం

జర్నలిస్టుల వర్క్‌షాప్‌లో ఎంపీ ఈటల
హాజరైన ఐదుగురు ఎమ్మెల్యేలు, కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లేలా మీడియా సమర్థవంతంగా పనిచేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. సంక్షేమ పథకాలు సంబంధిత లబ్ధిదారులకు చేరాయో.. లేదో నిర్ధారించుకొని వార్తలు రాయాల్సిన బాధ్యత కూడా పాత్రికేయులకు ఉందని పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశమందిరంలో పత్రికా సమాచార కార్యాలయం(పీఐబీ) ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన వార్తలాప్- వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాలకు చేరడం లేదని, అవి వారికి అందే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఈటల పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం మీడియా ద్వారా ప్రజలకు చేరవేయడంలో పీఐబీ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు.

వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయం

పీఐబీ లాంటి కేంద్ర ప్రభుత్వ శాఖ మన మధ్యకు వచ్చి జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నందుకు ఆ సంస్థ బృందాన్ని మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ అభినందించారు. క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాల అమలు తీరు గురించిన వివరాలు అందించాల్సిన బాధ్యత పాత్రికేయులదేనని పేర్కొన్నారు. రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధీనంలోని పీఐబీ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తోందన్నారు. సమావేశంలో భాగంగా 'మీడియాలో విలువలు- అభివృద్ధి, జర్నలిజం 'అనే అంశంపై ప్రముఖ జర్నలిస్టు ఉమామహేశ్వర రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సీహెచ్ మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, వివేకానందగౌడ్, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పత్రికా సమాచార కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, పీఐబీ అధికారి గాయత్రి శివచరణ్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ డీపీఆర్‌ఓ స్వర్ణలత, ఐఅండ్ పీఆర్ అధికారి నాగాంజలి, ప్రముఖ జర్నలిస్టు సత్యేంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి శ్రీవారి లడ్డూల విక్రయాలు

కాచిగూడ: తిరుమల శ్రీవారి లడ్డూ జారీలో తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చిందని హిమాయత్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ ప్రభు, ఎన్.నిరంజన్ కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల శ్రీవారి భక్తులకు పవిత్రమైన లడ్డూ ప్రసాదం వారాంతంలో రూ.50కే ప్రతిరోజూ అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తాజాగా తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు గురువారం నుంచి మళ్లీ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్ ఆలయాల్లో లడ్డూలను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

9న నేతన్నలకు ఆర్థిక సాయం

హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి

నాంపల్లి: హైదరాబాద్ పబ్లిక్‌గార్డెన్స్‌లోని తెలుగు లలితా కళాతోరణం ప్రాంగణంలో ఈ నెల 9న నేతన్నలకు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్ బుధవారం తెలుగు లలిత కళాతోరణం ప్రాంగణాన్ని సందర్శించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, మెహిదీపట్నం సర్కిల్-12 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర రావుతో కలిసి వేదికను పరిశీలించారు. సభా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం చేతుల మీదుగా చెక్కుల పంపిణీ ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మధ్యమండలం డీసీపీ అక్షాంశ్ యాదవ్, అదనపు డీసీపీ ఆనంద్, చేనేత, సాంస్కృతిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అమీర్‌పేట్ హెచ్ఎండీఏ కార్యాలయంలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లో అధికారులు, సిబ్బందికి బుధవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

'బాధితులకు న్యాయం చేయాలి'

పంజగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి చెందిన మండి శ్రీనివాస్ యాదవ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాములు యాదవ్‌తోపాటు నారాయణపేట జిల్లా మద్దూరు మండలం చింతల్‌దిన్నె గ్రామానికి చెందిన బాధితులైన మండి బసమ్మ, బీరప్ప యాదవ్ దంపతులు మాట్లాడారు. గ్రామంలో 25 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలాన్ని అగ్రకులానికి చెందిన పల్లె చిన్న అనివిరెడ్డి, పల్లె వెంకటరెడ్డి, పల్లె బుగ్గారెడ్డి, పల్లె రాజశేఖర్ రెడ్డి, పల్లె రాజిరెడ్డి, పల్లె విష్ణువర్ధన్ రెడ్డిలు సదరు భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అడ్డుకోబోయిన తమపై దాడి చేశారని పేర్కొన్నారు. ఆర్మీజవాన్ అయిన తమ కుమారుడు శ్రీనివాస్ యాదవ్‌పై హత్యాయత్నం చేశారని ఆరోపించారు. తమ కుమారుడు హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆసుపత్రిలో 10 రోజులుగా చికిత్స పొందుతున్నారని తెలిపారు. పోలీసులు నిందితులపై చిన్న కేసు నమోదు చేసి వదిలేశారని ఆరోపించారు.

కంటోన్మెంట్‌కు ఊరట

- అదనంగా ఒక ఎంజీడీ నీటి సరఫరా
- నిర్ణయం తీసుకున్న జలమండలి ఎండీ



ఎమ్మెల్యే శ్రీగణేశ్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ చర్చలు

సాక్షి, సిటీబ్యూరో/కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డుకు ప్రస్తుతం అందిస్తున్న నీటికి తోడు అదనంగా ఒక ఎంజీడీల నీటిని సరఫరా చేసేందుకు జలమండలి సిద్ధమైంది. బుధవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్‌తో పాటు బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, సీఈ రాజ్ కుమార్, ఉన్నతాధికారులతో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి భేటీ అయ్యారు. కొంత కాలంగా కంటోన్మెంట్ ప్రాంతానికి సరిపడా నీరు సరఫరా కావడం లేదని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అదనపు నీటి సరఫరాకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన జలమండలి చర్యలకు ఉపక్రమించింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సుమారు 40 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. రోజువారీగా 5.9 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా అదనంగా ఏయే ప్రాంతాల్లో ఎంత నీరు సరఫరా పెంచే విషయమై వారితో చర్చించారు. సాధ్యాసాధ్యాల్ని పరిశీలించిన అనంతరం.. ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు కాకుండా.. అదనంగా ఇంకో ఎంజీడీ నీటిని సరఫరా చేసేందుకు హామీ ఇచ్చారు. దీంతో కంటోన్మెంట్ ప్రాంతానికి ఇక నుంచి మొత్తం 6.9 ఎంజీడీల నీరు జలమండలి సరఫరా చేయనుంది. ఇప్పటికే వారం రోజులుగా 0.54 ఎంజీడీల నీరు అందిస్తుండగా.. మిగిలిన 0.46 ఎంజీడీల నీటిని మరో మూడు నాలుగు రోజుల్లో సరఫరా చేస్తామని ఎండీ తెలిపారు.

నిల్వ సామర్థ్యం పెంపు

కంటోన్మెంట్ బోర్డు పంపిణీ వ్యవస్థతో పాటు నిల్వ సామర్థ్యం మెరుగుపర్చుకోవాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. కంటోన్మెంట్ పరిధిలో ఉన్న నల్లా అక్రమ కనెక్షన్‌లపై సర్వే చేసి వాటిని రెగ్యులర్ చేసుకోవాలన్నారు. జలమండలి.. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి నీరు సరఫరా చేస్తున్నందున నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని చెప్పారు. ఇన్‌లెట్‌ల వద్ద వాటర్‌ఫ్లో మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించగా.. బోర్డు అధికారులు అందుకు సుముఖత వ్యక్తం చేశారు.

హాస్టళ్లలో పరిశుభ్రత లోపిస్తే కఠినచర్యలు

- ముషీరాబాద్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో కలెక్టర్ తనిఖీ
- జమిస్తాన్‌పూర్, అడ్డగుట్ట ఎస్సీ హాస్టల్ వార్డెన్, ఏఎస్‌డబ్ల్యూవోకు నోటీసులు



భోలక్‌పూర్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్



జమిస్తాన్‌పూర్ హాస్టల్ వార్డెన్ భానుప్రియపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ అనుదీప్

ముషీరాబాద్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను హెచ్చరించారు. బుధవారం ముషీరాబాద్ మండలంలోని జమిస్తాన్‌పూర్, అడ్డగుట్ట ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహాలను కలెక్టర్ తనిఖీ చేశారు. వసతిగృహాల పరిసరాలు, స్టోర్‌రూంలను పరిశీలించారు. రిజిస్టర్‌లు, కిచెన్ రూమ్‌లను తనిఖీ చేశారు. పిల్లలకు సన్న బియ్యంతో కూడిన నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. భారీ వర్షాల వల్ల వాతావరణంలో మార్పు వచ్చినందున పిల్లలకు జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వసతిగృహ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో జమిస్తాన్‌పూర్ హాస్టల్ సంక్షేమ అధికారి భానుప్రియ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి శాంతి, అడ్డగుట్ట ఏఎస్‌డబ్ల్యూవో గట్టు మల్లుకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్, ఆర్ఐ సుభాష్ పాల్గొన్నారు.

నేడు ఖైరతాబాద్ గణపతికి 'నేత్రోనిలనం'



ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో 70 అడుగుల ఎత్తున మట్టితో రూపుదిద్దుకున్న శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి తయారీ పనులు పూర్తికావడంతో గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య మహాగణపతి నేత్రోనిలనం(కళ్లు తెరిచే) కార్యక్రమం ఉంటుందని ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్‌రాజ్ తెలిపారు. ఈ సంవత్సరం మహాగణపతి తయారీ పనులు కేవలం 60 రోజులు ముందు ప్రారంభమైనా శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ నేతృత్వంలో రెండు షిఫ్టులుగా 150 మంది కార్మికులు పనిచేసి పూర్తి చేశారని పేర్కొన్నారు. వినాయక చవితికి రెండు రోజుల ముందే భక్తులకు దర్శనమిచ్చేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. గురువారం ఉదయం మహాగణపతికి నేత్రోనిలనం చేయడం ద్వారా ప్రాణప్రతిష్ఠ చేసినట్లు అవుతుందని శిల్పి తెలిపారు.

టైప్-1 మధుమేహుల ఆయుష్షు తగ్గే ప్రమాదం

డాక్టర్ బిపిన్ సేథీ



లక్డీకాపూల్: టైప్-1 మధుమేహంతో బాధపడుతున్న వ్యక్తుల జీవన ప్రమాణం పదేళ్ల వరకు తగ్గిపోయే ప్రమాదం ఉందని ప్రముఖ మెడిసిన్, ఎండోక్రైనాలజీ నిపుణులు డాక్టర్ బిపిన్ సేథి అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో సనోఫి ఇండియా సంస్థ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టైప్-1 మధుమేహం ఉన్నవారి శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి నిలిచిపోతుందని, ప్రత్యామ్నాయంగా బయట నుంచి ఇంజక్షన్ రూపంలో ఇన్సులిన్‌ను అందించాల్సి ఉంటుందన్నారు. రీసెర్చ్ సొసైటీ ఫర్ ది స్టడీ ఆఫ్ డయాబెటీస్ ఇన్ ఇండియా(ఆర్ఎస్ఎస్‌డీఐ), సనోఫి ఇండియా లిమిటెడ్(ఎస్ఐఎల్)లు సంయుక్తంగా సోషల్ ఇంపాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా దేశంలో 1,400 మంది పిల్లలకు ఇన్సులిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో తెలంగాణ నుంచి 72 మంది ఉన్నారన్నారు. జువెనైల్ ఇన్సులిన్ డయాబెటిక్‌తో బాధపడేవాళ్లు మధుమేహ నిర్వహణలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, సరైన శిక్షణ పొందిన వైద్యులు, పోషకాహార నిపుణులు, ఇతర సహాయక సిబ్బంది లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. నిర్ణీత ప్రమాణాల కంటే అధిక బరువు ఉండేవారిలో టైప్ -2 మధుమేహం వచ్చే అవకాశాలు ఉన్నాయని డాక్టర్ బిపిన్ పేర్కొన్నారు.

చట్టసభలో సమస్యలు లేవనెత్తుతా: కోదండరాం



త్యాగరాయగానసభలో కోదండరాంను గజమాలతో సత్కరిస్తున్న నేతలు



లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి ప్రారంభమైన స్వాగత ర్యాలీలో కోదండరాం తదితరులు

చిక్కడపల్లి: ఎమ్మెల్సీ పదవిని బాధ్యతగా భావిస్తానని, తెలంగాణ ప్రజల సమస్యలను చట్టసభల్లో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ జన సమితి(టీజేఎస్) అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య ఆధ్వర్యంలో ఆత్మీయ పౌర సన్మానసభ బుధవారం త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ పదవి అనేది సాధనమే కానీ, అదే అంతిమ లక్ష్యం కాదన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటానన్నారు. ప్రజల కోసం జీవితాలను అంకితం చేసిన రాంమనోహర్ లోహియా, కర్పూరీ ఠాకూర్, గుమ్మడి నర్సయ్య లాంటి మహనీయులు తనకు ఆదర్శమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం అన్ని వర్గాలు, సమూహాలు, ఉద్యమకారులతో కలిసి ఎప్పటిలాగే పనిచేస్తానని పేర్కొన్నారు.

కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు..

అంతకుముందు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్ట మైసమ్మ దేవాలయంలో కోదండరాం పూజలు నిర్వహించారు. అనంతరం త్యాగరాయ గానసభ వరకు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు బద్రుద్దీన్, రామచందర్, మానేపల్లి లక్ష్మణ్, ఎస్.సురేష్‌కుమార్, చంద్రశేఖర్, అధికార ప్రతినిధి నాకోటి రవికాంత్, ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విలీన పంచాయతీల రికార్డులు స్వాధీనం

- కీసరలో రాత్రివేళ విధుల నిర్వహణపై విచారణ
- అక్రమంగా ఇళ్ల అనుమతి, నంబర్లు జారీ చేసిన వారిపై వేటు?



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న 51 గ్రామ పంచాయతీలను సమీప పురపాలక సంఘాల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిన నేపథ్యంలో ఆ గ్రామ పంచాయతీలకు సంబంధించిన కీలకమైన రికార్డులను ఆయా జిల్లాల పంచాయతీ శాఖలు స్వాధీనం చేసుకున్నాయి. నగర శివారు మూడు జిల్లాల పరిధిలోని 13 పురపాలక సంఘాల పరిధిలో 51 గ్రామ పంచాయతీలు విలీనం కాగా, ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఏడు పురపాలక సంఘాల్లో 28, రంగారెడ్డి జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 12, సంగారెడ్డి జిల్లాలోని రెండు పురపాలక సంఘాల్లో 11 గ్రామ పంచాయతీలను కలిపారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిన నేపథ్యంలో విలీన గ్రామపంచాయతీల్లో ఉన్న కీలకమైన పర్మిషన్, తీర్మానం, మినిట్స్, చెక్‌బుక్‌లకు సంబంధించిన రికార్డులను ఆయా జిల్లా పంచాయతీ శాఖలు తమ అధీనంలోకి తీసుకున్నాయి.

కీసర ఉదంతంపై..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని దమ్మాయిగూడ పురపాలక సంఘంలో విలీనమైన కీసర గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రాత్రి 10 గంటల వరకు విద్యుత్తు లైట్లు వేసుకుని సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహించారు. ఈ విధినిర్వహణలో భాగంగా పాత తేదీలతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పలు అక్రమ అనుమతులు, ఇంటి నంబర్లు జారీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయమై 'సాక్షి'దినపత్రికల్లో బుధవారం 'సమయం లేదు ..మిత్రమా..'అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా అధికార యంత్రాంగం జిల్లా పంచాయతీ శాఖకు చెందిన ఒక అధికారిని విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే జిల్లా పంచాయతీ శాఖ పురపాలక సంఘాల్లో విలీనమైన మేడ్చల్ జిల్లాలోని 28 గ్రామ పంచాయతీలకు చెందిన పర్మిషన్, తీర్మానం, మినిట్స్, చెక్‌బుక్‌లకు సంబంధించిన కీలకమైన రికార్డులను స్వాధీనం చేసుకుంది. కీసర గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రాత్రి 10 గంటల వరకు సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించి విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో పలువురిపై వేటు వేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

వీడని వర్షం



బంజారాహిల్స్‌లో..



సాక్షి, సిటీబ్యూరో: నగరాన్ని వర్షం వీడటం లేదు. బుధవారం సాయంత్రం చిరుజల్లులతో తేలిక పాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం కారు మబ్బులతో వర్ష సూచన కనిపించినా..కొద్ది పాటి చినుకులకు పరిమతమైంది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత భారీ వర్షం కురిసింది. అత్యధికంగా బేగంపేటలో సుమారు 8.7 సెంటీమీటర్ల వర్ష పాతం నమోదైంది. సరిగ్గా గంట పాటు కుండపోత వర్షం కురిసింది. కాప్రా, చర్లపల్లిలో 7.4, అల్వాల్‌లో 6.0, ఉప్పల్‌లో 5.9, మల్లాపూర్‌లో 5.8, ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో 5.6, జీడిమెట్ల 5.3, సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నగరంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. సికింద్రాబాద్, బంజారాహిల్స్, శేరిలింగంపల్లి, రాయదుర్గం, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, చందానగర్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, కూకట్‌పల్లి, బాలానగర్ ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది.

సరిగా వెయిట్ లిఫ్ట్ చేస్తున్నానా? ఒక చేతితో చేసిన రిపిటీషన్స్ స్థాయిలో రెండో చేతితో చేయలేకపోతున్నానెందుకు? ట్రెడ్‌మిల్ మీద ఫుట్ వర్క్ సరిగానే ఉందా? డైట్‌లో మార్పు చేర్పులెలా చేయాలి? ఒకటా రెండా.. జిమ్‌లో ఎక్సర్‌సైజెస్‌తో పాటు ఎన్నో డౌట్స్ కూడా వెంటాడుతాయి. వీటన్నింటికీ సమాధానాలు వర్కవుట్ చేసే మిషన్ చేతే చెప్పిస్తూ.. వినియోగించే టాప్ ఎక్విప్‌మెంట్ స్టార్ క్రికెటర్ విరాట్ కొహ్లి నుంచి సూపర్‌స్టార్ మహేష్‌బాబు దాకా అందరూ వినియోగించే ఎక్విప్‌మెంట్‌ని దక్షిణాదిలోనే అతిపెద్ద హైటెక్ ఫిట్‌నెస్ సెంటర్.. ఐ జిమ్‌లో అందుబాటులోకి తెచ్చారు. – సాక్షి, సిటీబ్యూరో







ఐ జిమ్‌లో వర్కవుట్ చేస్తున్న మిస్టర్ యూనివర్స్ 2023 బ్రాంకో టియోదోరోవిక్..



హైదరాబాద్ వైబ్స్

- జిమ్‌లో ఏదైనా వర్కవుట్ కోసం ఒక మిషన్ మీద కూర్చునే ముందు దాన్ని మన హైట్‌కు తగ్గట్టుగా మనం సెట్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ కొన్ని మిషన్స్ మనం కూర్చోగానే వాటికవే మన హైట్‌కు తగ్గట్టు హెచ్చుతగ్గులు సెట్ చేసుకుంటాయి.
- మనకు ఓ పార్క్‌లోనో, గ్రౌండ్‌లోనో రన్నింగ్ వాకింగ్ చేసే అలవాటు ఉంటే.. ఈ జిమ్‌లో ట్రెడ్‌మిల్ మీద మీరు వాక్, రన్ చేస్తుంటే.. అచ్చం అదే పార్క్ లేదా గ్రౌండ్‌లో చేసినట్టే ఫీల్ వస్తుంది. అక్కడ ఎత్తు పల్లాలతో సహా ఇక్కడా అదే విధమైన ఫీల్ వస్తుంది.
- మిషన్స్‌కి మొబైల్ ఫోన్‌లోని ఒక యాప్‌కి అనుసంధానం చేసి ఉంటుంది. ఆ యాప్‌లో రోజువారీగా మన వర్కవుట్ విశ్లేషణతో పాటు వారానికి, నెలకోసారి కూడా వర్కవుట్ ఎనాలసిస్ మనకు అందుతుంది. తద్వారా మన వ్యాయామ తీరుతెన్నులు ఎలా ఉన్నాయి? మజిల్ స్ట్రెంగ్త్‌లో వచ్చిన మార్పులు, లోపాలు, బలాలు అన్నీ తెలుస్తాయి.
- డైటీషియన్స్ కూడా నిత్యం యాప్ ద్వారా టచ్‌లో ఉంటారు. మనం ఏ టైమ్‌కి ఏం తినాలి ఏం తింటున్నాం అనేది పర్యవేక్షిస్తుంటారు. ఒకవేళ సూచించిన డైట్‌ని మనం ఏ రోజైనా ఏ కారణం చేతనైనా ఫాలో అవలేకపోతే దానికి ప్రత్యామ్నాయం కూడా అందిస్తారు.

సర్‌ప్రైజింగ్‌గా మారుతున్న సిటీ ‘ఫిట్’సీన్..

అత్యాధునిక పరికరాల్లో పోటాపోటీ

ఇంటర్నెట్ నుంచి ఏఐ దాకా మేళవింపు

దక్షిణాదిలో అతి పెద్ద హైటెక్ జిమ్ సిటీలో ఏర్పాటు

ఫిట్ టెక్నిక్

హిట్ ఫిజిక్

పరుగు/నడక చేసే క్రమంలో బర్న్ అవుతున్న కేలరీలు, అధిగమిస్తున్న దూరాలు, హార్ట్ బీట్.. వంటివి చూపించే ట్రెడ్‌మిల్ ఫిట్‌నెస్ లవర్స్‌కి తెలుసు. కానీ ఆ టైమ్‌లో మనం చేస్తున్న తప్పులేంటి?సరిచేసుకునే చిట్కాలేంటి? అది కూడా ట్రెడ్‌మిల్ స్వయంగా తానే చెబుతూ మన వాక్, జాగ్, రన్‌లో లోపాలు చూపించే/సరిచేయించే ట్రెడ్‌మిల్? తెలుసా? ప్రపంచ ప్రసిద్ధి చెందిన జిమ్ ఎక్విప్‌మెంట్ తయారీ బ్రాండ్ టెక్నో అందించే అద్భుతాల్లో అదో చిరు ఉదాహరణ మాత్రమే. ఇటీవల నగరంలోని గచ్చిబౌలిలో ఏర్పాటైన అత్యాధునిక ఐజిమ్.. టెక్నో పరికరాల టెక్నికల్ వండర్స్‌కు అద్దం పడుతోంది.

మరెన్నో అత్యాధునిక ఫీచర్లు..

పారిస్ ఒలింపిక్స్‌లో ఏర్పాటు చేసిన ఒలింపిక్స్ విలేజ్‌లో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా జిమ్ కూడా సెట్ చేశారు. ఆ జిమ్‌లో అత్యాధునిక హైటెక్ పరికరాలను అందుబాటులో ఉంచారు. పూర్తిగా టెక్నాలజీతో అనుసంధానమైన ఈ జిమ్ దాదాపుగా 15వేల చదరపు అడుగుల్లో దక్షిణాదిలోనే అతిపెద్ద జిమ్ కమ్ కేఫ్ ఇది. ఈ జిమ్‌లో పరికరాలకు ఇంటర్నెట్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కూడా అనుసంధానించారు. వాకింగ్ చేస్తూ ఇష్టమైన వెబ్‌సిరీస్ చూడటం దగ్గర్నుంచి చాట్ చేయడం దాకా అన్నీ వర్కవుట్ మెషిన్లతోనే కానిచ్చేయవచ్చు. దాదాపుగా మెషిన్లన్నీ మన శరీరంతో కనెక్ట్ అవుతాయి. వర్కవుట్‌లో మంచి చెడుల్ని విశ్లేషిస్తాయి. చేస్తున్న విధానంలోని తప్పొప్పులు చెబుతాయి.. ఉదాహరణకు ట్రెడ్ మిల్ మీద జాగింగ్ చేస్తుంటే.. మన లెఫ్ట్ లెగ్ బాగా పనిచేస్తోందా? లేక రైట్ లెగ్ బాగా పనిచేస్తోందా? నీ స్టెప్ లెంగ్త్ ఎంత? ఫుట్ వర్క్ కరెక్ట్‌గా పడుతుందా లేదా అనే సూక్ష్మస్థాయి అంశాలు కూడా తెలియజేస్తాయి. మిషన్‌కు అమర్చిన స్క్రీన్‌లో ఒక మనిషి వర్కవుట్ చేస్తూ మనతో చేయిస్తాడు. ఇవన్నీ చిన్న చిన్న ఉదాహరణలు మాత్రమే.. మరెన్నో అత్యాధునిక ఫీచర్లు వీటి సొంతం.





కంట్రీలోనే బెస్ట్..

“సిటీలో పెద్ద పెద్ద జిమ్స్‌లో నేను వర్కవుట్ చేశాను. ఆ అనుభవంతోనే అన్నింటికన్నా ది బెస్ట్ ఏర్పాటు చేయాలనుకున్నా. వ్యయ ప్రయాసలకు ఓర్చుకుని చాలా టైమ్ తీసుకుని దీన్ని తీర్చిదిద్దాను. బయోమెకానిక్స్, బాడీ మైండ్ కనెక్షన్ వంటి ఫీచర్లతో దేశంలో ఎక్కడా ఇలాంటి జిమ్ లేదని ప్రశంసలు అందుకుంటోంది. ఇండియాలో చూడడానికి కూడా కనపడని ఏఐ ఆధారిత మెషిన్లను ఇటలీలో నెలల తరబడి అన్వేషించి తీసుకొచ్చాం. మిస్టర్ యూనివర్స్ బ్రాంకో మన సిటీకి వచ్చి మా జిమ్‌లో వర్కవుట్ చేసి, మాది బెస్ట్ జిమ్ అని ప్రశంసించారు.”

– వంశీరెడ్డి, ఐ జిమ్







హైలైఫ్.. ఎగ్జిబిషన్

ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు కొనసాగనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి సీరత్‌కపూర్, నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 350 మంది డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రముఖ డిజైనర్లు, మోడల్స్ తదితరులు పాల్గొన్నారు. – మాదాపూర్

AI టీచ్.. అధ్యాపకుల ఆసక్తి..

- ఓ అధ్యయనంలో వెల్లడి
- ఇప్పటికే వినియోగిస్తున్న వారు 41శాతం



నేడు టీచర్స్ డే..

సాక్షి, సిటీబ్యూరో: ఉన్నత విద్యాబోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారం తీసుకోవడంపై 93శాతం మంది అధ్యాపకులు ఆసక్తిగా ఉన్నారని డిజీ సంస్థ అధ్యయనం తేల్చింది. ఉన్నత విద్యకు ఉపకరించే ‘సాస్’ రూపకల్పనకు పేరొందిన డిజీ.. మన హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, ఢిల్లీలలోని ఉన్నత విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులతో ఈ సర్వే చేసి, 93% మంది ఫ్యాకల్టీ సభ్యులు ఏఐ వారి బోధనా నైపుణ్యాన్ని గణనీయంగా పెంచుతుందని విశ్వసిస్తున్నట్లు వెల్లడించింది. దాదాపు 41% మంది ఫ్యాకల్టీ సభ్యులు తమ బోధనలో ఇప్పటికే ఏఐని ఉపయోగిస్తున్నారని, వీరిలో అత్యధికులు కంటెంట్ సృష్టి కోసం, మరికొందరు అసెస్‌మెంట్‌లను రూపొందించడానికి, 28.4%మంది పర్యవేక్షణ హాజరు కోసం, 24.4% మూల్యాంకనాలను నిర్వహించడానికి 22.5% మంది అభిప్రాయాన్ని రూపొందించడానికి ఏఐ ఉపయోగిస్తున్నారని తేల్చింది. ఇటీవలే తాము డీఐజీఐఐఏఐ అనే కొత్త ఉత్పాదక ఏఐ సాధనాన్ని పరిచయం చేశామని హాజరు ట్రాకింగ్, క్లాస్ షెడ్యూల్ తయారీ, డాక్యుమెంటేషన్, అసెస్‌మెంట్ క్రియేషన్ మూల్యాంకనం వంటి పనులను క్రమబద్ధీకరించడానికి ఇది ఉపకరిస్తుందన్నారు.

వీ హబ్‌తో వాధ్వాని ఒప్పందం





సాక్షి, సిటీబ్యూరో: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే క్రమంలో వీ హబ్ కార్యక్రమాలకు మద్దతు అందించేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని చేసుకున్నట్లు వాధ్వాని ఫౌండేషన్ ప్రకటించింది. ఈ ఒప్పందం సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో వాధ్వాని ఫౌండేషన్ సీఈఓ సంజయ్‌షా మాట్లాడుతూ ఇప్పటి వరకు, వీ హబ్ మద్దతుతో 6 వేల మంది మహిళలు తమ వ్యాపారాలను విజయవంతంగా ప్రారంభించి, అభివృద్ధి చేసుకున్నారన్నారు. తమ ఇరు సంస్థలు కలిసి మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లను ముందుకు నడిపించడానికి అంకితభావంతో కృషి చేస్తామన్నారు. మహిళలు పోటీ ప్రపంచంలో రాణించడానికి విస్తరించడానికి వారికి సాధనాలను సమకూర్చుతామని చెప్పారు. సమావేశంలో వీ హబ్ సీఈఓ సీతా పల్లచోళ్ల మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు పైగా విస్తరించడం ద్వారా వాధ్వాని ఫౌండేషన్ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలను గణనీయంగా ప్రభావితం చేసిందని, స్థిరమైన సామాజిక-ఆర్థిక మార్పుకు దోహదం చేసిందన్నారు. అలాంటి ఫౌండేషన్‌తో భాగస్వామ్యం మహిళలను వృద్ధి పథంలోకి చేర్చే తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రెండు సంస్థలు కలిసి రూపొందించిన కార్యక్రమాల ద్వారా మహిళల-నేతృత్వంలోని వ్యాపారాలను ప్రారంభించేందుకు దోహదం చేస్తామని, అదేవిధంగా మహిళా వ్యాపారవేత్తలు తమ స్టార్టప్ ప్రయాణంలో ఎదుర్కొనే క్లిష్టమైన సవాళ్లను పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని వాధ్వాని ప్రతినిధులు తెలిపారు. వీ ఎంగేజ్ - స్పార్క్ (ఎర్లీ స్టేజ్) ప్రోగ్రామ్, వీ ఎంగేజ్ - ప్రొపెల్ (ఎర్లీ-ట్రాక్షన్ స్టేజ్)లు విజయవంతంగా అమలయ్యేలా చూస్తాయన్నారు.

మిల్లెట్స్ ఈట్ బన్



సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక రుచులకు పేరొందిన వెస్ట్‌లైఫ్ ఫుడ్‌వరల్డ్ ఆధ్వర్యంలోని మెక్‌డొనాల్డ్స్ ఇండియా ఆరోగ్యకరమైన రుచుల ఉత్పత్తుల్లో భాగంగా మల్టీ-మిల్లెట్ బన్‌ను విడుదల చేసింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సీఎస్ఐఆర్ -సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ)లతో భాగస్వామ్యంతో ఇకపై ఈ తరహా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించనున్నట్లు మెక్‌డొనాల్డ్స్ నగర ప్రతినిధులు తెలిపారు. తమ కొత్త మల్టీ-మిల్లెట్ బన్‌లో పోషకాలు అధికంగా ఉండే సజ్జలు, రాగి, జొన్నలు, వరిగెలు, అరికెలు వంటి చిరు/తృణధాన్యాలు కలిపి ఉంటాయని, వీటిని గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి సేకరించామన్నారు. మారుతున్న ఆహార ప్రాధాన్యతలకు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మిల్లెట్ వంటి ఆరోగ్యకరమైనవి కలపడంపై దృష్టి సారించి ప్రత్యేక మెనులను రూపొందించనున్నామని, ఇవి కృత్రిమ రంగులు, కృత్రిమ రుచులు, కృత్రిమ ప్రిజర్వేటివ్‌ల రహితంగా ఉంటాయన్నారు.

మట్టి గణపతి.. పర్యావరణ హితం

– ప్రముఖ సినీనటి రీతూవర్మ



వెంగళరావునగర్: ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే ప్రతిష్ఠించుకోవాలని ప్రముఖ సినీనటి రీతూవర్మ అన్నారు. శ్రీకృష్ణానగర్‌లోని శ్రీవాసవీ యువజన సేవా సంఘం నేతలు బుధవారం ఆమెను కలిసి మట్టి గణపతిని అందజేశారు. శ్రీకృష్ణానగర్‌లో శ్రీబాల వినాయక మట్టిగణపతి మంటపానికి పూజకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను మట్టి గణపతినే పూజిస్తానన్నారు. పుట్టా రామకృష్ణ, బుజ్జి, మహేష్, భరత్, నవీన్, సూర్యారావు, దిలీప్, యతిరాజు, సాయి ఉన్నారు.

వీకెండ్ వచ్చిందంటే చాలు.. నగరంలో జోష్ అంతా ఇంతా కాదు. సినిమాలు, షాపింగ్, గేమింగ్, క్లబ్‌లు, పబ్‌లు.. ఇలా వినోదానికి ఎన్నో విలాస కేంద్రాలు. వీటికి తోడు ట్యాంక్ బండ్ మొదలు హైటెక్ సిటీ వరకు ఫుడ్, ఫ్యాషన్ అంటూ ఎన్నెన్నో వ్యాపకాలు.. కానీ ప్రస్తుతం నగర యువత మెల్లిగా తమ పంథాను మార్చుకుంటోంది. ఏదో ఒక కళలో ప్రావీణ్యం కోసం ప్రయత్నిస్తోంది. విభిన్న ఆర్ట్స్‌పైన శిక్షణనందించే వేదికల వైపు అడుగులేస్తోంది. అది పెయింటింగ్, క్రాఫ్టింగ్, డ్యాన్సింగ్, పాటరీ, మ్యూజిక్, ఫ్యాషన్, స్పోర్ట్స్.. ఇలా పలు కళలపైన ఆసక్తి చూపిస్తున్నారు. ఔత్సాహికుల అభిరుచికి అనుగుణంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో నిర్వాహకులు కూడా వారాంతాల్లో విభిన్న వర్క్‌షాప్స్ ఏర్పాటు చేస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో



వీకెండ్ ఆర్ట్..

వారాంతాల్లో కళాత్మకతకు పదును

- ఆసక్తి చూపిస్తున్న నగర యువత
- సాహిత్యం, పెయింటింగ్, పాటరీ, యాక్టింగ్
- తదితరాల్లో శిక్షణకు కేంద్రాలు..
- ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

పాటరీ వర్క్‌షాప్స్..

ఈ మధ్య కాలంలో పాటరీ వర్క్‌షాప్స్ బాగా ఆదరణ పొందుతున్నాయి. మెత్తని మట్టితో చిన్న చిన్న కళాకృతమైన కుండలు, బొమ్మలు, ఇంట్లో అలంకార వస్తువులను తయారు చేయడంపై శిక్షణ అందిస్తారు. గ్రామీణ మూలాల్లోంచి కొనసాగుతున్న కళ కావడం, అంతేగాకుండా ఈ పాటరీకి ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ఆదరణ ఉండటంతో ఈ వర్క్‌షాప్స్‌కు ఔత్సాహికులు నిండిపోతున్నారు. తయారు చేసే సామాగ్రి, పనిముట్లు తదితరాలను నిర్వాహకులే సమకూరుస్తున్నారు.

మ్యూజిక్ సైన్స్..

సంగీతాన్ని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తి కాదేమో.. అయితే.. ఈ సంగీతాన్ని ఆస్వాదించడం పోయి వాయించడం అభిరుచిగా మార్చుకుంటున్నారు నగరవాసులు. గిటార్, వయోలిన్, డ్రమ్స్, ఫ్లూట్ ఇలా ఏదో ఒక సంగీత వాయిద్యంపై పట్టు పెంచుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఓ వైపు ఐటీ జాబ్స్ చేస్తూనే ఇలాంటి ఆర్ట్స్‌పై అవగాహన పెంచుకుంటూ మ్యూజిక్ బ్యాండ్స్‌లో సైతం సభ్యులుగా మారుతున్నారు. వీటి శిక్షణ కోసం పలు సంగీత శిక్షణ కేంద్రాలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖా ఆధ్వర్యంలోని కేంద్రాలు సైతం ఉన్నాయి.

థియేటర్ ఆర్ట్స్..

కొంతకాలంగా సిటీలో థియేటర్ ఆర్ట్స్‌కు ఔత్సాహికుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. నటనలో, నాటకాల్లో శిక్షణ పొందుతూ.. థియేటర్ ప్లేలు ప్రదర్శిస్తూ వినూత్న ఒరవడికి నాంది పలుకుతున్నారు. వీటి కోసం రవీంద్రభారతి, తెలుగు యూనివర్సిటీ కళాప్రాంగణం, రంగభూమి వంటి వేదికలు అవకాశాలను కల్పిస్తున్నాయి. రంగస్థలంపై రాణించిన యువతకు సినిమాల్లో అవకాశాలు సైతం వస్తుండటంతో థియేటర్ ఆర్ట్స్ మోడ్రన్ యాక్టివిటీగా మారింది. అన్ని రంగాల్లో జాబ్స్ చేస్తున్న వారు ఇందులో భాగస్వామ్యం అవుతుండటం విశేషం.



గార్డెనింగ్.. మోడ్రన్ ఆర్ట్..

ఈ మధ్య మొక్కలు పెంచడం కూడా ఓ కళగా మారింది. ఇందులో ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్, టెర్రస్ గార్డెనింగ్ అంటూ విభిన్న రకాలుగా ఉన్నాయి. నగరంలోని కొందరు మొక్కల ప్రేమికులు సోషల్ యాప్స్‌లో గ్రూపులుగా మారి ఈ గార్డెనింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ముఖ్యంగా నగర జీవనశైలి దృష్ట్యా టెర్రస్ గార్డెనింగ్ ఔత్సాహికులు వేల సంఖ్యలో ఉన్నారు. వీరంతా ప్రత్యేకంగా మీట్స్ ఏర్పాటు చేసుకుని మొక్కలను, వాటి విత్తనాలను ఒకరికొకరు పంచుకుంటున్నారు. ఇదే వేదికలుగా ప్లాంటేషన్‌పై అనుభవజ్ఞులు, నిపుణులచే అవగాహన పొందుతున్నారు. నిత్యం ఒత్తిడి పెంచే సిటీ లైఫ్‌లో గార్డెనింగ్ అనేది వినూత్న కళగా అవతరించింది. ఇవేకాకుండా పెయింటింగ్, రెసిన్ ఆర్ట్స్, హ్యాండ్ క్రాఫ్ట్, పేపర్ క్రాఫ్ట్, మైక్రో ఆర్ట్స్, జుంబా వంటి విభిన్న కళా అంశాలపై శిక్షణ పొందుతూ తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు. వారి కళాత్మకతను సోషల్ మీడియా వేదికగా రీల్స్, షేర్లు, పోస్టులతో ప్రమోట్ చేసుకుంటూ సోషల్ సెలబ్స్‌గా మారుతున్నారు.

అత్యధికం

ఆకలి చావులే!

విజయవాడలో పదుల సంఖ్యలో వెలుగు చూస్తున్న మృతదేహాలు ● మొన్న 32.. నిన్న 15.. మొత్తం 47

వాంబే కాలని నుంచి సాక్షి ప్రతినిధి/ సాక్షి నెట్‌వర్క్ : వాంబే కాలనీ జీ బ్లాక్.. నాలుగు రోజులుగా వరద నీరు చుట్టుముట్టింది.. బయటకు వచ్చే అవకాశమే లేదు.. ఇంట్లో ఉన్న సరుకులన్నీ అయిపోయాయి.. చాలా మందికి తినడానికి తిండి ఏమీ లేదు.. వీరిలో 78 ఏళ్ల రాజశేఖర్ అనే వృద్ధుడు కూడా ఒకరు.. పాస్టర్‌గా పని చేస్తున్న ఇతను తన భార్య కమలమ్మతో కలిసి జీవిస్తున్నాడు.. వయసు పైబడిన ఇద్దరూ పలు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు.. పూట పూటకూ మందులు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.. ఒక్క పూట ఆహారం లేకపోతే షుగర్ స్థాయి తగ్గి నీరసించే వారు.. వరద కారణంగా రెండు రోజుల పాటు ఏమీ తినకుండా ఉండిపోవాల్సి వచ్చింది. కనీసం తాగేందుకు మంచి నీళ్లు లేకుండా లేని దయనీయ స్థితి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఉన్నట్లుండి రాజశేఖర్ తుది శ్వాస విడిచారు. ప్రభుత్వం ఆహారం, నీరు అందించి ఉంటే బతికి ఉండే వారని చుట్టుపక్కల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపులో చిక్కుకుని ఇలా ఎందరో అర్ధంతరంగా తనువు చాలించడం అందరి హృదయాలను కలచి వేస్తోంది. అకలితో చనిపోవటం అనేది ఇటీవలి కాలంలో మన ప్రాంతంలో ఎప్పుడూ విన లేదు. అంధ్ర అన్నపూర్ణగా పిలిచే కృష్ణా డెల్టాలో అకలి చావు సంభవించడం యావత్ రాష్ట్రాన్ని విస్మయానికి గురి చేస్తోంది. మంగళ, బుధవారాల్లో తిండి, నీరు లేక చనిపోయిన వారే ఎక్కువ.

పెరుగుతున్న మరణాల సంఖ్య

వరద తగ్గు ముఖం పట్టే కొద్దీ మృతుల సంఖ్య పెరుగుతోంది. గల్లంతైన వారి లెక్క తేలటం లేదు. బంధువుల అచూకి తెలియక పలువురు అందోళన చెందుతున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా వీరి గోడు మాత్రం అలకించడం లేదు. మంగళవారం వరకు 32 మంది మృతి చెందినట్లు వెల్లడికాగా, బుధవారం మరో 15 మృతదేహాలు వెలుగు చూశాయి. దీంతో మృతుల సంఖ్య 47కు చేరింది. ఇంకా పలు మృతదేహాలు నీటిలో తేలియాడుతున్నాని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నప్పటికీ వాటి లెక్క తేలడం లేదు. కొన్ని ప్రాంతాలకు ఇంకా ఎవరూ వెళ్లలేదు. ఆ ప్రాంతంలో పరిస్థితి ఏమిటో తెలియదు. ఇంకెన్ని శవాలు బురదలో ఉన్నాయోనని పలువురు అందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి బుధవారం సాయంత్రం వరకు 22 మృతదేహాలు వచ్చాయి. 11 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. మరో 11 మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. ఇందులో ఆరు మృతదేహాలు కుళ్లిపోయి, పూర్తిగా గుర్తు పట్టలేని విధంగా ఉన్నాయి.



కేఎల్ రావు నగర్‌లో బాలుడి మృతదేహాన్ని వరద నీటిలో తరలిస్తున్న యువకులు

తమవారి అచూకీ కోసం..

వరదలో చాలా మంది కొట్టుకుపోయారు. నాలుగు రోజులు గడిచినా వారి అచూకీ అభించలేదు. అయితే మార్చురీలో కొన్ని మృతదేహాలు ఉన్నాయనే విషయం తెలియడంతో గల్లంతు అయిన వారి బంధువులు పెద్ద సంఖ్యలో మార్చురీకి క్యూ కట్టారు. 'నాలుగు రోజుల క్రితం మా అన్న పోలినాయుడు పనికి వెళ్లి వస్తూ.. వరదలో కొట్టుకుపోయాడు. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. మా కుటుంబ సభ్యులం, మా ప్రాంత వాసులం వెతుకుతున్నాం. అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాగైతే ఎలా?' అని న్యూరాజరాజేశ్వర రావుపేటకు చెందిన కరుభుక్త సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి. వరద మృత్యురూపంలో కబళించిన వారందరి మృతదేహాలను మార్చురీలో ఉండటంతో తమ వారిని గుర్తించేందుకు వందల సంఖ్యలో ముంపు ప్రాంత ప్రజలు ప్రభుత్వాస్పత్రికి వస్తున్నారు. అక్కడ కుళ్లి ఉన్న తమ వారి మృతదేహాలను చూసి కన్నీరు మున్నీరవుతున్నారు. ఇలా సింగ్‌నగర్, పాయకాపురం, ప్రకాష్‌నగర్ ప్రాంతాలతో పాటు, వైఎస్సార్ కాలనీ ప్రాంతాల నుంచి వస్తున్న వారే ఎక్కువగా ఉన్నారు. డీ కంపోజ్ అయిన మృతదేహాలు చాలా వరకు గుర్తు పట్టలేని స్థితిలో ఉన్నాయి.

చెట్టుకొకరు.. పుట్టకొకరు..

తెల్లారేసరికి ఒక్కసారిగా వరద ముంచేసింది. ఎటు వెళ్లాలో తెలియలేదు. ఇంత ఉధృతంగా ఉంటుందని అస్సలు ఊహించలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేవు. పోనీ వరద ముంచెత్తుతున్నప్పుడైనా బయటకు వద్దామంటే అంత సమయం లేదు. అతికష్టం మీద వచ్చినా ఎక్కడికెళ్లాలో, ఎక్కడుండాలో తెలియదు. సర్కారు ఎలాంటి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇన్ని ఇబ్బందుల మధ్య దిక్కుతోచని స్థితిలో వరద బాధితులు తమ ఇళ్లలోనే ఉండిపోయారు. వారిలో వృద్ధులున్నారు.చిన్న పిల్లలున్నారు. ఆనారోగ్యం పాలైన వారున్నారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నవారున్నారు. వారిని ఎవరూ పట్టించుకోలేదు. కనీసం మందులు సమకూర్చలేదు. తాగునీరు, ఆహారం లేక, ఆకలితో, అనారోగ్యంతో ఎంతో మంది అభాగ్యులు ఇళ్లలోనే ప్రాణాలు విడిచారు. మరికొందరు సాయం కోరేందుకు, అపాయం నుంచి తప్పించుకునేందుకు బయటకు వచ్చి వరద నీటిలో కొట్టుకు పోయారు. అలాంటి వారి మృతదేహాలు చెట్టుకొకటి, పుట్టకొకటిగా వేలాడుతున్నాయి. సింగ్‌నగర్ ప్రాంతంలోని ఇందిరానాయక్ నగర్‌లో మృతదేహం ఉందని స్థానికుల ద్వారా తెలుసుకున్న 'సాక్షి' ఆ సమాచారాన్ని సహాయక చర్యల కోసం వచ్చిన జాతీయ విపత్తు నిర్వహణ బలగాల(ఎన్‌డీఆర్‌ఎఫ్)కు తెలియజేసింది. సాయిబాబా గుడి వీధిలో ఇంటి గోడపై అనాధగా పడి ఉన్న ఓ మృతదేహాన్ని గుర్తించింది. వరద నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో బోటు సాయంతో ఒడ్డుకు చేర్చింది. అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని తరలించారు. ఇలా ఎవరూ గుర్తించని మృతదేహాలు ఆ వరదలో ఇంకా చాలానే ఉన్నాయి. ముంపు కాస్త తగ్గుముఖం పట్టడంతో అవన్నీ ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. అంతిమ యాత్రకు కూడా నోచుకోకుండా, కనీసం బయటకుతీసేవారు లేక చాలా వరకూ కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



ఇందిరానాయక్ నగర్‌లో అయ్యప్పస్వామి గుడి వెనుక నీటిలో తేలియాడుతున్న మృతదేహం

అడుగు కదలని పరిస్థితి...

అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి.. మూడు రోజులుగా మృతదేహం నీళ్లలోనే తేలియాడుతున్న దుస్థితి.. వ్యక్తి గల్లంతై నాలుగు రోజుల గడుస్తున్నా.. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రాధేయపడుతున్నా, అధికారులు.. ప్రభుత్వం నుంచి కనీస సాయం కరువైంది. ద

సీఎంగా అర్హుడివేనా?

చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్ ● విజయవాడ విపత్తుకు ముమ్మాటికి తప్ప బాబుదే

సాక్షి, అమరావతి: సీఎం పదవిలో కూర్చుకోవడానికి అసలు అర్హుడివేనా? అని ఒక్కసారి గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించాలని చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. విజయవాడ విపత్తుకు ముమ్మాటికీ చంద్రబాబు తప్పిదమే కారణమని పునరుద్ఘాటించారు. చేసిన తప్పులకు వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడ వరదలకు ఇప్పటికే 32 మంది బలి అయ్యారని.. ఇంకెందరు చనిపోయారో లెక్క తెలియడం లేదని.. ఆ మరణాలకు పూర్తి బాధ్యత చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. వరద సహాయ చర్యల్లోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడంతో తప్పులు కప్పి పుచ్చుకునేందుకు చంద్రబాబు ఆ నెపాన్ని అధికారులపై నెడుతున్నారని మండిపడ్డారు. నిజానికి అన్ని అనర్థాలకు కారణం చంద్రబాబే అని తేల్చిచెప్పారు. బుధవారం విజయవాడ పాత రాజరాజేశ్వరిపేటలో మోకాలి లోతు నీళ్లలో వైఎస్ జగన్ నడుచుకుంటూ వెళ్లి వరద బాధితులను నేరుగా కలుసుకున్నారు. వారి కష్టాలను విని చలించిపోయారు. తిండి, నీరు లేక మూడు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడని, ఎక్కడికైనా వెళ్లిపోదామంటే కనీసం బోట్లు కూడా ఏర్పాటు చేయలేదని బాధితులు వైఎస్ జగన్ వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. ఆ బాధలు తెలుసుకుని వారిని ఓదార్చి నేనున్నానంటూ వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు.

ముమ్మాటికీ బాబు తప్పిదం వల్లే..

తాను నివాసం ఉంటున్న కరకట్ట అక్రమ నివాసాన్ని కాపాడుకోవడం కోసమే చంద్రబాబు విజయవాడను ముంచారు. చివరకు ఆ ఇల్లు కూడా నీట మునగడంతో కలెక్టర్ ఆఫీస్‌కు మకాం మార్చారు. ప్రజల కోసమే తానక్కడ ఉంటున్నట్లు ప్రచారం చేసుకుంటూ మందీ మార్బలంతో వరద పీడిత ప్రాంతాల్లో హంగామా చేస్తున్నారు. విజయవాడలో విపత్తు కచ్చితంగా మానవ తప్పిదం వల్లే వచ్చింది. బుడమేరు వాగుపై వెలగలేరు రెగ్యులేటర్ గేట్లను ఒకేసారి ఎందుకు ఎత్తాల్సి వచ్చింది? మూడు రోజుల ముందే కాస్త ఎత్తి ఉంటే వరద ఎప్పటికప్పుడు వెళ్లిపోయి ఉండేది కదా? వరదను అలా నియంత్రించి ఉంటే తొలుత డైవర్షన్ ఛానల్, అక్కణ్నుంచి పోలవరం కెనాల్ ద్వారా ప్రకాశం బ్యారేజీ మీదుగా సముద్రంలో కలిసిపోయి ఉండేది. కానీ అలా చేయకుండా వరద ఉధృతి పెరిగాక ఒకేసారి ఎత్తారు. చంద్రబాబు ఇల్లు మునిగిపోకుండా ఉండడం కోసం అలా చేయడంతో ఆ నీరంతా ఒక్కసారిగా నగరాన్ని ముంచెత్తింది. ఇంత దారుణమైన పరిస్థితి నెలకొంటే ఈ పెద్ద మనిషి చంద్రబాబు ప్రజల మీద ఏమైనా కాస్తో కూస్తో కనికరం చూపించాడా? వారిని ఆదుకోవడం కోసం ఏమైనా అడుగులు వేశాడా? ఏ చర్యలైనా తీసుకున్నాడా? అంటే ఏదీ లేదు. విజయవాడలో ఎక్కడికైనా వెళ్లండి.. ఏ కాలనీ అయినా తీసుకోండి. ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఎక్కడా రిలీఫ్ క్యాంపులు లేవు.



తమ కష్టాలు చెప్పుకొని కన్నీటి పర్యంతమైన మహిళను ఓదారుస్తున్న వైఎస్ జగన్

ముందస్తు జాగ్రత్త లేదు..

ఈ ప్రాంతంలో అతి భారీ వర్షాలు, వరదలపై గత బుధవారమే ఐఎండీ (వాతావరణశాఖ) హెచ్చరించింది. అప్పుడే జలవనరులు, రెవెన్యూ, హోంశాఖ కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేసి ఉంటే ఈ విపత్తు వచ్చి ఉండేది కాదు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా బుడమేరు నుంచి నీళ్ల వదలడం, ముందు జాగ్రత్తగా లోతట్టు ప్రాంతాల ప్రజలను రిలీఫ్ క్యాంప్‌లకు తరలించకపోవడం ఇన్ని అనర్థాలకు కారణం.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

మా ప్రభుత్వ హయాంలో గోదావరి జిల్లాలో వరద లొస్తే 40 వేల జనాభా ఉన్న ఊరి నుంచి 36 వేల మందికి పైగా రిలీఫ్ క్యాంప్‌లకు తరలించాం. ఏ విపత్తు వచ్చినా ముందుగానే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కలెక్టర్లు అప్రమత్తమయ్యే వారు. ముందుగానే సమాచారం ఇవ్వడంతో పాటు వలంటీర్లు దగ్గరుండి తలుపుతట్టి మరీ ప్రజలను రిలీఫ్ క్యాంపులకు తీసుకెళ్లేవారు.

కలెక్టర్లకు వారం టైమిచ్చి..

రాష్ట్రంలో ఏ విపత్తు వచ్చినా నాడు సహాయ చర్యలు వేగంగా జరిగేలా కలెక్టర్లకు పూర్తి అధికారంతోపాటు తగినన్ని నిధులు కూడా కేటాయిస్తూ (టీఆర్–27 కింద కలెక్టర్ల ఖాతాలో జమ) వారం రోజులు సమయం ఇచ్చేవాళ్లం. సహాయ చర్యలకు ఆటంకం కలిగించకూడదన్నదే మా అభిమతం. ఆ టైమ్ ఇవ్వడం వల్ల వెంటనే కలెక్టర్ యాక్టివేట్ కావడంతో పాటు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను కూడా క్రియాశీలం చేసి అంతా కలిసి ఒక వ్యవస్థలా పని చేసి ప్రతి బాధితుడికీ అండగా నిల్చేవారు.

ఆ రిటైనింగ్ వాల్ కనుక లేకుంటే..

ప్రకాశం బ్యారేజీకి ఏ మాత్రం వరద వచ్చినా మునిగిపోయే కృష్ణలంక, దిగువ ప్రాంతాల వాసుల కష్టాలను స్వయంగా చూసి రూ.500 కోట్లతో కృష్ణలంకకు ఇరువైపులా నిర్మించిన రీటెయినింగ్ వాల్ ఇప్పుడు దాదాపు 3 లక్షల మందిని కాపాడుతోంది. అందుకే మొన్న నేను వారధి మీదుగా వస్తుండగా కృష్ణలంక వాసులు పలుకరించి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు ఆ వాల్ కనుక లేకపోయి ఉంటే ఇంకా ఎంత అనర్థం జరిగి ఉండేదో ఆలోచించాలి. ఈ విపత్తులో ఇప్పటికే 32 మంది చనిపోయారు. మరణించిన వారి పేర్లతో సహా ఆ వివరాలన్నీ పత్రికలో వచ్చాయి. నిజానికి మరణాల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుంది. ఏదేమైనా ప్రభుత్వ వైఫల్యం వల్లనే ఇదంతా జరిగింది. ఇప్పటి వరకు బయటపడిన 32 మరణాలకు సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలి.

అధికారులపై వేలెత్తడం హేయం

అధికారులను సీఎం చంద్రబాబు సస్పెండ్ చేస్తానంటున్నాడు. అసలు అధికారులు ఎవరు? ప్రభుత్వం ఎవరిది? ఎన్నికల ఫలితాలు వచ్చాక ఆయనే దగ్గరుండి ఏ అధికారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలి అనేది చెప్పి అన్ని పోస్టింగులు పూర్తి చేశాడు. తానే పోస్టింగులు ఇప్పించుకున్న అధికారుల వల్ల ఇది జరిగిందని సిగ్గు లేకుండా చెబుతున్నాడు! ఇంతకన్నా సిగ్గుమాలిన పని ఏదన్నా ఉంటుందా? ఆయన తప్పును కప్పి పుచ్చుకునే దాని కోసం అధికారులను బలి పశువులను చేస్తూ వారిపై వేలెత్తి చూపించే కార్యక్రమం చేస్తున్నారు.

నిజాయితీ ఉంటే చూపించండి..

మీరంతా విలేకరులు..ఒకసారి నేరుగా వెళ్లి మీరే చూడండి. ఇదే విషయం వాళ్ల పాంప్లెట్ పేపర్ ఈనాడులోనూ వచ్చింది. దయచేసి జర్నలిజంలో న్యాయం, ధర్మం కొంచమైనా పాటించి వాళ్ల గెజిట్ పేపర్ ఈనాడులో వచ్చిన ఆ వార్తను ఒక్కసారి మీ టీవీల్లో చూపించండి. వాళ్లంతట వాళ్లే వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తారు. అనివార్య పరిస్థితుల వల్ల గేట్లు పైకెత్తారట! అనివార్య కారణాల వల్ల నీళ్లు విజయవాడకు వచ్చాయట!

గోదావరి పుష్కరాల తరహాలోనే..

విజయవాడ విపత్తు కచ్చితంగా మ్యాన్ మేడ్ ఫ్లడ్. గతంలో గోదావరి పుష్కరాల్లో కూడా చంద్రబాబు తన షూటింగ్ కోసం, తాను ఒక హీరోలా కనిపించాలనే తాపత్రయంతో చేసిన హంగామాలో తొక్కిసలాట జరిగి 29 మంది దుర్మరణం చెందారు. ఇప్పుడు కూడా అదే మాదిరిగానే చంద్రబాబు తప్పిదం వల్లే 32 మంది చనిపోయారు.

హైదరాబాద్ విమోచనను అధికారికంగా నిర్వహించాలి

బీజేఎల్పీ నేత ఏలేటి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సెప్టెంబర్ 17 హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విమోచన దినోత్సవాన్ని జరపకుండా బీఆర్‌ఎస్ జాతీయ సమైక్యదినంగా జరుపుకుందని ఎద్దేవాచేశారు. అప్పట్లో తెలంగాణ నుంచి కొన్ని జిల్లాలు కర్ణాటక, మహారాష్ట్రలో కలిశాయని, ఆ రాష్ట్రాల్లో విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తుంటే తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని ఏలేటి ప్రశ్నించారు. బుధవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సిద్ధించాక విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించే అవకాశం కాంగ్రెస్‌కు వచ్చిందన్నారు. భారీ వర్షాలు, వరదలకు జరిగిన ప్రాణ, ఆస్తినష్టంపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని కేంద్రానికి వివరిస్తున్నట్లు తెలిపారు.

'దిశ' కేసులో వాయిదా కోరడం సరికాదు

రాష్ట్రప్రభుత్వ తీరుపై సీజే ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: దిశ హత్యాచారం కేసు విచారణ సందర్భంగా వాయిదా కోరిన ప్రభుత్వ న్యాయవాదిపై హైకోర్టు సీజే ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అంతసేపు వాదనలు జరిగినప్పుడు వాయిదా కోరకుండా.. తీరా ప్రభుత్వ సమయం వచ్చినప్పుడు ఏజీ వస్తారనడంపై అభ్యంతరం తెలిపారు. అనంతరం విచారణను ఈనెల 9కి వాయిదా వేశారు. దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. అనంతర పరిణామక్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టుకు వచ్చిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. కొందరు పిటిషనర్ల తరఫున హక్కుల కార్యకర్త, న్యాయవాది వృందా గ్రోవర్ వాదనలు వినిపించారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన బాధితుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇచ్చేలా ఆదేశించాలని వారి తరఫున న్యాయవాది విజ్ఞప్తి చేశారు. కోర్టు ఎలా ఆదేశించినా ఆ మేరకు ముందుకు వెళ్తామని సీబీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలకు సమయం కావాలని కోరిన న్యాయవాదిపై సీజే ఆగ్రహం వ్యక్తం చేశారు.



విద్యుత్‌సౌధలో జరిగిన మహాధర్నాలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య తదితరులు

సమ్మెకు వెనుకాడబోం!

- విద్యుత్ సౌధ మహాధర్నాలో బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ స్పష్టీకరణ
- సీఎం, డిప్యూటీ సీఎం చొరవ తీసుకోవాలని ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కో, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్‌లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇచ్చిన పదోన్నతుల్లో చోటుచేసుకున్న అవకతవకతలపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. బీసీ, ఓసీ విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతుల్లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని, లేనిపక్షంలో ఉద్యోగులు సమ్మె చేయడానికి వెనకాడబోరని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతో పాటు హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా గత కొంత కాలంగా తాత్కాలికం (అడ్‌హక్) పేరుతో షరతులతో కూడిన పదోన్నతులు కల్పిస్తూ బీసీ, ఓసీ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించారని అందోళన వ్యక్తం చేసింది. 35 వేల మందికి పైగా ఉన్న బీసీ, ఓసీ విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎన్నోసార్లు కోరినా యాజమాన్యాలు పట్టించుకోకపోవడంతో ఆందోళనబాట పట్టక తప్పడం లేదని తెలిపింది. విద్యుత్ సంస్థల్లో పదోన్నతులను పునఃసమీక్షించి బీసీ, ఓసీ ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో మహాధర్నా జరిగింది. యాజమాన్యాలకు నోటీసులు అందజేసిన తర్వాత కూడా 3,830 మందికి మళ్లీ అడ్‌హక్ పదోన్నతులు కల్పించారని జేఏసీ చైర్మన్ కోడెపాక కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో విధించిన షరతులను పక్కనబెట్టి ఇప్పుడు కొత్త షరతులతో పదోన్నతులు ఇస్తున్నారని, ఇప్పుడు గత ప్రభుత్వం విధించిన షరతులు ఉన్నట్లా? లేనట్లా? అని ప్రశ్నించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రొనాల్డ్ రాస్ సెలవులో ఉన్నప్పుడు ఉపముఖ్యమంత్రి ఆదేశాల పేరుతో పదోన్నతులు కల్పించడం బీసీ, ఓసీ ఉద్యోగులకు విస్మయాన్ని కలిగించిందన్నారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎండీ రోనాల్డ్ రాస్ ప్రత్యేక చొరవ తీసుకుని బీసీ, ఓసీ ఉద్యోగులకు న్యాయం చేయాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

మాది ఉద్యోగ సానుకూల ప్రభుత్వం

ఉప ముఖ్యమంత్రి భట్టి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని, వారి సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ప్రతినిధులు భట్టిని కలిసి ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన 39 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ సంఘాలతో చర్చించి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, స్టీరింగ్ కమిటీ నేతలు దేవరకొండ సైదులు, శ్యాంసుందర్, కస్తూరి వెంకట్ తదితరులున్నారు.

యశోద గ్రూప్ రూ.కోటి విరాళం

వరద బాధితుల సహాయార్థం యశోద గ్రూప్ హాస్పిటల్స్ రూ.కోటి విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసిన ఆసుపత్రి చీఫ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి రూ.కోటి చెక్కును అందజేశారు. ఆపద సమయంలో దాతృత్వాన్ని చాటుకున్న యశోద ఆసుపత్రి చైర్మన్ రవీందర్‌రావు, డైరెక్టర్లు సురేందర్‌రావు, దేవేందర్‌రావులను ఈ సందర్భంగా భట్టి అభినందించారు.

'కేన్స్'పై నిజాలు చెప్పండి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ కేన్స్ గుజరాత్‌కు తరలిపోతున్నా ప్రజలను తప్పుదోవ పట్టించేలా మంత్రి శ్రీధర్‌బాబు అసత్యాలు చెప్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మూడు యూనిట్లలో కీలమైన రెండు యూనిట్లు తరలిపోతున్నాయని, కాంగ్రెస్ చేతగాని, అసమర్థ, గందరగోళ నిర్ణయాలతో పెట్టుబడిదారుల్లో అయోమయం నెలకొందన్నారు. ఇకనైనా కేన్స్ సంస్థ పెట్టుబడుల విషయంలో ప్రజలకు నిజాలు చెప్పాలని 'ఎక్స్'వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేన్స్ సంస్థ తెలంగాణలో మూడు యూనిట్లను స్థాపించేలా ఒప్పించి అన్ని అనుమతులను ఇచ్చామన్నారు. వీటిలో సాధారణ ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్‌తో పాటు మరో అత్యాధునిక యూనిట్ (ఒసాట్)ను కొంగరకలాన్‌లో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మరో పీసీబీ యూనిట్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేసేందుకు కంపెనీని ఒప్పించామని కేటీఆర్ తెలిపారు. ఒసాట్‌ను కొంగరకలాన్‌లో ఏర్పాటు చేసి ఉంటే సెమీ కండక్టర్ల రంగానికి హైదరాబాద్‌లో మంచి భవిష్యత్ ఉండేదన్నారు. తెలంగాణలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించేలా ప్రోత్సహించి, అవసరమైతే ప్రలోభాలకు, బెదిరింపులకు పాల్పడుతూ కాంగ్రెస్ పార్టీ సర్కస్ ఫీట్లు చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే వారిపై చర్యలు అంటూ హంగామా చేస్తోందన్నారు.

మునిసిపల్ కమిషనర్లపై కేసులు సరికాదు!

దానకిషోర్‌కు మునిసిపల్ కమిషనర్స్ అసోసియేషన్ లేఖ

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ పరిధిలోని మునిసిపల్ కమిషనర్ల ప్రమేయం లేకుండానే భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరవుతాయని, హైడ్రా సిఫార్సుల పేరుతో మునిసిపల్ కమిషనర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం సరికాదని తెలంగాణ మునిసిపల్ కమిషనర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. హైడ్రాతో మునిసిపల్ కమిషనర్లకే ప్రయోజనమని, అయితే ఈ సంస్థ ద్వారా కమిషనర్లపై చర్యలకు దిగడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్‌రెడ్డి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల చర్యలు తీసుకున్న కమిషనర్లకు ఆయా ప్రాంతాల్లో ఇచ్చిన అనుమతులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మునిసిపల్ కమిషనర్లు అనుమతులు ఇవ్వకపోయినా, వారిపై క్రిమినల్ చర్యలకు సిఫారసు చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. చందానగర్ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుధామ్ష్, నిజాంపేట కమిషనర్ రామకృష్ణారావులపై తీసుకున్న క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. వీరు పదవుల్లో కొనసాగినప్పుడు అనుమతులు 'టీజీబీపాస్'విధానంలో చేసుకున్న భవన నిర్మాణ దరఖాస్తులని, ఇవి అధునాతన సాఫ్ట్‌వేర్ ద్వారా మెషన్ లెర్నింగ్ ప్రక్రియ ద్వారా పరిశీలించబడతాయని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది విచారించి డిజైన్‌ను పరిశీలించి అనుమతులకు సిఫారసు చేస్తే నామమాత్రంగా కమిషనర్ ఆమోదముద్ర వేసిన సంఘటనలేనని తెలిపారు. కాబట్టి అంతర్గత ప్రాథమిక విచారణలు లేకుండా క్రమశిక్షణ చర్యలు చేపట్టవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

'చంద్రబాబు'పై విచారణకు మేం రెడీ

▶ మొదటి పేజీ తరువాయి

పర్సొనెల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ), సీబీఐ అఫిడవిట్ కూడా దాఖలు చేశాయి. విచారణ చేపట్టడానికి మాకెలాంటి అభ్యంతరం లేదు. అత్యంత భారీ కుంభకోణమైన ఐఎంజీ భారత్‌కు భూ కేటాయింపుల వెనుక ఎవరున్నారో తేల్చేందుకు సిద్ధంగా ఉన్నాం..' అని చెప్పారు.

పిల్స్‌ను కొట్టేయాలి: లూథ్రా

అనంతరం నాటి క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి రాములు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. 'రాజకీయ వివాదాల్లో భాగంగా ఈ పిటిషన్లు వచ్చాయి. ఇందులో ప్రజాప్రయోజనం లేదు. 850 ఎకరాలను కేటాయిస్తూ 2003లో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై ఐఎంజీ భారత తరఫున బిల్లీరావు హైకోర్టులో పిటిషన్ వేస్తే.. విచారణ జరిపిన న్యాయస్థానం దాన్ని కొట్టివేయడంతో పాటు జీవో రద్దును సమర్థించింది. భూములను ప్రభుత్వం ఎలాగూ వెనక్కు తీసుకుంది కాబట్టి ఇక ఈ పిల్స్‌ను కొట్టివేయాలి..'అని విజ్ఞప్తి చేశారు. అనంతరం ధర్మాసనం.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత

సీబీఐ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసిందని గత విచారణ సందర్భంగా మాజీ ఏజీ బీఎస్ ప్రసాద్ తెలిపారు. అయినా విచారణకు ఆదేశించకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. దేశంలో 2003లో జరిగిన అతిపెద్ద భూకుంభకోణం ఇదని.. దీనిపై సీబీఐ విచారణ కోరుతూ పిటిషనర్లు వ్యాజ్యాలు దాఖలు చేసి దాదాపు 12 ఏళ్లు గడిచాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

అసలేంటీ కేసు

క్రీడాభివృద్ధి పేరిట ఐఎంజీ భారతకు 2003లో మామిడిపల్లి, శేరిలింగంపల్లిలో 850 ఎకరాల అత్యంత విలువైన భూములను చంద్రబాబు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 450 ఎకరాలకు సేల్‌డీడ్ కూడా చేసి ఇవ్వడమే కాకుండా రాష్ట్రంలోని స్టేడియాలను ఆ సంస్థకే అప్పగించింది. అలాగే నిర్వహణ కోసం రాయితీలు ఇస్తూ ఒప్పందం చేసుకుంటూ జీవోను విడుదల చేసింది. అయితే తర్వాత వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో, అదీ ఆ సంస్థ పెట్టిన నాలుగు రోజుల్లోనే భూములు ఇవ్వడాన్ని ఆక్షేపించింది. ఎలాంటి క్రెడిబులిటీ లేని సంస్థకు స్టేడియాలు, రాయితీలు ఇవ్వడం ప్రజా ధనం దుర్వినియోగం కిందకే వస్తుందని భావించి ఒప్పందాన్ని, జీవోను రద్దు చేసింది. దీనిపై బిల్లీరావు హైకోర్టులో పిటిషన్ వేయగా.. వైఎస్సార్ ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయస్థానం సమర్థించింది. ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని 2024 మార్చిలో ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఇదే అంశంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ పలు పిల్స్ దాఖలు కాగా, వాటిపై విచారణ కొనసాగుతోంది.

తుది తీర్పు మేరకే నియామకాలు

గ్రూప్–4 ఉద్యోగాలపై హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–4 సర్వీస్ ఉద్యోగాలకు సంబంధించి తాము ఇచ్చే తుదితీర్పు మేరకే నియామకాలు ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. 2022, డిసెంబర్ 1న ప్రభుత్వం జారీ చేసిన గ్రూప్–4 నోటిఫికేషన్‌లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ కల్పించలేదంటూ సరూర్‌నగర్‌కు చెందిన బి.భూమి, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాంతర రిజర్వేషన్లు కల్పించేలా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున ఎల్.రవిచందర్ వాదనలు వినిపించగా, కౌంటర్ దాఖలుకు పది రోజుల సమయం కావాలని ఏఏజీ కోరడంతో ధర్మాసనం.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించండి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల పిటిషన్

సాక్షి, హైదరాబాద్: రాజకీయ నాయకులు, ప్రైవేటు వ్యక్తులతోపాటు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్ల ట్యాపింగ్ అంశంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి వద్ద బుధవారం విచారణకు వచ్చింది. అయితే ఇప్పటికే ఫోన్‌ట్యాపింగ్‌పై పలు పిటిషన్లు సీజే ధర్మాసనం వద్ద విచారణకు ఉండటంతో దీనిని కూడా వాటికి అటాచ్ చేయాలని న్యాయమూర్తి రిజిస్ట్రీని ఆదేశించారు.



'నడక' నేర్పిన గురువు..





జోసెఫ్ సుందర్.. ఈయన 'నడక' నేర్పే గురువు.. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతోపాటు నడత నేర్పితే.. రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో కొరియోగ్రాఫర్‌గా రాణిస్తున్న జోసెఫ్ మోడల్స్‌తో పాటు షో స్టాపర్‌గా మెరిసే పీవీ సింధు లాంటి సెలబ్రిటీ క్రీడాకారులు, సినీతారలకు ర్యాంప్‌పై 'నడక' నేర్పారు. 'మోడలింగ్ రంగంలోకి నేను ప్రవేశించినప్పుడు హైదరాబాద్‌లో ఫ్యాషన్‌రంగం ఈ స్థాయిలో లేదు. ఇప్పుడు ఫ్యాషన్ రంగం ఎదుగుదలతోపాటు..నేటి ఎందరో మేటి మోడల్స్‌కు ఒకప్పుడు నేను శిక్షణ ఇవ్వడం అనేది నాకు చాలా ఆనందంగా అనిపిస్తుంది'అని చెప్పారు జోసెఫ్. 'మోడలింగ్‌లో ర్యాంప్‌వాక్ ట్రైనింగ్ మాత్రమే కాదు..పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఫొటో పోజింగ్, బాడీ లాంగ్వేజ్, కాన్ఫిడెన్స్, ఎక్స్‌ప్రెషన్ ఎక్సర్‌సైజ్‌లు, మర్యాదలు, స్టైలింగ్ ఇన్‌పుట్స్, ఫ్యాషన్–ట్రెండ్స్ పరిజ్ఞానం తదితర అంశాలన్నీ పాఠాలుగా మారతాయి. నా దగ్గర శిక్షణ పొందిన మోడల్స్ జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. దియామీర్జా, నఫీసాజోసెఫ్, డినో మారియా, సోనీకౌర్, అర్చన అఖిల్‌కుమార్, శ్రీధర్‌రావు, దీక్షాపంత్, రిషిక, వాసుకి సుంకర, చందన జయరామ్ తదితర జాతీయస్థాయి తారలు, మోడల్స్‌తో కలిసి పనిచేశా. చాలా ఏళ్లుగా నిఫ్ట్‌లో మోడలింగ్ సబ్జెక్ట్ బోధిస్తున్నాను. మోడలింగ్ రంగానికి అంతగా ప్రాధాన్యం లేని రోజుల్లోనే దీనికి మంచి భవిష్యత్ ఉందని నమ్మిన నా నమ్మకం ఎందరికో కెరీర్ ఇచ్చిందనే తృప్తి చాలు నాకు' అని అంటున్నారు ఫ్యాషన్ గురు జోసెఫ్ సుందర్.

–సాక్షి, హైదరాబాద్

పల్లెకు వెళ్లే డాక్టర్లకు రెట్టింపు వేతనం!

జీతానికి అదనంగా 100% ప్రోత్సాహకం దిశగా సర్కారు చర్యలు • గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తే 125%

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూత్రప్రాయ నిర్ణయం

జిల్లా ప్రాంతాల్లోనే సూపర్ స్పెషాలిటీ సేవలకు దోహదం.. త్వరలో ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ వంటి ప్రముఖ నగరాలకే పరిమితమవుతున్న డాక్టర్లను పల్లెలకు పంపించే దిశగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిర్ణయం తీసుకున్నారు. గ్రామాల్లో పనిచేసేందుకు ముందుకు వచ్చే డాక్టర్లకు రెట్టింపు వేతనాలు ఇవ్వాలని నిర్ణయించారు. దీనివల్ల వైద్యులు గ్రామాల వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) మొదలు సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోకి వెళ్లి పనిచేస్తే వేతనానికి రెట్టింపు (100 శాతం) ప్రోత్సాహకం, గిరిజన ప్రాంతాల్లోకి వెళ్లి పనిచేస్తే 125 శాతం ప్రోత్సాహకం ఇవ్వాలని అధికారులకు మంత్రి చెప్పినట్లు తెలిసింది. మెడికల్ కాలేజీలు, జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో వైద్య సేవలు అందించే



డాక్టర్లు అందరికీ ఈ ప్రోత్సాహకాన్ని వర్తింపజేస్తారు. వీటికి సంబంధించి త్వరలో ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఒడిశా మోడల్

పల్లెల్లో పనిచేసే డాక్టర్ల కంటే హైదరాబాద్‌లో పనిచేసే వారికి హెచ్‌ఆర్‌ఏ (ఇంటి అద్దె అలవెన్సు) ఎక్కువ వస్తుంది. అంతేకాదు నగరంలో ఉంటూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేసే వారూ ఉన్నారు. కొందరు సొంత ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇలా అదనంగా ఆదాయం సమకూర్చుకుంటున్నారు. పిల్లల చదువుల కోసం మరికొంత మంది నగరానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలా అనేక కారణాలతో గ్రామాలకు, గిరిజన ప్రాంతాలకు వెళ్లడానికి డాక్టర్లు ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో మంత్రి పలుమార్లు వైద్యాధికారులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. ఒడిశా సహా పలు రాష్ట్రాల్లో అమలవుతున్న ప్రోత్సాహక పథకంపై వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ), వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తదితరులతో అధ్యయనం చేయించారు. ఒడిశాలో రాష్ట్ర రాజధాని నుంచి ప్రతి 50 కిలోమీటర్ల దూరానికి ఒక స్లాబ్ నిర్ణయించి, బేసిక్ పేపై 25 నుంచి 150 శాతం వరకూ ప్రోత్సాహకం ఇస్తున్నారు. దీంతో డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. దీనిపై అధికారులు మంత్రికి నివేదిక ఇచ్చారు. దీంతో ఇదే పద్ధతిని రాష్ట్రంలోనూ అమలు చేయాలని మంత్రి నిర్ణయించారు.

జిల్లాలకు వెళితే క్వార్టర్లు కూడా..

జిల్లాలకు వెళ్లే డాక్టర్లకు ఆయా ఆసుపత్రుల్లో క్వార్టర్లు నిర్మించాలని కూడా నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాల్లోని మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆసుపత్రుల్లోని డాక్టర్లకే క్వార్టర్లు ఉన్నాయి. అయితే కొత్తగా సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లకు కూడా క్వార్టర్లు నిర్మించాలని మంత్రి అధికారులకు సూచించారు. పీహెచ్‌సీల్లోని డాక్టర్లు గ్రామాల్లో కాకుండా సమీపంలో ఉన్న మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లి రావొచ్చు కాబట్టి వారికి క్వార్టర్లు అవసరం లేదనే అభిప్రాయానికి వచ్చారు. అయితే క్వార్టర్లు నిర్మించి ఇవ్వడం వల్ల డాక్టర్లు నిరంతరం అక్కడే ఉండే అవకాశం ఉంటుంది. డాక్టర్ అందుబాటులో లేడనే అభిప్రాయం కూడా ఉండదని మంత్రి భావిస్తున్నారు. ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల్లో పనిచేసేది స్పెషాలిటీ డాక్టర్లు కాబట్టి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. వీరికి ప్రోత్సాహకాలు ఇచ్చి పల్లెలకు పంపడం వల్ల అక్కడే స్పెషాలిటీ సేవలన్నీ అందుబాటులోకి వస్తాయి. ఈ నేపథ్యంలో జిల్లాల్లో డాక్టర్లను పూర్తి స్థాయిలో నియమించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని భావిస్తున్నారు. దీనివల్ల 75% వైద్య సేవలు జిల్లాలకే పరిమితం అవుతాయని, హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు.

ఆర్టీసీ 10 శాతం రాయితీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–విజయవాడ మార్గంలో ప్రయాణించే బస్సుల్లో ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. ఈ మార్గంలో ప్రయాణించే రాజధాని, సూపర్ లగ్జరీ టికెట్ ధరల్లో 10 శాతం రాయితీ వర్తిస్తుందని ఆర్టీసీ ఒక ప్రకటనలో తెలిపింది ఈ రాయితీ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సంస్థ కోరింది.

హైడ్రా పేరిట వసూళ్లపై ఫిర్యాదు చేయండి

సాక్షి, హైదరాబాద్: 'హైడ్రా'పేరుతో బెదిరింపులు, అవినీతి అక్రమాలకు పాల్పడేవారి గురించి తమకు ఫిర్యాదు చేయాలని అవినీతి నిరోధక శాఖ ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేసింది. కొందరు ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వ అధికారులు 'హైడ్రా' పేరు చెప్పి నోటీసులతో బెదిరింపులు, అవినీతికి పాల్పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ తెలిపారు. హైడ్రా పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

గుర్తుపట్టలేని వాళ్లు ఎలా రక్షణ కల్పిస్తారు?

- పోలీసుల ప్రొటోకాల్ ఉల్లంఘనపై నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం
- సభ్యుల హక్కులకు భంగం కలగకుండా చూస్తా: స్పీకర్ ప్రసాద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలమయిన మమ్మల్ని గుర్తుపట్టని పోలీసులు మాకు ఎలా రక్షణ కల్పిస్తారు'? అని నకిరేకల్ కాంగ్రెస్ శాసనసభ్యుడు వేముల వీరేశం ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పోలీసుల తీరులో మాత్రం మార్పు రాలేదన్నారు. గత నెల 30న ఇరిగేషన్ సమీక్ష సమావేశం సందర్భంగా మంత్రులు వచ్చినప్పుడు హెలీప్యాడ్ వద్దకు తనను అనుమతించకుండా అడ్డుకున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఆయన మినిస్టర్స్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలతో కలసి వచ్చిన వీరేశం.. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తనను అవమానించిన డీసీపీ, ఏసీపీలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరినట్టు వెల్లడించారు.



స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తున్న వీరేశం

పూర్తి వివరాలు తెప్పించుకుంటా: స్పీకర్

ఎమ్మెల్యే వీరేశం ఆవేదనను తాను అర్థం చేసుకున్నానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడించారు. 'వెంటనే పూర్తి వివరాలను తెప్పించుకుంటాను. సభ్యుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత శాసనసభాపతిగా నాపై ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సభా నియమాల పరిధిలో చర్యలు తీసుకుంటాం'అని స్పీకర్ పేర్కొన్నారు.

సుడిగాలి మిస్టరీ

▶ మొదటి పేజీ తరువాయి

నల్లగొండ జిల్లాలో ఇలాంటి స్వల్పస్థాయిలో చోటుచేసుకుందని చెప్పారు. వాతావరణ మార్పులతోనే ఇలా జరిగిందని భావిస్తున్నామని.. అడవుల్లో ఇలా జరగడంపై లోతైన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.



నేలకూలిన భారీ వృక్షాలను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ దోబ్రియల్

అతివేగమైన గాలి.. తడిసిన నేలతో..: అత్యంత వేగంగా, బలంగా వీచిన గాలులతోనే ములుగు అడవిలో విధ్వంసం జరిగి ఉంటుందని రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి (మాజీ పీసీసీఎఫ్ ర్యాంక్ అధికారి) రఘువీర్ అంచనా వేస్తున్నారు. నాలుగైదు రోజులు ఆగకుండా కురిసిన వానతో నేల తడిసి, డొల్లగా అవుతుందని.. దీనికితోడు ఫంగల్ ఇన్ఫెక్షన్లు, కొమ్మలు కొట్టేయడంతో చెట్లు బలహీనమయ్యే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఇలాంటప్పుడు అతివేగంగా వీచే గాలులతో చెట్లు కూలిపోయే చాన్స్ ఉంటుందని వివరించారు. 1996లో మధ్యప్రదేశ్‌లోని ఓ అభయారణ్యంలో ఇలాంటి ఘటన జరిగిందని.. ములుగులో జరిగిన దానికంటే కూడా ఎక్కువ స్థాయిలో చెట్లు పడిపోయాయని నిపుణులు చెప్తున్నారని రఘువీర్ వెల్లడించారు. ములుగులో పెద్ద సంఖ్యలో చెట్లు కూలినా.. చాలా వరకు వేళ్లతో సహా పెకిలింతకు గురికాలేదన్నారు. మధ్యకు విరిగిన, కొమ్మలన్నీ పోయి కాండం మిగిలిన చెట్లు త్వరలోనే కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇక టోర్నడో వృత్తాకారంలోఒకేచోట తిరుగుతుందని.. కానీ ములుగు అడవిలో అలాకాకుండా ఒకేవైపు నుంచి ప్రభావం పడిందని తెలిపారు.

అందరిలోనూ విస్మయం

ఒకే ప్రాంతంలో ఒకే సమయంలో 50వేల చెట్లు నేలకూలడం అటవీశాఖ అధికార యంత్రాంగాన్ని విస్మయానికి గురిచేస్తోంది. దీనికి కారణమేంటన్న దానిపై పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియల్, జిల్లా అధికారులు రాహుల్‌కిషన్ జాదవ్, ఇతర అధికారులు పరిశీలన జరుపుతున్నారు. డ్రోన్ కెమెరా ద్వారా కూలిన చెట్లను పరిశీలించారు. మరోవైపు పెనుగాలులతో నేలకూలిన చెట్లపై కలప స్మగ్లర్ల కన్నుపడిందని స్థానికులు అంటున్నారు. చెట్ల దుంగలను తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొంటున్నారు.

తల్లుల దీవెనలతోనే బయటపడ్డాం: సీతక్క

సుడిగాలి గ్రామాలపైకి మళ్లితే పెను విధ్వంసం జరిగేదని రెండు రోజుల క్రితమే చెట్లు నేలకొరిగిన ప్రాంతాన్ని సందర్శించినా.. ఇలా వేలాది చెట్లు కూలిపోయాయని ఊహించలేదని మంత్రి సీతక్క చెప్పారు. డ్రోన్ కెమెరాల సాయంతో పరిశీలించినప్పుడు విధ్వంసం బయటపడిందన్నారు. బుధవారం సచివాలయం నుంచి పీసీసీఎఫ్, డీఎఫ్ఓ, స్థానిక అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. సమ్మక్క సారలమ్మ తల్లుల దయ వల్లే సుడిగాలి ఊర్ల మీదకు మళ్లలేదని.. అలా మళ్లి ఉంటే పెను విధ్వంసం జరిగి ఉండేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక బృందాలను పంపి చెట్లు కూలిన ఘటనపై పరిశోధన జరిపించాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కోరారు.

సుడిగాలితో నేలకొరిగి ఉంటాయి!

సుడిగాలి, మేఘాలు రెండూ కలిసినపుడు ఇటువంటి వర్షాలు కురుస్తాయి. సాధారణంగా చెట్ల వేళ్లు భూమిలో ఎక్కువ లోతుకు వెళితే గట్టి పట్టు ఉంటుంది. కానీ ఇక్కడి ఆకులు రాలుతూ అక్కడే చెట్టుకు అవసరమై ఎరువు తయారవుతూ ఉంటుంది. దీనితో వేర్లు లోతుగా కాకుండా పక్కలకు విస్తరించి పట్టులేకుండా ఉంటాయి. ఇలాంటి చెట్లు సుడిగాలితో పట్టుకోల్పోయి నేలకొరిగి ఉంటాయి. ఇలాంటి ఘటనను నా 35 ఏళ్ల సర్వీస్‌లో ఎప్పుడూ చూడలేదు.

– ఆర్ఎం డోబ్రియాల్, పీసీసీఎఫ్





సరిగానే విన్నారు.. ఈమె బైక్ టీచర్!

అమ్మాయిలు బైక్ డ్రైవ్ చేయడం వింత అనే రోజుల్లోనే బైకర్‌గా మారారు హైదరాబాద్‌వాసి అర్చన చిగుళ్లపల్లి. ఇప్పుడామె బైక్ టీచర్. కొన్నేళ్లుగా ఆమె మోటార్ సైకిల్ నడపడం నేర్పిస్తున్నారు. తొలుత తన స్నేహితురాళ్లకు బైక్ డ్రైవింగ్ చేయడంపై క్లాస్ తీసుకోవడం ప్రారంభించి... అలా బయటి అమ్మాయిలు, గృహిణులకు కూడా మోటార్‌సైకిళ్లు, మోపెడ్ (స్కూటీ/యాక్టివా) ఎలా నడపాలో నేర్పుతూ వచ్చారు. గడప దాటని ఎందరో మహిళలు ఎన్నో విజయాలు సాధించేందుకు ఈ బైక్/స్కూటర్ డ్రైవింగ్ ఒక స్ఫూర్తిగా పనిచేసిందని ఆమె సంతృప్తిగా చెబుతున్నారు. వేల సంఖ్యలో ఆమె విద్యార్థులు ఇప్పుడు బైక్స్ మీద దూసుకుపోతున్నారు. స్వయం సమృద్ధి దిశగా సాగిపోతున్నారు. పట్టుదల, ఆత్మవిశ్వాసం మెండుగా ఉన్నవారికి గంట శిక్షణతో మొదలుపెట్టి కొన్ని వారాల దాకా...ఆమె దగ్గర డ్రైవింగ్ కోర్సు తీసుకునేవారు ఉన్నారు. స్థానికంగానే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థినులు సైతం తన దగ్గరకు వచ్చి నేర్చుకుంటున్నారని ఆమె చెబుతున్నారు. బైకర్‌గా, ఫుడ్ బ్లాగర్‌గా..మరెన్నో వ్యక్తిగత విజయాల ద్వారా తన దగ్గర బైక్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి వచ్చే మహిళలకు స్ఫూర్తిని అందిస్తున్నారు.

ఐటీలో మేటిగా తెలంగాణ

- ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల ఆధారంగా అభివృద్ధి సాధిస్తాం
- బెంగళూరును అధిగమించే దిశగా ప్రయత్నాలు చేస్తాం
- ఏఐ టెక్నాలజీని ప్రోత్సహించే దిశగా 'ఏఐ సిటీ' నిర్మాణం
- నేటినుంచి జరిగే 'ఏఐ సమ్మిట్'లో ఏఐ నిపుణుల తయారీపైనా చర్చ

'సాక్షి' ఇంటర్వ్యూలో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్

కొత్తగా దూసుకువస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ టెక్నాలజీ)తో పాటు ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆధారంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలుపుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఐటీ ఉత్పత్తులు, ఎగుమతుల్లో బెంగళూరు చాలా ముందంజలో ఉందని, ఇతర రాష్ట్రాలు కూడా ఎమర్జింగ్ టెక్నాలజీ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు పోటీ పడుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఏఐ సాంకేతికత ద్వారా భారీ ముందడుగు వేసి ఐటీ రంగంలో బెంగళూరును అధిగమించే దిశగా ప్రయత్నాలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఏఐ టెక్నాలజీ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలు, వాణిజ్యం పెంచే దిశగా ప్రభుత్వం రోడ్ మ్యాప్ రూపొందిస్తోందని తెలిపారు. ఏఐ టెక్నాలజీని ప్రోత్సహించే ప్రణాళికలో భాగంగా ఏఐ సిటీ నిర్మిస్తామని, రాష్ట్ర అభివృద్ధిని పదింతలు పెంచుతామని చెప్పారు. గురు, శుక్రవారాల్లో రెండురోజుల పాటు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) వేదికగా 'తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్'(అంతర్జాతీయ ఏఐ సదస్సు)ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి శ్రీధర్‌బాబు 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..



ఇంటర్ స్థాయిలో ఏఐ!

సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా ఎనలిటిక్స్ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీ ఆధారిత ఉత్పత్తులు, సేవలు అందుబాటులోకి తెచ్చేలా పరిశోధనలు, అభివృద్ధి కార్యకలాపాలు జరుగుతున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తాం. విద్యార్థులకు జూనియర్ కాలేజీ స్థాయి నుంచి కరిక్యులమ్‌లో ఏఐ పాఠ్యాంశాలను చేర్చడంపై సదస్సులో చర్చిస్తాం. బెంగళూరు తరహాలో ఇక్కడి ఏఐ హబ్ నుంచి యూనికార్న్‌లు (బిలియన్ డాలర్ల వ్యాపారం చేసే సంస్థలు) పుట్టుకొచ్చే వాతావరణం కల్పిస్తాం. త్వరలో ఎస్ఎంఎస్ఈ, లైఫ్ సైన్సెస్ పాలసీలను కూడా ఆవిష్కరిస్తాం.

బహుముఖ లక్ష్యంతో..

ఐటీ రంగంలో కొత్తగా వస్తున్న ఏఐ టెక్నాలజీ ఫలితాలు, వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం సహా బహుముఖ లక్ష్యంతో నాస్కామ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఏఐ ద్వారా భవిష్యత్తులో ఐటీ రంగంలో కొత్తగా భారీగా ఉద్యోగాల కల్పన జరుగుతుంది. అదే సమయంలో ఇది కోడింగ్, అల్గారిథమ్స్ ఆధారిత ఉద్యోగాలు చేస్తున్న ఐటీ నిపుణుల ఉద్యోగ భద్రతకు కూడా సవాలు విసరనుంది. ఈ నేపథ్యంలో ఏఐ నిపుణులను తయారు చేసేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడానికి అనుసరించాల్సిన విధానాలపై సదస్సులో చర్చిస్తాం. వాణిజ్యం, వ్యాపార రంగాల్లో ఏఐ ఆధారిత అభివృద్ధి, ఉత్పాదకత పెంచడం తదితరాలపై సదస్సులో పాల్గొనే నిపుణులు సూచనలు చేస్తారు. ఏఐ టెక్నాలజీ రెండంచుల కత్తిలాంటిదనే ఆందోళన నేపథ్యంలో నైతిక మార్గంలో ఏఐ సాంకేతికత వినియోగం, ప్రభుత్వ నియంత్రణ తదితర అంశాలపై కూడా చర్చ జరుగుతుంది. ఏఐ పాలసీ రూపకల్పన కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో సదస్సులో పాల్గొనే నిపుణుల అభిప్రాయాలు తీసుకుంటాం. తెలంగాణను 'ఏఐ క్యాపిటల్'గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సదస్సు జరుగుతోంది.

ఉత్పాదకత పెంపునకు ఏఐ వినియోగం

వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగంలో ఉత్పాదకత పెంచడం లక్ష్యంగా ఏఐ వినియోగం పెంచాలని భావిస్తున్నాం. పరిశ్రమల ఆటోమేషన్, మెరుగైన నాణ్యత, యంత్రాల మెయింటినెన్స్, మార్కెటింగ్, మెరుగైన విద్యుత్ వినియోగం వంటి అంశాల్లో ఏఐ టెక్నాలజీ ఉపయోగించేలా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాం. వ్యవసాయంలో ఎరువులు, నీళ్లు, తెగుళ్లు, పంట నూర్పిళ్లు సమర్థవంతంగా జరిగేలా చూడటం, కూలీల కొరతను అధిగమించడం వంటి సవాళ్ల పరిష్కారంపై ఇప్పటికే పలు ఏఐ ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీలు, చికిత్సలు, రోగ నిర్ధారణ సమర్థవంతంగా చేయడం సాధ్యమవుతోంది. విద్యారంగంలోనూ ఏఐ సాంకేతికతతో బహుళ లాభాలు ఉండబోతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో ఏఐ ఆధారిత శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఎస్సీ గురుకుల సొసైటీలో పార్ట్‌టైమ్, గెస్ట్ టీచర్ల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ టీచర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ ఆందోళనకు దిగారు. ఎలాంటి సమాచారం లేకుండా విధుల నుంచి వారిని తొలగించడం పట్ల తీవ్రస్థాయిలో మండిపడుతూ బుధవారం మాసాబ్‌ట్యాంక్‌లోని సొసైటీ కార్యదర్శి కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని 268 గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలతో పాటు 38 డిగ్రీ కాలేజీల్లో దాదాపు 2వేల మంది పార్ట్‌టైమ్ టీచర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. ఈ రెండు కేటగిరీల్లో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్‌కు సొసైటీ కార్యదర్శి సోమవారం మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అయితే తొలగింపునకు సంబంధించి ఎలాంటి కారణాలు మాత్రం వెల్లడించలేదు. ఈ క్రమంలో మంగళవారం రాతపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రిన్సిపల్స్ ఆయా గెస్ట్, పార్ట్ టైమ్ టీచర్లకు ఆదేశాలను స్పష్టం చేస్తూ బుధవారం నుంచి వారిని విధుల్లోకి అనుమతించలేదు. ఈ క్రమంలో ఆయా ఉద్యోగులంతా ఉదయం సొసైటీ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న తమను అకస్మికంగా తొలగించేందుకు కారణాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

మళ్లీ పశువులు కాసే పరిస్థితి తెచ్చారు: ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా వ్యవస్థను శిథిలం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఎస్సీ గురుకులాల్లో రెండు వేల మంది టీచర్లను రాత్రికి రాత్రే ఉద్యోగాల నుంచి తొలగించి వారి నోట్లో ప్రభుత్వం మట్టికొట్టింద న్నారు. ఈ కుట్రలో రెండు లక్షల మంది ఎస్సీ విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ప్రవీణ్‌కుమార్ బుధవారం మీడియాతో మాట్లాడారు. గతంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ద్వారా ఇంజనీర్లు, డాక్టర్లు తయారు కాగా, ప్రస్తుతం తిరిగి పశువుల కాసే పరిస్థితికి తీసుకువచ్చారన్నారు.

47 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ఉన్నత, ఇంటర్ విద్యతో కలిపి 113 మందికి పురస్కారాలు

నేడు రవీంద్రభారతిలో గురుపూజోత్సవం

సాక్షి, హైదరాబాద్: విద్యా బోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందించనుంది. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రవీంద్ర భారతిలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనుంది. గురువారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సహా పలువురు మంత్రులు, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు కలిపి మొత్తం 113 మందికి ప్రభుత్వం పురస్కారాలు ఇవ్వనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 12 మంది హెచ్ఎంలు, 23 మంది స్కూల్ అసిస్టెంట్లు, 12 మంది ఎస్జీటీలు, ఉన్నత విద్యలో పనిచేస్తున్న 55 మంది అధ్యాపకులు, ఇంటర్ విద్యలో పనిచేస్తున్న 11 మంది లెక్చరర్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు.

పురస్కారాలకు ఎంపికైన వారు వీరే..

ప్రధానోపాధ్యాయులు: టి భాస్కర్ (పాఠశాల/జిల్లా: తెల్లాపూర్, సంగారెడ్డి), మెస నరేందర్ (ఆలూరు, నిజామాబాద్), ఏవీ సత్యవతి-రిటైర్డ్ (నయాబజార్, హైదరాబాద్), ఎస్.కె. తాజ్‌బాబు (రాయదుర్గ్, రంగారెడ్డి), టి సునీత (కోటకొండ, నారాయణ్‌పేట్), బి. బాపూరెడ్డి (కుషాయిగూడ, మల్కాజ్‌గిరి), పి.శంకర్‌గౌడ్ (యాప్రాల, వనపర్తి), పి. పద్మజ (కనగోడ, నల్లగొండ), కె.నర్సయ్య (అంకోలి, ఆదిలాబాద్), కె.ఇందుమతి(హసన్‌పర్తి, హనుమకొండ), డాక్టర్ ప్రభుదయాల్ (రామాపురం, కొత్తగూడెం), జి. రాజన్న (హనుమకొండ).



స్కూల్ అసిస్టెంట్లు: కె. నర్సింహులు (ఇబ్రహీంనగర్, మహబూబ్‌నగర్), కొంక అనురాధ (కొత్తూరు, వరంగల్), కూన రమేశ్ (చిచోలి-బి, నిర్మల్), ముద్దుకృష్ణ (దుబ్బ, నిజామాబాద్), జె. రాజశేఖర్‌రావు (చిన్నముద్దునూర్, నాగర్‌కర్నూల్), ఎస్.సురేందర్ (అన్నారం, మంచిర్యాల), సీహెచ్ షర్మిల (అలుబాక, ములుగు), ఎం.రమేశ్ (బ్రాహ్మణపల్లి, పెద్దపల్లి), జి.రాజయ్య (మొగుళ్లపల్లి, భూపాలపల్లి), జి.అంజన్‌కుమార్ (ఎన్టీపీసీ జ్యోతినగర్, పెద్దపల్లి), కృష్ణకాంత్ నాయక్ (మిర్యాలగూడ, నల్లగొండ), సీహెచ్ గిరిప్రసాద్ (తిమ్మాపురం, సూర్యాపేట), ఎస్.అమరేందర్ రెడ్డి (కొంపల్లి, భూపాలపల్లి), పి.శంకర్‌గౌడ్ (శివనగర్, సిరిసిల్ల), జి.వెంకటేశ్వర్లు (పెద్దగోపతి, ఖమ్మం), కె.సత్యం(కందానెల్లి, వికారాబాద్), టి.స్వర్ణలత (పాల్వంచ, కామారెడ్డి), వి.రామకృష్ణ(చిన్నమల్లారెడ్డి, కామారెడ్డి), పి.రూపారాణి (సిరిసినగండ్ల, సిద్దిపేట), ఆర్.కృష్ణప్రసాద్ (నాగ్‌పూర్, మెదక్), హెచ్.విజయకుమార్ (ముడిమనిక్, సంగారెడ్డి), కె.కృష్ణయ్య(కుత్బుల్లాపూర్, రంగారెడ్డి).

ఎస్జీటీలు: జె. శ్రీనివాస్ (అక్కపల్లిగూడ, మంచిర్యాల), వై.వెంకటసురేశ్ కుమార్ (రామంచ, సిద్దిపేట), పి.రఘురామరావు (జీడీపల్లి, నాగర్‌కర్నూల్), దాసరి శంకర్ (పీచర్ల, నిర్మల్), పల్సి శ్రీనివాస్ (భైంసా, నిర్మల్), కె సుధాకర్ (తిడుగు, జనగాం), డి.కవిత(పెద్ద రాజమూర్, మహబూబ్‌నగర్), ఎం. క్రాంతికుమార్ (సింగన్నగూడ, సిద్దిపేట), కె. నాగేశ్వరి (పటేల్‌గూడ, సంగారెడ్డి), దల్లి ఉమాదేవి (ఆర్ఎస్ గుట్ట, భద్రాద్రి కొత్తగూడెం), జి. శ్రీనివాస్ (కీసరగుట్ట, మల్కాజ్‌గిరి), ఎంఎ అలీమ్ (గద్వాల్, నిజామాబాద్)

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 5-9-2024

టీచర్స్ డే స్పెషల్...

అంతవరకూ నీవొక రాయివి. గురువు చేయి పడగానే చెకుముకి అవుతావు. అంతవరకూ నీవొక ప్రవాహం. గురువు కాళ్లను తడపగానే దిశ గల్గి సారవంతమైన నేలకు మళ్లి విత్తుకు ప్రాణం పోస్తావు. అంతవరకూ కేవలం తోలు ముక్క. గురువు?... దానికి నాదం ఇస్తాడు. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేసినా ఎవరో ఒకరు ప్రేమగా ఆలనా పాలనా చేయగలరు. ప్రేమ పంచగలరు. కాని జ్ఞానం మాత్రం సరైన గురువే ప్రసాదిస్తాడు. గద్దించి బుద్ధి చెప్తాడు. కనుచూపుతోనే శాసించి కడుపులో కరుణ దాచుకుని ఎదిగే వరకూ చేయి పట్టి నడిపిస్తాడు. తల్లిదండ్రులు జన్మనిస్తే దానిని సార్థకం ఎలా చేసుకోవాలో గురువే తెలియచేస్తాడు. ఒక్క గురువు వేల జీవితాలకు దిక్సూచి. గొప్ప గొప్ప టీచర్లు ఎందరో. తెలియని మహానుభావులు ఎందరో. విద్యార్థులు ఎదిగేందుకు నిచ్చెనలుగా మారి వారు మాత్రం నేల మీదే ఉండిపోతారు. అలాంటి మహనీయులందరికీ 'టీచర్స్ డే' సందర్భంగా నమస్కారాలు. థ్యాంక్యూ టీచర్.

థ్యాంక్యూ టీచర్

నా బెస్ట్ టీచర్


డాక్టర్ ఎస్. మృదుల

ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్నారు డాక్టర్ ఎస్. మృదుల. హైదరాబాద్, బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్. ఉపాధ్యాయురాలిగా 34 ఏళ్లలో ఆమె దగ్గర పదివేల మంది విద్యార్థులు తెలుగు నేర్చుకున్నారు. తనను బోధనరంగం వైపు నడిపించింది సికింద్రాబాద్, ప్యాట్నీలోని తాను చదువుకున్న స్కూలు, ఆ స్కూల్ తెలుగు టీచర్ భువనేశ్వరి గారేనన్నారు డాక్టర్ మృదుల. అంటే ఈ బెస్ట్ టీచర్ మెచ్చుకున్న తన బెస్ట్ టీచర్ భువనేశ్వరి.

అంతా ఆ టీచర్ ప్రభావమే

'భువనేశ్వరి టీచర్ పద్యంలోని ప్రతి పదానికి అర్థం చెప్పడంతోపాటు, దానికి వ్యుత్పత్తి, ఆ పదాన్ని ప్రయోగించడం వెనుక కవి ఉద్దేశం చెప్పేవారు. కవితలు, కథలు రాయించేవారు. సభా నిర్వహణ చేయించేవారు. ఆమె ప్రభావంతోనే తెలుగు భాష మీద మక్కువ పెరిగింది. ఆ ప్రోత్సాహమే ఇప్పటికీ మయూఖ, తరుణి మ్యాగజైన్‌లలో కాలమిస్టుగా వ్యాసాలు రాయిస్తోంది. పాఠం చెప్పడంలో కూడా ఆమె బాటనే అనుసరిస్తున్నాను' అంటారు మృదుల.

సీతమ్మ బడి

మా స్కూల్ పేరు 'పరోపకారి బాలికోన్నత పాఠశాల'. సీతమ్మ అనే మహిళ కట్టించిన స్కూల్ కావడంతో సీతమ్మబడి అంటారు. కవితలు రాయడంతోపాటు స్కూల్లో జరిగే సభలు, సమావేశాల్లో చురుగ్గా ఉండేదాన్ని. చక్కటి తెలుగుతో వక్తలను వేదిక మీదకు ఆహ్వానించేదాన్ని. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఉన్నప్పుడు ఆకాశవాణిలోని యువవాణి కార్యక్రమంలో ప్రయోక్తగా ప్రముఖులను ఇంటర్వ్యూ చేశాను. అనౌన్స్‌మెంట్‌లు, వ్యాసాలు కథానికలు చదవడం... ఇలా కలం, గళం కలిసి కొనసాగాయి. ఇక బోధనరంగంలోకి వచ్చిన తర్వాత ప్రతిరోజూ ఇష్టమైన రోజుగానే గడిచింది.

నిత్యం విద్యార్థినే!

'నా విద్యార్థులకు నేను అసైన్‌మెంట్‌లు ఇచ్చినప్పుడు వాళ్లు కచ్చితంగా గడువులోపే పూర్తి చేయాలని కోరుకుంటాను. అలాగే అధికారుల నుంచి మాకు వచ్చే అసైన్‌మెంట్‌లను కూడా గడువులోపు పూర్తి చేసేదాన్ని. పనిని శ్రద్ధగా అంకితభావంతో చేయాలనుకుంటాను. మా కుటుంబంలో టీచర్‌లు లేరు. నేను టీచింగ్‌లోకి వచ్చినందుకు అమ్మానాన్న చాలా సంతోషించారు. కోవిడ్‌లో ఆన్‌లైన్ క్లాసులు చెప్పడానికి సాంకేతికపరంగా అవసరమైన సహాయం మా పిల్లలు చేసేవాళ్లు. కోవిడ్ తర్వాత కూడా అవసరాన్ని బట్టి ఆన్‌లైన్ క్లాసులను కొనసాగించాను. క్లాసులో పూర్తి కాని పాఠాలను ఇంటికి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో చెప్తున్నాను. టీచర్‌గా 'బెస్ట్ ఆన్‌లైన టీచర్, బెస్ట్ హెచ్ఓడీ, బెస్ట్ ఫ్యాకల్టీ' గౌరవాలందాయి. ఉపాధ్యాయురాలిగా ప్రభుత్వం నుంచి పురస్కారం అందుకోవడం ఇదే మొదటిసారి'' అని తన ఉపాధ్యాయ ప్రస్థానాన్ని వివరించారు డాక్టర్ మృదుల. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ రోజు ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆమె 'ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు'నందుకోనున్నారు.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

నా బెస్ట్ స్టూడెంట్స్


తన్నీరు శశి

ఉపాధ్యాయురాలిగా నేను 1992లో చాక్‌పీస్ పట్టుకున్నాను. తల్లిదండ్రులకు దూరంగా ఉన్న చిన్నారులు, అందులోనూ పేదింటి పిల్లలకు చదువు చెప్పేటప్పుడు చాలా బాధ్యతగా ఉండాలి. నా కన్నపిల్లలు ఇద్దరైతే 32 ఏళ్ల సర్వీస్‌లో దేవుడిచ్చిన పిల్లలు ఇరవై వేలకు పైనే.

జ్వరంతో పరీక్ష రాసింది

లక్ష్మి... చక్కగా చదివే అమ్మాయి. నేను వాళ్లకు మాథ్స్ టీచర్‌ని, హౌజ్ పేరెంట్‌ని కూడా. మాథ్స్ పరీక్షకు ముందు లక్ష్మికి అమ్మవారు పోసింది. ఒళ్లంతా కాలిపోతూ ఉంది. హాస్పిటల్‌కి తీసుకెళ్లి సెలైన్ పెట్టించి, బెడ్ పక్కనే ఉండి ధైర్యం చెపుతూ ఉన్నాను. ఉదయానికి జ్వరం కొంచెం తగ్గింది. 'పరీక్ష రాయగలవా?' అని అడిగాను.

'మీరు పక్కన ఉంటే రాస్తాను' అంది ధైర్యంగా. మెల్లిగా సెంటర్‌కి తీసుకొని వెళ్లాను. మా అబ్బాయికి కూడా ఆ రోజు పదో తరగతి పరీక్ష. కానీ ఈ పిల్లలే నా తొలి ప్రాధాన్యం. మొదటి అంతస్తు లో లక్ష్మి పరీక్ష గది.

'ఎక్కగలవా లక్ష్మీ?' అడిగాను. నీరసంగా బదులిచ్చింది. కొబ్బరి నీళ్లు తాగించి ఎగ్జామ్ హాల్‌లో పక్క పిల్లలకి లక్ష్మి గురించి చెప్పి కిందకు వచ్చాను.

రిజల్ట్ వచ్చింది. చక్కటి మార్క్స్. పదో తరగతి మార్కులతోనే పోస్ట్ ఆఫీస్ ఉద్యోగంలో చేరిందని తెలిసి ఎంత సంతోషం వేసిందో!

ఓల్డ్ స్టూడెంట్స్ నా దగ్గరకు వచ్చినప్పుడు 'పక్క వాళ్లకు మంచి చేస్తున్నారా? చెడు అలవాట్లు చేసుకున్నారా?' అని రెండు ప్రశ్నలు వేస్తాను. వాళ్లు 'మేము మీ స్టూడెంట్స్ మేడం' అంటారు. నా పిల్లలు ఇంజినీర్లు, టీచర్స్, నర్స్‌లు, ఎస్.ఐ, ప్రాజెక్ట్ మేనేజర్ లు, ఫిజియో థెరపిస్టులు... ఇందరికి అమ్మగా ఉండగల వరం ఇదిగో ఈ ఉపాధ్యా వృత్తిలోనే సాధ్యం. అబ్దుల్ కలాం గారి అడుగు జాడల్లో నడిచే నాకు ఇంతకంటే కావలసింది ఏముంది! చివరి క్షణం వరకూ అధ్యాపకురాలిగానే ఉంటాను.

చదువు కోసం పెళ్లిని వాయిదా వేసింది

'ఉమ'. పదో తరగతి మంచి మార్క్స్‌తో పాస్ అయింది. మా గురుకుల పాఠశాలలోనే ఇంటర్ చదివింది. రోజూ నా క్లాస్‌కి వచ్చి కొద్దిసేపు ఉండేది. ఎందుకలా అని అడిగినప్పుడు 'మా అమ్మను చూసినట్లు ఉంటుంది. ఇప్పుడు మీరు క్లాసుకు రావడం లేదు కదా! అందుకే రోజూ వచ్చి చూసి వెళ్తున్నాను' అని ఉమ చెప్తుంటే నాకు కన్నీళ్లాగలేదు. ఇంటర్ తరువాత మా ఇంటికి వచ్చి 'బీటెక్‌లో చేరడానికి కాలేజీలు ఆప్షన్స్ పెట్టండి... పదో తరగతి తరువాత పెళ్లి చేసుకోవద్దు... ఇంట్లో ఒప్పించి చదవండి అని మీరు చెప్పేవారు కదా. నేను మా నాన్నను అలాగే ఒప్పించి చదువుకోబోతున్నాను. చదువు తరువాతే పెళ్లి అని చెప్పేశాను' అంటున్న ఉమని చూస్తే తృప్తి. ఉమ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగంలో చేరింది. మరో ఇంజినీర్‌నే పెళ్లి చేసుకున్నది... అని తెలిసినప్పుడు సంతృప్తి.

- తన్నీరు శశి, గణిత అధ్యాపకురాలు, పుదూరు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, తిరుపతి జిల్లా

నేచరే టీచర్


బుల్‌బుల్ శర్మ

'ప్రకృతి అనే బడిలో ఎంతో మంది గురువులు ఉన్నారు' అంటుంది రచయిత్రి, ఇలస్ట్రేటర్ బుల్‌బుల్ శర్మ. తానే ఒక గురువుగా మారి ప్రకృతిని గురువుగా చేసుకుని ఎలాంటి పాఠాలు నేర్చుకోవచ్చో పిల్లలకు చెబుతోంది. వారి కోసం స్టోరీ, ఆర్ట్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది. క్లాస్‌రూమ్‌లో కూచుంటే టీచర్ మాత్రమే గురువు. అదే ప్రకృతి అనే క్లాస్‌రూమ్‌లోకి వెళితే ప్రతి తీవ, చెట్టు, పక్షి, ఊడ అన్నీ ఎన్నో నేర్పిస్తాయి పిల్లలకు. విషాదం ఏమంటే పిల్లలు ఈ అతి పెద్ద క్లాస్‌రూమ్‌ను మిస్ అవుతున్నారు అంటుంది శర్మ.

పిల్లలకు అడవి తెలియదు

'ఎలాంటి కాలంలో ఉన్నాం మనం? చెట్టు కనిపించడమే అపూర్వం, చెట్టు మీద పిట్ట కనిపించడం అద్భుతం అనుకునే కాలంలో ఉన్నాం. అక్కడెక్కడో చంద్రుడి మీద ఆవాసాల గురించి ఆలోచించే మనం చుట్టు ఉన్న ప్రకృతికి మాత్రం దూరం అవుతున్నాం. పిల్లలను ప్రకృతిలోకి తీసుకురావడానికి, అక్కడ పక్షులు అనే గురువులను వారికి పరిచయం చేయడానికి ఎన్నో కథలు రాశాను. బొమ్మలు వేశాను. వాటిని చూసిన, చదివిన పిల్లలు మనం కూడా పచ్చటి అడవిలోకి వెళదాం అనుకుంటారు' అంటుంది శర్మ.

ఫోన్ నుంచి ఫారెస్ట్‌కి

ఒక రోజు శర్మ ఫోన్ మోగింది. తనని తాను పరిచయం చేసుకున్న తరువాత 'మా అబ్బాయి మీ పుస్తకం చదివిన తరువాత ఫారెస్ట్‌కు తీసుకువెళ్లు, పక్షులు చూపించు అని ఒకటే అడగడం...' అని ఒక తల్లి శర్మతో ఫోన్‌లో చెబుతూ పోయింది. ఆ తల్లి గొంతులో పిల్లాడి మీద అసహనం లేదు. ఆమె మనసు సంతోషంతో నిండిపోయింది. బుల్‌బుల్ శర్మ పుస్తకాలు పిల్లలపై చూపిన సానుకూల ప్రభావం గురించి చెప్పడానికి ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. 'మీరు ఏం నేర్చుకున్నారు పక్షుల నుంచి' అని అడిగితే 'క్రమశిక్షణ, ఐక్యత. కష్టపడడం, ఆత్మవిశ్వాసం, ఎప్పుడూ సంతోషంగా ఉండడం, గుడ్ పేరెంటింగ్ ఇలా ఎన్నో మంచి విషయాలు పక్షుల నుంచి నేర్చుకోవచ్చు' అంటారు పిల్లలు. ఆమె ఏ స్కూల్లోనూ టీచర్‌గా పని చేయలేదు. కాని వందలాది విద్యార్థులకు ప్రియమైన గురువు. ఆమె పుస్తకాలే వారికి గురుబోధ. వారితో ఆమె చేయించే హోమ్‌వర్క్ పేరే అడవి.

పిల్లల కోసమే జీవితం

ఢిల్లీలో పుట్టిన బుల్‌బుల్ శర్మ భిలాయ్‌లో పెరిగింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో రష్యన్ లాంగ్వేజ్‌లో గ్రాడ్యుయేషన్ చేసి పై చదువుల కోసం మాస్కో స్టేట్ యూనివర్శిటీకి వెళ్లింది. స్వదేశానికి తిరిగివచ్చిన తరువాత పెయింటర్‌గా ప్రస్థానం ప్రారంభించింది. పిల్లల కోసం ఆమె రాసిన కథలు భారతీయ భాషలతో పాటు ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్.. మొదలైన విదేశీ భాషల్లోకి కూడా అనువాదం అయ్యాయి. తన పరిశీలన, ప్రయాణాల ఆధారంగా పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా రచనలు చేయడం బుల్‌బుల్ శర్మ శైలి. 'ఏమైనా నేర్చుకోవచ్చు. ఏ వయసులో అయినా నేర్చుకోవచ్చు. ఎవరి నుంచి అయినా నేర్చుకోవచ్చు' అనేది శర్మ నోటి నుంచి వినిపించే మాట.

బ్యూటిప్స్

చర్మకాంతికి మునగ

మునగ ఆకు ఆరోగ్యపరంగానే కాదు, సౌందర్య పోషణలోనూ మంచి ఫలితాలను ఇస్తుంది.

- అర టీ స్పూన్ మునగ ఆకు పొడి, టేబుల్ స్పూన్ తేనె, రోజ్ వాటర్ సగం టేబుల్ స్పూన్, తగినన్ని నీళ్లు కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, పది నిమిషాలు ఉంచాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరచాలి. శుభ్రమైన టవల్‌తో తుడిచి, కొద్దిగా మాయిశ్చరైజర్ రాసుకోవాలి. దీని వల్ల చర్మం మృదుత్వం, కాంతిమంతం అవుతుంది.
- మునగ ఆకు పొడి చర్మం ముడతలు తగ్గడానికి బాగా పనిచేస్తుంది. యవ్వనకాంతిని తీసుకు రావడంలో సహాయపడతుంది. మునగ ఆకు పొడిలో రోజ్‌వాటర్ కలిపి నల్ల మచ్చలు, యాక్నె ఉన్న చోట రాయాలి. ఆరిన తర్వాత శుభ్రపరచాలి. మచ్చలు, మొటిమలు, యాక్నె సమస్య తగ్గుతుంది.



న్యూస్‌మేకర్

గేలిచేస్తే గెలిచేసి...



పారిస్‌లో జరుగుతున్న పారా ఒలింపిక్స్‌లో మన వరంగల్ బిడ్డ దీప్తి జీవాన్‌జీ కాంస్యం సాధించింది. 400 మీటర్ల టీ20 విభాగంలో ఆమె ఈ ఘనతను లిఖించింది. పారా ఒలింపిక్స్‌లో ఏ విభాగంలో అయినా పతకం సాధించిన అతి చిన్న వయస్కురాలు దీప్తే. ఊర్లో అందరూ వెక్కిరించినా హేళనతో బాధించినా వారందరికీ తన విజయాలతో సమాధానం చెబుతోంది దీప్తి. ఒకనాడు హేళన చేసిన వారు నేడు ఆమె పేరును గర్వంగా తలుస్తున్నారు.

మొన్నటి మంగళవారం (సెప్టెంబర్ 3) పారిస్ పారా ఒలింపిక్స్‌లో దీప్తి పరుగు తెలుగు వారికీ దేశానికి గొప్ప సంతోషాన్ని గర్వాన్ని ఇచ్చింది. 400 మీటర్ల టీ20 (బుద్ధిమాంద్యం) విభాగంలో దీప్తి 55.52 సెకండ్లలో మూడోస్థానంలో నిలిచి కాంస్యం సొంతం చేసుకుంది. ఈ పోటీలో మొదటి స్థానంలో ఉక్రెయిన్‌కి చెందిన యూలియా (55.16 సెకండ్లు), రెండవ స్థానంలో టర్కీకి చెందిన ఐసెల్ (55.23) సెకన్లు నిలిచారు. ఇంకొన్ని సెకన్లలో ఆమెకు స్వర్ణమే వచ్చేదైనా ఈ విజయం కూడా అసామాన్యమైనదే ఆమె నేపథ్యానికి.

షూస్ లేని పాదాలు

దీప్తి స్వగ్రామం వరంగల్ జిల్లాలోని కల్లెడ. తల్లిదండ్రులు యాదగిరి, లక్ష్మి. పుట్టుకతో దీప్తి బుద్ధిమాంద్యంతో ఉంది. ఆమె రూపం కూడా పూర్తిగా ఆకారం దాల్చలేదు. దాంతో స్కూల్లో చుట్టుపక్కల అన్నీ హేళనలే. మాటల్లో వ్యక్తపరచడం రాని దీప్తి అన్నింటినీ మౌనంగా సహించేది. కొందరు 'కోతి' అని వెక్కిరించేవారు. స్కూల్లో ఆమె ఆటల్లో చరుకుదనం చూపించేసరికి తల్లిదండ్రులు కనీసం ఈ రంగంలో అయినా ఆమెను ప్రోత్సహిస్తే కొంత బాధ తగ్గుతుందని భావించారు. పిఇటీ టీచర్ బియాని వెంకటేశ్వర్లు ఆమెను ప్రోత్సహించారు. హనుమకొండలో స్కూల్ లెవల్‌లో ఆమె పరుగు చూసి ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ ప్రోత్సహించాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు హైదరాబాద్ రమ్మంటే షూస్ లేకుండా ఖాళీ పాదాలతో వచ్చిన దీప్తికి సహాయం అందించేందుకు నాగపురి రమేశ్ పూర్తి దృష్టి పెట్టాడు. దాంతో అంచలంచెలుగా ఎదిగిన దీప్తి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. పుల్లెల గోపీచంద్ కూడా ఆమె శిక్షణకు ఆర్థిక సహాయం అందించారు.

బంగారు పరుగు

2022లో మొరాకో వేదికగా జరిగిన ప్రపంచ పారా గ్రాండ్‌ప్రిలో 400 మీటర్ల పరుగులో పసిడితో మెరిసింది. అదే సంవత్సరం బ్రిస్బేన్ ఆసియానియా పోటీల్లో 200 మీటర్లలో 26.82 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడిపతకం గెలిచింది. 400 మీటర్లను 57.58 సెకన్ల వ్యవధిలోనే పూర్తి చేసి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. మే 2024లో జపాన్‌లో జరిగిన పారా అథ్లెటిక్స్‌లో ఏకంగా స్వర్ణం సాధించి రికార్డు సృష్టించింది. ఇప్పుడు పారిస్‌లో కాంస్యం సాధించడంతో ఆమె దేశ పతాకాన్ని తల ఎత్తుకునేలా చేసింది. ఒకప్పుడు గేలి చేసిన ఊరికి ఆమె పేరు ఇప్పుడు చిరునామాగా మారింది.

మన(సు)లో మాట

మందు మానేందుకు కూడా మందు ఉందా?

మా వివాహమై పదిహేనేళ్లయింది. పెళ్లికి ముందే ఆయనకు కొద్దిగా తాగుడు అలవాటుండేది. పోను పోను ఈ మధ్య మరీ ఎక్కువైంది. రెండేళ్ల నుండి పగలు రాత్రి తేడా లేకుండా, తాగుతున్నారు. తాగనప్పుడు ఎంత మంచిగా ఉంటారో, తాగితే అంత గొడవ చేస్తారు. పొద్దున లేస్తూనే, ఒళ్లంతా వణకటం, నీరసం, చికాకుగా, ... ఉండంటూ ఏ పనీ చేయలేకపోవడం, మళ్ళీ తాగితేనే గాని పని చేయలేనంటున్నారు. ఈ అలవాటు వల్ల, బిజినెస్ దెబ్బ తిని, చాలా నష్టపోవటమే కాకుండా, నలుగురిలో చులకన అయిపోయారు. పిల్లలు కూడా ఆయన్ను లెక్క చేయడం లేదు. తిండి, నిద్ర కూడా బాగా తగ్గి, చిక్కిపోయారు. ఇలాగే తాగుతుంటే ఆయన మాకు దక్కరేమోనని భయంగా ఉంది. డాక్టరు దగ్గరకు రమ్మంటే రావడం లేదు. మాకేదైనా పరిష్కారం చూపించగలరు.

– కోమలి, రాజమండ్రి



తాగుడుకు అలవాటు పడటమనేది కూడా, ఒక మానసిక జబ్బు కిందే వస్తుందన్నది చాలామందికి తెలియదు. సరదాగా ప్రారంభించి, చివరకు దానికి అలవాటు పడిపోతారు. మానాలనుకున్నా మానేయలేని స్థితికి వెళ్తారు. సమస్యొచ్చినా, సంతోషమొచ్చినా, ఏదో ఒక కారణం పెట్టుకుని చాలా మంది ఇలా తాగుడుకు బానిసలవుతారు. దీనివల్ల అన్ని విధాలా నష్టపోవడమే కాకుండా లివర్ దెబ్బతిని చివరకు 'సిరోసిస్' అనే వ్యాధి బారిన పడతారు. ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా తెగించి తాగే వారు కూడా చాలామంది ఉంటారు. మునుపటి కంటే ఇప్పుడు తాగుడు అలవాటు నుంచి పూర్తిగా విముక్తి కల్పించేందుకు ఆధునిక మానసిక వైద్య శాస్త్రంలో మంచి మందులు, చికిత్సా పద్ధతులు ఉన్నాయి. అయితే అందుకు ఆ వ్యక్తి సహకారం చాలా అవసరం. ఏదో ఒక విధంగా ఒప్పించి మీరు సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్ళే ప్రయత్నం చేయండి. మద్యం పైన తపన తగ్గించేందుకు 'యాంటీ క్రేవింగ్ డ్రగ్స్', మద్యం పై ఎవర్షన్ కలిగించేందుకు 'డిటరెంట్స్' అనే మందులతో పాటు, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, ఫ్యామిలీ కౌన్సెలింగ్ లాంటి మానసిక చికిత్సా పద్ధతులతో మీ వారిని ఆ అలవాటు నుంచి పూర్తిగా బయట పడేయవచ్చు.



- డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

తల్లిదండ్రులే టెక్ గురువులు



ఆఫ్‌లైన్‌లో బాలికలు/మహిళలపై జరుగుతున్న దారుణాలను మించి ఆన్‌లైన్‌లో చోటు చేసుకుంటున్నాయి అంటున్నారు సైబర్ నిపుణులు. ప్రతి పది మంది బాలికల్లో ఒకరు సైబర్ బెదిరింపులకు గురవుతున్నారని, మహిళలను లక్ష్యంగా చేసుకొని నేరాలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. తల్లిదండ్రులే ఆన్‌లైన్ గురువులుగా మారి బాలికలకు అవగాహన కల్పించాల్సిన అవసరం నేటి రోజుల్లో ఎంతో ఉంది.

సైబర్ నేరస్థులు ప్రధానంగా బాలికలు, మహిళలనే లక్ష్యంగా చేసుకుంటున్నారని నివేదికలు సూచిస్తున్నాయి. నేరస్థులు బాలికలు, మహిళల చిరునామాలు, ఆర్థిక వివరాలు, వ్యక్తిగత సంభాషణల వంటి సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తుంటారు. బాధితులు తమ డిమాండ్లను ఒప్పుకోకపోతే బాలికలు/మహిళల వ్యక్తిగత డేటాను బయటపెడతామని, అందరిలో పరువు పోతుందని నేరస్థులు బెదిరిస్తుంటారు. దీంతో ఎవరికీ చెప్పుకోలేక బాలికలు/మహిళలు నేరస్థులకు డబ్బులు పంపడం లేదా ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయాలకు రావడం జరుగుతుంటుంది. చాలా మంది బాధిత మహిళలు ఇలాంటి విషయాలు బయటకు చెప్పుకోవడానికి, పోలీసులకు కంప్లైంట్ చేయడానికి ఇష్టపడరు. ఇలాంటప్పుడు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు పెద్దలు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

భయపడకూడదు

మోసగాళ్లు అందుబాటులో ఉన్న మీ డేటాను, గత సోషల్‌మీడియా పోస్టింగ్‌లను, సోషల్ ఇంజనీరింగ్ నుండి సమాచారాన్ని పొంది, ఆన్‌లైన్ షేమింగ్ లేదా దోపిడీకి దారి తీస్తుంటారు. వాయిస్ మెసేజ్‌లు, ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా సంభాషణ జరిపి ఆ సమాచారంతో బెదిరింపులకు పాల్పడేవారి సంఖ్య పెరిగింది. మోసగాళ్లు మీలా నటిస్తూ నకిలీ ఖాతాను సృష్టిస్తారు. మీ పరిచయాల నుండి డబ్బు అడగడం, ద్వేషపూరిత మెసేజ్‌లు చేయచ్చు. ఆన్‌లైన్‌లో ఎవరి నుంచైనా అనైతిక ప్రవర్తనతో ఇబ్బంది పడితే భయపడకుండా కుటుంబ సభ్యులతో, టెక్నాలజీ మిత్రులతో పంచుకొని సరైన నిర్ణయం తీసుకోవాలి. స్కూళ్లలోనూ టీచర్లు టెక్నాలజీ విషయాల్లో అమ్మాయిలకు అవగాహన కల్పించడం తప్పనిసరి.



– అనీల్ రాచమల్ల
సైబర్ సేఫ్టీ నిపుణులు, ఎండ్ నౌ ఫౌండేషన్

టెక్నాలజీని పేరెంట్స్ నేర్చుకోవాలి...

పిల్లలను టెక్నాలజీ వాడకుండా అడ్డుపడకూడదు. పాజిటివ్ కోణంలోనే పిల్లలకు టెక్నాలజీని నేర్పాలి. పిల్లలతో పాటు పెద్దలూ టెక్నాలజీ జర్నీ చేయాలి.

- పిల్లలకు ఫోన్ ఇవ్వడంతో పాటు ఒక హద్దును సృష్టించాలి. అదే సమయంలో వయసును బట్టి ఫిల్టరింగ్ సాఫ్ట్‌వేర్స్‌ను వాడాలి.



మనో ధైర్యాన్ని పెంచుకోవాలి...


- ఏవరైనా వ్యక్తితో ఇబ్బంది ఉంటే ఆ వ్యక్తి అకౌంట్‌ని బ్లాక్ చేయాలి
- మనోధైర్యాన్ని పోగొట్టుకోకుండా ఏవైనా వీడియోలు, ఫొటోలు, చాటింగ్ సంభాషణ ... వంటివి ఉంటే డిలీట్ చేయకుండా బ్యాకప్ స్టోరేజ్ చేసుకోవాలి. పెద్దలతో మాట్లాడి https://cybercrime.gov.inలో కంప్లైంట్ చేయాలి.

క్రీడల్లో కొన్ని బౌండరీస్ ఎలా ఉంటాయో టెక్నాలజీ బౌండరీస్‌ను పెద్దలే గీయాలి
- టెక్ ఫోన్ ఫ్రీ జోన్స్ నిబంధనలను అమలు చేయాలి. (బెడ్‌రూమ్, డైనింగ్ ప్లేస్.. వంటి చోట్ల ఫోన్ వాడకూడదు..)
- YAPPY (యువర్ అడ్రస్, యువర్ ఫుల్‌నేమ్, యువర్ పాస్‌పోర్ట్...ఇలా పూర్తి వివరాలు) ఆన్‌లైన్‌లో ఎవరికీ ఇవ్వకూడదని చెప్పాలి
- ఫొటోలు/డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ చేసుకునే ముందు నిజనిర్ధారణ చేసుకోవాలి. డౌన్‌లోడ్స్‌కి వెళ్లకూడదు
- పనిష్మెంట్‌గా లేదా రివార్డ్‌గానూ ఫోన్/ట్యాబ్.. వంటి ఎలక్ట్రానిక్ ఐటమ్స్ పిల్లలకు ఇవ్వకూడదు
- స్క్రీన్ టైమ్– గ్రీన్ టైమ్‌కి తేడా తెలియాలి. వర్చువల్ గేమ్స్, గ్రౌండ్ గేమ్స్‌కి కండిషన్స్ పెట్టాలి
- వయసుకు తగ్గట్టుగా ఆడే ఆన్‌లైన్ గేమ్స్‌కి కొన్ని కంట్రోల్స్ ఉంటాయి. వాటిని పాటించేలా జాగ్రత్తపడాలి.

బొట్టు బిళ్లతో కవర్ చేయాలి...

- ఏదైనా వెబ్‌సైట్ https:// (ప్యాడ్‌లాక్ సింబల్ ఉన్న సైట్‌నే ఓపెన్ చేయాలి. పాస్‌వర్డ్ ఎప్పుడూ (క్యాపిటల్, స్మాల్ లెటర్స్, నంబర్స్) ఉండే విధంగా సెట్ చేసుకోవాలి
- ఫోన్ ఇతర గ్యాడ్జెట్స్ లొకేషన్ ఎప్పుడూ ఆఫ్ చేసుకోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆన్ చేసి, మళ్లీ ఆఫ్ మోడ్‌లో ఉంచాలి
- వెబ్ కెమెరాను బొట్టు బిళ్లతో కవర్ చేసుకోవడం మేలు. ఫోన్‌లోనూ వెబ్ క్యామ్ అనేబుల్ క్యాప్షన్‌లో ఉంచాలి
- తెలిసిన పరిచయాలు కాంటాక్ట్స్‌లో ఉండాలి. పరిచయస్తులతో మాత్రమే సంభాషణ జరపాలి
- యాప్స్ కూడా ప్లే స్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేయాలి. ఆసక్తిగా కనిపించిన లింక్స్ అన్నీ ఓపెన్ చేయద్దు.

ఎట్టకేలకు గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో అ‘మెరిక’న్


ఫ్రిట్జ్

న్యూయార్క్: సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. ఎట్టకేలకు 2009 తర్వాత గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో అమెరికా ప్లేయర్‌ను ఫైనల్లో చూడబోతున్నాం. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో అమెరికా ఆటగాళ్లు టేలర్ ఫ్రిట్జ్, ఫ్రాన్సెస్ టియాఫో సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. తొలి సెమీఫైనల్లో వీరిద్దరు ముఖాముఖిగా తలపడనున్నారు. దాంతో ఓ అమెరికా ప్లేయర్ యూఎస్ ఓపెన్ టైటిల్ పోరుకు అర్హత సాధించడం ఖాయమైంది. 2009 వింబుల్డన్ టోర్నీలో ఆండీ రాడిక్ తర్వాత మరో అమెరికా ప్లేయర్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి క్వార్టర్ ఫైనల్లో 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-6 (7/2), 3-6, 6-4, 7-6 (7/3)తో నాలుగో సీడ్ 2020 రన్నరప్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను బోల్తా కొట్టించాడు. తొమ్మిదో సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా)తో జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో 20వ సీడ్ టియాఫో 6-3, 6-7 (5/7), 6-3, 4-1తో గెలుపొందాడు. నాలుగో సెట్‌లో టియాఫో 4-1తో ఆధిక్యంలో ఉన్న దశలో దిమిత్రోవ్ గాయంతో వైదొలిగాడు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్), ముకోవా (చెక్ రిపబ్లిక్) సెమీఫైనల్లోకి ప్రవేశించారు.


టియాఫో

‘టోక్యో’ను దాటేసి...

ఊహించినట్లుగానే భారత పారాలింపియన్లు గత విశ్వ క్రీడలకంటే మరింత మెరుగైన ప్రదర్శనతో సత్తా చాటారు. 2020 టోక్యో కీడల్లో ఓవరాల్‌గా 19 పతకాలు గెలుచుకున్న మన బృందం ఇప్పుడు దానిని అధిగమించింది. బుధవారం పోటీలు ముగిసేసరికి భారత్ ఖాతాలో మొత్తం 22 పతకాలు చేరాయి. మంగళవారం అర్ధరాత్రి దాటాక హైజంప్‌లో శరద్ కుమార్, తంగవేలు మరియప్పన్ వరుసగా రజత, కాంస్య పతకాలు గెలుచుకోగా... ఆ తర్వాత జావెలిన్ త్రోలో ఇలాగే అజీత్ సింగ్, సుందర్ సింగ్ లకు వరుసగా రజత, కాంస్యాలు లభించాయి. దీంతో మన బృందం టోక్యో ప్రదర్శనను దాటగా... షాట్‌పుట్‌లో సచిన్ సాధించిన రజతంతో, ఆర్చరీలో హర్విందర్ సింగ్ గెలిచిన స్వర్ణంతో ఈ సంఖ్య మరింత పెరిగింది. వరుసగా మూడో పారాలింపిక్స్‌లోనూ పతకం గెలిచిన తమిళనాడు ప్లేయర్ తంగవేలు ప్రదర్శన ఈ క్రీడల్లో హైలైట్‌గా నిలిచింది.


హర్విందర్

పారిస్: పారాలింపిక్స్‌లో భారత్‌కు అథ్లెటిక్స్ క్రీడాంశంలో పతకాల పంట పండింది. ఇప్పటికే జట్టుకు ఇందులో 11 మెడల్స్ లభించాయి. పురుషుల హైజంప్ టి63 ఈవెంట్‌లో ఇద్దరు భారత ఆటగాళ్లు పోడియంపై నిలిచారు. 1.88 మీటర్ల ఎత్తుకు జంప్ చేసిన శరద్ కుమార్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకున్నాడు. సీనియర్ అథ్లెట్ మరియప్పన్ తంగవేలుకు ఈ ఈవెంట్‌లోనే కాంస్యం దక్కింది. అతను 1.85 మీటర్ల ఎత్తుకు ఎగిరాడు. మరో భారత ప్లేయర్ శైలేష్ కుమార్‌కు నాలుగో స్థానం (1.85 మీటర్లు) దక్కింది. ఇద్దరి స్కోర్లూ సమానంగానే ఉన్నా... తక్కువసార్లు విఫలమైన తంగవేలుకు పతకం ఖరారైంది. ఈ పోటీలో ఎజ్రా ఫ్రెంచ్ (అమెరికా; 1.94 మీటర్లు) స్వర్ణ పతకం సాధించాడు. ఆ తర్వాత పురుషుల జావెలిన్ త్రో ఎఫ్46 ఈవెంట్‌లో భారత అథ్లెట్ అజీత్ సింగ్ రజత పతకం సొంతం చేసుకున్నాడు. అతను తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేస్తూ జావెలిన్‌ను 65.62 మీటర్ల దూరం విసిరాడు. అతని తర్వాత మూడో స్థానంలో నిలిచి సుందర్ సింగ్ గుర్జర్ కాంస్యం గెలుచుకున్నాడు. సుందర్ విసిరిన జావెలిన్ 64.96 మీటర్లు వెళ్లింది. ఇందులో క్యూబాకు చెందిన గిలెర్మో గొంజాలెజ్ (66.14 మీటర్లు) స్వర్ణం గెలుచుకున్నాడు.

హర్విందర్ ‘పసిడి’ గురి

పురుషుల ఆర్చరీ రికర్వ్ వ్యక్తిగత విభాగంలో హర్విందర్ సింగ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఫైనల్లో హర్విందర్ 6-0తో (28-24, 28-27, 29-25) లుకాస్ సిసిజెక్ (పోలాండ్)పై గెలుపొందాడు. 2020 టోక్యో పారాలింపిక్స్‌లో హర్విందర్ కాంస్య పతకాన్ని గెలిచాడు.

సత్తా చాటిన సచిన్...

పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 ఈవెంట్‌లో భారత ఆటగాడు సచిన్ ఖిలారి రజత పతకంతో మెరిశాడు. ఈ ఈవెంట్‌లో ప్రపంచ చాంపియన్ అయిన సచిన్ తన రెండో ప్రయత్నంలో ఇనుప గుండును అత్యుత్తమంగా 16.32 మీటర్లు విసిరాడు. స్కూల్‌లో చదివే రోజుల్లోనే జరిగిన ప్రమాదం తర్వాత నుంచి సచిన్ ఎడమచేయి పని చేయలేదు. పలు శస్త్రచికిత్సల తర్వాత కూడా పరిస్థితి మారలేదు. 2015లో ఆటల్లోకి ప్రవేశించి ముందుగా జావెలిన్‌లో ప్రయత్నం చేసిన అతను ఆ తర్వాత షాట్‌పుట్‌కు మారాడు. గత ఆసియా పారా క్రీడల్లో అతను స్వర్ణం సాధించాడు. మెకానికల్ ఇంజినీర్ అయిన సచిన్ ప్రస్తుతం పలు విద్యా సంస్థల్లో విజిటింగ్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నాడు.


అజీత్

మరోవైపు టేబుల్ టెన్నిస్‌లో భవీనాబెన్ పటేల్ పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. టోక్యోలో రజతం సాధించిన భవీనా ఈసారి క్వార్టర్స్‌లో 12-14, 9-11, 11-8, 6-11 స్కోరుతో యింగ్ జూ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. షూటింగ్‌లో 50 మీటర్ల మిక్స్‌డ్ పిస్టల్ ఈవెంట్ (ఎస్‌హెచ్1)లో భారత ఆటగాళ్లు నిహాల్ సింగ్, రుద్రాంశ్ ఖండేల్‌వాల్ క్వాలిఫయింగ్‌లోనే విఫలమైన ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భారత పారాలింపిక్స్ చరిత్రలో అత్యధిక పతకాలు

- గత విశ్వ క్రీడల పతకాల సంఖ్యను అధిగమించిన మన బృందం
- ప్రస్తుతం భారత్ ఖాతాలో 22 పతకాలు
- వరుసగా మూడో పారాలింపిక్స్‌లో తంగవేలుకు పతకం
- ఆర్చరీలో స్వర్ణం నెగ్గిన హర్విందర్


సచిన్


శరద్


సుందర్

తంగవేలు తీన్‌మార్





- వరుసగా మూడో పారాలింపిక్స్‌లో పతకం
- ఈ ఘనత సాధించిన తొలి భారత ప్లేయర్‌గా గుర్తింపు

ఒకటి, రెండు, మూడు... అతని అడుగులు వేగంగా పడ్డాయి. ఎప్పటిలాగే ఒంటి కాలిపై వేగంగా ముందుకు దూసుకుపోయి చేసిన జంప్ మరో పారాలింపిక్ పతకాన్ని అందించింది. ఒకటి కాదు రెండు కాదు ఇది వరుసగా మూడో పారాలింపిక్ మెడల్... ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా 29 ఏళ్ల మరియప్పన్ తంగవేలు సగర్వంగా నిలిచాడు. హైజంప్‌లో ఎదురులేకుండా సాగిన అతను 2016 ‘రియో’లో స్వర్ణం, 2020 ‘టోక్యో’లో రజతం గెలవగా... 2024 ‘పారిస్’లో కాంస్యం దక్కింది. ఐదేళ్ల వయసులో అంగవైకల్యాన్ని ఎదుర్కొన్న రోజు నుంచి ఇప్పుడు పారా క్రీడల్లో భారత పతాకాన్ని రెపరెపలాడించే వరకు తంగవేలు సాగించిన ప్రస్థానం అసాధారణం, అందరికీ స్ఫూర్తిదాయకం.

పేదరికానికి చిరునామాలాంటి కుటుంబంలో జన్మించిన తంగవేలుకు అనూహ్యంగా ఎదురైన వైకల్యం కష్టాలతో పాటు అతనిలో పట్టుదలను కూడా పెంచింది. తమిళనాడు సేలం వద్ద ఒక చిన్న గ్రామం అతనిది. ఆరుగురు పిల్లల కుటుంబంలో అతనొకడు. తండ్రి పట్టించుకోకపోవడంతో తల్లి కూలీ పని, ఆపై కూరగాయలు అమ్మి తీవ్ర ఇబ్బందుల మధ్య పిల్లలను పెంచింది. అలాంటి స్థితిలో ఐదేళ్ల వయసులో స్కూల్‌కు వెళుతుండగా బస్సు ఢీకొనడంతో కుడికాలు కింది భాగాన్ని కోల్పోయాడు. శస్త్ర చికిత్స తర్వాత కూడా దానిని ఏం చేయలేమని డాక్టర్లు తేల్చేశారు. కానీ స్కూల్ స్థాయిలో కూడా ఆ చిన్నారి ఎలాంటి బాధను తన దరిచేరనీయలేదు. తనకు స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం. అందుకే స్కూల్‌లో ఆ కాలుతోనే అన్ని క్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధపడిపోయేవాడు. అన్ని సక్రమంగా ఉన్నవారితో మరీ పోటీ పడి గెలిచేవాడు కూడా. తాను ఎవరికంటే తక్కువ కాదనే భావనను ఇది కలిగించిందని అతను చెప్పుకునేవాడు. వేర్వేరు క్రీడలతో మొదలైనా పీఈటీ సర్ సూచన మేరకు హైజంప్‌ను అతను తన గేమ్‌గా మార్చుకున్నాడు. ఇదే జోరులో ఎక్కడ అవకాశం దొరికినా పోటీలో పాల్గొంటూ జాతీయ పారా క్రీడల వరకు తంగవేలు చేరుకున్నాడు.

దివ్యాంగుల క్రీడల్లో శిక్షణ ఇవ్వడంతో మేటి అయిన సత్యనారాయణ దృష్టిలో పడటం తంగవేలు కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆయన శిక్షణలో అసలైన ప్రొఫెషనల్ తరహా కోచింగ్ తంగవేలుకు లభించింది. ఫలితంగా పారా క్రీడల్లో తంగవేలుకు వరుస విజయాలు దక్కాయి. ఈ క్రమంలో 2016 రియో పారాలింపిక్స్‌కు అర్హత సాధించడంతో అతని గురించి ప్రపంచానికి తెలిసింది. ఇక ఆ తర్వాత ఒలింపిక్ పతకం, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు తంగవేలుకు పేరు తెచ్చిపెట్టాయి. క్రీడల్లో గుర్తింపు తెచ్చుకొని కొంత డబ్బు రాగానే అతను కుటుంబ కనీస అవసరాలపైనే దృష్టి పెట్టాడు. ముందుగా అమ్మ కోసం కొంత పొలం కొనడం, ఊర్లో సొంత ఇల్లు కట్టుకోవడంవంటివే చేశాడు. ‘అర్జున’... ‘పద్మశ్రీ’... ‘ఖేల్ రత్న’ అవార్డుల తర్వాత స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌గా ఉద్యోగం కూడా దక్కడంతో తంగవేలు స్థిరపడ్డాడు. ఇప్పుడు మూడో ఒలింపిక్ పతకంతో పారా క్రీడల్లో శాశ్వత కీర్తిని అందుకున్నాడు.


- సాక్షి క్రీడావిభాగం

హెడ్ 25 బంతుల్లో 80

ఎడిన్‌బరో: ఓపెనర్ ట్రావిస్ హెడ్ (25 బంతుల్లో 80; 12 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఫలితంగా స్కాట్లాండ్‌తో బుధవారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట స్కాట్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. అనంతరం ఆస్ట్రేలియా 9.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 156 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ మార్ష్ (12 బంతుల్లో 39; 5 ఫోర్లు, 3 సిక్సర్లు), ఇంగ్లిస్ (13 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరిశారు.

మేము సైతం





ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ ఎప్పుడూ ముందుంటుంది. ఇటీవల కేరళలో సంభవించిన వరదల సమయంలో తెలుగు నటులు కొందరు భారీ విరాళాలు ప్రకటించారు. తాజాగా తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితుల సహాయార్థం తెలుగు హీరోలు, నిర్మాతలు, హీరోయిన్లు ‘మేము సైతం’ అంటూ విరాళాలు ప్రకటించారు.













- ‘‘తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు కలచి వేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నిర్దేశంలో రెండు ప్రభుత్వాలు శాయశక్తులా పరిస్థితిని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నాయి. మనందరం ఏదో విధంగా సహాయక చర్యల్లో పాలు పంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగా రెండు రాష్ట్రాలలో ప్రజల ఉపశమనానికి తోడ్పాటుగా నా వంతు కోటి రూపాయలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కి 50 లక్షలు చొప్పున) విరాళంగా ప్రకటిస్తున్నాను’’ అంటూ ‘ఎక్స్’లో షేర్ చేశారు చిరంజీవి.

- ‘‘అక్కినేని నాగేశ్వరరావు గారు ఆపదలో ఆదుకోవడానికి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలవడానికి ఎప్పుడూ ముందుండేవారు. వరద బాధితులని ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయ నిధికి యాభై లక్షల రూపాయల చొప్పున విరాళంగా అందిస్తున్నాం. ఈ సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు అండగా నిలుస్తాం. వరద దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి’’ అని అక్కినేని కుటుంబం పేర్కొంది. విశాఖపట్నంలోని అలు ఫ్లోరైడ్ లిమిటెడ్, హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని కుటుంబానికి చెందిన గ్రూప్ కంపెనీస్ ఈ విరాళాన్ని అందజేస్తున్నాయి.

- తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితుల సహాయార్థం రూ. 6 కోట్ల విరాళం ప్రకటించారు నటుడు, జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి, ఏపీ పంచాయతీ రాజ్ మంత్రిగా ఉన్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వరద ముంపు బారిన పడిన 400 పంచాయితీలకు రూ. 1 లక్ష చొప్పున రూ. 4 కోట్లు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి, ఇలా మొత్తంగా రూ. ఆరు కోట్లను పవన్ కల్యాణ్ విరాళంగా అందించనున్నారు.

- తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితుల సహాయార్థం ప్రభాస్ రూ. 2 కోట్లు విరాళాన్ని అందజేయనున్నట్లుగా ఆయన సిబ్బంది వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి కోటి రూపాయల చొప్పున విరాళం అందించనున్నట్లుగా ప్రభాస్ టీమ్ పేర్కొంది.

- ‘‘వర్షాలు, వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు మనం చేయూత అందించాల్సిన సమయం ఇది. నా వంతు బాధ్యతగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కోటి రూపాయలు విరాళంగా ప్రకటిస్తున్నా’’ అంటూ రామ్‌చరణ్ ‘ఎక్స్’లో షేర్ చేశారు.

- ‘‘తెలుగు రాష్ట్రాల్లోని వరద పరిస్థితులను చూస్తుంటే బాధగా ఉంది. నా వంతుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి కోటి రూపాయల విరాళం అందిస్తున్నాను’’ అంటూ ‘ఎక్స్’లో షేర్ చేశారు అల్లు అర్జున్.

- తెలుగు రాష్ట్రాల్లోని వరదల కారణంగా ప్రజలు పడుతున్న కష్టాల్ని చూసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రుల సహాయ నిధులకు రూ. 10 లక్షల చొప్పున 20 లక్షలు... అలాగే విజయవాడలోని అమ్మ ఆశ్రమం, ఇతర స్వచ్ఛంద సంస్థలకు రూ .5 లక్షలు.. ఇలా మొత్తంగా రూ. 25లక్షలను విరాళంగా ప్రకటిస్తున్నట్లుగా వెల్లడించారు సాయిదుర్గా తేజ్.

- తెలుగు రాష్ట్రాల్లో వరదల కారణంగా నెలకొన్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో తన వంతుగా సహాయ కార్యక్రమాలు చేస్తున్నానని, తన సిబ్బంది వరద బాధితులకు ఆహారం, తాగునీరు, మెడికల్ కిట్స్ అందిస్తూ, సహాయ కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొంటున్నారని సోనూసూద్ తెలిపారు.


బుధవారం పైన పేర్కొన్న నటులు విరాళం ప్రకటించగా, అంతకుముందు విరాళం ప్రకటించినవారి వివరాల్లోకి వెళితే...

ఏపీ, తెలంగాణ సీఎంల సహాయ నిధికి రూ. 50 లక్షలు చొప్పున కోటి రూపాయలు బాలకృష్ణ, మహేశ్‌బాబు, ఎన్టీఆర్ విరాళంగా ప్రకటించారు. దర్శకుడు త్రివిక్రమ్- ఎస్. రాధాకృష్ణ-ఎస్. నాగవంశీ ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 25 లక్షలు అందజేస్తున్నట్లుగా తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు 15 లక్షల రూపాయల చొప్పున మొత్తంగా రూ. 30 లక్షలు విరాళంగా ప్రకటించారు సిద్ధు జొన్నలగడ్డ. విశ్వక్ సేన్, దర్శకుడు వెంకీ అట్లూరి మొత్తంగా పది లక్షలు, హీరోయిన్ అనన్య నాగళ్ల 5 లక్షలు (ఏపీ 2.5 లక్షలు, తెలంగాణకు 2.5 లక్షలు) విరాళం ప్రకటించారు. దర్శకుడు-నటుడు తల్లాడ సాయికృష్ణ రూ. లక్షా యాభై వేలుని ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు విరాళంగా ప్రకటించారు.

సినిమా

- ఏయన్నార్ శత జయంతి సందర్భంగా

కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్ ఫిల్మ్ ఫెస్టివల్



ప్రముఖ దివంగత నటులు అక్కినేని నాగేశ్వరరావు నటించిన కొన్ని క్లాసిక్ చిత్రాలు మళ్లీ థియేటర్స్‌లో ప్రదర్శితం కానున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు 20న అక్కినేని నాగేశ్వరరావు నూరవ జయంతిని పురస్కరించుకుని ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ ‘ఏయన్నార్ 100 – కింగ్ ఆఫ్ ది సిల్వర్‌స్క్రీన్’ పేరుతో ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ప్రకటించింది. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు వంటి మెట్రో సిటీస్‌తో పాటు వరంగల్, కాకినాడ, తుముకూరు, వడోదర, జలంధర్, రూర్కెలా సహా 25 నగరాల్లో సెప్టెంబర్ 20 నుంచి 22 వరకు 10 క్లాసిక్స్ చిత్రాలను ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ– ‘‘మా నాన్నగారి 100వ జయంతిని దేశవ్యాప్తంగా ఆయన ల్యాండ్‌మార్క్ సినిమాల ఫెస్టివల్‌తో జరుపుకోనుండటం ఆనందంగా ఉంది. మన రాష్ట్రంలో తెలుగు చిత్ర పరిశ్రమకు తొలి పునాది వేసి అన్నపూర్ణ స్టూడియోస్‌ను స్థాపించి మార్గ దర్శకునిగా నిలిచారు. ఆయన లెగసీని కొనసాగించడం మాకు గర్వంగా వుంది. ఈ పండగను సాధ్యం చేయడంలో మాతో భాగస్వామ్యం అయినందుకు అక్కినేని కుటుంబం మొత్తం ఎన్‌ఎఫ్‌డీసీ–ఎన్‌ఎఫ్ఎఐ, పీవీఆర్–ఐనాక్స్‌కి ధన్యవాదాలు’’ అని అన్నారు. ‘‘తెలుగు సినీ లెజెండ్ శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గౌరవార్థం ఈ ఫెస్టివల్ చేయడం హ్యాపీగా ఉంది’’ అన్నారు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ ఫిల్మ్ మేకర్, డైరెక్టర్ శివేంద్ర సింగ్ దుంగార్‌పూర్. ‘‘ఒక దిగ్గజ నటుడికి నివాళులర్పించడం మాత్రమే కాదు, భారతీయ సినిమా యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి, ప్రచారం చేయడానికే ఈ పండగ’’ అని తెలిపారు ఎన్‌ఎఫ్‌డీసీ–నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ, మేనేజింగ్ డైరెక్టర్ పృథుల్ కుమార్.

- రోటి కపడా... పోస్టర్



ఎమోషనల్ రైడ్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘రోటి కపడా రొమాన్స్’. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో సృజన్ కుమార్ బొజ్జం, బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను అక్టోబరు 4న రిలీజ్ చేయనున్నట్లుగా దర్శక-నిర్మాతలు వెల్లడించారు. ‘‘యూత్‌ఫుల్ ఎమోషనల్ రైడ్‌గా ఈ చిత్రం అలరిస్తుంది’’ అని చిత్రబృందం పేర్కొంది.

కన్నడ పరిశ్రమలోనూ హేమా తరహా కమిటీ కావాలి

- ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యకు ‘ఫైర్’ వినతి పత్రం


సుదీప్


కవితా లంకేశ్

‘‘మలయాళ పరిశ్రమలో జస్టిస్ హేమా కమిటీని ఏర్పాటు చేసినట్లుగా కన్నడంలోనూ ఓ కమిటీ ఉండాలి. సుప్రీమ్ కోర్టు లేక హై కోర్టు రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో ఆ కమిటీని ఏర్పాటు చేయాలి’’ అంటూ కర్ణాటకకు చెందిన ‘ఫిల్మ్ ఇండస్ట్రీ ఫర్ రైట్స్ అండ్ ఈక్విటీ’ (ఫైర్) కర్ణాటక ప్రభుత్వాన్ని కోరింది. కన్నడ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, ఇతర సమస్యలపై నివేదిక తీసుకురావాలని ‘ఫైర్’ సభ్యులు కోరారు. బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యకు తమ డిమాండ్లను తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ వినతి పత్రంలో పలువురు నటీనటులు, రచయితలు.... ఇలా మొత్తం 153 మంది సంతకం చేశారు. వీరిలో నటుడు కిచ్చా సుదీప్, నటీమణులు రమ్య, ఆషికా రంగనాథ్, శ్రద్ధా శ్రీనాథ్, ‘ఫైర్’ అధ్యక్షురాలు, దర్శకురాలు, రచయిత కవితా లంకేశ్ వంటివారు ఉన్నారు. ‘‘కేఎఫ్ఐ’ (కన్నడ ఫిల్మ్ ఇండస్ట్రీ)లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, ఇతర సమస్యలపై సమగ్ర విచారణ జరపాలి. కర్ణాటక పరిశ్రమలో పని చేస్తున్న మహిళలకు సురక్షితమైన, సమానమైన పని వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి, వారిపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడానికి సమగ్రమైన చర్యలు చేపట్టాలి’’ అని ఆ వినతి పత్రంలో ‘ఫైర్’ పేర్కొంది. కాగా ‘మీటూ’ ఉద్యమం ఊపందుకున్న సమయంలో 2018లో ‘ఫైర్’ సంస్థ ఆరంభమైంది. దేశంలోనే మొట్టమొదట ‘ఐసీసీ’ (పరిశ్రమలో జరుగుతున్న అంతర్గత ఫిర్యాదుల కమిటీ)ని స్థాపించడంలో ‘ఫైర్’ కీలక పాత్ర పోషించింది. లైంగిక వేధింపులకు గురైన వారికి న్యాయ సహాయం అందించడానికి ‘ఫైర్’ కృషి చేస్తూ వస్తోంది.

అందరం మాట్లాడుకుంటున్నాము కానీ...


- సమంత



మలయాళ చిత్ర పరిశ్రమలోని జస్టిస్ హేమా కమిటీ తరహాలో తెలుగులోనూ ఓ కమిటీ రావాలని, తెలుగు ఇండస్ట్రీలో మహిళల కోసం ఏర్పాటు చేయబడిన 2019 సబ్ కమిటీ నివేదికను బయట పెట్టాలని సమంత ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. తాజాగా సమంత ఇన్‌స్టాలో షేర్ చేసిన మరో పోస్ట్ వైరల్ అవుతోంది. ‘‘ఆగస్టు నెల గడిచిపోయింది. 2012లో జరిగిన హత్యాచార ఘటన తరహాలోనే ఇటీవల కోల్‌కతాలోనూ జరిగింది... ఘటనలు జరుగుతున్నాయి. వీటి గురించి మనందరం మాట్లాడుకుంటున్నాం. ఈ ఘటనల హైప్ మెల్లిగా తగ్గిపోతుంది. మనం కూడా మన పనులతో ముందుకెళ్తుంటాం. మళ్లీ ఘటన జరుగుతుంది’’ అంటూ సమంత ఆ పోస్ట్‌లో షేర్ చేశారు. ఇదిలా ఉంటే... తాను గాయపడ్డ విషయాన్ని తెలియజేస్తూ సమంత ఇన్‌స్టాలో మరో పోస్ట్ షేర్ చేశారు. ‘‘గాయాలు లేకుండా నేను యాక్షన్ స్టార్ కాలేనా?’’ అంటూ సమంత ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. దీన్నిబట్టి ఆమె ఏదో సినిమా సెట్‌లో గాయపడి ఉంటారని ఊహించవచ్చు.

ఆరోపణలు నిజమైతే ఐదేళ్లు బహిష్కరణ

- దక్షిణ భారత నటీనటుల సంఘం తీర్మానం


ఖుష్బూ, రోహిణి, సుహాసిని

నటీమణులపై లైంగిక వేధింపుల వ్యవహారంలో కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హేమా కమిటీ ప్రభావం ఇతర ఇండస్ట్రీల్లోనూ చర్చనీయాంశమైంది. దీంతో దక్షిణ భారత నటీనటుల సంఘం (నడిగర్ సంఘం) నటీమణులపై లైంగిక వేధింపుల వ్యవహారంలో చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం చెన్నైలోని ఆ సంఘం నిర్వాహకుల సమావేశంలో కొన్ని తీర్మానాలు చేశారు. ఇందులో ముఖ్యంగా విశాఖ కమిటీ సూచనల మేరకు నటీమణుల రక్షణ కోసం ఎస్ఐఏఏ-జీఎస్ఐసీసీ పేరుతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తీర్మానం చేశారు. దీనికి నటి రోహిణి అధ్యక్షురాలిగానూ, నటీమణులు సుహాసిని, ఖుష్బూ సభ్యులుగానూ వ్యవహరిస్తారు. ఈ కమిటీకి ఒక న్యాయవాదిని నియమించనున్నారు. నటీమణులపై లైంగిక వేధింపులు రుజువైతే అందుకు కారణమైన వారిని సినిమాల నుంచి 5 ఏళ్లు బహిష్కరించాలని నిర్మాతల మండలికి సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా బాధిత నటీమణులకు చట్టపరంగా సహాయాలను అందించడం జరుగుతుందన్నారు. అలాగే బాధితుల ఫిర్యాదుల కోసం ఇప్పటికే ఫోన్ నంబర్ ఏర్పాటు చేశామనీ, తాజాగా ఈమెయిల్ ద్వారానూ ఫిర్యాదులు చేయవచ్చనీ తీర్మానం చేశారు. కాగా యూట్యూబ్ ఛానల్స్ కారణంగా బాధితులైనవారు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ కమిటీ వారికి సహకరిస్తుందని, కమిటీ చర్యలను నటీనటుల సంఘం పర్యవేక్షిస్తుందని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచి మురుగన్, కోశాధికారి కార్తీ పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	202	81,834
నిఫ్టీ ▽	81	25,199

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,139	△	3
డోజోన్స్	40,887	▽	50
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,360	▽	28
డాక్స్	18,592	▽	155
షాంఘై	2,784	▽	19
నికాయ్	37,048	▽	1,639

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	71,295 ▽	199
బంగారం (99.5 స్వచ్ఛత)	71,010 ▽	198
వెండి (కేజీ)	81,337 ▽	941


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.55	84.57
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	108.87	111.48
€	యూరో	ఒకటి	91.71	94.10
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.13	58.43
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.34	57.28
S$	సింగపూర్ డాలర్	భారతీయకరెన్సీ	62.25	66.59
SAR	సౌదీ రియాల్	భారతీయకరెన్సీ	21.50	23.04
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయకరెన్సీ	21.98	23.74
¥	చైనా యువాన్	భారతీయకరెన్సీ	10.92	12.74

ఏ బ్యాంకు నుంచైనా

ఈపీఎస్ పింఛను

2025 జనవరి నుంచి అమలు ● కార్మిక శాఖ మంత్రి మాండవీయ



న్యూఢిల్లీ: ఈపీఎఫ్‌వో నిర్వహణలోని 'ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్' (ఈపీఎస్) 1995 కింద దేశవ్యాప్తంగా ఏ బ్యాంకు శాఖ నుంచి అయినా పింఛను పొందొచ్చని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. వచ్చే జనవరి నుంచి ఇది అమల్లోకి వస్తుందన్నారు. ఈపీఎఫ్‌వో అత్యున్నత నిర్ణయాల మండలి అయిన 'సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్'కు కార్మిక శాఖ మంత్రి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తుంటారు. ఈపీఎస్ 1995 పరిధిలోని ఉద్యోగులకు కేంద్రీకృత పింఛను చెల్లింపుల వ్యవస్థ(సీపీపీఎస్)కు ఆమోదం తెలిపినట్టు మాండవీయ ప్రకటించారు. దీని ద్వారా ఏ బ్యాంక్ శాఖ నుంచి అయినా పింఛను చెల్లింపులకు వీలుంటుంద న్నారు. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ఆధునికీకరణలో సీపీపీఎస్ ఓ మైలురాయిగా అభివర్ణించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

విమాన తయారీకి ప్రభుత్వ దన్ను | మూలధన వ్యయాల పెంపుపై కేంద్రం దృష్టి

రిలయన్స్ బ్యాటరీ ప్లాంటుకు పీఎల్ఐ



న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద రిలయన్స్ ఇండస్ట్రీస్ 10 గిగావాట్ల వరకు సామర్థ్యంతో బ్యాటరీల తయారీ ప్లాంటును ఏర్పాటు చేసే ప్రతిపాదనకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీ స్టోరేజీకి సంబంధించి పీఎల్ఐ స్కీమ్‌కు 2021 మే నెలలో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తొలి విడత ఏసీసీ పీఎల్ఐ బిడ్డింగ్ 2022 మార్చిలో పూర్తి కాగా మూడు సంస్థలు ఎంపికయ్యాయి. మలివిడతలో రూ. 3,620 కోట్ల కేటాయింపులతో పీఎల్ఐ కింద 10 గిగావాట్ల ఏసీసీ తయారీ యూనిట్ కోసం ఈ ఏడాది జనవరిలో టెండర్లను ఆహ్వానించగా ఏడు సంస్థలు బిడ్లు వేశాయి. రిలయన్స్ సహా ఎక్మి క్లీన్‌టెక్ సొల్యూషన్స్, అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్, వారీ ఎనర్జీస్ తదితర సంస్థలు వీటిలో ఉన్నాయి.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

- అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం
- బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ



ముంబై: బ్యాంకులు, ఐటీ, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణ తో నిఫ్టీ 14 రోజుల వరుస రికార్డు ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. అధిక వెయిటేజీ ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, టీసీఎస్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు షేర్లు 2% శాతం నష్టపోయి ఒత్తిడి పెంచాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో సూచీలు భారీ నష్టాలతో మొదలయ్యాయి. తర్వాత కాస్త కోలుకుని భారీ నష్టాల నుంచి రికవరీ అయ్యాయి. ఉదయం సెన్సెక్స్ 709 పాయింట్ల భారీ నష్టంతో ట్రేడింగ్ ప్రారంభించింది. ఒక దశలో 722 పాయింట్లు క్షీణించి 81,834 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 202 పాయింట్లు నష్టంతో 81,834 నిలిచింది. నిఫ్టీ 81 పాయింట్లు పతనమై 25,199 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 196 పాయింట్లు క్షీణించింది. ఫార్మా, కమోడిటీ, కన్జూమర్, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. చైనా మందగమనం, అమెరికా తయారీ రంగ డేటా నిరాశ పరచడంతో ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



మొబిలిటీ-హాస్పిటాలిటీ రంగానికి చెందిన ఎకోస్ మొబిలిటీ షేరు లిస్టింగ్‌లో మెప్పించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.334)తో పోలిస్తే 17% ప్రీమియంతో రూ.391 వద్ద లిస్టయ్యింది. అనిశ్చితి ట్రేడింగ్‌లోనూ ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంట్రాడేలో 36.52% ఎగసి రూ.456 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 32 % లాభంతో రూ.441 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,646 కోట్లుగా నమోదైంది.

అక్కడ డొక్కు డొక్కు.. ఇక్కడ డుగ్గు డుగ్గు



రాయల్ ఎన్‌ఫీల్డ్.. యెజ్డీ.. జావా.. నార్టన్... బీఎస్ఏ.. విశ్వ విఖ్యాత బైక్ బ్రాండ్‌లు ఇవి. విదేశాల్లో మనుగడ సాధించలేక చేతులెత్తేసిన ఈ బ్రాండ్‌లన్నీ భారతీయుల చేతిలో మళ్లీ ప్రాణం పోసుకున్నాయి. అమ్మకాల్లో దుమ్ము రేడమే కాదు.. మళ్లీ వాటిని గ్లోబల్ బ్రాండ్‌లుగా నిలబెట్టి మనోళ్లు సత్తా చాటుతున్నారు!

గ్లోబల్ బైక్ బ్రాండ్స్‌కు భారత్ లైఫ్‌లైన్!

- విదేశీ దిగ్గజాలను కొనుగోలు చేసి సత్తా చాటుతున్న దేశీ కంపెనీలు
- మనోళ్ల చేతిలో 'బుల్లెట్'లా దూసుకెళ్తున్న అమ్మకాలు

మహీంద్రా కంపెనీ క్లాసిక్ లెజెండ్స్ తాజాగా ప్రఖ్యాత బ్రిటిష్ మోటార్‌సైకిల్ బ్రాండ్ బీఎస్ఏను భారత్‌లో ప్రవేశపెట్టడం తెలిసిందే. అక్కడ మూసేసిన ఈ కంపెనీని కొనుగోలు చేసి, మన మార్కెట్లో లాంచ్ చేసింది. విదేశీ బ్రాండ్‌లకు మన దగ్గర తిరిగి జీవం పోస్తూ... 1994లో ప్రారంభమైన ఈ ట్రెండ్ ఇప్పటికీ నాన్‌స్టాప్‌గా కొనసాగుతూనే ఉంది. ఇంగ్లాండ్‌లో కార్యకలాపాలను నిలిపేసిన బ్రిటిష్ మోటార్ సైకిల్ కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను ఐషర్ గ్రూప్ 1994లో చేజిక్కించుకుంది. అయితే, మన దగ్గర ఈ బ్రాండ్‌ను మళ్లీ జనాల్లోకి తీసుకెళ్లేందుకు ఆ కంపెనీకి 15 ఏళ్లు పట్టింది. 2009లో క్లాసిక్ 350, క్లాసిక్ 500 మోటార్ సైకిళ్లు డుగ్గు డుగ్గు మంటూ మళ్లీ మన రోడ్లపై పరుగులు తీయడం మొదలైంది. ఇప్పుడు యువతకు ఈ మోటార్ సైకిల్స్ అంటే ఎంత క్రేజో చెప్పాల్సిన పని లేదు! '2009లో విడుదల చేసిన క్లాసిక్‌తో రాయల్ ఎన్‌ఫీల్డ్ గ్లోబల్ కంపెనీగా అపూర్వ విజయం సొంతం చేసుకుంది. మొదట్లో ఏడాదికి 50,000 బుల్లెట్లను అమ్మడమే గగనంగా ఉన్న స్థాయి నుంచి ప్రస్తుతం అనేక మోడల్స్ దన్నుతో వార్షిక సేల్స్ 8.5 లక్షలకు ఎగబాకాయి' అని కంపెనీ సీఈఓ గోవిందరాజన్ పేర్కొన్నారు. 2009 నుంచి ఇప్పటిదాకా రాయల్ ఎన్‌ఫీల్డ్ 75 లక్షల మోటార్ సైకిళ్లను విక్రయించగా అందులో 40 లక్షలు క్లాసిక్ మోడల్ కావడం మరో విశేషం. ఈ నెల 12న కూడా కంపెనీ కొత్త క్లాసిక్‌ను ప్రవేశపెట్టింది.

యెజ్డీ.. కుర్రకారు హార్ట్ 'బీట్'

అనుపమ్ తరేజా సారథ్యంలోని క్లాసిక్ లెజెండ్.. గ్లోబల్ బైక్ బ్రాండ్స్ జావా, యెజ్డీ, బీఎస్ఏలను భారతీయులకు మళ్లీ పరిచయం చేసింది. 1970లో మార్కెట్ నుంచి వైదొలగిన చెక్ కంపెనీ జావా.. 2018లో మనోళ్ల చేతికి చిక్కింది. అప్పటి నుంచి 1.4 లక్షల జావాలు రోడ్డెక్కాయి. గత నెల 13న జావా 42 మోడల్‌ను సైతం రంగంలోకి దించింది. ఇక అప్పట్లో అదిరిపోయే బీట్‌తో కుర్రోళ్ల మనసు కొల్లగొట్టిన యెజ్డీ కూడా 1996లో అస్తమించి.. 2022లో లెజెండ్స్ ద్వారా తిరిగి ప్రాణం పోసుకుంది. 60 వేల బైక్‌లు ఇప్పటిదాకా అమ్ముడవ్వడం విశేషం. బీఎస్ఏ అయితే, 1973లోనే మూతబడింది. దాన్ని ఆనంద్ మహీంద్రా పోటాపోటీగా దక్కించుకుని యూకేతో పాటు భారత్‌లోనూ మళ్లీ ప్రవేశపెట్టారు.





2015లో మహీంద్రా మెజారిటీ పెట్టుబడితో ఫై క్యాపిటల్ ఓనర్ అనుపమ్ తరేజా క్లాసిక్ లెజెండ్స్ అనే కంపెనీని నెలకొల్పారు. జావా, యెజ్డీ, బీఎస్ఏ వంటి గ్లోబల్ ఐకాన్‌లను దక్కించుకుని, పునరుద్ధరించారు.



1994లో ఐషర్ గ్రూప్ ఇంగ్లాండ్‌లో పూర్తిగా అమ్మకాలను నిలిపేసిన బ్రిటిష్ బైక్ దిగ్గజం రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను చేజిక్కించుకుంది. 2009లో 'క్లాసిక్' బ్రాండ్‌కు తిరిగి జీవం పోయడంమే కాదు.. గ్లోబల్ కంపెనీగా దీన్ని మళ్లీ నిలబెట్టింది.



2013లో టీవీఎస్ బీఎండబ్ల్యూ మోటోరాడ్‌తో డీల్ కుదుర్చుకుంది. తద్వారా ప్రపంచ మార్కెట్ కోసం 500 సీసీ లోపు బైక్‌లను అభివృద్ధి చేసి, ఇంటా బయటా విక్రయిస్తోంది. 2020లో టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రఖ్యాత బ్రిటిష్ మోటార్‌సైకిల్ బ్రాండ్ నార్టన్‌ను కొనుగోలు చేసింది; వచ్చే మూడేళ్లలో ఆరు కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టే పనిలో ఉంది.



2023లో హీరో మోటోకార్ప్ భారత్‌లో విఫలమై పట్టర్ మూసేసిన హార్లే డేవిడ్‌సన్‌కు మళ్లీ ఇక్కడ ప్రాణం పోసింది. ఎక్స్440 మోడల్‌ను విడుదల చేసి సక్సెస్ కొట్టింది.

అదే బాటలో టీవీఎస్, హీరో...

ఇక దేశీ దిగ్గజం టీవీఎస్ కూడా మరో విఖ్యాత బ్రిటిష్ బైక్ బ్రాండ్ నార్టన్‌ను కేవలం రూ.153 కోట్లకు కొనుగోలు చేసింది. 2025 నాటికి తొలి మోడల్‌ను ప్రవేశపెట్టడంతో పాటు మూడేళ్లలో ఆరు కొత్త నార్టన్ బైక్‌లను తీసుకొచ్చే సన్నాహాల్లో ఉంది. ఈ ప్రఖ్యాత బ్రాండ్‌లను దక్కించుకోవడంతో పాటు వాటి చారిత్రక నేపథ్యాన్ని అలాగే కొనసాగించడం ద్వారా ఒరిజినాలిటీని కాపాడుతున్నామని తరేజా వ్యాఖ్యానించారు. బీఎస్ఏను భారత్‌లోనే తయారు చేస్తున్నా, దాని బ్రిటిష్ బ్రాండ్ ప్రాచుర్యం పదిలంగా ఉందన్నారు. ఇక భారత్‌లో నేరుగా ప్లాంట్ పెట్టి, చేతులెత్తేసిన హార్లీ డేవిడ్‌సన్‌కు హీరో మోటోకార్ప్ దన్నుగా నిలిచింది. ఆ కంపెనీతో జట్టుకట్టి మళ్లీ హార్లీ బైక్‌లను భారతీయులకు అందిస్తోంది. ఎక్స్440 బైక్‌ను ఇక్కడే అభివృద్ధి చేయడం విశేషం. దీన్ని దేశీయంగా హీరో ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్రామాణిక హార్లీ బైక్ బ్రాండ్ విలువలో ఎలాంటి మార్పులు చేయలేదని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ జోషెఫ్ జీట్స్ పేర్కొన్నారు. భారత్‌లో నేరుగా విక్రయాల్లో వెనుకబడ్డ బీఎండబ్ల్యూ మోటోరాడ్, టీవీఎస్‌తో జట్టుకట్టింది. టీవీఎస్ రూపొందించిన 500 సీసీ లోపు బైక్‌లు 60 వేలకు పైగా అమ్ముడవ్వడం మనోళ్ల సత్తాకు నిదర్శనం!

– సాక్షి, బిజినెస్ డెస్క్

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేవీ కొలువు.. కెరీర్‌కు మలుపు!

పదో తరగతి, ఇంటర్‌తో నేవీలో ఉద్యోగాలు

పదో తరగతి, ఇంటర్ అర్హతతోనే..సుస్థిర కొలువు సొంతం చేసుకోవాలని కోరుకునే యువతకు చక్కటి మార్గం..త్రివిధ దళాలు. ముఖ్యంగా త్రివిధ దళాల్లో కీలక విభాగమైన నేవీలో పలు ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్ష, 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్, నేవీ అగ్నివీర్‌ల ద్వారా నావికా దళంలో చక్కటి కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు.

ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్ష

ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు నేవీలో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాలో అడుగు పెట్టేందుకు మార్గం.. ఎన్‌డీఏ(నేషనల్ డిఫెన్స్ అకాడమీ), ఎన్ఏ(నేవల్ అకాడమీ) ఎగ్జామినేషన్. ఈ పరీక్షను యూపీఎస్సీ ఏటా రెండు సార్లు నిర్వహిస్తుంది. రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఇందులోనూ నెగ్గి తుది జాబితాలో నిలిస్తే నేవీలో అడుగు పెట్టే అవకాశం లభిస్తుంది.

మూడేళ్ల శిక్షణ: ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి నేషనల్ డిఫెన్స్ అకాడమీలో మూడేళ్లపాటు శిక్షణ ఇస్తారు. తొలి రెండున్నరేళ్లు అన్ని విభాగాల అభ్యర్థులకు ఒకే విధంగా శిక్షణ ఉంటుంది. చివరి ఆరు నెలలు అభ్యర్థులు ఎంపికైన విభాగం ఆధారంగా ఫిజికల్ ట్రైనింగ్ ఉంటుంది. ఇలా మొత్తం మూడేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వారు ఎంపిక చేసకున్న కోర్సు ఆధారంగా జేఎన్‌యూ-ఢిల్లీ నుంచి బీఏ, బీఎస్సీ, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) డిగ్రీలను అందిస్తారు. నేవల్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న వారికి బీటెక్ చదివేందుకు కూడా అవకాశం ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సబ్ లెఫ్టినెంట్ హోదాతో కొలువు సొంతమవుతుంది. ఆ తర్వాత పనితీరు, అనుభవం, సీనియారిటీ ఆధారంగా.. లెఫ్టినెంట్, లెఫ్టినెంట్ కమాండర్, కమాండర్, కెప్టెన్(సెలక్షన్), కెప్టెన్(టైమ్ స్కేల్), కమడోర్, రియర్ అడ్మిరల్, వైస్ అడ్మిరల్, అడ్మిరల్ స్థాయిలకు చేరుకోవచ్చు.

10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్

ఇంటర్‌తోనే ఇండియన్ నేవీలో కొలువుదీరేందుకు మరో అవకాశం..10+2(బీటెక్)క్యాడెట్ ఎంట్రీ స్కీమ్. దీని ద్వారా ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీలో నాలుగేళ్ల బీటెక్ కోర్సులో ప్రవేశాలకు ఇండియన్ నేవీ అవకాశం కల్పిస్తుంది.

అర్హతలు: ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్,కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఉత్తీర్ణత సాధించాలి. ఈ మూడు సబ్జెక్టుల్లో సగటున 70 శాతం మార్కులు, ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. దీంతోపాటు జేఈఈ మెయిన్‌కు హాజరైన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. జేఈఈ మెయిన్‌లో పొందిన ర్యాంకు ఆధారంగా సర్వీస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ) అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తుంది. ఆ తర్వాత మెడికల్ టెస్టులు నిర్వహించి ఖాళీలు, మెరిట్ లిస్ట్ ఆదారంగా ప్రవేశాలు ఖరారు చేస్తారు.

బీటెక్ సర్టిఫికెట్

ఆఫ్టర్ టెన్త్, ఇంటర్

ఎంపికైన అభ్యర్థులు నేవల్ అకాడమీలో క్యాడెట్లుగా నాలుగేళ్ల బీటెక్ కోర్సులో ప్రవేశం పొందుతారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ)బీటెక్ పట్టా ప్రదానం చేస్తుంది. అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లలో ఏదో బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్‌తోపాటు కొలువు సొంతం చేసుకోవచ్చు.

నేవీ అగ్నివీర్

ఇండియన్ నేవీలో ఇంటర్మీడియెట్ అర్హతతో.. అగ్నివీర్- సీనియర్ సెకండరీ రిక్రూట్, పదో తరగతి అర్హతతో.. అగ్నివీర్-మెట్రిక్ రిక్రూట్ పేరుతో పలు పోస్టులను భర్తీ చేస్తున్నారు. అగ్నివీర్‌లుగా ఎంపికైన వారు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్స్, గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్స్, ఫ్రిగేట్స్, రిప్లెనిష్‌మెంట్ షిప్స్, టెక్నికల్ సబ్ మెరైన్స్, నేవీ ఎయిర్ క్రాఫ్ట్స్ వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అదే విధంగా సెయిలర్, ఆర్టిఫిషర్ అప్రెంటీస్ పోస్టులను కూడా అగ్నివీర్ స్కీమ్‌లో భాగంగా భర్తీ చేస్తున్నారు. అగ్నివీర్ నియామక ప్రక్రియలో ఎంపికై.. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిలో 25 శాతం మందిని నేవీలో శాశ్వత హోదాలో సెయిలర్‌గా నియమించనున్నారు.

వంద మార్కులకు రాత పరీక్ష: నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో 100 మార్కులకు నాలుగు విభాగాల్లో (ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్) ఉంటుంది. ప్రతి విభాగం నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా తదుపరి దశలో.. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు.

అగ్నివీర్-మెట్రిక్ రిక్రూట్

పదో తరగతి అర్హతతో.. నేవీలో అగ్నివీర్-మెట్రిక్ రిక్రూట్ పేరుతో.. చెఫ్, స్టివార్ట్, శానిటరీ హైజినిస్ట్, మ్యూజిషియన్, సెయిలర్, ఫ్యూన్, సఫాయివాలా, వాచ్‌మెన్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, టెలిఫోన్ ఆపరేటర్స్, ఎల్‌డీసీ, ఛార్జ్‌మెన్ తదితర పోస్టులకు నియామకం చేపడుతున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో తొలిదశలో రాత పరీక్ష ఉంటుంది. సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 25 ప్రశ్నలు, సైన్స్ అండ్ మ్యాథ్స్ నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం 50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్ష తర్వాత దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ ఉంటుంది.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్:
www.joinindiannavy.gov.in

డిప్లొమాతో ఉన్నత విద్య, ఉపాధి!

» ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ డిప్లొమాలు
» మూడేళ్లు, రెండేళ్ల వ్యవధిలో డిప్లొమా కోర్సులు
» సత్వర ఉపాధితోపాటు ఉన్నత విద్యావకాశాలు

డిప్లొమా కోర్సులు.. పాలిటెక్నిక్స్‌గా సుపరిచితం! ముఖ్యంగా పదో తరగతి తర్వాత.. సత్వర ఉపాధి కోరుకునే వారికి చక్కటి మార్గం! ఇంజనీరింగ్, టెక్నికల్ మొదలు అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్, ఫార్మసీ.. ఇలా పలు విభాగాల్లో డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఉపాధితోపాటు ఉన్నత విద్య అవకాశాలు సొంతమవుతాయి!! ఈ నేపథ్యంలో..డిప్లొమా కోర్సులు,ప్రవేశ విధానం, ఉపాధి మార్గాలు తదితర వివరాలు..



కెరీర్ గైడెన్స్

ఇంజనీరింగ్ డిప్లొమాలు

డిప్లొమా కోర్సులు అనగానే విద్యార్థులకు టక్కున గుర్తొచ్చేది పాలిటెక్నిక్ ఇంజనీరింగ్‌డిప్లొమాలే. ప్రస్తుతం పదో తరగతి అర్హతతో పలు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవి.. సివిల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఈఈఈ, ఎలక్ట్రికల్ వెహికిల్ టెక్నాలజీ, ఈసీఈ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, 3-డి యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, అపరెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ), కెమికల్ ఇంజనీరింగ్(పెట్రో కెమికల్స్), కెమికల్ ఇంజనీరింగ్(ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్), కెమికల్ ఇంజనీరింగ్(షుగర్ టెక్నాలజీ), సెరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ, లెదర్ అండ్ గూడ్స్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజనీరింగ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, ప్రింటింగ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్, మైనింగ్ ఇంజనీరింగ్.

పాలిసెట్ ర్యాంకుతో ప్రవేశాలు

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రతి ఏటా పాలిసెట్‌ను నిర్వహించి అందులో ర్యాంకు ఆధారంగా డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. డిప్లొమా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఏఐసీటీఈ-ప్రగతి స్కాలర్‌షిప్, అదే విధంగా సాక్షమ్ స్కాలర్‌షిప్ వంటివి అందుకునే అవకాశముంది.

ఉపాధి అవకాశాలు

ఆయా ఇంజనీరింగ్ విభాగాల్లో డిప్లొమా పూర్తి చేసుకున్న వారు పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఈ సమయంలో నెలకు రూ.20 వేల వరకు వేతనం లభిస్తుంది. అదే విధంగా.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే ఏఈఈ పోస్టులకు, రాష్ట్ర స్థాయిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఏఈఈ పోస్టులకు పోటీ పడొచ్చు.

అగ్రికల్చర్, అనుబంధ డిప్లొమా కోర్సులు

డిప్లొమా కోర్సుల్లో మరో ముఖ్యమైన విభాగం.. అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులు. వీటిని తెలుగు రాష్ట్రాల్లోని వ్యవసాయ విశ్వ విద్యాలయాలు (ఏఎన్‌జీఆర్ఏయూ-ఏపీ, పీజేటీఎస్ఏయూ-తెలంగాణ) అందిస్తున్నాయి. ముఖ్యంగా అగ్రికల్చర్ డిప్లొమా, విత్తన సాంకేతిక పరిజ్ఞానం(సీడ్ టెక్నాలజీ), సేంద్రీయ వ్యవసాయం (ఆర్గానిక్ ఫార్మింగ్), అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వ్యవధి మూడేళ్లు. కాగా, మిగతా మూడు డిప్లొమా కోర్సుల వ్యవధి రెండేళ్లు. ఉన్నత విద్య పరంగా బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీల్లో చేరే అవకాశముంది.

ఉపాధి మార్గాలు: ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, న్యూట్రియంట్ పరిశ్రమల్లో ప్లాంట్ అసిస్టెంట్, టెక్నీషియన్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి. ప్రారంభంలోనే నెలకు రూ.15 వేల వరకు వేతనం అందుకోవచ్చు.

హార్టికల్చర్ డిప్లొమా కోర్సు

ఇటీవల ప్రాధాన్యం పెరుగుతున్న మరో విభాగం .. హార్టికల్చర్. ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై ఆసక్తి పెరుగుతుండటంతో హార్టికల్చర్ డిప్లొమా ఉత్తీర్ణులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. ఈ కోర్సు పూర్తి చేసుకుంటే.. నర్సరీలు, ఎకలాజికల్ పార్క్‌ల్లో ఉద్యోగాలు సొంతం అవుతాయి.

వెటర్నరీ, ఫిషరీస్ డిప్లొమా

వ్యక్తుల స్థాయిలో పెంపుడు జంతువులను పెంచుకునే అలవాటు పెరుగుతోంది. మరోవైపు వాణిజ్యం పరంగా లైవ్‌స్టాక్‌గా పేర్కొనే పౌల్ట్రీ ఫార్మ్స్ పెరుగుతున్నాయి. వీటిలో పని చేసేందుకు నిపుణుల అవసరం ఏర్పడుతోంది. ఈ విభాగంలో వెటర్నరీ సైన్స్ డిప్లొమా పూర్తి చేసుకున్న వారికి అవకాశాలు ఆహ్వానం పలుకుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఏపీలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో.. తెలంగాణలో పి.వి.నరసింహారావు తెలంగాణ స్టేట్ వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తారు. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి పౌల్ట్రీ ఫార్మ్స్, లైవ్ స్టాక్ ఫర్మ్స్, డెయిరీ ఫార్మ్స్‌లో లైవ్ స్టాక్ అసిస్టెంట్స్, ఫర్మ్ క్యూరేటర్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఫిషరీస్ సైన్స్‌లో డిప్లొమా పూర్తి చేసిన వారు ఆక్వాకల్చర్ ఫర్మ్స్, ఆక్వా సీడ్ ప్రొడక్షన్ సంస్థల్లో ప్లాంట్ ఆపరేటర్, క్యూరేటర్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు.

ప్రవేశాలు ఇలా

అగ్రికల్చర్, దాని అనుబంధ డిప్లొమా కోర్సులు, అదే విధంగా హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్, ఫిషరీ సైన్స్, డెయిరీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు పదో తరగతి, పాలిసెట్ ర్యాంకులను పరిగణనలోకి తీసుకుంటారు. ఏపీలో పదో తరగతి మార్కులను, తెలంగాణలో టీఎస్ పాలిసెట్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు. అగ్రికల్చర్, అనుబంధ విభాగాల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల విషయంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. పదో తరగతి లోపు నాలుగేళ్లపాటు గ్రామీణ ప్రాంత (నాన్-మునిసిపల్) పాఠశాలల్లో చదివి ఉండాలనే నిబంధన విధించారు.

ఫార్మసీ డిప్లొమా

రెండేళ్ల వ్యవధిలోని ఫార్మసీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియెట్ ఎంపీసీ లేదా బైపీసీ ఉత్తీర్ణులు అర్హులు. ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి హెల్త్‌కేర్ రంగంలో, డయాగ్నస్టిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ విభాగాల్లో అవకాశాలు లభిస్తున్నాయి. అదే విధంగా.. ప్రభుత్వ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, విద్యా సంస్థలు, క్లినిక్‌లు, ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాప్స్, ఫార్మాస్యూటికల్ సంస్థలు, సేల్స్, మార్కెటింగ్, పరిశోధనా సంస్థలు, పరిశోధన ప్రయోగశాలల్లో ఉపాధి పొందొచ్చు. డి.ఫార్మసీ తర్వాత రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఈసెట్ పరీక్షలో అర్హత సాధించి.. లేటరల్ ఎంట్రీ ద్వారా బీఫార్మసీ రెండో సంవత్సరంలో చేరొచ్చు. ఫార్మ్-డి కోర్సులను కూడా అభ్యసించొచ్చు.

ఉన్నత విద్య అవకాశాలు

డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉన్నత విద్య అవకాశాలు సైతం అందుబాటులో ఉన్నాయి. పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులకు ఈసెట్ నిర్వహించి.. అందులో ర్యాంకు ఆధారంగా.. లేటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలోకి ప్రవేశం కల్పిస్తారు. అగ్రికల్చర్, అనుబంధ డిప్లొమా కోర్సులు, వెటర్నరీ సైన్స్, హార్టికల్చర్ సైన్స్ డిప్లొమాలు పూర్తి చేసుకున్న వారు బ్యాచిలర్ స్థాయి కోర్సుల్లో చేరొచ్చు. అగ్రికల్చర్ డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులు.. లేటరల్ ఎంట్రీ విధానంలో బీఎస్సీ అగ్రికల్చర్‌లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందొచ్చు. అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డిప్లొమా పూర్తి చేసుకున్న వారు బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం లభిస్తుంది. ఇందుకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

తెలుగు రాష్ట్రాలకు జస్టిస్ ఎన్వీ రమణ విరాళం

ఏపీకి రూ.10 లక్షలు, తెలంగాణకు రూ.10 లక్షలు



సాక్షి, న్యూఢిల్లీ: ఆపత్కాల సమయంలో ప్రజలంతా ఏకమవ్వాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రెండు తెలుగు రాష్ట్రాలు అతలాకుతలమవుతున్న నేపథ్యంలో వరద బాధితులకు సహాయం అందించేందుకు జస్టిస్ ఎన్వీ రమణ విరాళం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.10 లక్షలు, తెలంగాణ ప్రభుత్వానికి రూ.10 లక్షల చొప్పున బుధవారం ఢిల్లీలో ఏపీ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌కు చెక్కులను అందజేశారు. కష్టసమయంలో తోచినంత సాయం చేయాలని ప్రజలకు జస్టిస్ రమణ పిలుపునిచ్చారు.

బీఎస్ఎన్ఎల్ తెలంగాణ టెలికాం చీఫ్ జీఎంగా రత్నకుమార్



సాక్షి, హైదరాబాద్: బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) తెలంగాణ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా జి. రత్నకుమార్ బాధ్యతలు స్వీకరించారు. 1988 ఇండియన్ టెలికాం సర్వీస్ (ఐటీఎస్) బ్యాచ్ కు చెందిన రత్నకుమార్ దేశంలోని పలు ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్లలోని వివిధ రంగాల్లో 34 ఏళ్లుగా విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది. ఇంతకుముందు ఈయన డీడీజీ ఏపీ ఎల్ఎస్ఏ టెలి కమ్యూనికేషన్ విభాగం హైదరాబాద్‌లో పనిచేశారు.

8న పీజీ సీట్ల తొలి జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 8న వివిధ వర్సిటీల్లో పీజీ సీట్లు సాధించిన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేయనున్నట్లు టీజీపీజీఈసెట్–2024 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా వర్సిటీల పరిధిలోని పీజీ కళాశాలల్లో ఈ నెల 13 వరకు రిపోర్టు చేయాలని కోరారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు ఈ నెల 18 నుంచి విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు తరచూ ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలని కన్వీనర్ సూచించారు.

డ్రగ్స్ కేసులో ఉన్నావంటూ బెదిరించి...

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి 1,58,47,000 కాజేసిన సైబర్ నేరగాడు

పటాన్‌చెరు టౌన్: మలేసియాకు అక్రమంగా డ్రగ్స్ రవాణా చేస్తున్నావు.. మనీలాండరింగ్ కేసులో అనుమానితుడిగా ఉన్నావంటూ బెదిరించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ. కోటి 58 లక్షల 47 వేలు కాజేశాడు ఓ సైబర్ నేరగాడు. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 29వ తేదీన అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి కాల్ చేస్తున్నామని, మీపై అక్రమ డ్రగ్స్ రవాణా అలిగేషన్ ఉందని, అదేవిధంగా మనీ లాండరింగ్ కేసులో మీ పేరు ఉందని బెదిరించారు. పేరు తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో బెదిరిపోయిన ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.. కోటి 58 లక్షల 47 వేలు పంపాడు. ఇంకా డబ్బులు వేయాలని ఒత్తిడి చేయడంతో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడింగ్ పేరుతో మోసం..

రూ.13.16 కోట్లు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట ఓ సీనియర్ సిటిజన్ నుంచి సైబర్ కేటుగాళ్లు ఏకంగా రూ. 13.16 కోట్లు కొట్టేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన సీనియర్ సిటిజన్‌కు కొన్ని రోజుల కిందట ఇత్రం రవి పవగీ పేరుతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్‌లో చేరాలంటూ కొన్ని లింకులు పంపించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు కొంత మొత్తాన్ని స్టాక్ ట్రేడింగ్లో పెట్టారు. మొదట్లో లాభాలు చూపించిన కేటుగాళ్లు ఆ తర్వాత బాధితుడి నుంచి పలు దశల్లో రూ.13.16 కోట్లు కొట్టేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ఈ నెల 2న పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సన్నిధి ......సాక్షి ప్లస్

గురువారం ॥ 5-9-2024

చెన్నైనగర శివారు ప్రాంతమైన తిరువొట్రియూర్‌లో అత్యంత పురాతనమైన త్యాగరాజస్వామి ఆలయం ఉంది. అత్యద్భుతమైన శిల్పసౌందర్యంతో, అణువణువునా సొగసైన పనితనం ఉట్టిపడే ఈ ప్రాచీన కట్టడం త్యాగరాజస్వామి ఆలయమైతే, ఈ ఆలయ ప్రాంగణంలోనే పరమశివుడు తన భక్తుడైన సుందరుని కల్యాణాన్ని జరిపించిన వృక్షం నేటికీ భక్తులకు దర్శనమిస్తూ, వారి మనోరథాలను నెరవేరుస్తుంటుంది.

తిరువొట్రియూర్

కళ్యాణమిక్కడ 'మూడుకన్నుల' పండుగ



స్వామివారి సన్నిధికి కుడివైపునే వడి ఉడై అమ్మన్ ఆలయం ఉంది. ఎడమవైపున జగన్నాథుడు, జగదాంబికల సన్నిధులు నేత్రపర్వం చేస్తుంటాయి. ఆ పక్కనే వినాయకుడు, కుమారస్వామి, బాలపరమేశ్వరుడు, కాళికాంబ సన్నిధులు కనువిందు చేస్తూ, భక్తులకు పరమశివుడి సాన్నిధ్యాన్ని కనులముందు సాక్షాత్కరింపజేస్తుంటాయి.



తిరువొట్రియూర్ ఆలయంలోని మరో విశిష్టత ఏమిటంటే, ఇక్కడ నక్షత్రలింగ సన్నిధి అని 27 నక్షత్రాలకు సంబంధించి 27 శివలింగాలున్నాయి. ఈ సన్నిధిలో 27 నక్షత్రాలకు సంబంధించిన భక్తులు తమ జాతక దోషాలను పోగొట్టుకునేందుకు పూజలు చేస్తుంటారు. ఉత్సవమూర్తి అయిన త్యాగరాజస్వామి, మూలవిరాట్టు అయిన ఆదిపురీశ్వరుని విగ్రహాలు భక్తులను ఆనంద పారవశ్యంలో ముంచి వేస్తుంటాయి. సువర్ణకవచాన్ని అలంకరించుకుని ఉన్న మూలవిరాట్టు ధగద్ధగాయమానంగా మెరిసిపోతూ, భక్తులకు కొంగుబంగారంగా భాసిల్లుతుంటుంది. ఎక్కడా లేనివిధంగా ఇక్కడి మూలవిరాట్టు ఆదిపురీశ్వరుడు నిత్యం తైలాభిషేకంలో మునిగి తేలుతుంటాడు. ఆయనకు అభిషేకించిన తైలం పిల్లల మాడుమీద అంటి, నొసట బొట్టులా పెడితే చాలు– బాలారిష్టాలూ, దృష్టిదోషాలూ అంతరించిపోతాయనీ, బాలలు ఆయురారోగ్యాలతో నిత్యం ఆనందంతో కేరింతలు కొడతారని ప్రతీతి.

భక్తులు ప్రత్యేక రుసుము చెల్లించడం ద్వారా ఆలయంలో స్వామికి చందనకాప్పు (గంధపు పూత), మంజళ్ కాప్పు (పసుపు పూత), పంచామృతాభిషేకం, క్షీరాభిషేకాలను స్వయంగా నిర్వహించుకోవచ్చు. దోషనివారణ చేసుకోవచ్చు.



ఎక్కడ ఉందంటే..?

చెన్నై నగరానికి శివారు ప్రాంతంలోనే ఉంది తిరువొట్రియూర్. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి బస్సులు, లోకల్ రైళ్లు ఉన్నాయి. ఆటోలలో కూడా ఆలయానికి చేరుకోవచ్చు. తిరువొట్రియూరులో తెలుగు వారు తక్కువేమీ కాదు. అందువల్ల తెలుగుమాత్రమే తెలిసిన వాళ్లకు ఇబ్బంది ఏమీ ఉండదు. బస, భోజన వసతులకు కూడా బాగానే ఉంటాయిక్కడ. తిరువొట్రియూరులో కూడా అలాంటి సౌకర్యం ఉంది కాబట్టి యాత్రికులు తిండికోసం ఇబ్బంది పడనక్కరలేదు.

అతి పెద్ద ఆలయం... తిరువారూరు త్యాగరాజాలయం

త్యాగరాజస్వామికి తిరువారూరులో అతిపెద్ద ఆలయం ఉంది. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఆలయంగా పేర్కొనే ఈ గుడి తంజావూరు జిల్లాలోని తిరువారూరులో ఉంది. ఈ గుడికి నాలుగువైపులా నాలుగు గోపురాలున్నాయి. ఈ దేవాలయం 30 ఎకరాల సువిశాలమైన విస్తీర్ణంలో ఉంది. దీనికి అనుసంధానంగా పెద్ద కోనేరు ఉంది. కమలాలయం అనే పేరుగల ఈ కోనేరు ఆలయంకన్నా పెద్దగా ఉండటం విశేషం. దక్షిణ భారతదేశంలో ఇదే అతి పెద్ద కోనేరు. చోళరాజుల కాలం నాటి ఈ గుడి శిల్పసౌందర్యానికి పెట్టింది పేరు. అత్యంత విలువైన దివ్యాభరణాలతో అలంకృతమై ఉన్న త్యాగరాజస్వామివారి విగ్రహం ఈ గుడిలో కనువిందు చేస్తుంది. అంతేకాదు, ఆలయంలో అనేకమైన తైలవర్ణ చిత్రాలున్నాయి. వాటిలో శయనముద్రలో ఉన్న శ్రీ మహావిష్ణువు చిత్రం చూపు తిప్పుకోనివ్వనంత అద్భుతంగా ఉంటుంది. ఆయన ఎదపైన నటరాజస్వామి నర్తిస్తూ ఉన్నట్లు చిత్రించి ఉండటం మరో అద్భుతం. తిరువారూరులో ఏటా బ్రహ్మాండమైన రథోత్సవం జరుగుతుంది. అంతేకాదు, ఇక్కడ కమలాలయం కోనేరులో జరిగే తెప్పోత్సవానికి కూడా మంచి పేరుంది.





ధర్మసందేహాలు

ఇంట్లో ఉండి కూడా నా తండ్రి ఆబ్దికంలో పిండాలకి నమస్కరించడం గాని, భోజనాన్ని చేయడం గాని, మరేవిధంగానూ సహకరించడం గాని నా భార్య చేయదు. దీనివల్ల నాకేదైనా దోషమా? ప్రాయశ్చిత్తం చేసుకోవాలా?

– సూర్యనారాయణ, హైదరాబాద్



'ధర్మ అర్థ కామ విషయాల్లో ఈమెని అతి చరించి ప్రవర్తించ' నని (నాతి చరామి) మీరు ప్రతిజ్ఞ చేసే పెళ్లాడారామెని. కాబట్టి ఆబ్దికానికి సహకరించవలసిందిగా అడక్కపోయిన పక్షంలో తప్పు మీదే అవుతుంది. భోక్తలు భోజనాన్ని ముగించాక ఆ అన్నశేషాన్ని 'ఇష్టులతో భుజించవలసిం'దని మంత్రమే చెప్తోంది కాబట్టీ, ఆమె మీకు ఈ విషయంలో అనిష్టురాలు కాబట్టీ భోజనం చేయకపోవడమే పితృదేవతలకిష్టం. ఈ విషయంలో మీరు నిశ్చింతగా ఉండచ్చు.


తండ్రిపోయిన సంవత్సర కాలానికొచ్చే సాంవత్సరికాలని జ్యేష్ఠుడు నిర్వహించడానికి ఇష్టంతో ఉంటే, కనిష్ఠుడు తానుగా నేరుగా నిర్వహించవచ్చునా?

– కె.సురేష్, రేపల్లె

శ్రాద్ధం వల్ల తండ్రి తరిస్తాడని నమ్మి చేయదలచినప్పుడు ఆ శాస్త్రం చెప్పిన మిగిలిన విషయాల్ని కూడా నమ్మాలిగా! జ్యేష్ఠుడుండగా– అతను కూడా చేయదలచి ఉండగా– కనిష్ఠుడు చేయడం దోషమే. అది తండ్రికి చెందదు. చేయరాని యాగాన్ని త్రిశంకుని విషయంలో విశ్వామిత్రుడంతటివాడు చేయదలిస్తే ఏమయిందో మనకి తెలుసు కదా!

ఎక్కడైనా తపస్సుని ప్రారంభించారని తెలియగానే అప్సరసల్ని పంపి తపస్సును చెడగొట్టే లక్షణమున్న ఇంద్రుణ్ణి దేవతలు ఎలా అధ్యక్షుణ్ణిగా ఎన్నుకున్నారు? కొనసాగిస్తున్నారు పదవిలో?

– వి.కె.సి. అజాద్, ఫిరంగిపురం



ఇంద్రునిది పరీక్షాధికారి పదవి. ఎవరైనా తపస్సు ప్రారంభించగానే వారిది ఏ స్థాయి తపస్సో, ఎంత గాఢ తపస్సో పరీక్షించవలసిన బాధ్యతనీ ధర్మాన్నీ దేవతలు ఈయన మీద ఉంచారు. అందుచేత ఇంద్రుడు కామం, క్రోధం లోభం మోహం మదం మాత్సర్యం అనే ఆరింటిలోనూ ఒకదాని తర్వాత ఒకటి చొప్పున పరీక్షలు నిర్వహిస్తాడు. ఓడిపోవడమనేది (కామంలో మేనకతో విశ్వామిత్రుడు, క్రోధంలో అహల్య విషయంలో గౌతముడు.. ఇలా) ఆ రుషుల తప్పు తప్ప, పరీక్షించ వచ్చిన అప్సరసలదీ కాదు– ఇంద్రునిది ఏమాత్రమూ కాదు కూడ.

సగోత్రీకులు భార్యాభర్తలవుతున్నారు. కొందరు సగోత్ర విధానాన్ని అంగీకరించరు. ఏది సరి?

– రాజమౌళి, శ్రీకాకుళం

గో– వంశాన్ని, త్ర– రక్షించే మహర్షులు అని అర్థం. ప్రతి వంశాన్నీ ఒక్కో మహర్షి రక్షిస్తూ ఉంటాడు. ఇలా ఒకే మహర్షి రక్షణలో ఉన్న ఒక స్త్రీ, పురుషుడు వివాహానికి సగోత్రీకులు అవుతారు. ఇది ఏ కులంలోనైనా సరికానిదే.

శంఖం... లక్ష్మీ స్వరూపం

ప్రాచీన భారతీయ సంస్కృతిలో శంఖానికి విశిష్ట స్థానం ఉంది. శ్రీమన్నారాయణుని మన సనాతన ధర్మంలో శంఖాన్ని మహావిష్ణు స్వరూపంగా, లక్ష్మీప్రదంగా వివరించారు. శంఖంలో పోస్తేనే తీర్థమన్నారు మనవారు. శాస్త్రప్రకారం శంఖం లక్ష్మీస్వరూపం.



సముద్రంలో జీవించు ఒక ప్రాణి ఆత్మరక్షణ కోసం శరీరానికి నాలుగువైపుల రక్షణ కవచం నిర్మించుకొంటుంది. కొంతకాలం తర్వాత అది కవచం వదిలి కొత్త కవచం కట్టుకోవడంలో లీనమవుతుంది. ఆ కవచమే మనకు చిరపరిచయమైన శంఖం.

అర్చన సమయాలలో శంఖ నాదం చేస్తారు. బెంగాల్‌లో వివాహ సందర్భంగా శంఖధ్వని తప్పనిసరి, శంఖం లోపలి భాగం ముత్యంలా ఉంటుంది. అందులో చెవి పెట్టి వింటే సముద్ర ఘోష వినిపిస్తుంది. శంఖంలో పోసిన తీర్థం సేవించడం వల్ల వాత పిత్త దోషాలు, సమస్త రోగాలు తొలగి పోతాయని పరమపురుష సంహిత చెబుతోంది.

శంఖాలలో దక్షిణావర్త శంఖం శ్రీ విష్ణువుకు, లక్ష్మీదేవికి ఎంతో ప్రీతికరం అయింది. ఈ శంఖం ఉన్న ఇంటిలో అఖండ సంపదలతో లక్ష్మి నివసిస్తుందని ప్రతీతి. చాలామంది పూజలో ఈ శంఖాన్ని పెడతారు. పుణ్యదినాలలో ఇంట్లో పూజచేసి దేవతార్చనలో పెట్టాలి. శ్రీరామ నవమి, విజయదశమి, గురుపుష్యమి, రవిపుష్యమి నక్షత్రాలు, పుణ్యతిథులు ఈ పర్వదినాల్లో తప్పకుండా పూజ చేయాలని పెద్దలు చెప్పారు.

దానం పునీతం..

దానం ఓ మహత్తర కార్యం. ప్రతిఫలాపేక్ష లేని త్యాగం. కీర్తి కండూతి లేకుండా చేసేదే దానం. యజ్ఞం, దానం, తపస్సుల ద్వారా మోక్షం సాధించవచ్చునని ఉపనిషత్తులు చెబుతున్నాయి. కలియుగంలో యజ్ఞం, తపస్సు సాధ్యం కావు. కనుక దానమనే త్యాగగుణం మాత్రమే మానవులను పునీతుల్ని చేస్తుందని భగవద్గీత చెబుతోంది. కలియుగంలో కేవలం దానం వల్లనే కీర్తిమంతులు అవుతారని రుషులు చెప్పారు.



కన్యాదానం వల్ల మంచి కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుంది. గోదాన, భూదానాల వల్ల కుటుంబ పోషణకు అవసరమైన పాడిపంటలు వృద్ధి చెందుతాయి. విద్యాదానం వల్ల అజ్ఞానం అంతరించి విజ్ఞానం వికసిస్తుంది. విజ్ఞాన సముపార్జనతో ఉపాధి లభిస్తుంది. ఈ నాలుగు దానాలు విశిష్టమైనవని పెద్దలు చెబుతారు.

భూదానం, గోదానం, తిలదానం, హిరణ్యదానం, వెండి దానం, ఆజ్య దానం, వస్త్ర దానం, ధాన్య దానం, గుడదానం, లవణ దానం అనేవి దశ దానాలు. వీటికి విద్య, కన్య, గృహ, శయ్య, దాసి, అగ్రహార దానాలను కూడా జత చేర్చి షోడశ దానాలు అన్నారు. అలాగే అన్నదానం, ఉదక దానం కన్నతల్లితో సమమైనవి. ఆకలి దప్పులను తీర్చగలిగే అన్నదానమే అత్యుత్తమమైనదని చాణక్యుడు అన్నాడు.

కర్ణుడు సహజ కవచకుండలాలను ఇంద్రుడికి దానం చేశాడు. శరణార్థిగా వచ్చిన పావురాన్ని రక్షించడానికి తన శరీరం నుంచి సమమైన మాంసాన్ని ఇవ్వడానికి సిద్ధపడ్డాడు శిబి చక్రవర్తి. ఇచ్చిన మాట తప్పక వామనుడు అడిగిన మూడు అడుగుల భూమిని దానం చేశాడు బలి చక్రవర్తి. వృత్రుడు అనే రాక్షసుణ్ణి సంహరించడం కోసం ఆత్మత్యాగం చేసి తన వెన్నెముకను సమర్పించాడు దధీచి. వీరంతా దాతలు.

ఏడడుగులు ఎందుకు వేస్తారు?



* మూడు ముళ్ల తర్వాత హోమం చుట్టూ ఏడడుగులు ప్రదక్షిణ చేస్తారు వధూవరులు. అంటే జీవిత భాగస్వామితో ఏడు జన్మల వరకూ తోడుంటా అని వాగ్దానం చేస్తూ ఏడడుగులు వేస్తారు. ఇంకా వివరంగా చెప్పాలంటే ఒక్కో అడుగుతో ఒక్కో భరోసాను జీవిత భాగస్వామికి ఇస్తున్నట్లు లెక్క
* మొదటి అడుగు.. అన్నవృద్ధికి. అంటే అన్నపూర్ణగా పిలిచే మనదేశంలో పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ వేసేది.
* రెండో అడుగు.. బలవృద్ధికి. అంటే వధూవరుల ఇరు కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలతో ఉండాలని వేస్తారు.
* మూడో అడుగు.. ధన ప్రాప్తి కలగాలని వేస్తారు
* నాలుగో అడుగు..దంపతులిద్దరూ సదా సుఖ సంతోషాలతో ఉండాలని
* ఐదో అడుగు..ఒక్క తమ కుటుంబం మాత్రమే కాకుండా సమాజానికి తమ చేతనైన మేరకు సాయం చేస్తామని చెప్పడం.
* ఆరో అడుగు..వైవాహిక జీవితంలో ఎలాంటి కలహాలు, అనుమానాలు లేకుండా సాఫీగా సాగాలని.
* ఏడో అడుగు.. శారీరకంగా, మేధో పరంగా పుష్టి కలిగిన సంతానాన్ని కలిగించాలని వేసే అడుగు.

సువార్త

హృదయం అన్నిటికంటే మోసకరమైనది


ప్రస్తుత కాలంలో ప్రబలుతున్న భయంకరమైన వ్యాధులలో ప్రేమ అనేది ఒక భయంకరమైన వ్యాధి; ఒక మాటలో చెప్పాలి అంటే ఇది క్యాన్సర్ కన్నా భయంకరమైనది. ప్రేమ రెండు రకాలు. ఒకటి శాశ్వతమైన ప్రేమ; రెండు ఆ శాశ్వతమైన ప్రేమ (కామ వికారం గల ప్రేమ).

'యిర్మీయా' అనగా హీబ్రూ భాషలో స్థిరపర్చువాడు అని అర్థం. ఈ విలపించే ప్రవక్త క్రీ.పూ. 626 సం॥లో హృదయం అన్నిటికంటే మోసకరమైనది; అది బహు ఘోరమైన వ్యాధి కలిగినది దాని గ్రహింపగలవాడెవడని (యిర్మీయా 17:9)లో ప్రవచించారు. ప్రస్తుత రోజుల్లో సైకాలజిస్టులు ; మందులు ఇచ్చి కౌన్సిలింగ్‌లు చేస్తున్నారు. ఇంకో పక్క మంత్రశక్తి కంటే దైవశక్తి గొప్పదని క్రీ.పూ. 17–13 శతాబ్ద కాలంలో నిరూపించబడింది (నిర్గమకాండం 8:17,9).

ఈ కాలంలో భార్యాభర్తలు కొంత కాలం కాపురం చేసి, నిరాశా నిస్పృహలకులోనై, మనసులు కలవక మధ్యలో వేరొక స్త్రీ ప్రవేశించి, విడాకులు కోరుటకు ఈ మోసకరమైన మనస్సు కారణం.

1) మోసపూరిత మనస్సు: ప్రజలందరూ ఒకరితో ఒకరు అబద్ధాలు మాట్లాడటం, ఇచ్చకముగా పెదవులతో మాట్లాడటం. మహారాజైన దావీదు కీర్తనలు గ్రంథం 12:2లో భోదిస్తుంది; దీనినే మోసపూరితమైన హృదయం గల మనస్సు అంటారు.

2) అహంకరమైన మనస్సు: ఈ మనస్సు తల్లిదండ్రుల మాటలను, రక్త సంబంధుల మాటలను లెక్క చేయకుండా అహంకారం వారిని పాలిస్తుంది (సామెతలు 6:18). పది నెలలు మోసి, కనీపెంచిన తల్లినీ; ధర్మశాస్త్రోపదేశకుడైన తండ్రిని కానక, దైవ సన్నిధిలోను, సంఘములోను, కుటుంబంలో సమాజములో అప్రతిష్ఠపాలగుచున్నారు.



3) చింతపడే మనస్సు: దేవా ఎన్నాళ్ళు వరకు నన్ను మరిచెదవు? నిత్యము మరిచెదవా? ఎంతకాలం విముఖుడవై యుందువు? అని దైవ నామస్మరణలో దేవుని యందు భయభక్తులతో చింతపడే మనస్సు (కీర్తనలు 13:2). ఇది ఆధ్యాత్మికంగా చింతపడే మనసు.

4) స్థిరమైన మనస్సు: అనారోగ్యకరమైన మనస్సు ఎముకలను ఎండిపోజేయును (సామెతలు 17:22). గనుక సమ్మతి గల మనస్సును, ధృఢమైన మనస్సును కలుగజేయుమని దేవుణ్ణి ఆశ్రయించి ప్రార్థించిన యెడల అట్టి ప్రార్థనలు ధూపంవలె దేవుని సన్నిధికి చేరుతుంది. ఎందుకంటే అందం మోసం; సౌందర్యం వ్యర్థం అని; ఈ రోజు జీవించి, మరుసటి రోజు కనబడని మనుషులము. కష్టపడకుండా పెంచకుండా ఒక రాత్రిలోనే పుట్టిపెరిగి, ఒక రాత్రిలోనే వాడిపోయిన చెట్టు గురించి గమనించాలి (యోనా4:5–10). మనుష్యులము కూడా అలాంటివారమే అని గ్రహించి మనస్సు కకావికలము చేసుకొనక, శాశ్వతమైన ప్రేమ కొరకు హృదయములను రూపాంతరపరుచుకోవాలి అని బైబిల్ హెచ్చరిస్తుంది. దేవున్ని ఆశ్రయించి ధన్య జీవితం పొందుటయే జీవిత పరమార్థం; అట్టి మనస్సు కలిగి యుందురు గాక. ఆమెన్.

– కోట బిపిన్ చంద్రపాల్

ఆయన జన్మదినమే గురుపూజోత్సవంగా...



ఉపాధ్యాయ వృత్తికే అత్యంత గౌరవం, గుర్తింపు తెచ్చిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఆ వృత్తితో ఎంతగా పెనవేసుకుపోయిందంటే... డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయంలో తత్త్వ శాస్త్రానికి ఆచార్యుడిగా ఉండి తరువాత కలకత్తా విశ్వవిద్యాలయానికి ఉన్నత పదవిలో చేరడానికి సిద్ధపడ్డారు. మైసూరునుంచి కలకత్తాకు వెళ్ళే రోజున సామానంతా వేరుగా స్టేషన్‌కు పంపించేసి, భార్యతో గుర్రపుబగ్గీలోపోవడానికి బయటికి వచ్చారు. ఆయన దగ్గర చదువుకున్న, చదువుకుంటున్న విద్యార్థులువందల సంఖ్యలో ఆ సమయానికి అక్కడికి చేరుకున్నారు. ''మాకింత గొప్పగా పాఠాలు చెప్పి తన ఊపిరిని మాకోసం వెచ్చించిన మా గురువుకు కృతజ్ఞతగా ...''అంటూ బండికి కట్టిన గుర్రాలను విడిపించి స్వయంగా విద్యార్థులే ఆ బండిని మైసూరు స్టేషన్ వరకు లాగుకుంటూ తీసుకెళ్ళారు. పూలు పరచి వాటిమీదుగా వారిని తీసుకెళ్ళి రైలెక్కించారు. రాధాకృష్ణన్ కూడా బరువెక్కిన హృదయంతో చేతులూపుతూ వారినుంచి వీడ్కోలు తీసుకున్నారు. ఆయన శిష్యులు, అభిమానులు అందరూ పుట్టినరోజు వేడుకలు చేద్దామనుకుంటుంటే ఆయన వాటికి అలా ఇష్టపడలేదు.''మీకందరికీ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులను మీ కుటుంబ సభ్యులుగా చూడండి. మీ తల్లిదండ్రులను ఎలా గౌరవిస్తారో అలా వారిని కూడా గౌరవించండి. మీరు వృద్ధిలోకి రావాలని మీ అమ్మానాన్నలు ఎలా తాపత్రయపడతారో అలా మీ భవిష్యత్తు కోసం తాపత్రయపడే వ్యక్తి మీ గురువు. ఆయనను గౌరవించడం నేర్చుకోండి. ఆరోజున గురుపూజోత్సవంగా నిర్వహించండి. అదే నాకు మీరు చేసే పుట్టినరోజు వేడుక...'' ...అని సూచించారు. అప్పటినుంచి ఇప్పటివరకు సెప్టెంబరు 5న మనం గురుపూజోత్సవం జరుపుకుంటున్నాం.

చాడీలు, అపనిందలు

ఇస్లాం వెలుగు

నోరు మంచిదైతే ఊరు మంచిదంటారు. నోరు ఎన్నెన్నో మంచి పనులు చేస్తుంది. మనిషి గౌరవ మర్యాదల్ని పెంచి, సంఘంలో అతనికి మంచి స్థానం సమకూర్చిపెడుతుంది. అయితే అదుపు తప్పితే ఈ నోరే మనిషికి ఇహపరాల్లో ఎన్నో ఆపదలు తెచ్చిపెడుతుంది. దేవుని దృష్టిలో నోటి దురుసు, దుర్భాష, అశ్లీలం ఘోరమైన నేరాలు. వీటికి పరలోకంలో మనిషి నరక శిక్ష అనుభవించవలసి ఉంటుంది. వీటిని గురించి దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: ప్రళయ దినాన విశ్వాసి త్రాసులో ఉంచే అత్యంత బరువైన వస్తువు అతని సత్ప్రవర్తనే. నోటితో అశ్లీల మాటలు పలికేవాడ్ని, దుర్భాషలాడేవాడ్ని దేవుడు అసహ్యించుకుంటాడు. (తిర్మిజి గ్రంథం)

కొందరు పైకి ఎంతో భక్తి పరాయణులుగా కనిపించినా వారు తమ నోటితో ఇతరుల్ని తరచుగా బాధిస్తుంటారు. అలాంటి వారికి ఈ క్రింది హదీసు (ప్రవచనం) చక్కని గుణపాఠం.

ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లం వద్దకు వచ్చి ''ఫలానా స్త్రీ ఎన్నో నఫిల్ (ఐచ్ఛిక) నమాజులు చేస్తుంది. మరెన్నో ఉపవాసాలు పాటిస్తుంది. (పెద్ద ఎత్తున) దానధర్మాలు కూడా చేస్తుంది. ఈ సత్కార్యాలలో ఆమె పేరు పొందింది. కానీ ఆమె తరచుగా నోటితో ఇరుగుపొరుగు వారిని బాధిస్తుంది'' అన్నాడు. దానికి దైవప్రవక్త సల్లం, '' అయితే ఆమె నరకానికి పోతుంది'' అన్నారు. తిరిగి ఆ వ్యక్తి ఇలా అన్నాడు:

''దైవ ప్రవక్తా! ఫలానా స్త్రీ నఫిల్ ఉపవాసాలు చాలా అరుదుగా పాటిస్తుంది. నఫిల్ నమాజులు కూడా చాలా తక్కువగానే ఆచరిస్తుంది. అప్పుడప్పుడు కొన్ని జున్ను గడ్డల్ని దానం చేస్తుందని ప్రతీతి. అయితే ఆమె తన నోటితో ఇరుగుపొరుగు వారిని బాధించదని జనం చెప్పుకుంటారు. దైవ ప్రవక్త ఈ మాట విని ''ఆమె స్వర్గవాసి అవుతుంది'' అని చెప్పారు. (ఖుర్ఆన్ భావామృతం నుంచి)



–షేక్ అబ్దుల్ రషీద్

సాక్షి ప్లస్
గురువారం। 5-9-2024

బిజినెస్ రీల్

ఏఎస్‌సీఐ నూతన చైర్మన్‌గా పార్థ సిన్హా



న్యూఢిల్లీ: ప్రకటనల రంగ స్వీయ నియంత్రణ సంస్థ అడ్వెర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) నూతన చైర్మన్‌గా బెనెట్ కాల్‌మన్ అండ్ కంపెనీ ప్రెసిడెంట్, చీఫ్ బ్రాండ్ ఆఫీసర్ పార్థ సిన్హాను నియమించుకుంది. అలాగే వైస్ చైర్మన్‌గా పిడిలైట్ ఇండస్ట్రీస్ డిప్యూటీ ఎండీ సుధాన్షు వాట్స్, ట్రెజరర్‌గా లింటాస్ గ్రూప్ సీఈవో ఎస్.సుబ్రమన్యేశ్వర్ నియమితులైనట్టు ప్రకటించింది.

బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ రూ. 1,500 కోట్ల క్విప్ ఇష్యూ

న్యూఢిల్లీ: రియల్టీ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యకలాపాల విస్తరణలో భాగంగా క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్విప్) దారా రూ. 1,500 కోట్ల వరకు నిధులు సమీకరిస్తోంది. సెప్టెంబర్ 2న ప్రారంభమైన క్విప్ ఇష్యూకి సంబంధించి ఒక్కో షేరుకు రూ. 1,164.70 చొప్పున ధర నిర్ణయించింది. సోమవారం నాటి క్లోజింగ్ ధర రూ. 1,239.80 ప్రకారం కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 28,000 కోట్ల పైగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లాభం రూ. 39 కోట్ల నుంచి రూ. 84 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ. రూ. 685 కోట్ల నుంచి రూ. 1,113 కోట్లకు చేరింది.

450కి తగ్గిన సీసీడీ అవుట్‌లెట్స్

న్యూఢిల్లీ: కేఫె కాఫీ డే (సీసీడీ) అవుట్‌లెట్స్ సంఖ్య గత ఆర్థిక సంవత్సరం 450కి తగ్గాయి. అయితే, కార్పొరేట్ ఆఫీసులు, హోటళ్లలో వెండింగ్ మెషిన్ల సంఖ్య 52,581కి పెరిగింది. కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ (సీడీఈఎల్) నివేదిక ప్రకారం 2023 ఆర్థిక సంవత్సరంలో కాఫీ డే అవుట్‌లెట్స్ సంఖ్య 469గా, సీసీడీ వేల్యూ ఎక్స్‌ప్రెస్ కియోస్కల సంఖ్య 268గా, వెండింగ్ మెషిన్ల సంఖ్య 48,788గా ఉంది. మరోవైపు, సీసీడీ కార్యకలాపాలు 154 నగరాల నుంచి 141 నగరాలకు పరిమితమయ్యాయి. కాఫీ వ్యాపార ఆదాయం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 11 శాతం పెరిగి రూ. 966 కోట్లకు పెరగ్గా, నికర రుణభారం రూ. 1,524 కోట్ల నుంచి రూ. 881 కోట్లకు తగ్గింది. 2019 జూలైలో వ్యవస్థాపక చైర్మన్ వీజీ సిద్ధార్థ మరణం తర్వాత నుంచి కంపెనీ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అసెట్ మానిటైజేషన్ ద్వారా వస్తున్న నిధులతో రుణభారాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-9-2024	
విశాఖ	505-00
చిత్తూరు	518-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	505-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	470-00
వరంగల్	472-00
రిటైల్ ధర	5.30

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	3,233.80	2.5
GRASIM	2,758.50	1.91
HINDUNILVR	2,841.95	1.71
ULTRACEMCO	11,601.25	1.23
SUNPHARMA	1,833.00	1.19

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	519.65	-3.06
COALINDIA	505	-2.81
ONGC	314.9	-2.27
HINDALCO	666	-1.9
LTIM	6,074.80	-1.15

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,121
ఎన్ఎస్ఈ	1,14,787
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,91,682
ఎఫ్ఐఐ	+975
డీఐఐ	+97

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.95	$ 70.34
బ్రెంట్	72.48	$ 73.75

మూలధన వ్యయాల వృద్ధిపై కేంద్రం దృష్టి

రూ. 500 కోట్లపైన వ్యయాలపై నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ: ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ మూలధన వ్యయాల వేగవంతంపై కేంద్రం దృష్టి సారించింది. రూ. 500 కోట్లకు మించిన వ్యయానికి సంబంధించిన నిబంధనలను ఆర్థిక మంత్రిత్వ శాఖ సడలించింది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ. 11.11 లక్షల కోట్ల క్యాపెక్స్‌ను(మూలధన వ్యయం) బడ్జెట్ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 11.1 శాతం ఎక్కువ. సార్వత్రిక ఎన్నికల కారణంగా కొన్ని నెలలపాటు మందగించిన ప్రభుత్వ వ్యయాలను తిరిగి వేగవంతం చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు ఉన్నత స్థాయి వర్గాలు పేర్కొన్నాయి. మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 15 నెలల కనిష్ఠ స్థాయిలో 6.7 శాతంగా నమోదుకావడానికి ఎన్నికల సందర్భంగా మూలధన వ్యయాల్లో నెమ్మదే కారణమన్న విశ్లేషణలు వచ్చిన సంగతి తెలిసిందే. మూలధన వ్యయాలకు సంబంధించి అనుమతించిన తాజా సడలింపులను అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఖచ్చితంగా పాటించవలసి ఉంటుంది. సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎన్ఎన్ఏ), సెంట్రల్ నోడల్ ఏజెన్సీ (సీఎన్ఏ), మంత్లీ ఎక్స్‌పెండిచర్ ప్లాన్ (ఎంఈపీ), స్కీమ్ అలాగే నాన్-స్కీమ్ ఖర్చుల కోసం మంత్రిత్వ శాఖలు రూపొందించిన త్రైమాసిక వ్యయ ప్రణాళిక (క్యూఈపీ)లు సీలింగ్‌ల మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలి.

క్యాపెక్స్ కోసం త్రైమాసిక లక్ష్యాలు

మరోవైపు రోడ్డు, రవాణా- రహదారుల మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌టీహెచ్), టెలికాం శాఖ కోసం బడ్జెట్ మూలధన వ్యయాలపై జరిగిన ఒక సమీక్షా సమావేశంలో ఆర్థికశాఖ నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, వివిధ మంత్రిత్వ శాఖలు క్యాపెక్స్ కోసం త్రైమాసిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం అవసరమని అన్నారు. సంవత్సరంలో మిగిలిన నెలల్లో వ్యయాలను వేగవంతం చేయాల్సిన ఆవశ్యకత ప్రాముఖ్యతను ఉద్ఘాటించారు. రోడ్డు, రవాణా- రహదారుల మంత్రిత్వ శాఖకు బడ్జెట్ క్యాపెక్స్ కేటాయింపులు 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.42 లక్షల కోట్లు ఉంటే, ప్రస్తుత 2024-25లో 90% వృద్ధితో రూ. 2.72 లక్షల కోట్లకు ఎగశాయి. 2024-25కు సంబంధించిన క్యాపెక్స్ ప్రణాళికల గురించి ఎంఓఆర్‌టీహెచ్ సెక్రటరీ కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించినట్లు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. వివిధ చర్యల ద్వారా ప్రైవేట్ మూలధనాన్ని ఆకర్షించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.



ఆస్తుల రీసైక్లింగ్ లక్ష్యాలను కూడా చేరుకునేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆర్థికమంత్రికి సెక్రటరీ తెలియజేసినట్లు సమాచారం. క్యాపెక్స్ వ్యయాల వేగవంతంపై ఆర్థిక మంత్రి వివిధ మంత్రిత్వశాఖలు, సమావేశమవుతున్నారు.

అపోలో రిసర్చ్ అకాడమీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్స్ గ్రూప్ తాజాగా అపోలో రిసర్చ్ అకాడమీని ఏర్పాటు చేసింది. ఆరోగ్య సంరక్షణ పరిశోధన, ఆవిష్కరణలలో అంతర్జాతీయంగా నాయకత్వ స్థానానికి ఎదగాలన్న లక్ష్యంతో దీనిని నెలకొల్పినట్లు వెల్లడించింది. రవి పి మహాజన్ నేతృత్వంలోని ఈ అకాడమీ పరిశోధనా నైపుణ్యం యొక్క సమ్మిళిత, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన హబ్‌ను రూపొందించడానికి వివిధ అపోలో సంస్థల ప్రయత్నాలను సమన్వయం చేయడానికి సిద్ధంగా ఉందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ బుధవారం తెలిపింది.

బ్రెయిలీ భాషలో స్టార్ హెల్త్ పాలసీ



చెన్నై: స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ ఆదర్శనీయమైన నిర్ణయం తీసుకుంది. 'స్పెషల్ కేర్ గోల్డ్' పాలసీని 'బ్రెయిలీ' భాషలో విడుదల చేసింది. కంటి చూపు సరిపడా లేని వారు సైతం ఆరోగ్య బీమా పాలసీకి సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని స్వయంగా తెలుసుకుని, తగిన నిర్ణయం తీసుకునేందుకు ఇది వీలు కల్పిస్తుందని సంస్థ తెలిపింది. దేశంలో 3.4 కోట్ల మంది దృష్టి లోపంతో బాధపడుతున్నారని.. వారికి తగిన నైపుణ్యాలు, శిక్షణ ఇచ్చి హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్లుగా అవకాశం ఇవ్వడం ద్వారా మద్దతుగా నిలవనున్నట్లు ప్రకటించింది. సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా ఆరోగ్య బీమా సేవలు అందించాలన్నదే తమ లక్ష్యమని.. బ్రెయిలీలో స్పెషల్ కేర్ గోల్డ్ పాలసీ విడుదల ఈ దిశగా మైలురాయి అని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో ఆనంద్‌రాయ్ పేర్కొన్నారు. అంధులైన వారి సమగ్రమైన, సమ్మిళిత ఆరోగ్య బీమా రక్షణ అవసరాలను ఈ పాలసీ తీరుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంధుడైన పారిశ్రామికవేత్త, బొల్లాంట్ ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీకాంత్ బొల్లా పాల్గొన్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్ సహకారంతో స్పెషల్ కేర్ గోల్డ్ పాలసీ బ్రెయిలీ వెర్షన్‌ను స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ రూపొందించింది.

గృహ పొదుపులే ఆదుకుంటాయ్

ఆర్థిక వృద్ధికి మద్దతు • ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ పాత్ర



ముంబై: గృహ పొదుపులు ఆర్థిక వ్యవస్థ పెట్టుబడి అవసరాలకు మద్దతుగా నిలుస్తున్నాయని (వృద్ధికి) ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మేకేల్ దేబబ్రత పాత్ర అన్నారు. వెలుపలి నిధులను కేవలం అదనపు మద్దతుగా పేర్కొన్నారు. సీఐఐ నిర్వహించిన ఆర్థిక సదస్సులో పాల్గొని కీలక ప్రసంగం చేశారు. ''గృహాలకు సంబంధించి నికర ఆర్థిక పొదుపులు 2020-21 నుంచి చూస్తే సగానికి తగ్గాయి. కరోనా విపత్తు సమయంలో వివేకంతో దాచుకున్న పొదుపులు ఇల్లు వంటి భౌతిక ఆస్తుల్లోకి మళ్లుతుండడమే దీనికి కారణం. రానున్న రోజుల్లో పెరిగే ఆదాయాలతో గృహ పొదుపులు తిరిగి ఆర్థిక సాధనాల్లోకి వస్తాయి. ఈ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. 2011-17 నాటికి జీడీపీలో గృహ ఆర్థిక పెట్టుబడులు 10.6 శాతంగా ఉంటే, 2017-23 నాటికి 11.5 శాతానికి చేరాయి''అని పాత్ర వివరించారు. కరోనా అనంతరం భౌతిక పొదుపులు సైతం జీడీపీలో 12 శాతానికి పెరిగాయని, రానున్న రోజుల్లో మరింత పెరుగుతాయన్నారు. ప్రైవేటు కార్పొరేట్ రంగం నికర రుణ భారాన్ని గణనీయంగా తగ్గించుకున్నట్టు చెప్పారు. మూలధన వ్యయాల సైకిల్ పుంజుకున్నందున కార్పొరేట్ రంగం రుణాలు ఇకమీదట పెరగొచ్చని అంచనా వేశారు. ఈ విధమైన రుణ అవసరాలను గృహ పొదుపులతోపాటు, వెలుపలి వనరులు తీరుస్తాయన్నారు. ఆర్థిక ఉత్పాదకత పెరుగుతున్న కొద్దీ విదేశీ నిధులను సర్దుబాటు చేసుకునే సామర్థ్యం ఇనుమడిస్తుందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, కరెన్సీ విషయంలో ఆర్‌బీఐ పాత్రను ఇదే సమావేశంలో భాగంగా సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ మెచ్చుకున్నారు.

ఆగస్టులో సేవలు.. అదుర్స్

60.3 నుంచి 60.9కి సూచీ



ముంబై: భారత్ ఎకానమీలో మెజారిటీ వెయిటేజ్ కలిగిన సేవల రంగం ఆగస్టులో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. జూలైలో 60.3 వద్ద ఉన్న హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ యాక్టివిటీ ఇండెక్స్, ఆగస్టులో 60.9కి ఎగసింది. గడచిన ఐదు నెలల్లో ఈ స్థాయికి సూచీ ఎగయడం ఇదే తొలిసారి. కొత్త ఆర్డర్లు పూర్తి సానుకూలంగా ఉన్నట్లు హెచ్ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనమిస్ట్ ప్రంజుల్ భండారీ పేర్కొన్నారు. అయితే ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ లోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు.

సేవలు-తయారీ సూచీ యథాతథం

మరోవైపు సేవలు-తయారీ కలగలిపిన హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ అవుట్‌పుట్ ఇండెక్స్ ఆగస్టులో జూలై స్థాయిలోనే యథాతథంగా 60.7 వద్ద కొనసాగింది.



గృహ కొనుగోలుదారులకు 'ప్రాప్ ఆలర్ట్' సేవలు

ప్రారంభించిన ప్రాప్‌ఈక్విటీ

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ డేటా విశ్లేషణ సంస్థ ప్రాప్ ఈక్విటీ కొత్తగా 'ప్రాప్‌అలర్ట్' సేవలను ప్రారంభించింది. హౌసింగ్ ప్రాజెక్టుల నిర్మాణ కార్యకలాపాల పురోగతిపై ఎప్పటికప్పుడు కొనుగోలుదారులకు సమాచారం ఇస్తుంటుంది. నిర్మాణంలోని ఇళ్లను కొనుగోలు చేసిన వారి ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ వెర్టికల్‌ను రూపొందించినట్టు సంస్థ తెలిపింది. ఎన్ఎస్ఈలో లిస్ట్ అయిన ప్రాప్‌ఈక్విటీ సెప్టెంబర్ నాటికి 10,000 మంది చందాదారులను సొంతం చేసుకోనున్నట్టు అంచనా వేస్తోంది. ''నిర్మాణంలోని ప్రాపర్టీల కొనుగోలుదారులకు తగిన సమాచారం, ఎప్పటికప్పుడు అలర్ట్‌లను ప్రాప్‌అలర్ట్ పంపిస్తుందని ప్రాప్‌ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజా తెలిపారు. కేవలం భారత్‌లో ఇళ్ల కొనుగోలుదారులకే కాకుండా, ఎన్ఆర్ఐలు సైతం ఒక్క మౌస్ క్లిక్‌తో నిర్మాణంలోని ప్రాపర్టీల పురోగతిని తెలుసుకోవచ్చన్నారు. ప్రాజెక్టుల పురోగతి సేవలను ఇప్పటికే 70కు పైగా ఇనిస్టిట్యూషన్స్, బ్యాంకులకు అందిస్తున్నట్టు ప్రాప్‌ఈక్విటీ తెలిపింది. దేశవ్యాప్తంగా 2,000 ప్రాజెక్టుల పరిధిలో 5 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం నిలిచిపోయినట్టు ప్రాప్‌ఈక్విటీ తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. దీంతో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని కొనుగోలుదారులకు ప్రాప్‌అలర్ట్ సేవలు ఉపయోగకరంగా ఉండనున్నాయి.

జీఐసీ ఆర్‌ఈలో కేంద్రం వాటాల విక్రయం

ఓఎఫ్‌ఎస్ ద్వారా 6.78 శాతం అమ్మకం

న్యూఢిల్లీ: ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ ఆర్ఈ)లో కేంద్ర ప్రభుత్వం 6.78 శాతం వరకు వాటాలను (11.90 కోట్ల షేర్లను) విక్రయించనుంది. ఇందుకోసం ఒక్కో షేరు ధరను రూ. 395గా నిర్ణయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లకు ఓఎఫ్ఎస్ బుధవారం ఉంటుంది. రిటైల్ ఇన్వెస్టర్లు, ఉద్యోగులు గురువారం బిడ్ చేయొచ్చని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే మైక్రో బ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో తెలిపారు. ఓఎఫ్ఎస్ కోసం నిర్ణయించిన షేరు ధర ప్రకారం ఈ విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 4,700 కోట్లు రావచ్చని అంచనా. ప్రస్తుతం కంపెనీలో కేంద్రానికి 85.78 శాతం వాటాలు ఉన్నాయి. 2017లో జీఐసీ ఆర్ఈ లిస్టయ్యింది. ఐపీవో (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ద్వారా కేంద్రానికి రూ. 9,685 కోట్లు వచ్చాయి. మంగళవారం బీఎస్ఈలో జీఐసీ ఆర్ఈ షేరు 0.13 శాతం తగ్గి రూ. 421.25 వద్ద క్లోజయ్యింది. దానితో పోలిస్తే ఓఎఫ్ఎస్ ధర 6.23 శాతం తక్కువగా ఉంటుంది.



జాతీయ, అంతర్జాతీయ ఎకానమీపై ఆర్‌బీఐ సమీక్ష

గవర్నర్ అధ్యక్షతన 610వ బోర్డ్ భేటీ

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ అధ్యక్షతన ఇక్కడ జరిగిన 610వ బోర్డ్ సమావేశం జాతీయ, అంతర్జాతీయ ఎకానమీ, సవాళ్ల పరిస్థితులపై సమీక్ష జరిపింది. ఈ సమావేశానికి డిప్యూటీ గవర్నర్లు మైఖేల్ దేబబ్రత పాత్ర, ఎం రాజేశ్వర్ రావు, టి రబీ శంకర్ హాజరయ్యారు. సెంట్రల్ బోర్డు ఇతర డైరెక్టర్లు సతీష్ కె మరాఠే, రేవతి అయ్యర్, సచిన్ చతుర్వేది, వేణు శ్రీనివాసన్, పంకజ్ రామన్‌భాయ్ పటేల్, రవీంద్ర హెచ్ ధోలాకియా సమావేశానికి హాజరయ్యారు. ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అజయ్ సేథ్ సమావేశంలో పాల్గొన్న వారిలో ఉన్నారు.

విమాన తయారీకి ప్రభుత్వ దన్ను

- ఎస్‌పీవీ ఏర్పాటుకు రెడీ
- ఐదేళ్లలో కార్యకలాపాలు షురూ

న్యూఢిల్లీ: దేశీయంగా వాణిజ్య విమానాల తయారీకి బూస్ట్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక సంస్థ(ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేయనుంది. తద్వారా విమాన తయారీ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లనున్నట్లు పౌరవిమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. దేశీయంగా వేగవంత వృద్ధిలో ఉన్న వైమానిక రంగానికి పలు అవకాశాలున్నట్లు తెలియజేశారు. భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లు 2024ను లోక్‌సభ ఆగస్టులో ఆమోదించింది. ఈ బిల్లులో విమాన తయారీ, డిజైన్‌లను నియంత్రించే ప్రొవిజన్లను చేర్చింది. తద్వారా ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమానికి వత్తాసు పలకడం ద్వారా సొంత తయారీకి దారి ఏర్పాటు చేసింది.



వెరసి సొంత విమానాలను భారత్ తయారు చేసుకునేందుకు ప్రభుత్వం పటిష్ట కార్యాచరణకు తెరతీసిందని నాయుడు తెలియజేశారు. ఇందుకు ఏర్పాటు చేయనున్న ఎస్‌పీవీలో పరిశ్రమ సంబంధిత నిపుణులు తదితరులను భాగస్వాములను చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న ఐదేళ్లలో సొంత విమానాల తయారీ కార్యకలాపాలు ప్రారంభంకాగలవని హామీనిచ్చారు. విమాన తయారీలో ప్రధాన పాత్ర పోషించడంతోపాటు.. వీటిని భారత్ ఎగుమతి చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. విమాన తయారీ దిగ్గజాలు బోయింగ్, ఎయిర్‌బస్‌లకు భారత్ కీలక మార్కెట్‌గా నిలుస్తున్నట్లు తెలియజేశారు.

కేంద్ర ప్రభుత్వ దిగ్గజం హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) ఇప్పటికే చిన్నతరహా పౌర విమానాలను రూపొందిస్తున్న అంశాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచంలోనే వేగవంతంగా విస్తరిస్తున్న వైమానిక మార్కెట్లలో భారత్ ఒకటని పేర్కొన్నారు. పీహెచ్‌డీ సీసీఐ ఏర్పాటు చేసిన సదస్సులో నాయుడు వైమానిక తయారీ అంశాలపై ప్రసంగించారు. విమానాల నిర్వహణ, పూర్తిస్థాయి తనిఖీలు, మరమ్మతుల(ఎంఆర్‌వో) కార్యకలాపాలలో సైతం భారత్‌కు అపార అవకాశాలున్నట్లు అభిప్రాయపడ్డారు. దేశాన్ని వైమానిక, ఎయిర్ కార్గో, ఎంఆర్‌వో కార్యకలాపాలకు కేంద్రంగా మలచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రస్తావించారు.

పండగ సీజన్‌పై ఫ్లిప్‌కార్ట్ ఫోకస్..

- కొత్తగా 1 లక్ష ఉద్యోగాల కల్పన
- లాజిస్టిక్స్, వేర్‌హౌస్, డెలివరీ విభాగాల్లో అవకాశాలు

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ పండుగ సీజన్‌పై మరింతగా కసరత్తు చేస్తోంది. రాబోయే బిగ్ బిలియన్ డేస్ (టీబీబీడీ) 2024 సేల్ కోసం పెద్ద ఎత్తున నియామకాలు జరపనుంది. కొత్తగా 1 లక్ష ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఇన్వెంటరీ మేనేజర్లు, వేర్‌హౌస్ అసోసియేట్లు, లాజిస్టిక్స్ కోఆర్డినేటర్లు, కిరాణా పార్ట్‌నర్లు, డెలివరీ డ్రైవర్లు మొదలైన సిబ్బందిని తీసుకోనున్నట్లు కంపెనీ తెలిపింది. పండుగ సీజన్ కోసం కొత్త వర్కర్లకు అవసరమైన శిక్షణనివ్వనున్నట్లు వివరించింది. ఇప్పటికే తొమ్మిది నగరాల్లో 11 కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను (ఎఫ్‌సీ) ప్రారంభించినట్లు, దీంతో దేశవ్యాప్తంగా వీటి సంఖ్య 83కి చేరినట్లు ఫ్లిప్‌కార్ట్ వివరించింది. సామాజిక-ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్న లక్ష్యంతో ఉద్యోగాల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది పండుగ సీజన్ సందర్భంగా ఒకవైపు తమ నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడంతో పాటు మరోవైపు ఆర్థిక వృద్ధికి దోహదపడాలని, స్థానిక కమ్యూనిటీలకు సాధికారత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫ్లిప్‌కార్ట్ వివరించింది. తమ సరఫరా వ్యవస్థ కార్యకలాపాలు నిరాటంకంగా సాగేలా, పెరుగుతున్న డిమాండ్ ప్రకారం నిల్వల నిర్వహణ, ప్రోడక్టుల లభ్యత మొదలైన అంశాలను మెరుగుపర్చుకునేందుకు వినూత్నమైన సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. పండుగల సీజన్‌లో ఈ-కామర్స్ కంపెనీలు కల్పించే ఉద్యోగాలు సాధారణంగా ఆయా సీజన్‌లకు పరిమితమైనవిగా ఉంటాయి.

బ్యాంక్ లైసెన్స్ కోసం ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ దరఖాస్తు

న్యూఢిల్లీ: ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఏయూఎస్ఎఫ్‌బీ) పూర్తి స్థాయి బ్యాంక్ లైసెన్స్ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్‌బీఐ) దరఖాస్తు సమర్పించింది. కనీస నికర విలువ రూ. 1,000 కోట్లతో సహా నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న చిన్న ఆర్థిక బ్యాంకులు.. పూర్తి స్థాయి బ్యాంక్‌లుగా మారడానికి ఏప్రిల్‌లో ఆర్‌బీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందుకు అనుగుణంగా దరఖాస్తు సమర్పించినట్లు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఒక బీఎస్ఈ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ప్రైవేట్ రంగంలో చిన్న ఫైనాన్స్ బ్యాంకులు (ఎస్ఎఫ్‌బీ) పూర్తి స్థాయి బ్యాంకుగా మారడానికి సంబంధించిన లైసెన్సింగ్ మార్గదర్శకాలను నవంబర్ 2014లో ఆర్‌బీఐ జారీ చేసింది. జైపూర్‌కు చెందిన ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఈ ఏడాది మొదట్లో ఫినకేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌ను కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి విలీనం అమల్లోకి వచ్చింది. దీనితో విలీన సంస్థ మొత్తం వ్యాపార పరిమాణం రూ. 1.8 లక్షల కోట్లు దాటింది.

4 బిలియన్ డాలర్ల విలువైన ల్యాప్‌టాప్‌ల దిగుమతి



న్యూఢిల్లీ: దిగుమతి నిర్వహణ వ్యవస్థను అనుసరించి అనుమతి పొందిన కంపెనీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 4 బిలియన్ డాలర్ల విలువైన ల్యాప్‌టాప్‌లు, ఇతర ఐటీ ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. 2023-24లో ఈ దిగుమతుల విలువ 8.4 బిలియన్ డాలర్లు. వీటిలో అత్యధికం చైనా నుంచి భారత్‌కు వస్తున్నాయని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. 2023 అక్టోబర్‌లో ల్యాప్‌టాప్‌లు, పర్సనల్ కంప్యూటర్లు, ఐటీ హార్డ్‌వేర్ ఉత్పత్తుల దిగుమతుల కోసం ప్రభుత్వం దిగుమతి నిర్వహణ/అధికారీకరణను రూపొందించింది. మార్కెట్ సరఫరా దెబ్బతినకుండా దేశంలోకి ఈ వస్తువుల రాకను పర్యవేక్షించడం ఈ వ్యవస్థ లక్ష్యం. దీని ప్రకారం దరఖాస్తు చేసుకుని పొందిన అనుమతులు 2024 సెప్టెంబర్ 30 వరకు చెల్లుబాటు అవుతాయి.

10 బిలియన్ డాలర్లకుపైగా..

నూతన వ్యవస్థ అమలులోకి వచ్చిన తొలిరోజు 2023 నవంబర్ 1న 100కుపైగా దరఖాస్తులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటిలో యాపిల్, డెల్, లెనోవో వంటి సంస్థలు ఉన్నాయి. 10 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఉత్పత్తుల కోసం ఇవి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్ 30 తర్వాత తదుపరి ఉత్తర్వుల కోసం వాణిజ్య మంత్రిత్వ శాఖ పూర్తిగా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సూచనలను పాటిస్తుందని అధికారి తెలిపారు. 2022-23లో భారత్‌కు 5.33 బిలియన్ డాలర్ల విలువైన పర్సనల్ కంప్యూటర్లు దిగుమతి అయ్యాయి. ఇందులో చైనా వాటా ఏకంగా 5.11 బిలియన్ డాలర్లు ఉంది. సింగపూర్, హాంగ్‌కాంగ్, యూఎస్, మలేషియా, తైవాన్, నెదర్లాండ్స్, వియత్నాం సైతం ఐటీ ఉత్పత్తులను భారత్‌కు సరఫరా చేస్తున్నాయి.

దేశవాళీ ధమాకా


గిల్

నేటి నుంచి భారత దేశవాళీ క్రికెట్ సీజన్ మొదలు

- దులీప్ ట్రోఫీతో ఆరంభం
- బెంగళూరు వేదికగా భారత్ 'ఎ'తో భారత్ 'బి' ఢీ
- అనంతపురంలో భారత్ 'సి', భారత్ 'డి' మధ్య పోరు
- బరిలో టీమిండియా స్టార్ ఆటగాళ్లు
- ఉదయం గం. 9:30 నుంచి మ్యాచ్‌లు ప్రారంభం

బెంగళూరు: భారత జట్టు అంతర్జాతీయ సీజన్ ప్రారంభానికి రెండు వారాల ముందుగానే 2024–2025 దేశవాళీ క్రికెట్ సీజన్‌కు తెర లేవనుంది. ఇందులో భాగంగా గురువారం దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనున్న మ్యాచ్‌లో భారత్ 'ఎ' జట్టుతో భారత్ 'బి' జట్టు... అనంతపురంలో నిర్వహించనున్న మరో మ్యాచ్‌లో భారత్ 'సి' జట్టుతో భారత 'డి' జట్టు తలపడనున్నాయి. వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు ముందు టీమిండియా మరో 10 టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా... ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లు జాతీయ జట్టుకు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజాకు ఈ టోర్నీ నుంచి విశ్రాంతినివ్వగా... మిగిలిన యువ ఆటగాళ్లందరూ బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. రిషభ్ పంత్... చాన్నాళ్ల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్ ఆడనున్నాడు. టెస్టు జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవాలనుకుంటున్న శుబ్‌మన్ గిల్ భారత 'ఎ' జట్టుకు సారథ్యం వహిస్తుండగా... మరో యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ భారత్ 'బి' నుంచి బరిలోకి దిగనున్నాడు. ఈ టోర్నీని జాతీయ సెలెక్టర్లు నిశితంగా పరిశీలించనున్న నేపథ్యంలో ఆటగాళ్లంతా తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలని ఉవ్విళ్లూరుతున్నారు. మిడిలార్డర్ ప్లేయర్లు కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురేల్‌పై ప్రధానంగా దృష్టి ఉంటుంది. సీనియర్ పేసర్ షమీ శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటుండగా... సిరాజ్ అనారోగ్యంతో టోర్నీకి దూరమయ్యాడు. బుమ్రా కూడా అందుబాటులో లేకపోవడంతో మెరుగైన ప్రదర్శన కనబర్చిన పేసర్లకు ప్రత్యేక గుర్తింపు దక్కడం ఖాయమే. దీంతో ముకేశ్ కుమార్, ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, విద్వత్ కావేరప్ప, విజయ్ కుమార్, హర్షిత్ రాణాలపై సెలెక్టర్లు దృష్టి సారించనున్నారు. స్పిన్ విభాగంలో సత్తా చాటేందుకు అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, సాయికిశోర్, సౌరభ్ కుమార్, మానవ్ సుతార్ సిద్ధంగా ఉన్నారు.

ఇషాన్ కిషన్ అవుట్

దేశవాళీ టోర్నీల్లో ఆడని కారణంగా బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు కోల్పోయిన యువ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్... దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆడటం లేదు. కండరాల నొప్పితో బాధపడుతున్న ఇషాన్... భారత 'డి' జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. అనంతపురం వేదికగా జరగనున్న తొలి మ్యాచ్‌లో భారత్ 'సి'తో భారత్ 'డి' ఆడుతుంది. దీంతో గురువారం ప్రారంభం కానున్న పోరులో భారత్ 'డి' తరఫున ఆంధ్ర ఆటగాడు శ్రీకర్ భరత్ వికెట్ కీపర్‌గా వ్యవహరించే అవకాశాలున్నాయి. మరోవైపు భారత్ 'ఎ' జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న పేసర్ ప్రసిధ్ కృష్ణ కూడా శస్త్ర చికిత్స నుంచి పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడు కూడా తొలి రౌండ్ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. ఇషాన్ స్థానంలో సంజూ సామ్సన్‌ను జట్టులోకి తీసుకున్నారు.


తనుశ్, ఆకాశ్‌దీప్, తిలక్ వర్మ

జట్లు

భారత్ 'ఎ': శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, శివమ్ దూబే, తనుశ్ కొటియాన్, కుల్దీప్ యాదవ్, ఆకాశ్‌దీప్, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్, విద్వత్ కావేరప్ప, కుమార్ కుశాగ్ర, శాశ్వత్.

భారత్ 'బి': అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్, ముషీర్ ఖాన్, నితీశ్ కుమార్ రెడ్డి (ఫిట్‌నెస్ సాధిస్తేనే), వాషింగ్టన్ సుందర్, నవ్‌దీప్ సైనీ, యశ్ దయాల్, ముకేశ్ కుమార్, రాహుల్ చహర్, సాయి కిశోర్, మోహిత్ అవస్తి, జగదీశన్.

భారత్ 'సి': రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటిదార్, అభిషేక్ పొరెల్, ఇంద్రజీత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్ యాదవ్, విజయ్‌కుమార్, అన్షుల్, హిమాన్షు చౌహాన్, మయాంక్ మార్కండే, అర్యాన్ జుయల్, సందీప్ వారియర్.

భారత్ 'డి': శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అథర్వ తైడె, యశ్ దూబే, దేవదత్ పడిక్కల్, సంజూ సామ్సన్, రికీ భుయ్, సారాంశ్ జైన్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, ఆదిత్య థాక్రే, హర్షిత్ రాణా, తుషార్, ఆకాశ్ సేన్ గుప్తా, శ్రీకర్ భరత్, సౌరభ్ కుమార్.

"డిఫెన్స్‌ను మరింత బలోపేతం చేసుకునేందుకు సాధన చేశా. టర్నింగ్ ట్రాక్‌పై స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొనే ప్రయత్నం చేస్తా. టి20లు ఎక్కువ ఆడటం వల్ల బ్యాటింగ్ పిచ్‌లపై డిఫెన్స్‌లో కాస్త వెనుకబడుతాం. ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు దానిపైనే దృష్టి సారించా. టెస్టు క్రికెట్‌లో ఇప్పటి వరకు అనుకున్న స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోయా. ఈ సీజన్‌లో 10 టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్న నేపథ్యంలో ఆటతీరు మరింత మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నిస్తా.

– శుబ్‌మన్ గిల్, భారత్ 'ఎ' కెప్టెన్

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో జాతీయ జట్టు తరఫున ఓపెనింగ్ చేసిన తొమ్మిది మ్యాచ్‌ల్లో ఎంతో నేర్చుకున్నా. సారథి నమ్మకం మీ వెంట ఉంటే మరింత స్వేచ్ఛగా ఆడొచ్చు. స్పిన్ ట్రాక్‌లపై రోహిత్ శర్మ సలహాల వల్లే మెరుగైన ప్రదర్శన చేయగలిగా. దాన్ని ఇక ముందు కూడా కొనసాగించే ప్రయత్నం చేస్తా. అందుకు దులీప్ ట్రోఫీ ఉపయోగ పడుతుందని భావిస్తున్నా.

– యశస్వి జైస్వాల్, భారత్ 'బి' ఓపెనర్

2024-2025 దేశవాళీ క్రికెట్ సీజన్ షెడ్యూల్

టోర్నమెంట్	కేటగిరీ	లీగ్ దశ		నాకౌట్ దశ	
దులీప్ ట్రోఫీ	పురుషుల సీనియర్స్	5 సెప్టెంబర్ 2024	22 సెప్టెంబర్ 2024	-	-
ఇరానీ కప్	పురుషుల సీనియర్స్	-	-	1 అక్టోబర్ 2024	5అక్టోబర్ 2024
రంజీ ట్రోఫీ ఎలైట్	పురుషుల సీనియర్స్	11 అక్టోబర్ 2024	2 ఫిబ్రవరి 2025	8 ఫిబ్రవరి 2025	2 మార్చి 2025
రంజీ ట్రోఫీ ప్లేట్	పురుషుల సీనియర్స్	11 అక్టోబర్ 2024	16 నవంబర్ 2024	23 జనవరి 2025	27 జనవరి 2025
సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ	పురుషుల సీనియర్స్	23 నవంబర్ 2024	5 డిసెంబర్ 2024	9 డిసెంబర్ 2024	15 డిసెంబర్ 2024
విజయ్ హజారే ట్రోఫీ	పురుషుల సీనియర్స్	21 డిసెంబర్ 2024	5 జనవరి2025	9 జనవరి 2025	18 జనవరి 2025
కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ ఎలైట్	పురుషుల అండర్-23	13 అక్టోబర్ 2024	4 ఫిబ్రవరి 2025	10 ఫిబ్రవరి 2025	1మార్చి 2025
కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ ప్లేట్	పురుషుల అండర్-23	13 అక్టోబర్ 2024	18 నవంబర్ 2024	23 నవంబర్2024	26 నవంబర్ 2024
పురుషుల అండర్-23 స్టేట్ 'ఎ' ట్రోఫీ	పురుషుల అండర్-23	15 డిసెంబర్ 2024	27 డిసెంబర్ 2024	1 జనవరి 2025	10 జనవరి 2025
వినూ మన్కడ్ ట్రోఫీ	పురుషుల అండర్-19	4 అక్టోబర్ 2024	12 అక్టోబర్ 2024	17 అక్టోబర్ 2024	26 అక్టోబర్2024
కూచ్ బెహర్ ట్రోఫీ ఎలైట్	పురుషుల అండర్-19	6 నవంబర్ 2024	9 డిసెంబర్ 2024	14 డిసెంబర్ 2024	10 జనవరి 2025
కూచ్ బెహర్ ట్రోఫీ ప్లేట్	పురుషుల అండర్-19	6 నవంబర్ 2024	9 డిసెంబర్ 2024	14 డిసెంబర్ 2024	17 డిసెంబర్ 2024
విజయ్ మర్చంట్ ట్రోఫీ ఎలైట్	పురుషుల అండర్-16	6 డిసెంబర్ 2024	30 డిసెంబర్ 2024	3 జనవరి 2025	27 జనవరి 2025
విజయ్ మర్చంట్ ట్రోఫీ ప్లేట్	పురుషుల అండర్-16	6 డిసెంబర్ 2024	30 డిసెంబర్ 2024	3 జనవరి 2025	6 జనవరి 2025
సీనియర్ మహిళల టి20 ట్రోఫీ	సీనియర్ మహిళలు	17 అక్టోబర్ 2024	28 అక్టోబర్ 2024	6 నవంబర్ 2024	12 నవంబర్ 2024
సీనియర్ మహిళల టి20 చాలెంజర్ ట్రోఫీ	సీనియర్ మహిళలు	17 నవంబర్ 2024	25 నవంబర్ 2024	27 నవంబర్ 2024	27 నవంబర్ 2024
సీనియర్ మహిళల వన్డే ట్రోఫీ	సీనియర్ మహిళలు	4 డిసెంబర్ 2024	16 డిసెంబర్ 2024	21 డిసెంబర్ 2024	30 డిసెంబర్ 2024
సీనియర్ మహిళల వన్డే చాలెంజర్ ట్రోఫీ	సీనియర్ మహిళలు	5 జనవరి 2025	13 జనవరి 2025	15 జనవరి 2025	15 జనవరి 2025
సీనియర్ మహిళల మల్టీడే చాలెంజర్ ట్రోఫీ	సీనియర్ మహిళలు	18 మార్చి 2025	1 ఏప్రిల్ 2025	-	-
మహిళల అండర్ 23 టి20 ట్రోఫీ	మహిళల అండర్-23	5 జనవరి 2025	12 జనవరి 2025	16 జనవరి 2025	22 జనవరి 2025
మహిళల అండర్ 23 వన్డే ట్రోఫీ	మహిళల అండర్-23	5 మార్చి 2025	13 మార్చి 2025	17 మార్చి 2025	26 మార్చి 2025
మహళల అండర్ 19 టి20 ట్రోఫీ	మహిళల అండర్-19	1 అక్టోబర్ 2024	8 అక్టోబర్ 2024	12 అక్టోబర్ 2024	18 అక్టోబర్ 2024
మహిళల అండర్ 19 టి20 చాలెంజర్ ట్రోఫీ	మహిళల అండర్-19	24 అక్టోబర్ 2024	28 అక్టోబర్ 2024	30 అక్టోబర్ 2024	30 అక్టోబర్ 2024
మహిళల అండర్ 19 వన్డే ట్రోఫీ	మహిళల అండర్-19	4 జనవరి 2025	12 జనవరి 2025	16 జనవరి 2025	25 జనవరి 2025
మహిళల అండర్ 15 వన్డే ట్రోఫీ	మహిళల అండర్-15	21 నవంబర్ 2024	29 నవంబర్ 2024	9 డిసెంబర్ 2024	17 డిసెంబర్ 2024
విజ్జీ ట్రోఫీ	ఇంటర్ యూనివర్సిటీ	10 మార్చి 2025	14 మార్చి 2025	16 మార్చి 2025	16 మార్చి 2025

భారత టీటీ జట్ల కెప్టెన్‌లుగా శరత్, మనిక


మనిక



శ్రీజ

- ఆసియా చాంపియన్‌షిప్‌కు జట్ల ఎంపిక
- వచ్చేనెల 7 నుంచి 13 వరకు టోర్నీ

న్యూఢిల్లీ: ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్లను బుధవారం ప్రకటించారు. పురుషుల జట్టుకు వెటరన్ స్టార్ ఆచంట శరత్ కమల్, మహిళల జట్టుకు సీనియర్ మనిక బత్రా కెప్టెన్లుగా వ్యవహరిస్తారు. ఈ టోర్నీ కజకిస్తాన్ రాజధాని అస్తానాలో వచ్చే నెల 7 నుంచి 13 వరకు జరుగుతుంది. ఇది ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు క్వాలిఫయింగ్ టోర్నీ కావడంతో ఐదుసార్లు ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడ్డ 42 ఏళ్ల శరత్ సహా అనుభవజ్ఞులైన హర్మీత్ దేశాయ్, సత్యన్ తదితరులతో భారత్ పూర్తిస్థాయి జట్టుతో బరిలోకి దిగనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నాక విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ స్టార్, భారత నంబర్‌వన్ ఆకుల శ్రీజ ఈ టోర్నీతో మళ్లీ బరిలోకి దిగనునంది. ప్రస్తుతం జరుగుతున్న అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్‌లో శ్రీజ పాల్గొనడం లేదు.


శరత్

జట్ల వివరాలు

పురుషుల జట్టు: శరత్ కమల్ (కెప్టెన్), మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్, సత్యన్, మనుశ్ షా, **రిజర్వ్ ప్లేయర్లు:** స్నేహిత్, జీత్‌చంద్ర. **మహిళల జట్టు:** మనిక బత్రా (కెప్టెన్), ఆకుల శ్రీజ, ఐహిక ముఖర్జీ, దియా చిటాలే, సుతీర్థ ముఖర్జీ, **రిజర్వ్ ప్లేయర్లు:** యశస్విని, పాయ్‌మంటీ బైస్య.

సతీశ్ శుభారంభం

మహిళల సింగిల్స్‌లో ముగిసిన భారత పోరు



తైపీ సిటీ: తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో సతీశ్ కుమార్ కరుణాకరన్, శంకర్ సుబ్రమణియన్ ముత్తుస్వామి శుభారంభం చేయగా... కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. మహిళల సింగిల్స్‌లో బరిలో దిగిన నలుగురు భారత క్రీడాకారిణులు తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సతీశ్ కుమార్ 24-22, 23-21తో కాంతాపోన్ వాంగ్‌చరోయెన్ (థాయ్‌లాండ్)పై, శంకర్ ముత్తుస్వామి 21-12, 19-21, 21-11తో జోకిమ్ ఓల్డార్ఫ్ (ఫిన్‌లాండ్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. కిరణ్ జార్జి 21-15, 8-21, 16-21తో యోహానెస్ సౌత్ మార్సెలినో (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయాడు.

మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో తాన్యా హేమంత్ 11-21, 10-21తో టాప్ సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) చేతిలో... అనుపమా ఉపాధ్యాయ్ 21-17, 19-21, 11-21తో లౌరెన్ లామ్ (అమెరికా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 19-21, 18-21తో పోర్న్‌పిచా చోకీవోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో... రక్షిత శ్రీ 19-21, 13-21తో అసుకా తకహాషి (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో 'పాండా సిస్టర్స్' రితూపర్ణ-శ్వేతాపర్ణ 12-21, 16-21తో లుయ్ లోక్ లోక్-సాంగ్ హియు యాన్ (హాంకాంగ్) చేతిలో పరాజయాన్ని చవిచూశారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో (భారత్) ద్వయం 21-17, 13-21, 21-16తో లియావో చావో పాంగ్-లిన్ యు హావో (చైనీస్ తైపీ) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. అశిత్ సూర్య-అమృత ప్రముథేశ్ (భారత్) జంట 13-21, 9-21తో పకాపోన్-ఫాతైమస్ (థాయ్‌లాండ్) జోడీ చేతిలో... సతీశ్ కుమార్-ఆద్యా (భారత్) జోడీ 21-19, 20-22, 18-21తో లుయ్ చున్ వాయ్-ఫు చి యాన్ (హాంకాంగ్) ద్వయం చేతిలో ఓడిపోయాయి.

రాజస్తాన్ రాయల్స్ కోచ్‌గా ద్రవిడ్!



న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్, మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ మళ్లీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) బాట పట్టనున్నాడు. వచ్చే సీజన్ కోసం రాజస్తాన్ రాయల్స్ యాజమాన్యం క్రికెట్ దిగ్గజాన్ని హెడ్ కోచ్‌గా నియమించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు సంప్రదింపుల్ని ముమ్మరం చేసిన ఫ్రాంచైజీ తమ చర్చలు తుది దశకు వచ్చాయని తెలిపింది. 'ద్రవిడ్‌తో సంప్రదింపులు ఫలప్రదంగా ముగిశాయి. త్వరలోనే అతను కోచ్ బాధ్యతలు చేపట్టడం ఖాయం' అని ఫ్రాంచైజీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర ఈ ఫ్రాంచైజీ డైరెక్టర్‌గా ఉన్నాడు. రాజస్తాన్‌కు సంబంధించిన బార్బడోస్ రాయల్స్... కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో, పార్ల్ రాయల్స్... సౌతాఫ్రికా20 టోర్నీల్లో ఉండటంతో సహాయ సిబ్బందిలో దిగ్గజాలను నియమించుకుంటోంది. రాజస్తాన్‌కు సేవలందించడం ద్రవిడ్‌కు కొత్తేం కాదు. 2012, 2013 ఐపీఎల్ లీగ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన ద్రవిడ్ రిటైర్మెంట్ అనంతరం ఆ జట్టు మెంటార్‌గా రెండేళ్లు పని చేశాడు. తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌కు 2016లో మెంటార్ అయ్యాడు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) 'హెడ్'గా బాధ్యతలు చేపట్టడంతో ఐపీఎల్‌కు దూరమయ్యాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ ద్రవిడ్‌ల కాంబినేషన్‌లో టీమిండియా కరీబియన్ గడ్డపై ఈ ఏడాది టి20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్నాక... ద్రవిడ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నాడు. నిజానికి ద్రవిడ్ పదవీ కాలం కూడా గత ఏడాది వన్డే ప్రపంచకప్‌తోనే ముగిసింది.

పాకిస్తాన్ హాకీ జట్టు హెడ్ కోచ్‌గా తాహిర్ జమాన్

కరాచీ: అంతర్జాతీయ హాకీలో ప్రస్తుతం ఉనికి కోసం తాపత్రయపడుతున్న పాకిస్తాన్ జట్టును గాడిలో పెట్టేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగానే మాజీ ఒలింపియన్ తాహిర్ జమాన్‌ను జట్టు హెడ్ కోచ్‌గా నియమించారు. చైనాలోని హులుంబుర్‌లో ఈ నెల 8 నుంచి జరిగే ఆసియా చాంపియన్స్ ట్రోఫీ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. ఆతిథ్య చైనా సహా భారత్, పాక్, దక్షిణ కొరియా, జపాన్, మలేసియా జట్లు ఈ టోర్నీలో తలపడతాయి. టోర్నీకే హైలైట్‌గా నిలువనున్న చిరకాల ప్రత్యర్థుల సమరం సెప్టెంబర్ 14న జరుగుతుంది. ప్రస్తుత పాకిస్తాన్ కోచ్ రోలంట్ ఒల్ట్‌మన్స్ మరోసారి స్వల్పకాలిక కోచ్‌గా కొనసాగేందుకు విముఖత చూపారు. తాహిర్ 1992 ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన పాకిస్తాన్ జట్టులో సభ్యుడిగా ఉన్నారు. 1994లో జరిగిన ప్రపంచకప్, చాంపియన్స్ ట్రోఫీల్లోనూ ప్రాతినిధ్యం వహించారు.

1965 తర్వాత...

- ఎనిమిదో స్థానానికి పడిపోయిన పాకిస్తాన్
- ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్



దుబాయ్: బంగ్లాదేశ్‌తో సిరీస్ పరాజయంతో టెస్టుల్లో పాకిస్తాన్ ర్యాంక్ మరింత దిగజారింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో పాక్ 8వ స్థానానికి పడిపోయింది. రావల్పిండి వేదికగా సొంతగడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో పాకిస్తాన్ క్లీన్‌స్వీప్ అయింది. బంగ్లాదేశ్ చేతిలో సిరీస్‌ను కోల్పోవడం పాకిస్తాన్ జట్టుకు ఇదే తొలిసారి. ఒక్క టెస్టులోనూ పోరాటాన్ని కనబర్చలేకపోయిన పాక్ తొలి మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో... రెండో మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో కంగుతింది. 'ఐసీసీ పురుషుల టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో పాక్ రెండు స్థానాలు దిగజారి 8వ ర్యాంక్‌కు పడిపోయింది' అని ఐసీసీ వెబ్‌సైట్‌లో తెలిపింది. సిరీస్‌కు ముందు పాకిస్తాన్ ఆరో ర్యాంక్‌లో ఉంది. రెండు వరుస పరాజయాలతో వెస్టిండీస్ (7వ ర్యాంక్) కంటే దిగువ ర్యాంక్‌కు చేరింది. 1965 తర్వాత పాక్ ఇలా ర్యాంకింగ్స్‌లో దిగజారడం ఇదే తొలిసారి. అయితే పాక్‌ను వైట్‌వాష్ చేసినప్పటికీ బంగ్లాదేశ్ 9వ ర్యాంక్‌లో మార్పు లేదు. కానీ బంగ్లాదేశ్ జట్టు 13 రేటింగ్ పాయింట్లు మెరుగుపరుచుకుంది. త్వరలోనే బంగ్లాదేశ్... భారత్ పర్యటనలో రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొననుంది. ఈ నెల 19 నుంచి చెన్నైలో తొలి టెస్టు జరుగుతుంది.

స్టాలిన్ సైకిల్ సరదా..



అమెరికాలోని షికాగోలో సముద్ర తీరం వెంట సరదాగా సైకిల్ తొక్కుతున్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

సూర్య 'కిరణం'



రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ గగనతలంలో 'తరంగ శక్తి'లో భాగంగా వైమానిక విన్యాసాలు చేస్తున్న భారతవాయుసేనకు చెందిన సూర్యకిరణ్ విమానాలు

డోలు మోగిందిలే..



సింగపూర్‌లో బుధవారం తనకు స్వాగతం పలికిన కళాకారుల డోలు వాయిస్తున్న భారత ప్రధాన మంత్రి మోదీ

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా
పునరుద్ధరిస్తాం

ఎన్నికల ప్రచారంలో రాహుల్ హామీ

జమ్మూ/శ్రీనగర్: జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల ప్రచార పర్వానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం శ్రీకారం చుట్టారు. బనిహాల్, దూరూ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో రాహుల్ ప్రసంగించారు. ''కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విపక్షాల 'ఇండియా'కూటమి సాయంతో జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తాం. తమ కూటమి వచ్చే నెలలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుంది''అని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో కాంగ్రెస్ పొత్తుపెట్టుకోవడం తెల్సిందే. దూరూలో జరిగిన సభలో ఎన్‌సీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా సైతం పాల్గొన్నారు. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 8వ తేదీల్లో మూడు దశల్లో జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోని శాసనసభ స్థానాలకు పోలింగ్ జరగనున్న విషయం తెల్సిందే. 2019 ఆగస్టులో జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించాక జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికలు ఇవే. ''ఈ ప్రాంతానికి రాష్ట్ర హోదా ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. ఆధునిక భారతదేశ చరిత్రలో కేంద్రపాలిత ప్రాంతాలు సైతం రాష్ట్రహోదా సాధించాయిగానీ ఏ రాష్ట్రం కూడా తన రాష్ట్రహోదాను కోల్పోలేదు. రాష్ట్రహోదాను మాత్రమే పునరుద్ధరిస్తే సరిపోదు. ఇక్కడి ప్రజల హక్కులను పునరుద్ధరించాలి. స్వాతంత్ర్యానికి పూర్వం రాజుల కాలంలో లెఫ్టినెంట్ గవర్నర్లు ఉండేవారు. అలాగే ఇప్పుడూ ఇక్కడ ఒక లెఫ్టినెంట్ గవర్నర్ 21వ శతాబ్దపు రాజుగా పాలిస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంత ప్రజలుగా ఇక్కడి స్థానికులకు దక్కాల్సిన ప్రయోజనాలు, ఉద్యోగాలు, కాంట్రాక్టులను ఆయన బయటి వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు''అని ఆరోపించారు. 'ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అభ్యర్థుల వయసు మినహాయింపును 40 దాకా పెంచుతాం. రోజువారీ వేతనాలను క్రమబద్ధీకరిస్తాం. అధిక విద్యుత్ చార్జీలను తగ్గిస్తాం'అని అన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్‌కు తాను చేసిన భారత్ జోడో యాత్ర సందర్భంగా ఇచ్చిన ''విద్వేష మార్కెట్లలో ప్రేమ దుకాణాలను తెరుద్దాం 'నినాదాన్ని ఈ సందర్భంగా రాహుల్ గుర్తుచేశారు.

మత రాజకీయాలకు చెక్ పెట్టేందుకే కాంగ్రెస్‌తో దోస్తీ

జమ్మూకశ్మీర్‌లో బీజేపీ మత, విభజన రాజకీయాలకు చెక్ పెట్టేందుకే కాంగ్రెస్‌తో జట్టుకట్టామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. దూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి జీఏ మిర్‌కు మద్దతుగా రాహుల్ గాంధీ చేపట్టిన ర్యాలీలో ఫరూక్ అబ్దుల్లా ఓటర్లనుద్దేశిస్తూ మాట్లాడారు. ''పోటీలో ఉన్నది ఎన్‌సీ అభ్యర్థా కాంగ్రెస్ అభ్యర్థా అనేది చూడకండి. మాలాగే మీరు కూడా చేయి చేయి కలిపి అందరం విభజన శక్తులపై పోరాటం చేద్దాం''అని అన్నారు.

బుధవారం శ్రీనగర్‌కు 78 కి.మీ. దూరంలోని దురూ వద్ద ఎన్‌సీ నేత ఫరూక్ అబ్దుల్లాతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న రాహుల్



ఫ్రాన్స్ స్కూళ్లలో ఫోన్లు స్విచ్చాఫ్

స్కూల్ ప్రాంగణంలో ఉన్నప్పుడు ఫోన్లు ఆపాల్సిందే

- తొలుత 50 వేల మంది విద్యార్థులకు నిబంధన
- వచ్చే ఏడాది నుంచి దేశవ్యాప్తంగా అమలు

పారిస్: సెల్‌ఫోన్.. ప్రపంచమంతటా కేవలం పెద్దలకే కాదు, పిల్లలకు సైతం వ్యసనంగా మారిన సమాచార సాధనం. ఫోన్ చేతిలో లేకుండా ఒక్క క్షణం కూడా గడవని పరిస్థితి. హెల్‌ఫోన్ మారిన సెల్‌ఫోన్ పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను దెబ్బతీస్తున్నట్లు పలు అధ్యయనాల్లో గుర్తించారు. అంతేకాదు ఆధునిక యుగంలో ఎన్నో నేరాలకు ఫోన్లు కారణమవుతున్నాయి. ఈ జాఢ్యాన్ని వదిలించడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం నడుం కట్టింది. వచ్చే ఏడాది నుంచి పిల్లలు పాఠశాలలో ఉన్నప్పుడు ఫోన్లు వాడకుండా పూర్తి నిషేధం విధించబోతోంది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా 50 వేల మందికిపైగా విద్యార్థులకు ఫోన్లు నిషేధిస్తూ ఉత్తర్వు తీసుకొచ్చింది. ఇది ఇప్పటికే అమల్లోకి వచ్చింది. ఫ్రెంచ్ మిడిల్ స్కూళ్లలో చదువుతున్న 11 ఏళ్ల నుంచి 15 ఏళ్ల విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఉన్నంతసేపు ఫోన్లు పూర్తిగా స్విచ్చాఫ్ చేయాల్సిందేనని ప్రభుత్వం ఆదేశించింది. ఈ కార్యక్రమానికి 'డిజిటల్ విరామం' అని నామకరణం చేసింది. ఫోన్ల తెరల ముందు విద్యార్థులు సాధ్యమైనంత తక్కువ సమయం గడిపేలా చేస్తే వారిలో కొత్త విషయాలు నేర్చుకొనే సామర్థ్యం పెరుగుతుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ చెబుతున్నారు. ఫ్రాన్స్‌లోని నర్సరీలు, ఎలిమెంటరీ స్కూళ్లలో మొబైల్ ఫోన్లతోపాటు ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాల వినియోగంపై 2018 నుంచే నిషేధం అమల్లో ఉంది. ఉన్నత పాఠశాలల్లో చదువుకొనే 15 నుంచి 18 ఏళ్ల పిల్లలు తరగతి గదిలో ఫోన్ వాడకుండా నిషేధించారు. అయితే, వారు ఫోన్లు తప్పనిసరిగా స్విచ్చాఫ్ చేయాలన్న నిబంధన లేదు.

సహజీవనానికి సాక్ష్యంగా...
కోర్టుకు 'ఎంవోయూ' సమర్పించాడు!

దాంతో ముందస్తు బెయిల్ ఇచ్చిన జడ్జి

ముంబై: పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ముంబైకి చెందిన వ్యక్తిపై ఓ 30 ఏళ్ల మహిళ కేసు పెట్టింది. నిందితుడు మాత్రం తాము పరస్పర అంగీకారం మేరకే సహజీవనం చేశామని వాదించాడు. ''ఆ మేరకు మేం ఒప్పందం కూడా చేసుకున్నాం. దాని ప్రకారం ఈ కేసు చెల్లదు''అంటూ రుజువుగా సదరు అవగాహన ఒప్పందాన్నే (ఎంవోయూ) కోర్టుకు సమర్పించాడు. దాంతో వారు పరస్పర అంగీకారంతోనే కలిసి బతికారని కోర్టు తేల్చింది. అతనికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది!

ముంబైకి చెందిన వీరిద్దరూ 2023 అక్టోబర్ 6న కలిశారు. 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూన్ 30 దాకా 11 నెలల పాటు సహజీవనం కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) రాసుకున్నారు. అప్పటికే విడాకులు తీసుకున్న ఆమెను పెళ్లి చేసుకుంటానని అతను చెప్పాడు. కానీ అతనికి మరో మహిళతో సంబంధమున్నట్టు కలిసి బతకడం మొదలుపెట్టాక ఆమె గుర్తించింది. దాంతో, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఫిర్యాదు చేసింది. ''నేను గర్భవతినయ్యా. అబార్షన్ మాత్రలు వేసుకోమంటూ బలవంతం చేశాడు. అతనికి అప్పటికే పెళ్లయిందని తర్వాత తెలిసింది. ఇదేమిటని నిలదీస్తే అశ్లీల వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేశాడు. తనతో సంబంధం కొనసాగించాలంటూ పట్టుబట్టాడు. నేను లొకేషన్లు మారినా వేధిస్తున్నాడు. నా కొడుకును తీసుకెళ్తానని బెదిరించాడు''అని ఆరోపించింది. అత్యాచార ఆరోపణలు నిరాధారమని నిందితుడు వాదించాడు. తమ అగ్రిమెంట్‌ను రుజువుగా సమర్పించాడు. దానిపై తాను సంతకం చేయలేదని సదరు మహిళ వాదించింది. ఒప్పంద పత్రం ప్రామాణికతను నిర్ధారించే ఆధారాల్లేవన్న జడ్జి శయనా పాటిల్, 'ఇది పరస్పర అంగీకారంతో మొదలై చివరికి వికటించిన సంబంధంగా కన్పిస్తోంది'అని అభిప్రాయపడ్డారు. కస్టడీ విచారణ అవసరం లేదని తేల్చారు.

వైరలవుతున్న ఒప్పందం

వారి ఒప్పంద పత్రం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అందులో పలు నిబంధనలున్నాయి. 'ఏడాది పాటు అతనింట్లో కలిసుండాలి. ఆ సమయంలో పరస్పరం లైంగిక వేధింపుల కేసులు పెట్టుకోకూడదు. ఎవరికి నచ్చకపోయినా నెల ముందు నోటీసిచ్చి విడిపోవచ్చు'అని రాసుకున్నారు!

సిన్వర్‌పై అమెరికాలో కేసు

మరో ఐదుగురు హమాస్ నేతలపైనా

- అక్టోబర్ 7 దాడికి కారకులంటూ అభియోగాలు



వాషింగ్టన్: ఇజ్రాయెల్‌లో అక్టోబర్ 7న జరిగిన నరమేధానికి సంబంధించి హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్‌తో పాటు ఆ ఉగ్రవాద సంస్థకు చెందిన మరో ఐదుగురు అగ్ర నేతలపై అమెరికాలో కేసు నమోదైంది. దాడికి ప్రణాళిక, మద్దతు, నిర్వహణ వెనక ఉన్నది వీరేరంటూ మంగళవారం క్రిమినల్ అభియోగాలు నమోదయ్యాయి. ఈ జాబితాలో హమాస్ పొలిటికల్ చీఫ్ ఇస్మాయిల్ హనియా, మిలటరీ వింగ్ చీఫ్ మహ్మద్ దెయిఫ్, డిప్యూటీ మిలిటరీ కమాండర్ మార్వాన్ ఇస్సా, ఖలీద్ మెషాల్, అలీ బరాకా ఉన్నారు. వీరిలో హనియా, దెయిఫ్, ఇస్సా ఇప్పటికే ఇజ్రాయెల్ హతమార్చింది. ఖలీద్ మెషాల్ దోహాలో ఉంటూ గ్రూప్ దయాస్పోరాకు నాయకత్వం వహిస్తుండగా అలీ బరాకా లెబనాన్‌కు చెందిన సీనియర్ హమాస్ అధికారి.

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ బాంబు దాడిలో హనయా, గాజాపై జరిపిన వైమానిక దాడుల్లో మహ్మద్ దెయిఫ్, మరో దాడిలో ఇస్సా మరణించారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన పాశవిక మెరుపుదాడిలో 1,200 మందికి పైగా ప్రాణాలు పోగొట్టుకోవడం తెలిసిందే. వారిలో 40 మందికి పైగా అమెరికన్లున్నారు. ''ఇజ్రాయెల్‌ను నాశనం చేయడానికి, ఆ లక్ష్యసాధన కోసం ఆ దేశ పౌరులను చంపడానికి హమాస్ చేస్తున్న ప్రయత్నాలకు నిందితులంతా నాయకత్వం వహించారు. ఇరాన్ నుంచి అందుతున్న ఆర్థిక, సాయుధ, రాజకీయ దన్నుతో, హిజ్బొల్లా మద్దతుతో ఇందుకు తెగించారు''అని అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్ ఒక ప్రకటనలో తెలిపారు.

చర్చలకు విఘాతం!

అమెరికా తాజా చర్య గాజాలో కాల్పుల విరమణ యత్నాలకు విఘాతంగా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధానికి ముగింపు పలికేందుకు, ఖైదీల విడుదలకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్టు అమెరికా కొద్ది రోజులుగా ప్రకటనలు చేస్తుండటం తెలిసిందే. ఇలాంటి సమయంలో హమాస్ అగ్ర నేతలపై అమెరికా కేసులు పెట్టడం కాల్పుల విరమణ చర్చలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పరిశీలకులు అంటున్నారు. ''గాజాలో ఇజ్రాయెల్ దాడులకు అమెరికా పూర్తి మద్దతిస్తోంది. తాజా అభియోగాల ద్వారా హమాస్‌నే వేలెత్తి చూపుతోంది. కానీ వేలమందిని పొట్టన పెట్టుకుంటున్న ఇజ్రాయెల్‌ను మాత్రం కనీసం తప్పుపట్టడం లేదు. అమెరికావి ద్వంద్వ ప్రమాణాలని మరోసారి రుజువైంది'' అని బీరుట్‌లోని అమెరికన్ యూనివర్సిటీ ఫెలో రామి ఖౌరీ అన్నారు.



కంగన 'ఎమర్జెన్సీ'కి దక్కని ఊరట

తక్షణం సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వాలని ఆదేశించలేమన్న బాంబే హైకోర్టు

ముంబై: కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'ఎమర్జెన్సీ'సినిమాకు విడుదల కష్టాలు తప్పట్లేవు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ ఆరో తేదీన సినిమా విడుదల కావాల్సి ఉన్నా ఇంతవరకు సినిమా సర్టిఫికేషన్ పూర్తవలేదు. తక్షణం సర్టిఫై చేయాల్సిందిగా సెన్సార్ బోర్డును ఆదేశించలేమని జస్టిస్ బీపీ కోలాబవాలా, జస్టిస్ ఫిర్దోశ్ పూనీవాలాల బాంబే హైకోర్టు ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. సినిమాకు సర్టిఫికేట్ ఇచ్చేలా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ)ను ఆదేశించాలంటూ సినిమా నిర్మాణసంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ వేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు బుధవారం విచారించింది. సినిమాలో తమ వర్గాన్ని తక్కువ చేసి చూపించారని కొందరు సిక్కులు మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించడం తెల్సిందే. దీంతో సినిమాకు సర్టిఫికేట్ ఇచ్చే ముందు వీరి వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని సీబీఎఫ్‌సీని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశించడం తెల్సిందే. ఈ అంశాన్ని బుధవారం బాంబే హైకోర్టు ప్రస్తావించింది. 'సర్టిఫికేషన్ అంశంలో ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఆ ఉత్తర్వులు లేకపోయి ఉంటే ఈరోజే సర్టిఫై చేయాలని సీబీఎఫ్‌సీని ఆదేశించేవాళ్లం. ఈ దశలో మేం కలుగజేసుకోవడం సబబు కాదు. అందుకే తక్షణం సర్టిఫై చేయాలని ఆదేశించలేం. అయితే సినిమాపై వస్తున్న అభ్యంతరాలపై ఈనెల 18లోపు సీబీఎఫ్‌సీ నిర్ణయం తీసుకోవాలి'అని హైకోర్టు సూచించింది. సినిమాకు ఎలాంటి ఊరట లభించకపోవడంతో కంగన అసహనంతో ఒక పోస్ట్‌చేశారు. ''ఎమర్జెన్సీ సినిమాకు సర్టిఫికేట్ ఇవ్వకుండా సెన్సార్‌బోర్డు చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తోందని స్వయంగా బాంబే హైకోర్టే చెబుతోంది'అని కంగన 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

ప్రభుత్వాధినేతలు రాజుల్లా ఉండకూడదు

- ఉత్తరాఖండ్ సీఎం ధామికి సుప్రీంకోర్టు చురకలు

న్యూఢిల్లీ: ప్రభుత్వాధినేతల రాజుల్లా ప్రవర్తించకూడదని, మనం పెత్తందారీ వ్యవస్థలో లేమని సుప్రీంకోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసింది. అటవీ మంత్రి, అధికారుల అభిప్రాయాలను బేఖాతరు చేస్తూ ఒక ఐఎఫ్ఎస్ అధికారిని రాజాజీ టైగర్ రిజర్వు డైరెక్టర్‌గా ఎలా నియమిస్తారని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీని నిలదీసింది. ''ఆయన్ను నియమించొద్దంటూ ప్రత్యేక నోట్ ఉంది. దాన్ని డిప్యూటీ సెక్రటరీ నుంచి మంత్రి దాకా అంతా ఆమోదించారు. అయినా సీఎం ఏకపక్షంగా ఎలా నిర్ణయం తీసుకుంటారు?'' అని జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ''సీఎం అయినంత మాత్రాన ఏదైనా చేసేయగలరా? ఒక అధికారిపై ఎందుకంత మమకారం? '' అంటూ నిలదీసింది. రాహుల్‌పై శాఖాపరమైన విచారణ కొనసాగుతున్న విషయాన్ని గుర్తు చేసింది. రాహుల్ నియామక ఉత్తర్వులను ఈ నెల 3నే ఉపసంహరించుకున్నామని ఉత్తరాఖండ్ సర్కారు కోర్టుకు విన్నవించింది.

వ్యవసాయ వారసత్వానికి ప్రతీక..

గ్రేట్ బ్రిటన్ నుంచి నైజీరియా స్వాతంత్ర్యం పొందడానికి ముందే 1960 అక్టోబరులో జాతీయ జెండా పోటీ ప్రకటన వచ్చింది. ఆ సమయంలో లండన్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతున్న తైవో కూడా అందులో పాల్గొన్నారు. 3,000 సంక్లిష్టమైన డిజైన్లు వచ్చాయి. తైవోది సామాన్యమైన డిజైనే అయినా ఆకుపచ్చ-తెలుపు-ఆకుపచ్చ నిలువు గీతలతో బ్రిటిష్ యూనియన్ వలస పతాకాన్ని చక్కగా భర్తీ చేసింది. తైవో అసలు డిజైన్లో తెలుపు రంగు మధ్యలో కిరణాలతో కూడిన ఎర్రటి సూర్యుడు ఉంటాడు. దైవిక రక్షణ, మార్గదర్శకత్వానికి చిహ్నంగా అలా రూపొందించారు. అప్పుడు తైవోకు 23 ఏళ్లు. ఇందుకు కమిటీ ఆయనకు 100 పౌండ్లు (అప్పట్లో 280 డాలర్లు) బహుమతిగా ఇచ్చింది. జెండాలోని ఆకుపచ్చ నైజీరియా తాలూకు ఘనమైన వ్యవసాయ వారసత్వానికి ప్రతీక. తెలుపు శాంతికి, ఐక్యతకు చిహ్నం. వ్యవసాయమంటే తైవోకు ఇష్టం. స్వాతంత్ర్యం తరువాత నైజీరియాకు తిరిగి వచ్చి వ్యవసాయ శాఖలో ఉద్యోగంలో చేరారు. 1994లో పదవీ విరమణ చేసేదాకా ప్రజాసేవకునిగా ఉన్నారు. నైజీరియా 50వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 50 మంది విశిష్ట నైజీరియన్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆయనకు 2014లో నైజీరియా అత్యున్నత పురస్కారాలలో ఒకటైన 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఫెడరల్ రిపబ్లిక్ (ఒఎఫ్ఆర్) దక్కింది. తన తండ్రిని సమైక్య నైజీరియాకు చిహ్నామైన జాతీయ పతాక రూపకర్తగా జనం గుర్తుంచుకుంటారని కుమారుడు ఆశిస్తున్నాడు.

నైజీరియా 'మిస్టర్ ఫ్లాగ్ మాన్'కు..
ఎట్టకేలకు 'ఆత్మ'శాంతి!

అధికారిక అంత్యక్రియల కోసం ఏడాదిగా ఎదురుచూపులు • ప్రభుత్వం కళ్లు తెరవడంతో ఈ వారం జరగనున్న ఖననం

నైజీరియా జాతీయ పతాక రూపకర్తకు తీవ్ర అవమానం జరిగింది. ప్రభుత్వ వాగ్దానం ప్రకారం అధికార లాంఛనాలతో అంత్యక్రియల కోసం అతని కుటుంబ సభ్యులు ఏకంగా ఏడాదిపాటు ఎదురుచూశారు. ఎట్టకేలకు నిధులు ఇవ్వడానికి ఓయో రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో ఈ వారంలో అంత్యక్రియలు జరపనున్నారు. ఆయన నివసించిన ఓయోలోనే ఖననం చేయాలని నిర్ణయించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

తీర్మానం జరిగినా...

నైజీరియా జాతీయ పతాకాన్ని రూపొందించిన తైవో మైఖేల్ అకిన్‌కున్మిని గతేడాది మరణించారు. ఆయనను అంతా 'మిస్టర్ ఫ్లాగ్ మ్యాన్'అని పిలుచుకుంటారు. జాతీయ జెండా రంగులైన విలక్షణమైన ఆకుపచ్చ, తెలుపులనే తన ఇంటికీ వేసుకున్నారు. గతేడాది 87 ఏళ్ల వయసులో అకిన్‌కున్మి మరణించారు. ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించాలని, స్మారక సమాధి కట్టాలని తీర్మానం జరిగింది. కానీ అవేమీ జరగలేదు. అందుకోసం కుటుంబం ఏకంగా ఏడాది పాటు ఎదురుచూసింది. ఇంతకాలం మృతదేహాన్ని మార్చురీలో ఉంచడానికి రోజుకు 2,000 నైరాల చొప్పున చెల్లిస్తూ వస్తోంది. ''ఎట్టకేలకు అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని కళా, సాంస్కృతిక శాఖకు చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ కల్చరల్ ఓరియెంటేషన్ (నికో)ను ఆదేశించినట్లు మాకు జూన్‌లో తెలిసింది. కానీ ఒక్క ఫోన్ కాల్ మినహా ఆ సంస్థ నుంచే మరే సమాచారమూ అందలేదు'' అని తైవో కుమారుడు వాపోయారు. చివరికి అంత్యక్రియలకు ఓయో రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది.





అనిల్ దేశ్‌ముఖ్‌పై సీబీఐ మరో కేసు

బీజేపీ నాయకులను కేసుల్లో ఇరికించేందుకు కుట్ర పన్నారని అభియోగాలు



న్యూఢిల్లీ: మహారాష్ట్రకు చెందిన బీజేపీ అగ్రనాయకులను తప్పుడు కేసులో ఇరికించేందుకు కుట్ర పన్నారనే అభియోగాలతో మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ (ఎన్సీపీ- ఎస్పీ)పై సీబీఐ బుధవారం తాజాగా కేసు నమోదు చేసింది. 2020లో ఈ కుట్ర జరిగిందని తెలిపింది. 2020లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దేవేంద్ర ఫడ్నవీస్ అప్పటి స్పీకర్‌కు ఒక పెన్‌డ్రైవ్‌ను అందజేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రవీణ్ పండిత్ చవాన్.. అనిల్ దేశ్‌ముఖ్, ఇతరులతో కలిసి బీజేపీ నాయకుడు గిరీష్ మహాజన్ (ప్రస్తుతం మంత్రి)ని ఇరికించడానికి ప్రయత్నించినట్లుగా పెన్‌డ్రైవ్‌లోని వీడియోల్లో ఉన్నట్లు సీబీఐ చెబుతోంది. పండిత్ చవాన్ ప్రముఖ బీజేపీ నాయకులను తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులతో కలిసి పలు కుట్రలకు తెరతీసినట్లు ఈ వీడియోల్లో స్పష్టం ఉందని ప్రాథమిక విచారణలో గిరీష్ మహాజన్‌తో సహా నలుగురు ఎమ్మెల్యేలు.. సీబీఐకి తెలిపారు. ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడం. సాక్షులను చిత్రహింసలు పెట్టడం, నగదు చెల్లింపులు, దర్యాప్తు అధికారులకు సూచనలు ఇవ్వడం.. ఇలా పక్కా పథకరచన చేశాడని ఆరోపించారు. డీసీపీ పూర్ణిమ గైక్వాడ్, ఏసీపీ సుష్మా చవాన్‌లతో కలిసి సాక్షుల వాంగ్మూలను, ఆధారాలను మార్చేశాడని పేర్కొన్నారు. తాజా ఎఫ్ఐఆర్‌లో సీబీఐ అనిల్ దేశ్‌ముఖ్‌తో పాటు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రవీణ్ పండిత్ చవాన్, పూర్ణిమ, సుష్మ, న్యాయవాది విజయ్ పాటిల్‌లను నిందితులుగా పేర్కొంది. అవినీతి ఆరోపణలపై అనిల్ దేశ్‌ముఖ్ ఇప్పటికే సీబీఐ దర్యాప్తును ఎదుర్కొంటున్నారు. ఆయనపై ఈడీ కేసు కూడా నమోదైంది.

ఉపముఖ్యమంత్రి, బీజేపీ నేత దేవంద్ర ఫడ్నవీస్ బెంబేలెత్తిపోయి తనపై నిరాధార కేసును నమోదు చేయించారని అనిల్ దేశ్‌ముఖ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాతీర్పును చూసి.. కాళ్ల కింద నేల కదులుతోందని గ్రహించి ఫడ్నవీస్ ఇలాంటి కుట్రలకు దిగారని ఆరోపించారు.

4వేల పేజీలతో
దర్శన్‌పై చార్జ్‌షీట్ !

బెంగళూరు: తన సన్నిహిత నటిని ఆన్‌లైన్‌లో బెదిరించి, వేధించిన ఘటనలో తన అభిమాని రేణుకస్వామిని అనుచరులతో కలిసి హింసించి చంపేశారన్న కేసులో కన్నడ నటుడు దర్శన్ తూగుదీపపై పోలీసులు బుధవారం చార్జ్‌షీట్ దాఖలుచేశారు. ప్రత్యక్ష సాక్షులుసహా 231 సాక్ష్యాధారాలను చార్జ్‌షీటులో పొందుపరిచామని బెంగళూరు పోలీస్ కమిషనర్ బీ దయానంద చెప్పారు. ఏడు సంపుటాల్లో 10 ఫైళ్లలో 3,991 పేజీల చార్జ్‌షీట్‌ను 24వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. రక్తపు మరకలు ఉన్న దర్శన్ దుస్తులు, రక్తం అంటిన పవిత్ర గౌడ చెప్పులనూ చార్జ్‌షీటులో సాక్ష్యాలుగా ప్రస్తావించారు. కొట్టొద్దని రేణుకస్వామి బ్రతిమాలుతున్న సీసీటీవీ దృశ్యాలు, ఘటనాస్థలిలో దర్శన్ ఉన్న ఫొటోలు సమర్పించారు. రేణుకస్వామికి కరెంట్ షాక్ ఇచ్చిన విషయం, ఒంటిపై కాలిన గాయాలు, దారుణ దాడిలో బాధితుడి వృషణాలు చితికిపోవడం, చెవి భాగం తెగిపోవడం వంటివి సహా డిజిటల్, ఎలక్ట్రానిక్, సైంటిఫిక్ సాక్ష్యాధారాలు, కాల్ డేటా, మొబైల్, టవర్ లొకేషన్, ఫోరెన్సిక్ నివేదికలను కోర్టుకు అందజేశారు. ఈ కేసులో ఇప్పటిదాకా 17 మందిని అరెస్ట్‌చేశారు. కేసు సాక్ష్యుల్లో 56 మంది పోలీసు అధికారులు సైతం ఉన్నారు. చంపేయగానే మృతుడిని ఫొటో తీసి నిందితుడు మరో ప్రధాన నిందితుడికి పంపిన ఫొటోలనూ సమర్పించారు. పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న దర్శన్‌ను ఇటీవల బెంగళూరు కోర్టు ఆదేశాల నేపథ్యంలో తాజాగా బళ్లారి జైలుకు తరలించడం తెల్సిందే.



నల్లమలలో 11వ శతాబ్దం నాటి శిలాశాసనాలు

ఆత్మకూరు రూరల్: గతం తెలియని వారికి భవిష్యత్తు ఉండదని పెద్దలు చెబుతుంటారు. అందుకే గతకాలంలో జరిగిన విషయాలను పరిశోధించి, ఫలితాలను గుదిగుచ్చి చరిత్రగా మన ముందు ఉంచుతుంటారు చరిత్రకారులు. అలాంటి వారి దృష్టికి రాకుండా కొన్ని గతకాలపు ఆనవాళ్లు మరుగున పడిపోతుంటాయి. అలాంటివి కృష్ణా తీరంలో, నల్లమల అడవుల్లో ఎన్నో గుప్తంగా ఉండిపోతున్నాయి. ఇక్కడ కనపడుతున్న రెండు శిలాశాసనాలు కూడా అలాంటివే.. ఇవి నాగార్జునసాగర్ - శ్రీశైలం పులుల అభయారణ్యం ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని ఇందిరేశ్వరం బీట్‌లో పెద్ద గుమ్మితం వద్ద ఉన్నాయి. గుమ్మితం ఒక ప్రాచీన శైవ క్షేత్రం. కొండపైనుంచి దుమికే జలపాతాన్ని ఏర్పరచిన ఒక కొండ వాగు ఒడ్డున ఈ క్షేత్రం ఉంది. ఈ క్షేత్ర ఆవరణలో పురాతన లిపి ఉన్న రెండు శిలా శాసనాలు ఉన్నాయి. బాగా పాతకాలంనాడు అప్పటి వారు ఉపయోగించిన తెలుగు లిపితో ఈ శాసనాలు ఉన్నాయి. ఇవి కాకతీయ - విజయనగర పాలన మధ్య కాలంలోనివి(క్రీశ11-12 శతాబ్దాలు) అయి ఉండొచ్చునని చరిత్రపై అవగాహన ఉన్న కొందరు చెబుతున్నారు. ఇవి ఎర్రయ్య అనే వ్యక్తి వేయించిన దాన శాసనాలుగా తెలుస్తోంది. మల్లికార్జున స్వామికి ఏదో బహుమానం రూపంలో సమర్పించినట్లు లిపిని కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుస్తోంది. అయితే ఈ శిలాశాసనాలను పూర్తిస్థాయిలో పరిశోధిస్తే చరిత్రలో మరుగున పడ్డ విషయాలు వెలుగులోకి వస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



కాకతీయుల కాలం నాటి ప్రాచీన శిలాశాసనాలు



నల్లమలలోని ప్రాచీన గుమ్మితం శివాలయం

క్లుప్తంగా...

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

సాక్షి, అమరావతి: కృష్ణా వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుజ్జుల ఈశ్వర్, కేవీవీ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. బుడమేరు వరద ప్రభావానికి గురైన ఏ.కొండూరు మండలంలోని పలు గ్రామాలను వీరు బుధవారం సందర్శించి రైతులను పరామర్శించారు. విజయవాడతో పాటు బుడమేరు పరిసర ప్రాంతాలన్నీ జల సమాధి అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పంట పొలాలన్నీ ముంపునీటిలో చిక్కుకున్నాయని, రైతులకు అపార నష్టం వాటిల్లిందని నష్టపోయిన ప్రతీ ఒక్కరినీ ఆదుకోవాలని కోరారు.

బయోమెట్రిక్ స్కానర్ల కొనుగోలుకు రూ.53.78 కోట్లు

సాక్షి, అమరావతి: పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల బయోమెట్రిక్ (వేలి ముద్రలు) తీసుకోవడానికి ఉపయోగించే 1,34,450 ఫింగర్ ప్రింట్ స్కానర్ల కొనుగోలు చేసేందుకు రూ.53.78 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఆధార్ కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ ఇటీవల బయోమెట్రిక్‌కు ఉపయోగించే పరికరాల్లో సెక్యూరిటీకి సంబంధించి కీలక మార్పులు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం ఆధార్ అనుసంధానంతో కూడిన ‘బయోమెట్రిక్’ సేవలకు వినియోగిస్తున్న పరికరాలు అక్టోబర్ 1 తేదీ నుంచి పనికిరాని పరిస్థితి నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విధిగా కొత్తగా ఫింగర్ ప్రింట్ స్కానర్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో శ్రీనివాసరెడ్డి అరెస్ట్

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇంటిపై దాడి చేశారనే ఆరోపణపై విజయవాడ డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు అవుతు శ్రీనివాసరెడ్డిని మంగళగిరి పోలీసులు బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. సింగ్‌నగర్ ముంపు ప్రాంతాల్లోని బాధితులకు సహాయం చేసేందుకు ట్రాక్టర్ నడుపుతూ ఆహార పొట్లాలను పంచుతున్న ఆయనను రాత్రి 9 గంటల సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కనీసం కుటుంబ సభ్యులు వచ్చే వరకూ కూడా ఆగకుండా.. సేవా కార్యక్రమంలో ఉన్న ఆయనపై ఈ సమయంలో కక్షసాధింపు చర్యలు తీసుకోవడం దారుణమని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ పేర్కొన్నారు. దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

అనంతలో నేటి నుంచి దులీప్ ట్రోఫీ

మొదటి మ్యాచ్‌లో తలపడనున్న ఇండియా–సీ, డీ జట్లు

అనంతపురం: దేశవాళీ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు గురువారం నుంచి అనంతపురంలో జరగనున్నాయి. ఈ నెల 22వ తేదీ వరకు మొత్తం ఐదు మ్యాచ్‌లు ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఇందుకు అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం) సిద్ధమైంది. ఒక్కో మ్యాచ్ నాలుగు రోజుల పాటు (మల్టీడే మ్యాచ్) జరుగుతుంది. ఇండియా–సీ, డీ జట్ల మధ్య మొదటి మ్యాచ్ గురువారం ప్రారంభం కానుంది. ఇదే సమయంలో బెంగళూరులో ఇండియా–ఏ, బీ జట్లు తలపడతాయి. అనంతరం ఈ నెల 22 వరకు నాలుగు టీమ్‌ల మధ్య మ్యాచ్‌లు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలోనే జరుగుతాయి. ఇండియా–ఏ జట్టుకు శుభమన్ గిల్, ఇండియా–బీ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్, ఇండియా–సీ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ , ఇండియా–డీ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. మొత్తం 60 మంది స్టార్ క్రికెటర్లు ఈ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

డిజాస్టర్ కమిటీ ఏమైంది!

- వరదలు, విపత్తుల వేళ కానరాని సిటీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ
- 2014లో విపత్తుల నిర్వహణ వ్యవస్థను అటకెక్కించిన అప్పటి పాలకులు
- రాజకీయ ప్రాబల్యం పెరిగిపోవటంతో అధికారులకు సంకెళ్లు

పటమట (విజయవాడ తూర్పు): ఓ వైపు భారీ వర్షాలు.. మరోవైపు కొండచరియలు విరిగిపడ్డాయి. తేరుకునేలోపే వెంటనే బుడమేరు సింగ్‌నగర్ సహా ఎన్నో కాలనీలను వరదతో ముంచెత్తింది. వరుస విపత్తులు ముప్పేట దాడిచేసి విజయవాడ నగర వాసులను భయం గుప్పెట్లోకి నెట్టేశాయి. ఇలాంటి విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే రంగంలోకి దిగాల్సిన యంత్రాంగాల జాడ కనిపించకుండాపోయింది. ఇలాంటి సమయాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, విపత్తుల అనంతరం చేయాల్సిన విధులు, బాధ్యతలపై విజయవాడ నగరపాలక సంస్థ, రెవెన్యూ యంత్రాంగం, పోలీస్, విపత్తుల నిర్వహణ సంస్థ, వైద్య–ఆరోగ్యం, స్త్రీ–శిశు సంక్షేమశాఖ, ఇంజినీరింగ్, జలవనరులు, స్థానిక ఎమ్మెల్యేలు, డ్వాక్రా సంఘాలు వంటి 13 శాఖలతో 2011లో ‘సిటీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ’ఏర్పాటైంది.

సమన్వయ లోపమే కొంపముంచింది

వరుస విపత్తులు సంభవించి విజయవాడను అతలాకుతలం చేసినా.. ఒక శాఖతో మరో శాఖకు సంబంధం లేకపోవటం, వీఎంసీ–జిల్లా రెవెన్యూ విభాగాల మధ్య లోపించిన సమన్వయం, పోలీస్, రెవెన్యూ, జలవనరుల శాఖలు బాధితులకు సహాయ సహకారాలు అందించటంలో పూర్తిగా విఫలమయ్యాయి. ఫలితంగా లక్షలాది మంది బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. సిటీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ ఉందో లేదో తెలియని పరిస్థితులు, ఆయా శాఖలకు కనీస ప్రణాళిక లేకపోవటంతో ఈ దుస్థితి దాపురించింది. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించే యంత్రాంగం లేకపోవటం, ఎక్కడెక్కడ పునరావాస కేంద్రాలు ఉన్నాయో కూడా సమాచారం అందించకపోవడంతో ప్రజలు ఘోరవిపత్తును చవిచూడాల్సి వచ్చింది. 2014 తర్వాత విపత్తుల నిర్వహణ వ్యవస్థను అప్పటి పాలకులు అటకెక్కించడం, రాజకీయ ప్రాబల్యం పెరిగిపోవటం, అధికారులు తీసుకునే చర్యలపై అడుగడుగునా రాజకీయ నేతలు అడ్డుపడటంతో అధికారులకు సంకెళ్లు పడినట్టయ్యింది. ఫలితంగా అధికారులు సహాయక చర్యలను గాలికొదిలేయాల్సి వచ్చింది.

డిజాస్టర్ కమిటీలో ఎవరుండాలి!

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ చైర్మన్‌గా, పోలీస్ కమిషనర్ వైస్ చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ కార్యదర్శిగా, ఇరిగేషన్ ఎస్‌ఈ, జిల్లా సివిల్ సప్లై అధికారి, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ పీడీ, సిటీప్లానర్, చీఫ్ ఇంజనీర్, చీఫ్ హెల్త్ ఆఫీసర్, రీజనల్ ఫైర్ ఆఫీసర్, స్థానిక ఎమ్మెల్యే, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్, డ్వాక్రా సంఘం ప్రతినిధి సభ్యులుగా సిటీ డిజాస్టర్ కమిటీ పని చేయాలి. ఈ కమిటీ వరద కార్యాచరణ ఏర్పాటు చేస్తుంది. క్షేత్రస్థాయి సిబ్బంది, వివిధ విభాగాలు, శాఖల నుంచి వచ్చే సిబ్బంది ఈ కమిటీ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాల్సిందే. నగరవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించేందుకు గుణదల డాన్ బాస్కో స్కూల్, ప్రభుత్వ ప్రెస్, నందమూరినగర్, పాయకాపురం, భవానీపురం హెడ్‌వాటర్ వర్క్స్, రాజీవ్‌గాంధీ పార్క్‌లలో భారీ శబ్దం వెలువడేలా అలారమ్‌లు గతంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసింది. అలాంటి ఏర్పాటు ఉన్న విషయం ప్రజలకు, అధికారులకు తెలియకపోవడం గమనార్హం.

తరలింపు లేదు.. బాధితులే తరలివస్తున్నారు



వరద నీటినుంచి బుడమేరు వంతెన పైకి వస్తున్న బాధితులు

- వరద కొంచెం తగ్గడంతో బయటకు వస్తున్న విజయవాడ వాసులు
- బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లల్లోనే ఆశ్రయం
- బాధితులను బయటకు తీసుకురావడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- పునరావాస కేంద్రాలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి

సాక్షి, అమరావతి: వరద ప్రభావిత ప్రాంతాల నుంచి బాధితులు మంగళవారం ఉదయం నుంచి తండోపతండాలుగా బయటకు వస్తున్నారు. 2,3 అడుగుల మేర వరద తగ్గడంతో ఇళ్లను వదిలి ఎక్కడో ఒక చోట తలదాచుకోవడానికి వెళుతున్నారు. మూడు రోజులుగా ప్రభుత్వం తరఫున ఎవరైనా వచ్చి తమను బోట్లలో తీసుకెళతారని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూశారు. చివరికి ఎవరూ సహాయం చేయకపోవడంతో ప్రాణాలు దక్కించుకోవడానికి నీళ్లలోనే కి.మీ మేర నడుచుకుంటూ వస్తున్నారు. అలా వచ్చే వారితో సింగ్‌నగర్ బ్రిడ్జి ప్రాంతం కిక్కిరిసిపోయింది. ముంపులో ఉన్న వారిని బయటకు తీసుకురాలేకపోగా అష్టకష్టాలు పడి తమంతట తాముగా బయటపడ్డ వారికి పునరావాసం దొరకడం లేదు. దీంతో నగరంలోని సురక్షిత ప్రాంతాల్లో ఉన్న తమ బంధువులు, స్నేహితులు, తెలిసిన వాళ్ల ఇళ్లకు వెళుతున్నారు. నగరంలో ఎవరూ లేకపోతే ఇతర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు పయనమవుతున్నారు. బ్యాగులు, సంచులు భుజాన వేసుకుని, నెత్తిమీద పెట్టుకుని పిల్లలు, పెద్దవాళ్లు ఇబ్బందులు పడుతూ నడుచుకుంటూ వస్తున్నారు.

పునరావాస కేంద్రాలెక్కడ?

వరద నుంచి బయటపడినా కొందరికి ఎక్కడికెళ్లాలో తెలియడంలేదు. తెలిసిన వాళ్లు ఎవరూ లేకపోవడంతో ప్రభుత్వం ఎక్కడైనా పునరావాస కేంద్రాలు తెరిచిందేమో అని తెలుసుకోవడానికి యత్నిస్తున్నా వాటి జాడ కనిపించడం లేదు. పేరుకు వంద వరకు కేంద్రాలు తెరిచామని అధికారులు చెబుతున్నా అవి ఎక్కడున్నాయో తెలియడం లేదు. మరోవైపు..సింగ్‌నగర్ బ్రిడ్జితోపాటు మిగిలిన వరద ప్రభావిత ప్రాంతాలన్నీ పోలీసులు, అధికారుల వాహనాలతో నిండిపోయాయి. దీంతో మంచినీళ్లు, ఆహారం తీసుకువస్తోన్న లారీలు, వాహనాలు ముందుకు వెళ్లలేక ఎక్కడో దూరంగా ఆపేస్తున్నారు. కనీస సాయం అందించకుండా పోలీసు, ఇతర అధికారులు వారి వాహనాలతో అక్కడ తిష్ట వేయడం సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. అంబులెన్సులు వెళ్లే మార్గం కూడా కనిపించడంలేదు. ఇతర ప్రాంతాల నుంచి వస్తోన్న బోట్లను లోనికి తీసుకెళ్లడానికి ఈ ట్రాఫిక్ అడ్డంకిగా మారిపోయింది. దీంతో చాలా లారీల్లోని పడవలను దించకుండా అలాగే ఉంచేశారు. ఈ కారణంగానే ఆహార పదార్థాలను వరద ప్రభావిత ప్రాంతాల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారు. సీఎం చంద్రబాబు తరచూ వస్తుండడం, మంత్రులు, ఉన్నతాధికారులు అక్కడే ఉండడంతో పోలీసులు వారి సేవలోనే ఉండాల్సివస్తోంది. దీంతో వారి వాహనాలతోనే ఆ ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి.

అధికారులెవరూ ఇటు రాలేదు



బెడ్‌షీట్ల తయారీతో పది మందికి ఉపాధిని కల్పిస్తున్నా. వరద నీరు గోడౌన్‌ను ముంచెత్తడంతో బెడ్‌షీట్లతో పాటు కుట్టుమెషిన్లు, రూ.రెండు లక్షల విలువైన సరుకు పూర్తిగా నీటమునిగింది. బెడ్‌షీట్లు పనికి రాకుండా పోయాయి. మెషిన్లు అయినా బాగున్నాయా అంటే అదీ లేదు. అధికారులకు చెబుదామంటే ఎవరూ ఇటువైపు వచ్చింది లేదు. భవిష్యత్ ఏమిటో అర్థం కావడం లేదు.

– యల్లయ్య, కేఎల్‌రావునగర్ 8వ లైన్

ఆటో కదిలే పరిస్థితి లేదు



ఐదు రోజులుగా ఆటో వరద ముంపులోనే ఉంది. ఆటో కదలాలంటే రిపేరు చేయించుకోవాలి. ఆటో నడవక జీవనం కష్టంగా మారింది. మాలాంటి ఆటోడ్రైవర్లు ఎందరో ఉన్నారు. వారందరి కోసం ప్రభుత్వం ఆలోచన చేసి ఆదుకోవాలి. అప్పులు చేద్దామన్నా ఇచ్చే నాథులు లేరు.

– వి.కిశోర్

గృహోపకరణాల నష్టమే రూ.3 లక్షలు



గంట ముందు చెప్పినా ఇళ్లలోని వస్తువులు జాగ్రత్త చేసుకునే వాళ్లం. ప్రభుత్వం చేసిన ఒక్క తప్పు వల్ల ఇంటిలోని వస్తువులు పూర్తిగా తడిసిపోయాయి. ఎలక్ట్రికల్ గృహోపకరణాలు పూర్తిగా పాడయ్యాయి. నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలన్నీ పూర్తిగా కోల్పోయాం. ఫర్నిచర్ తదితర వస్తువులు చూస్తే సుమారు రూ.3 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగింది. మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు.

– లక్ష్మి, సింగ్‌నగర్, లూనా సెంటర్

రూ.30 లక్షలు నష్టపోయా

పప్పు దినుసులు, నిత్యావసర సరుకులు హోల్‌సేల్ వ్యాపారం చేసేవాడిని. ఆదివారం కావటంతో దుకాణాన్ని లేటుగా తీద్దామనుకున్నాం. ఉదయం 10 గంటల ప్రాంతంలో దుకాణం వద్దకు చేరుకుందామంటే అప్పటికే మనిషిలోతు నీరు నిండిపోవడంతో వెళ్లలేకపోయాను. మూడు రోజుల తరువాత దుకాణం వద్దకు వచ్చాను. లోపల ఉన్న సుమారు రూ.30 లక్షల సరుకులు మొలకెత్తి, ఎందుకు పనికి రాకుండాపోయాయి. మా పరిస్థితి ఏంటో అర్థం కావటం లేదు. మమ్మల్ని ఎవరు ఆదుకుంటారో తెలియడం లేదు



– శేషుకుమార్, దాబాకొట్లు రోడ్డు, సింగ్‌నగర్

వస్తువులన్నీ పాడైపోయాయి

నాలుగు రోజులుగా మా ఇంటిలో వరద నీరు నిలిచిపోయింది. ఇంట్లోని ఫ్రిజ్, స్టవ్, మైక్రో ఓవెన్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పాడైపోయాయి. చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న మాకు ఈ వరదలు తీరని నష్టాన్ని కలిగించాయి.

– లక్ష్మణరావు, లూనా సెంటర్

కొత్త ఆటో వరద పాలైంది

జీవనోపాధి కోసం ఈఎంఐ పద్ధతిలో నెల రోజుల క్రితం కొత్త ఆటో తీసుకున్నాను. అది పూర్తిగా వరదలో మునిగిపోయింది. ఈ నెల రెండో తేదీన ఈఎంఐ రూ.12,500 కట్టాల్సి ఉంది. ఇప్పుడు ఈఎంఐ ఎలా కట్టాలి. వరద వల్ల పాడైన ఆటోను ఏ విధంగా బాగు చేయించుకోవాలో అర్థం కావడం లేదు. నా ద్విచక్ర వాహనం కూడా పూర్తిగా నీటిలోనే మూడు రోజులు ఉండిపోయింది. ఇప్పుడు ఈ రెండు వాహనాలను బాగుచేయించాలంటే రూ.వేలల్లో ఖర్చవుతుంది.

– దాసరి శ్రీకాంత్, సింగ్‌నగర్

నా జీవనోపాధికి గండి

సింగ్‌నగర్‌లో సెలూన్ షాపు నిర్వహించుకుంటున్నాను. కురిసిన వర్షానికి, బుడమేరు వరద ఉధృతికి నా సెలూన్ షాపు పూర్తిగా నీట మునిగింది. షాపులోని అన్ని వస్తువులు పాడైపోయాయి. సుమారు. రూ.9 లక్షల వరకు నష్టం చేకూరింది. ఇప్పుడు షాపు నడపాలంటే కష్టంగా మారిన పరిస్థితి నెలకొంది.

– రాము, సెలూన్ షాపు నిర్వాహకులు, సింగ్‌నగర్

రూ.3 లక్షల నష్టం

మాది బెల్లం, సాల్ట్ హోల్‌సేల్ ఇతర వస్తువులు హోల్‌సేల్‌గా అమ్మే వ్యాపారం. షాపులో ఉన్న రూ.3 లక్షల విలువైన బెల్లం, సాల్ట్ ఇతర సామగ్రి నీటి పాలైంది. చేసేదేమి లేక షాపు ముందు దిగాలుగా కూర్చుని బాధపడాల్సిన పరిస్థితి నెలకొంది.

– లీలా ప్రత్యూష, ఎల్‌ఈఎస్ ట్రేడర్, సింగ్‌నగర్

లోవ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు శ్రీకారం

తుని రూరల్: కాకినాడ జిల్లాలోని తలుపులమ్మవారి లోవ దేవస్థానం అభివృద్ధికి రూపొందించనున్న మాస్టర్ ప్లాన్‌కు అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గేష్, డీఈ ఉదయ్ కుమార్, డిప్యూటీ స్థపతి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం లోవ దేవస్థానాన్ని సందర్శించింది. ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు మాట్లాడుతూ వేల సంఖ్యలో తరలివస్తున్న భక్తులు, వాహనాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు.

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి సహస్ర లిల్లీ పూజలు

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురంలో ప్రముఖ దత్త పుణ్యక్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల నడుమ స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో బుధవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవాలు జరిగాయి. సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవ మూర్తులను ఆశీనులు చేశారు. సాయంత్రం యాగశాలలో హోమాలు చేశారు. గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాలబోగం, పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 57,817 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 17,592 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.53 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.



9 లోపు పీజీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పీజీ సెట్–2024లో భాగంగా ఎస్వీయూలో పలు పీజీ కోర్సుల్లో సీట్లు సాధించిన విద్యార్థులు ఈ నెల 9వ తేదీలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరై అడ్మిషన్ పొందాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సీటు పొందిన వారు కార్యాలయ పనిదినాల్లో వర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయం వద్దకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు హాజరుకావాలని కోరారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

చంద్రగిరి(తిరుచానూరు): ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం సూపరింటెండెంట్ జేవీ.నాగేంద్రరావు ఆదేశించారు. ఆయన బుధవారం తిరుపతి జిల్లా తిరుచానూరు జెడ్పీ పాఠశాలలో జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలతో అడ్మిషన్లపై అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ ప్రక్రియలో అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మార్గదర్శకాలను తప్పక పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు నగరంలోని 54వ డివిజన్ భగత్ సింగ్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను దివ్యాంగుల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు జోగేంద్రనాథ్, కృష్ణ, విజయ, హరిని సన్మానించారు.

17 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు పొడిగింపు

నెల్లూరు (టౌన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా డీఈఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు.



అదానీ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ముత్తుకూరు: కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్‌కు 2024 విద్యా సంవత్సరానికి ఢిల్లీలోని ‘నేషనల్ స్కూల్ అవార్డు’ ద్వారా అరుదైన ఎక్సలెన్స్ అవార్డు లభించింది. సృజనాత్మక విద్యతో పాటు విశాలమైన తరగతి గదులు, ఆధునిక ల్యాబ్ సౌకర్యం, సాంకేతిక విద్య, వ్యక్తిగత శ్రద్ధ, ఆహ్లాద వాతావరణం, శారీరక–మానసిక ఎదుగుదలకు అవసరమైన క్రీడలు ఉండడం వల్ల ఈ అవార్డు లభించిందని ప్రిన్సిపల్ సత్యనారాయణ చెప్పారు.

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: 2024–25 విద్యా సంవత్సరానికి గాను యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా తమ దరఖాస్తులను ఐటీఐ కార్యాలయంలో అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 0884–2951001 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.



ఫార్మసీ రూం వద్ద మందులు తీసుకునేందుకు వచ్చిన రోగులు

వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యనిపుణులు లేక
రోగుల తిప్పలు

- ప్రతిరోజూ సుమారు 200 మంది వరకు రాక
- ఆరేళ్లయినా అందరూ కాంట్రాక్టు ఉద్యోగులే
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని వైనం
- జిల్లాస్థాయిలో ఎవరికీ అజమాయిషీ లేని తీరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉద్యోగులు, జర్నలిస్టులు, విశ్రాంత ఉద్యోగులకు వైద్యసేవలు అందించేందుకు ఉమ్మడి జిల్లాలో వెల్‌నెస్ సెంటర్‌ను ఆరేళ్ల కిందట ఏర్పాటు చేసినా ఇప్పటికీ కాంట్రాక్టు ఉద్యోగులతోనే కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అక్కడికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2018, సెప్టెంబర్ 5న అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పాత కలెక్టరేట్ ఆవరణలోని భవనంలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించారు. ఇక్కడ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించాలని నిర్ణయించారు. అయితే వైద్యులు, వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఈ సెంటర్‌కు జనరల్ ఫిజీషియన్లు ముగ్గురు, డయాబెటిక్, స్కిన్, గైనకాలజిస్ట్, చిల్డ్రన్స్ డాక్టర్, కార్డియాలజీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, డెంటల్ డాక్టర్ ఒక్కొక్కరు అవసరం. అయితే ప్రస్తుతం ఆర్థోపెడిక్, డెంటల్ డాక్టర్‌తో పాటు డిప్యుటేషన్‌పై జనరల్ ఫిజీషియన్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇక ముగ్గురు జీఎన్ఎంలకు ఒక్కరు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు నలుగురికి ఇద్దరు, స్వీపర్లు నలుగురికి ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు. వీరందరికీ ఇన్‌చార్జ్‌గా ఫిజియోథెరపీ వివేక్ వ్యవహరిస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు.

జిల్లాస్థాయి అధికారుల అజమాయిషీ కరువు

ఉమ్మడి జిల్లా నుంచి ఇక్కడికి ప్రతిరోజూ కనీసం 200 మంది రోగులు వస్తుంటారు. వీరిలో 90 శాతం మంది వృద్ధులే కావడంతో పైఅంతస్తులో ఉన్న ఈ సెంటర్‌కు చేరుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. పైకి.. కిందికి వెళ్లి రావడానికి మోకాళ్ల నొప్పులు ఉన్న వారి బాధలు వర్ణణాతీతం. మొదట్లో పాత కలెక్టరేట్ ఆవరణలో సువిశాలమైన భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉండేది. ఏడాదిన్నర కిందట అక్కడి నుంచి ఊరు చివర ఓ మూలకు విసిరేసినట్లు పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోకి మార్చారు. వేరే గ్రామాలు, జిల్లాల నుంచి వచ్చే వారు వెల్‌నెస్ సెంటర్‌కు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న కొత్త బస్టాండు లేదా రైల్వే స్టేషన్ సమీపంలోకి మార్చాలని వారు కోరుతున్నారు. ఈ ఆరేళ్లలో ఉన్నతాధికారులు ఈ కేంద్రాన్ని తనిఖీ చేసిన దాఖలాలు లేవు. దీంతో ఇక్కడి సిబ్బందిలో జవాబుదారీతనం కొరవడింది. ఉన్న ఒక్క జీఎన్ఎం సెలవు పెట్టిన రోజు స్వీపరే బీపీ, షుగర్ చెక్ చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఇలా ఎవరికి వారు ఇష్టానుసారంగా వచ్చిపోతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఎప్పుడు కరెంట్ ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. దీనివల్ల కొన్ని నెలలుగా వేడి నీటిలో వివిధ పరికరాలను కడిగే ఆటో క్లేవ్ యంత్రం పనిచేయడం లేదు. ఇన్వర్టర్ మరమ్మతుకు గురి కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అధిగమించలేక పోతున్నారు. కనీసం టోకెన్ నమోదు చేసుకోలేక కొన్నిసార్లు రోగులు వెనక్కి వెళ్లిన పరిస్థితులు ఉన్నాయి. సిబ్బంది కొరతతో అటెండరు, ల్యాబ్ టెక్నీషియనే రోగుల పేర్లను రాసుకోవాల్సి వస్తోంది.

4 నెలల నుంచి ప్రత్యేక వైద్యుడు లేడు

నేను డయాబెటిక్ పేషెంట్‌ను. రెండు మూడేళ్లుగా సొంతూరు నుంచి బస్సులో ఇక్కడికి వచ్చి పోతున్నా. నాలుగు నెలల నుంచి ప్రత్యేక వైద్యుడు లేకపోవడంతో వైద్యం సరిగా అందడం లేదు. జనరల్ ఫిజీషియన్ ఇచ్చిన మందులనే వాడుతున్నాను. తరచూ కరెంట్ పోతున్నందున కొన్నిసార్లు వెనక్కి వెళ్లాను. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తనిఖీ చేసి ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుంది.

- సత్యమ్మ, డయాబెటిక్ పేషెంట్, నాగర్‌కర్నూల్

డాక్టర్ల కొరత తీరుస్తాం

ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి త్వరలోనే అన్ని చర్యలు తీసుకుంటాం. విద్యుత్ సమస్య పరిష్కరించాలని గతంలో ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశాం. ఈ సెంటర్‌లో నెలకొన్న మిగతా సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- డాక్టర్ స్వప్న, రాజీవ్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్, మహబూబ్‌నగర్

'రజాకార్' వీక్షించాలని గవర్నర్‌కు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: తాను నిర్మాతగా తీసిన 'రజాకార్: ద సైలెంట్ జెనోసైడ్ ఆఫ్ హైదరాబాద్' చలన చిత్రాన్ని వీక్షించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బీజేపీ నేత గూడూరు నారాయణ్‌రెడ్డి ఆహ్వానించారు. తన ఆహ్వానానికి గవర్నర్ సానుకూలంగా స్పందించారని గూడూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చిత్రాన్ని నిర్మించినందుకు ఆయన తనను అభినందించారని తెలిపారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నర్‌ను కలిసినట్టు గూడూరు పేర్కొన్నారు.

పని ప్రదేశం మహిళలకు సురక్షితంగా ఉండాలి

మహిళా భద్రత విభాగం చీఫ్ శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: పని ప్రదేశంలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించాలని మహిళా భద్రత విభాగం చీఫ్ శిఖాగోయల్ అన్నారు. మహిళల భద్రత కోసం 'సాహస్' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా.. స్టీరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు సంబంధించిన పలు కీలకాంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శిఖాగోయల్ మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కచ్చితంగా సాహస్ వెబ్ పోర్టల్ అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కమిటీ (ఐసీ) సభ్యుల వివరాలు తెలిసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

'తెలంగాణ విద్యా కమిషన్‌ను పక్కాగా అమలు చేయాలి'

సాక్షి, హైదరాబాద్: ఇంతకు ముందు ఏర్పాటు చేసిన వివిధ కమిషన్ల మాదిరి కాకుండా తెలంగాణ విద్యా కమిషన్ (టీఈసీ)ను పక్కాగా అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. ఇంతకు ముందు ఏర్పాటు చేసిన ఆర్థిక సంఘం, తెలంగాణ విజిలెన్స్ కమిషన్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్లు ఇచ్చిన సూచనలు, సలహాలు పట్టించుకున్న నాథుడే లేడని ఆవేదన వ్యక్తంచేశారు.

టెక్నాలజీతో అగ్రగామిగా నిలిచేందుకు..

- పెట్టుబడులు, ఉపాధి, నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా సర్కారు ప్రణాళికలు
- విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో ఏఐ వినియోగానికి కసరత్తు
- 5, 6 తేదీల్లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్



సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను అనుకూలంగా మలచుకొని పెట్టుబడులు, ఉపాధి కల్పన, ఆవిష్కరణల రంగాల్లో అగ్రగామిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెల 5, 6 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ పేరిట రెండు రోజుల సదస్సు నిర్వహిస్తోంది. ఈ సదస్సు ద్వారా కృత్రిమ మేథ (ఏఐ) సహా ఎమర్జింగ్ టెక్నాలజీకి సంబంధించి ప్రభుత్వం పలు కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది.

పాఠ్య పుస్తకాల్లో 'ఏఐ పాఠాలు'

కృత్రిమ మేథ (ఏఐ)కు ఉన్న భవిష్యత్తు దృష్ట్యా ఇప్పటి నుంచే ఈ రంగం అభివృద్ధికి మౌలిక వసతులు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తద్వారా కొత్త తరం ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులను రప్పించడం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయం, ఆరోగ్యం, విద్య తదితర రంగాల్లో ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా అభివృద్ధి సాధించాలని భావిస్తోంది. ఏఐ సాయంతో వ్యవసాయ ఉత్పాదకత పెంచడం, పౌరులందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయడంతోపాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఏఐ పాఠ్యాంశాలను చేర్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఏఐతోపాటు ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీ పాఠాలను బోధించడం ద్వారా భవిష్యత్తు తరానికి నిత్య జీవితంలో వాటి వినియోగంపై అవగాహన పెంచడం సాధ్యమవుతుందని భావిస్తోంది. ఏఐ ద్వారా వాతావరణ మార్పులను ముందే గుర్తించి రైతులు, ప్రజలను అప్రమత్తం చేసేలా నూతన ఆవిష్కరణలకు ఊతమివ్వనుంది.

స్కిల్స్ యూనివర్సిటీలో ఏఐకి ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో ఏఐ సాంకేతికతపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా కోర్సులకు రూపకల్పన జరుగుతోంది. మరోవైపు ప్రభుత్వం చెబుతున్న ఫోర్త్ సిటీలోనూ ఏఐ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న నూతన పారిశ్రామిక పాలసీని కూడా ఏఐ టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణ, ఆవిష్కరణలు, ఇంక్యుబేటర్లు, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా రూపొందిస్తున్నారు. ఇతర సాంకేతికతలతో ఏఐ మేళవింపు ద్వారా దేశీయ పరిస్థితులకు అనుగుణంగా 'డ్రైవర్ లెస్ టెక్నాలజీ'పై ఐఐటీ హైదరాబాద్‌లో పరిశోధనలు జరుగుతున్నాయి. దేశీయంగా రోడ్లు, మౌలికవసతులకు సంబంధించిన అనేక సంక్లిష్ట అంశాలను దృష్టిలో పెట్టుకొని 'డ్రైవర్ లెస్'వాహనాలపై జరుగుతున్న పరిశోధనల విషయంలో ఆసక్తి చూపుతున్న ప్రభుత్వం వీలైనంత త్వరగా కొత్త టెక్నాలజీని రాష్ట్రంలో అందుబాటులోకి తేవాలని భావిస్తోంది.

బుల్డోజర్‌కు, హైడ్రాకు తేడా తెలియదా?

భువనగిరి ఎంపీ చామల

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్‌కు బుల్డోజర్‌కు, హైడ్రాకు తేడా తెలియదా? అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లోని బుల్డోజర్ పాలన మీద సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే.. తెలంగాణలోని హైడ్రాపై ఇచ్చినట్టు కేటీఆర్ వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, లింగం యాదవ్, శ్రీకాంత్ యాదవ్, వచన్‌కుమార్, సంధ్యారాణిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే.. బీఆర్ఎస్ దయాదాక్షిణ్యాలతో గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు ఎక్కడికి పోయారని ఆయన ప్రశ్నించారు.

కుల వివక్షకు పాల్పడే వారిని దేశద్రోహులుగా ప్రకటించాలి

కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు నాగరాజు

సాక్షి, హైదరాబాద్: కులం కేంద్రంగా వివక్షకు పాల్పడిన వారిని దేశద్రోహులుగా ప్రకటించాలని కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను.. ప్రధాన కార్యదర్శి నాగేందర్‌తో కలిసి వినతిపత్రం అందించారు. దళితులపై హత్యలు, దాడులు, రియల్ ఎస్టేట్ పేరుతో ఎస్సీ, ఎస్టీల భూముల దురాక్రమణలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రోజు రోజుకు ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని, ఇందులో ఆడవాళ్లు ప్రధాన బాధితులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కుల వ్యవస్థను రద్దు చేయాలని, దీనిపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని నాగరాజు కోరారు. దళితులపై కుల బహిష్కరణలు, వివక్షకు, దాడులకు కారణమవుతున్నది బీసీలు, అందులో ఎక్కువగా గౌడ, ముదిరాజ్, యాదవ తదితర కులాలు కారణమని తెలిపారు. ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీల ఐక్యతకు గండికొడుతుందని నాగరాజు ఆవేదన వ్యక్తంచేశారు.

సెక్షన్ 20ని సుప్రీంకోర్టు సమర్థించింది

- ఇంజనీరింగ్ కాలేజీల పిటిషన్లలో ఏజీ వాదనలు
- సింగిల్ జడ్జి వద్ద లిస్ట్ చేయాలని రిజిస్ట్రీకి సీజే ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కొత్త కోర్సులకు సంబంధించి నిర్ణయాధికారం సర్కారుదేనన్న తెలంగాణ విద్యాచట్టం–1982లోని సెక్షన్ 20ని సుప్రీంకోర్టు సమర్థించిందని అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాము ఈ సెక్షన్‌ను సవాల్ చేశామని పిటిషనర్ కాలేజీలే తెలిపాయన్నారు. నిబంధనలను ఒకసారి అత్యున్నత న్యాయస్థానం సమర్థించిన తర్వాత మళ్లీ అదే అంశంపై పిటిషన్ దాఖలు చేయడం సరికాదన్నారు. అయితే కొత్త కారణాలు పేర్కొన్నందున పిటిషన్లను సింగిల్ జడ్జి వద్ద లిస్ట్ చేయాలని రిజిస్ట్రీని సీజే ధర్మాసనం ఆదేశించింది. తెలంగాణ విద్యాచట్టం–1982లోని సెక్షన్ 20ని, సీట్ల పెంపునకు నిరాకరిస్తూ ప్రభుత్వం ఈ నెల 24న జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీని స్పాన్సర్ చేస్తున్న ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీతోపాటు పలు కాలేజీలు 11 పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై ప్రధానన్యాయమూర్తి అలోక్ ఆరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్లను సింగిల్ జడ్జి వద్ద లిస్ట్ చేయాలని ఆదేశిస్తూ, విచారణ గురువారానికి వాయిదా వేసింది.

టీజీఎస్‌సీఎస్‌సీఎల్ నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరపాలి

హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సివిల్ సప్‌లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఎస్‌సీఎస్‌సీఎల్)లో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే, టీజీఎస్‌సీఎస్‌సీఎల్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు కుమ్మక్కై పాల్పడుతున్న అవకతవకలతో ప్రభుత్వ ఖజానాకు సుమారుగా రూ.1,100 కోట్ల మేర నష్టం వాటిల్లనుందన్నారు. ఇప్పటికే రూ.188 కోట్ల మేరకు నష్టం జరిగిందని, ఇకపై అక్రమాలు చెక్ పెట్టాలంటే.. ధాన్యం అమ్మకాల టెండర్లపై విచారణ జరపాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణ చేపట్టాలని హైకోర్టును అభ్యర్థిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. మార్కెట్ ధరను పట్టించుకోకుండా మెట్రిక్ టన్నుకు రూ.20,240 లకే ధాన్యం అమ్మకాలకు టెండర్లు పిలిచారన్నారు. ప్రస్తుతం మెట్రిక్ టన్ను రూ.22,300 పలుకుతోందని కార్పొరేషన్ గణాంకాలు వివరిస్తున్నాయని చెప్పారు. దీంతో ఖజానాకు మరో రూ.750 కోట్లు నష్టం రానుందని వివరించారు. ఒకే అధికారి.. సన్న రకానికి మెట్రిక్ టన్నుకు 24,070 చొప్పున విక్రమానికి.. కొనుగోలు చేసేందుకు ఇదే మెట్రిక్ టన్నుకు రూ.56,799 టెండర్లు పిలిచారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మార్కెట్ ధరకంటే తక్కువకు విక్రయించడమే కాకుండా ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం ద్వారా మరో రూ.350 కోట్ల అవినీతిని జరుగుతోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వానికి నష్టం లేకుండా థర్డ్ పార్టీ బిడ్డర్ల ప్రమేయం లేకుండా ఉండేదని, ఇప్పుడు ఇష్టారాజ్యంగా మార్చారన్నారు. ఈ అక్రమాలపై ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు వివరించారు. ఈ టెండర్ల ప్రక్రియను నిలిపివేస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రెండుమూడు రోజుల్లో ఈ పిటిసన్ విచారణకు రానుంది.

డీకే అరుణకు 'వక్ఫ్' బాధితుల ఫిర్యాదులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులతో ముడిపడిన వివాదాస్పద భూములకు సంబంధించి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సభ్యురాలు, ఎంపీ డీకే అరుణకు ప్రజల ఫిర్యాదులు పెరుగుతున్నాయి. కేంద్ర వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై ఏర్పాటు చేసిన జేపీసీలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతోపాటు అరుణను కూడా సభ్యురాలిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలానికి చెందిన కొందరు బాధితులు, రైతులు అరుణను ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కొన్నేళ్లుగా తమ భూములను వక్ఫ్ భూముల పేరుతో స్వాధీనం చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యను జాయింట్ కమిటీ ముందు తెలియజేయాలని విన్నవించుకున్నారు. సమస్యను జేపీసీ దృష్టికి తీసుకెళ్తామని అరుణ వారికి హామీఇచ్చారు.

టీచర్ల తొలగింపుతో విద్యార్థుల భవితకు ముప్పు

మాజీ మంత్రి కొప్పుల

సాక్షి, హైదరాబాద్: పర్మినెంట్ ఉద్యోగాల భర్తీ పేరుతో గెస్ట్, పార్ట్‌టైం ఉపాధ్యాయులను తొలగిస్తారా? అని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల దాదాపు రెండు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పాతవారికి అవకాశం ఇవ్వకుండా మళ్లీ కొత్తవారితో భర్తీ అంటూ.. ఒక్కొక్క అభ్యర్థి నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి గురుకులాల్లో పనిచేస్తున్న గెస్ట్, పార్ట్‌టైం ఉద్యోగులను తొలగించి కొత్తవారిని నియమించడమేమిటని ప్రశ్నించారు. మూడు నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. గాలిదొడ్డి గురుకులం మళ్లీ శిథిలావస్థకు చేరుకుందని ఈశ్వర్ పేర్కొన్నారు.

90% చెరువులు కబ్జా చేసింది బీఆర్ఎస్ నేతలే


మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని 90 శాతం చెరువులను కబ్జా చేసింది బీఆర్ఎస్ నేతలేనని, తన ఆరోపణను నిరూపించేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ పాపం అప్పట్లో ఇరిగేషన్ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుదేనని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇరిగేషన్ మంత్రిగా పనిచేసిన కాలంలో తెలంగాణ ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఏ ఒక్క కార్యక్రమాన్ని కూడా హరీశ్‌రావు చేపట్టలేదని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలోని చెరువులు, పట్టణాల్లోని రెవెన్యూ భూములను కబ్జా చేసినప్పుడు బీఆర్ఎస్ నేతలకు కనిపించలేదా? అని యెన్నం ప్రశ్నించారు. ఇప్పుడు చెరువులను కాపాడేందుకే సీఎం రేవంత్ హైడ్రాను చేపట్టారని, ఇచ్చిన మాట మేరకు ప్రజలకు మంచి చేస్తున్న రేవంత్‌రెడ్డిని అభినందించాల్సింది పోయి బురద జల్లడం సరైంది కాదని వ్యాఖ్యానించారు.

నల్లమలలో అరుదైన చింకారా

అంతరించిపోయే దశలో ఉన్న ఇండియన్ గజల్

- మనుషులు కన్పిస్తేనే హడలిపోయే చింకారా
- మానవ సంచారం, వేటతో అతిచిన్న జింక జాతి మనుగడకు ముప్పు
- నల్లమల అడవిలో వదులుతున్న పశువుల మందతోనూ పొంచి ఉన్న ప్రమాదం



నల్లమల అటవీప్రాంతం

సాక్షి, నాగర్‌కర్నూల్: నాజూకైన శరీరం, బెదురు కళ్లు, రింగులు తిరిగిన కొమ్ములతో కృష్ణజింకలను పోలి ఉండే చింకారా అరుదైన వన్యప్రాణుల్లో ఒకటి. దేశంలో అరుదుగా కనిపించే ఈ ఇండియన్ గజల్ ఎక్కువగా గుజరాత్‌లో కొంతభాగం విస్తరించిన థార్ ఎడారితో పాటు కర్ణాటకలోని యాడహల్లి అభయారణ్యంలో మాత్రమే కన్పిస్తాయి. ఇలాంటి అరుదైన చింకారాల గెంతులకు నల్లమల అటవీ ప్రాంతం నెలవైంది. నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని మద్దిమడుగు రేంజ్‌లో పదుల సంఖ్యలో చింకారాలు ఉన్నాయి. అయితే అతి సున్నితమైన చింకారాల మనుగడకు వేట, మానవసంచారం రూపంలో ముప్పు పొంచి ఉంది.

అంతరించిపోతున్న దశలో చింకారా జాతి

దేశంలోనే అరుదైన చింకారా జాతి జింకలు అంతరించిపోతున్న దశలో ఉన్నాయి. దట్టమైన అడవిలో కాకుండా పూర్తిగా గడ్డి మైదానాలు, పొదలతో కూడిన అడవుల్లో నివసించేందుకే చింకారాలు ఇష్టపడతాయి. జనావాసాలు, మనుషులకు ఇవి దూరంగా ఉంటాయి. మనుషులు కన్పిస్తే చాలు భయంతో బెదిరిపోతాయి. చిన్నచిన్న శబ్దాలకు కూడా గజగజ వణికిపోతాయి. అతి సున్నితమైన ఈ జీవులకు వేట, మానవ సంచారం, ఇతర జంతువులతో ముప్పు ఉందని అటవీ అధికారులు చెబుతున్నారు. పులుల సంతతి పెరిగేందుకు, జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో చింకారాలు కీలకంగా పని చేస్తాయి. ఈ ప్రాంతాల్లో మానవ సంచారాన్ని తగ్గించేందుకు, వేటను నివారించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

చింకారాలు అతి సున్నితమైనవి



దేశంలో అరుదైన చింకారాలు నల్లమలలో ఉన్నాయి. జింక జాతికి చెందిన ఈ ప్రాణులు అతి సున్నితమైనవి. మనుషులు కన్పిస్తే బెదిరిపోతాయి. పులుల సంతతి పెరిగేందుకు, జీవవైవిధ్యంలో వీటి పాత్ర కీలకం. నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో వీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

– రోహిత్ గోపిడి, జిల్లా అటవీశాఖ అధికారి, నాగర్‌కర్నూల్ జిల్లా

జనసంచారం, ఆవుల మందలతో ముప్పు

నల్లమలలోని మద్దిమడుగు అటవీరేంజ్ పరిధిలో చింకారాల ఉనికి కన్పిస్తుండగా, ఈ ప్రాంతంలో జనసంచారం క్రమంగా పెరుగుతోంది. ప్రముఖ పుణ్యక్షేత్రం పబ్బతి ఆంజనేయస్వామి ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువగా భక్తుల తాకిడి ఉంటుంది. నల్లమలలో వేలసంఖ్యలో వదులుతున్న ఆవుల మందలతో కూడా చింకారాలకు ముప్పు పొంచి ఉంది. చిన్నచిన్న మొక్కలు, నేలపై తక్కువ ఎత్తులో ఉండే గడ్డి మాత్రమే చింకారాల ఆహారం కాగా, ఈ ప్రాంతంలో వందల సంఖ్యలో సంచరిస్తున్న ఆవుల మందలతో ఆహారపు పోటీ నెలకొంది. ఆవులను మేపేందుకు స్థానిక గ్రామాల నుంచి కాకుండా నల్లగొండలోని కంబాలపల్లి, చందంపేట పరిసర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో ఆవుల మందలను కృష్ణాతీరంలోని నల్లమలలో వదులుతున్నారు. జంతువుల నుంచి వన్యప్రాణులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధులకు చింకారాలు లోనయ్యే అవకాశం ఉంది. అరుదైన చింకారాల సంరక్షణకు అటవీశాఖ, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్స్ట్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

వైదిక నాగరికత - 2

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలివేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునా నదిని దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు. ఈ భౌగోళిక విస్తరణతోపాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతోపాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం' అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞ యాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికితోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలు, వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధాన్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశుపోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176 సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'ఆయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్థుల ప్రస్తావన ఉంది.



మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ ఆయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీతోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం, పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ'లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పద' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అథర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.

రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతోపాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలించకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా 'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే 'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుకలు. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు భాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్, అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్ణాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞ యాగాలు, బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలోని మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4) పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర
   3) క్షేత్రక 4) కర్షక
3. తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన - అతిథి
   2) దౌహిత్రి - కూతురు
   3) గోప - పశుకాపరి
   4) గవిష్టి - యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2; 5) 1.

అతి చిన్న ఎముక ఉండే అవయవం?



డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

నమూనా ప్రశ్నలు

1. హారిక బ్రెడ్‌ను ఆహారంగా తీసుకోవాలను కుంది. ప్యాకెట్ తెరిచి చూస్తే అది చెడిపోయినట్లు వాసన వచ్చింది. భూతద్దంతో పరిశీలిస్తే తంతువుల లాంటి పోగులు కనిపించాయి. ఆమె గుర్తించిన సూక్ష్మజీవులు ఏ రకానికి చెందుతాయి?
   1) శైవలాలు 2) శిలీంధ్రాలు
   3) బ్యాక్టీరియా 4) వైరస్
2. ఎల్లోస్పాట్‌లో ఎక్కువ సంఖ్యలో ఉండే కణాలు?
   1) దండాలు 2) రోమాలు
   3) కోనులు 4) ఉపకళా కణాలు
3. క్షయకరణ విభజనకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) ప్రత్యుత్పత్తి కణాల్లో జరుగుతుంది
   2) క్రోమోజోముల సంఖ్య సగానికి తగ్గించడానికి ఉపకరిస్తుంది
   3) జీవుల్లో క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి దోహదపడుతుంది
   4) ఇది శారీరక కణాల్లోనే జరుగుతుంది
4. సంక్లిష్ట కణజాలాలకు ఉదాహరణ ఇవ్వండి అని ఉపాధ్యాయుడు అడిగినప్పుడు నలుగురు విద్యార్థులు కిందివిధంగా సమాధానం చెప్పారు. వీటిలో సరైనవి ఏవి?
   శేఖర్ - దృఢ కణజాలం
   శ్వేత - మృదు కణజాలం
   శ్రియ - దారు కణజాలం
   శంకర్ - పోషక కణజాలం
   1) శేఖర్, శంకర్ 2) శ్వేత, శ్రియ
   3) శ్రియ, శంకర్ 4) శ్వేత, శేఖర్
5. క్లోమరసంలో కీమోట్రిప్సిన్ అనే ఎంజైమ్ ఏ పదార్థాన్ని వేటిగా మారుస్తుంది?
   1) కొవ్వులు - కొవ్వు ఆమ్లాలు
   2) ప్రోటీన్లు- పెప్టైడులు
   3) పిండి పదార్థాలు - మాల్టోజ్
   4) పిండి పదార్థాలు - పెప్టోనులు
6. మొక్కల్లో లెగుమినేసి - రైజోబియం మాదిరిగా జంతువుల్లో...?
   1) పీతలు - సముద్ర జంతువులు
   2) పీతలు - సీ ఎనిమోన్లు
   3) ఆల్చిప్పలు - జలగలు
   4) సముద్ర నక్షత్రం - షార్క్ చేప
7. రాడ్యులా కలిగి ఉన్న జీవికి ఉదాహరణ?
   1) దోమ 2) వానపాము
   3) నత్త 4) కప్ప
8. మానవ శరీరంలో అతి చిన్న ఎముకను కలిగి ఉండే అవయవం ఏది?
   1) కన్ను 2) చెవి
   3) ముక్కు 4) కపాలం
9. వినాళ గ్రంథులకు సంబంధించి కిందివాటిలో సరికాని ప్రవచనం?
   1) జీర్ణ రసాలను స్రవించవు
   2) అంతస్రావ గ్రంథులు అని కూడా అంటారు
   3) వీటి స్రావాలు నాళాల ద్వారా అవసరమైన చోటుకు ప్రవహిస్తాయి
   4) వీటి స్రావాలను హార్మోన్లు అంటారు
10. కిందివాటిలో వేటిలో పుపుస శ్వాసక్రియ జరగదు?
   ఎ. కప్ప బి. పావురం
   సి. చేపలు డి. టాడ్‌పోల్ లార్వా
   1) ఎ,బి 2) ఎ, డి
   3) బి, సి 4) సి, డి
11. ఎర్రరక్తకణాల శ్మశాన వాటిక అని ఏ అవయవాన్ని పేర్కొంటారు?
   1) ప్లీహం 2) కాలేయం
   3) ఊపిరితిత్తులు 4) ఎముక మజ్జ
12. విత్తనాలు లేని ఫలాలు ఏర్పడటానికి ఉపయోగపడే రసాయన పదార్థం?
   1) ఆక్సిన్లు 2) ఆబ్‌సిసిక్ ఆమ్లం
   3) ఇథిలిన్ వాయువు 4) జిబ్బరెల్లిన్లు
13. పన్నెండు జతల కపాల నాడుల్లో హృదయ స్పందన నియంత్రించే వేగస్ నాడీ ఎన్నోది?
   1) 9 2) 12 3) 10 4) 8
14. రవి కోపం, బాధ, ఆనందం లాంటి భావావేశాలను నియంత్రించుకోలేకపోతున్నాడు. అతడి మెదడులోని ఏ భాగంలో లోపం ఉండవచ్చు?
   1) అనుమస్తిష్కం 2) ద్వారగోర్థం
   3) మజ్జాముఖం 4) ఘ్రాణలంబికలు
15. సినర్జిడ్లు అనేవి మొక్కల్లోని ఏ భాగానికి సంబంధించినవి?
   1) పరాగకోశం 2) పిండకోశం
   3) వేరు పోషక కణాలు
   4) శిఖరాగ్ర మొగ్గలు
16. సయాన్, స్టాక్ అనేవి వేటిలో కనిపిస్తాయి?
   1) కోరకీభవనం 2) కణజాలవర్ధనం
   3) అంటుకట్టడం 4) ఫలదీకరణం
17. కిందివాటిలో ఏ రెండు జీవుల్లో బాహ్య ఫలదీకరణం జరుగుతుంది?
   ఎ. బొద్దింక బి. వానపాము
   సి. కప్ప డి. పాము
   1) ఎ, బి 2) బి, సి
   3) సి, డి 4) ఎ, డి
18. రాజేష్ వైద్యుడిని సంప్రదించినప్పుడు అతడు ప్రోటీన్లతో కూడిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల వ్యాధిగ్రస్థుడయ్యాడని తెలిపాడు. రాజేష్‌కు ఏ వ్యాధి వచ్చి ఉండవచ్చు?
   1) క్వాషియోర్కర్ 2) రికెట్స్
   3) అనీమియా 4) జీరాఫ్తాల్మియా
19. జ్యోతి అనే గృహిణి ఆహార పదార్థాలను అతిగా ఉడకబెడుతుంది. వారి కుటుంబ సభ్యుల్లో ఏ విటమిన్ లోపం ఉండవచ్చు?
   1) రెటినాల్ 2) కాల్సిఫెరాల్
   3) ఫోలిక్ ఆమ్లం 4) నియాసిన్
20. మలేరియా పరాన్నజీవి జీవితచక్రంలో షైజాంట్ దశ ఎక్కడ అభివృద్ధి చెందుతుంది?
   1) కాలేయ కణాలు
   2) లాలాజల గ్రంథులు
   3) ఎర్రరక్తకణాలు 4) జీర్ణాశయ గోడలు
21. ఎముకల సామాన్య విరుపునకు మరో పేరు?
   1) జటిల ఎముకల విరుపు
   2) మూసివేసిన ఎముకల విరుపు
   3) లేత ఎముక విరుపు
   4) బహిర్గత ఎముక విరుపు
22. కండరాలు ఉత్తేజం చెంది సంకోచస్థితిలోనే ఉండిపోవడాన్ని టిటాని అంటారు. ఈ స్థితికి కారణం?
   1) సమతుల ఆహార లోపం
   2) వాసోప్రెస్సిన్ తగినంత ఉత్పత్తి కాకపోవడం
   3) ఆహార పదార్థాల్లో తగినంత అయోడిన్ లేకపోవడం
   4) పారాథార్మోన్ అధికంగా ఉత్పత్తవడం
23. మెదడులోని ఏ భాగం అతి ముఖ్యమైన శ్వాసక్రియ, హృదయ స్పందన, రక్త పీడనం, శరీర ఉష్ణోగ్రత, లాలాజలం స్రవించడం లాంటి క్రియలను నియంత్రిస్తుంది?
   1) ద్వారగోర్థం 2) మజ్జాముఖం
   3) పిట్యూటరీ గ్రంథి
   4) మస్తిష్క గోళార్ధాలు
24. ఒక మొక్క కణం పూర్తి మొక్కను ఇవ్వగలిగే శక్తిని ఏమంటారు?
   1) టోటిపొటెన్సీ 2) కాలస్
   3) ఎక్స్‌ప్లాంట్ 4) సయాన్
25. కిందివాటిలో ఏ రెండు ఆవశ్యక అమైనో ఆమ్లాలు కావు?
   ఎ. ఐసోటానిన్ బి. గ్లిసరాల్
   సి. లైజీన్ డి. లిపిడ్లు
   1) ఎ, బి 2) బి, డి
   3) ఎ, సి 4) బి, సి
26. కిందివాటిలో నీటిలో, కొవ్వులో కరిగే విటమిన్లకు సంబంధించి సరైన క్రమం?
   1) BDE - ACK
   2) AEKC - BD
   3) BC - ADEK
   4) CD - ABEK
27. కిందివారిలో ఏ ఇద్దరు శాస్త్రవేత్తలు హెచ్ఐవీని కనుగొన్నారు?
   ఎ. ల్యూక్ మ్యాంట్ గ్నాయర్
   బి. ఇస్‌మార్క్
   సి. రాబర్ట్ గాలో
   డి. కార్ల్ లాండ్ స్టీనర్
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, డి 4) బి, సి
28. సముద్ర అడుగు భాగంలో ఉండే జీవులను ఏమంటారు?
   1) నెక్టాన్ 2) ప్లవకాలు
   3) బెంథాస్ 4) నిమ్మటిక్
29. సముద్ర మొక్కలు దేన్ని నిక్షిప్తం చేసుకుంటాయి?
   1) క్లోరిన్ 2) బ్రోమిన్
   3) అయోడిన్ 4) సోడియం
30. పప్పుధాన్యాల్లో ఎక్కువగా ఉండే పోషకాలు?
   1) మాంసకృత్తులు 2) పిండి పదార్థాలు
   3) కొవ్వులు 4) విటమిన్లు
31. జుట్టు రాలకుండా ఉండటానికి ఉపయోగించే కొంథారిడియస్ తైలాన్ని స్రవించేది?
   1) సిల్వర్ ఫిష్ 2) లక్కమాత్
   3) పట్టుమాత్ 4) బ్లిస్టర్ బీటిల్
32. కిందివాటిలో ఎలక్ట్రాన్ గ్రహీత కానిది?
   1) పైరిడాక్సిన్
   2) అడినోసిన్ ట్రై ఫాస్ఫేట్
   3) సైటోక్రోం 4) ప్లాస్టో క్వినోన్
33. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాస క్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారు?
   1) మెల్విన్ కాల్విన్ 2) ఆండ్రూ బెన్సన్
   3) సర్‌హాన్స్ క్రెబ్స్ 4) లిన్నియస్
34. కిరణజన్య సంయోగక్రియకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   1) ఉష్ణశక్తి వినియోగితమవుతుంది
   2) ఉష్ణశక్తి విడుదలవుతుంది
   3) వికిరణ శక్తి వినియోగమవుతుంది
   4) రసాయన శక్తి విడుదలవుతుంది
35. నికర ప్రాథమిక ఉత్పాదకతను ప్రదర్శించేవి?
   1) మొక్కలు 2) సూక్ష్మజీవులు
   3) జంతువులు 4) నిర్జీవ కారకాలు
36. వాణిజ్యపరంగా విలువైన నారను ఇచ్చే మొక్క శాస్త్రీయనామం?
   1) టెక్టోనా గ్రాండ్
   2) క్రొటలేరియా జన్సియా
   3) షోరియారాబస్టా
   4) ఇల్యూసిస్ కొరకాన
37. కిందివాటిలో వరి వంగడం కానిది?
   1) బాసుమతి 2) పూసామోతి
   3) హంస 4) రవి
38. శక్తివనరు మొక్కకు సంబంధించిన కింది ఏ మొక్కలో ప్రత్యేక వేర్లు కనిపిస్తాయి?
   1) యూకలిప్టస్ 2) కాజురైనా
   3) అవిసీనియా 4) లూసినా
39. పెట్రో పంటగా దేన్ని పిలుస్తారు?
   1) డాల్బర్జియా లాటిపోలియా
   2) డిజిటాలిస్
   3) రిసినస్ కామ్యునిస్
   4) టోడ్రియో కైకస్ బ్రానై
40. ఏకదళ బీజ వర్గానికి చెందిన కార్బోహైడ్రేట్లను కలిగిన మొక్కల్లో పుష్పవిన్యాస రకం?
   1) స్పాడిక్స్ 2) సమశిఖి
   3) కంకి 4) గుచ్ఛం
41. చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యలో ఉండే రక్త కణాలు?
   1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్తకణాలు
   3) లింఫోసైట్లు 4) థ్రాంబోసైట్లు

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 3	5) 2
6) 2	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 4	13) 3	14) 2	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 2	22) 4	23) 2	24) 1	25) 2
26) 3	27) 2	28) 3	29) 3	30) 1
31) 4	32) 2	33) 1	34) 3	35) 1
36) 2	37) 2	38) 3	39) 4	40) 3
41) 1				

గమనంలో ఉన్న వాహన చక్రాల చలనం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

యాంత్రిక శాస్త్రం

అభికేంద్ర బలం

స్థిర అక్షం చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తున్న వస్తువును వృత్తకేంద్రం వైపు కదులుతున్నట్లుగా పనిచేసే బలాన్ని 'అభికేంద్ర బలం' అంటారు.

- అభికేంద్ర బలం నిజమైన బలం (Real Force). ఈ బలాన్ని ఎల్లప్పుడూ వృత్తకేంద్రం సమకూరుస్తుంది.
- అభికేంద్ర బలం $F = \frac{mv^2}{r}$

$F = mr\omega^2 \quad [\because v = r\omega]$

ఉదాహరణలు:

- ఒక రాయికి దారాన్ని కట్టి వృత్తాకార మార్గంలో తిప్పుతున్నప్పుడు దానికి అవసరమైన అభికేంద్ర బలాన్ని మన భుజం నుంచి దారం ద్వారా అందజేస్తాం.
- సౌరకుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు,గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలకు అభికేంద్ర బలం అవసరం. ఈ బలాన్ని వాటి మధ్య పనిచేస్తున్న న్యూటన్ విశ్వ గురుత్వాకర్షణ బలాలు సమకూరుస్తాయి.
- పరమాణు కేంద్రకం చుట్టూ పరిభ్రమిస్తున్న ఎలక్ట్రాన్‌కు కావాల్సిన అభికేంద్ర బలాన్ని పరమాణు కేంద్రకంలోని కూలుంబ్ ఆకర్షణ బలాలు సమకూరుస్తాయి.
- వంపు మార్గంపై ప్రయాణిస్తున్న వాహనానికి కావాల్సిన అభికేంద్ర బలం వాహన చక్రాలు, రోడ్డుకు మధ్య ఉండే ఘర్షణబలం నుంచి లభిస్తుంది.
- తిరుతున్న గ్రామ్‌ఫోన్‌పై ఒక నాణేన్ని విసిరితే అది గ్రామ్‌ఫోన్ ప్లేట్‌తోపాటు తిరగడం ప్రారంభిస్తుంది. ఈ సందర్భంలో.. నాణేనికి కావాల్సిన అభికేంద్ర బలం కింద పేర్కొన్న అంశాల ద్వారా లభిస్తుంది.

ఎ. నాణేం, గ్రామ్‌ఫోన్ ప్లేట్ల మధ్య ఉన్న ఘర్షణ బలాలు

బి. నాణేం భారం.. w = mg

అపకేంద్ర బలం (Centrifugal Force)

స్థిర అక్షం చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తున్న ఒక వస్తువును వృత్త కేంద్రం నుంచి వెలుపలి వైపు తీసుకెళ్లడానికి ప్రయత్నించే బలాన్ని అపకేంద్ర బలం అంటారు.

$F = -\frac{mv^2}{r}$ (or) $f = -mr\omega^2$

– గుర్తు వ్యతిరేక దిశను సూచిస్తుంది.

- అభికేంద్ర బలం నిజమైన బలం. అపకేంద్ర బలం మిథ్యా బలం. అందువల్ల అభికేంద్ర, అపకేంద్ర బలాలను చర్య, ప్రతిచర్యల జంటలుగా భావించలేం.

ఉదాహరణలు:

1. ఒక రాయికి దారం కట్టి వృత్తాకార మార్గంలో తిప్పుతున్నప్పుడు దానికి కావాల్సిన అభికేంద్ర బలాన్ని మన భుజం అందిస్తుంది. దారాన్ని వదిలివేసినప్పుడు అపకేంద్ర బలం వల్ల ఆ రాయి వృత్తాకార మార్గానికి కోణీయంగా అవతలి వైపు వెళుతుంది.
2. సౌర కుటుంబంలోని న్యూటన్ విశ్వ గురుత్వాకర్షణ బలాలు అదృశ్యమైతే.. గ్రహాలు లేదా ఉపగ్రహాలకు కావాల్సిన అభికేంద్ర బలం లభించదు. అపకేంద్ర బలాల వల్ల ఆ గ్రహాలు/ఉపగ్రహాలు కక్ష్య మార్గానికి కోణీయంగా అవతలి వైపు వెళతాయి.

అపకేంద్ర బలం - అనువర్తనాలు

అపకేంద్ర యంత్రం (Centrifuse)

- అల్ప భారమున్న కణాల నుంచి అధిక భారమున్న కణాలను వేరు చేయడానికి అపకేంద్ర యంత్రాన్ని ఉపయోగిస్తారు. ఈ సాధనం అపకేంద్ర బలం ఆధారంగా పనిచేస్తుంది.

ఉపయోగాలు

1. మొలాసిస్ నుంచి చక్కెర స్ఫటికాలను వేరు చేయడానికి
2. తేనె తుట్టె నుంచి తేనెను వేరు చేసేందుకు
3. మజ్జిగ నుంచి వెన్న వేరు చేసేందుకు
4. రసాయనిక అవక్షేపాలను వేరు చేయడం కోసం
5. వాషింగ్ మిషన్లు, గ్రైండర్లు, మిక్సీలు మొదలైనవి అపకేంద్ర బలం సూత్రంపై ఆధారపడి పనిచేస్తాయి.

వంపు మార్గానికి గట్టు కట్టడం

- రోడ్ల మలుపు వద్ద దాని లోపలి అంచు కంటే అవతలి అంచును కొంచెం ఎక్కువ ఎత్తులో ఉండేలా నిర్మిస్తారు. దీన్నే వంపు మార్గానికి గట్టు కట్టడం అంటారు.
- వంపు మార్గం అవతలి అంచు, లోపలి అంచుతో చేసే కోణాన్ని గట్టు కోణం అంటారు.

గట్టు కోణం $Tan\theta = \frac{V^2}{rg}$

V = వంపు మార్గం వద్ద వాహనం వేగం

r = వంపు మార్గం వద్ద వ్యాసార్ధం

g = భూమి గురుత్వ త్వరణం

వంపు మార్గం వద్ద వాహనాన్ని సురక్షితంగా నడపడానికి కింద పేర్కొన్న జాగ్రత్తలు తీసుకోవాలి.


1. వంపు మార్గం వద్ద వాహనం వేగం తగినంత ఉండాలి. వాహన వేగం అవసరం కంటే ఎక్కువగా ఉంటే వంపు మార్గానికి అవతలి వైపు వాహనం బోల్తా పడుతుంది. ఒకవేళ వాహన వేగం నిర్ణీత వేగం కంటే తక్కువగా ఉంటే అది లోపలి వైపు బోల్తా పడుతుంది.
2. వంపు మార్గం వ్యాసార్ధం ఎక్కువగా ఉండాలి లేదా వాహనం రెండు చక్రాల మధ్య దూరం వీలైనంత ఎక్కువగా ఉండాలి.
3. వాహన గరిమనాభి స్థానం వీలైనంత కింది దిశలో అంటే తక్కువ ఎత్తులో ఉండాలి.

గరిమనాభి స్థానం (Center of gravity)

- వస్తువు లేదా వ్యవస్థలోని కణాల భారం మొత్తం ఆ వస్తువు లోపల ఏదో ఒక బిందువు వద్ద కేంద్రీకృతమై ఉంటుంది. వస్తువు భారం ఆ బిందువు ద్వారా కింది దిశలో పనిచేస్తుంది. ఆ బిందువును ఆ వస్తువు గరిమనాభి స్థానం అంటారు.
- క్రమ ఆకారం ఉన్న వస్తువుల్లో గరిమ నాభి స్థానం ఒక స్థిర బిందువు వద్ద ఉంటుంది. కానీ క్రమరహిత ఆకారం ఉన్న వస్తువుల్లో గరిమనాభి స్థానం ఒక బిందువు నుంచి మరో బిందువుకు మారుతుంది.

ఉదాహరణలు

- దీర్ఘ చతురస్రాకార/చతురస్రాకార వస్తువుల్లో ఎదురెదురు కర్ణాలు ఖండించుకునే బిందువుల వద్ద గరిమనాభి ఉంటుంది.
- త్రిభుజాకార వస్తువుల్లో వాటి ఎదురెదురు కర్ణాలు ఖండించుకునే బిందువు వద్ద గరిమనాభి స్థానం ఉంటుంది.
- గోళాకార, పళ్లెం ఆకృతిలో ఉన్న వస్తువుల్లో గరిమనాభి వాటి కేంద్రాల వద్ద ఉంటుంది.
- నిలబెట్టిన స్థూపం సగం ఎత్తు వద్ద గరిమనాభి స్థానం ఉంటుంది.



- పర్వతాన్ని అధిరోహిస్తున్న లేదా నిచ్చెన/మెట్లు ఎక్కుతున్న లేదా వీపు మీద ధాన్యం బస్తాను మోసుకెళ్తున్న వ్యక్తి వంగి నడుస్తాడు. దీంతో గరిమనాభి స్థానమైన స్థిర బిందువు నుంచి ఆ వ్యక్తికి అధిక స్థిరత్వం లభిస్తుంది.
- ఒక చేతిలో బరువును పట్టుకొని వెళ్తున్న వ్యక్తి రెండో వైపు వంగి నడుస్తాడు. దీని వల్ల అతడికి ఎక్కువ స్థిరత్వం లభిస్తుంది.
- వంపు మార్గం వద్ద మలుపు తిరిగే సైక్లిస్ట్ లోపలి వైపు వంగి ప్రయాణించడం వల్ల ఎక్కువ స్థిరత్వాన్ని పొందుతాడు.
- ఓడలు, పడవలు, స్టీమర్లలో గరిమనాభి స్థానం కింది దిశలో ఉండేలా జాగ్రత్తపడతారు. దీనివల్ల వాటికి ఎక్కువ స్థిరత్వం కలుగుతుంది.
- స్పోర్ట్స్ కార్లు, బైక్‌లకు చిన్న పరిమాణంలో ఉన్న చక్రాలను అమరుస్తారు. దీంతో ఈ వాహనాల గరిమనాభి స్థానం కింది దిశలో ఉంటుంది. దీంతో ఆ వాహనాలు మలుపులు తిరుగుతున్నప్పుడు ఎక్కువ స్థిరత్వం లభిస్తుంది.
- గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న నీటిని వేడిచేస్తే, అది వ్యాకోచిస్తుంది. అందువల్ల దాని గరిమనాభి స్థానం ఊర్ధ్వదిశలో స్థానభ్రంశం చెందుతుంది.
- ఊయలలో కూర్చొని ఉన్న బాలుడు నిలబడితే గరిమనాభి స్థానం ఊర్ధ్వదిశలో స్థానభ్రంశం చెందుతుంది.
- డ్రైవర్ సీటు కింది భాగంలో గరిమనాభి స్థానం ఉండేలా ట్రాక్టర్‌ను తయారు చేస్తారు. దీనివల్ల ట్రాక్టర్‌కు ఎక్కువ స్థిరత్వం కలుగుతుంది.

సరళ హరాత్మక చలనం (Simple Harmonic Motion)

- ఒక వస్తువు చలనం రెండు అంత్య బిందువుల మధ్య సమాన కాలాల్లో పునరావృతం అవుతున్నట్లయితే దాన్ని ఆవర్తన చలనం అంటారు.
- ఒకవేళ ఆ చలనం ఒక స్థిర బిందువుకు ఇరువైపులా జరుగుతున్నట్లయితే దాన్ని సరళ హరాత్మక చలనం అంటారు.

ఉదాహరణ:

- గోడ గడియారంలోని లోలకం, పదార్థంలోని కణాల కంపనాలు, కంపిస్తున్న శృతిదండం భుజాలు సరళ హరాత్మక చలనాన్ని చేస్తాయి.
- బ్లేడ్ ఒక చివరను బంధించి రెండో కొనను మీటితే అది చేసే కంపనాలు సరళ హరాత్మక చలనంలో ఉంటాయి.
- అలలు వస్తున్న నీటి ఉపరితలంపై ఉన్న చెక్క దిమ్మ సరళ హరాత్మక చలనం చేస్తుంది.
- 'U' ఆకారం ఉన్న గొట్టాన్ని కదిలిస్తే.. ఆ గొట్టంలోని ద్రవం కూడా ఇలాంటి చలనమే చేస్తుంది.
- పుటాకారంలో ఉన్న రోడ్డుపై బంతి లేదా వాహన చక్రం సరళ హరాత్మక చలనం చేస్తుంది.
- భూమిని ఒక పరిపూర్ణ గోళంలా భావించి, దాని ఉత్తర ధ్రువం నుంచి దక్షిణ ధ్రువానికి ఒక సొరంగం చేశామనుకోండి. అందులో ఒక వస్తువును జారవిడిస్తే అది రెండు ధ్రువాల మధ్య నిరంతరంగా సరళ హరాత్మక చలనం చేస్తుంది.

ఈ విధంగా డోలనాలు చేస్తున్న వస్తువు డోలనావర్తన కాలానికి సమీకరణం

$T = 2\pi\frac{\sqrt{R}}{g}$

R = భూమి సగటు వ్యాసార్ధం
= 6400 కి.మీ.

$g = 9.8\ ms^{-2}$

T = 84.6 నిమిషాలు
= 5000 సెకన్లు (సుమారుగా)

గమనిక: భూమికి అతి సమీపంలో పరిభ్రమిస్తున్న ఒక కృత్రిమ ఉపగ్రహం ఆవర్తన కాలం 84.6 నిమిషాలు లేదా 5000 సెకన్లు.

లిఫ్ట్‌లో ఒక వస్తువు దృశ్యాభారం

- ఒక వస్తువు నిజ భారం (w) = mg. ఒకవేళ ఆ వస్తువు లిఫ్ట్‌లో ఉన్నట్లయితే, దాని దృశ్యాభారం w = m[g±a]
- లిఫ్ట్ పైకి వెళుతున్నపుడు త్వరణాన్ని ధనాత్మకంగా, కిందికి వచ్చేటప్పుడు రుణాత్మకంగా తీసుకోవాలి.

సందర్భం 1: లిఫ్ట్ విరామస్థితిలో ఉన్నప్పుడు (V = 0) లేదా సమవేగంతో ($V_1 = V_2$...) పైకి లేదా కిందికి కదులుతున్నప్పుడు దాని త్వరణం శూన్యం. కాబట్టి ఆ లిఫ్ట్‌లో ఉన్న వస్తువు దృశ్యభారం w = m[g±a]

w = m[g+0]

w = mg. ఇది నిజమైన భారానికి సమానంగా ఉంటుంది.

సందర్భం 2: ఒకవేళ త్వరణం aతో లిఫ్ట్ పైకి కదులుతుంటే అందులోని వస్తువు దృశ్యభారం w = m[g+a] అవుతుంది. ఈ సందర్భంలో వస్తువు భారం పెరిగినట్లు అనిపిస్తుంది.

సందర్భం 3: త్వరణం aతో లిఫ్ట్ కిందికి దిగుతున్నపుడు అందులోని వస్తువు దృశ్యభారం w = m[g–a] అవుతుంది. వస్తువు భారం తగ్గినట్లుగా అనిపిస్తుంది.

సందర్భం 4: కదులుతున్న లిఫ్ట్ తీగలు తెగితే ఆ లిఫ్ట్ స్వేచ్ఛగా కిందికి పడుతుంది. ఈ సందర్భంలో లిఫ్ట్ త్వరణం భూమి గురుత్వ త్వరణానికి సమానంగా ఉంటుంది.

a = g కాబట్టి వస్తువు భారం

w = m×[g– a] = [g– g] = 0

వస్తువు భారరహిత స్థితిని పొందుతుంది.

సందర్భం 5: స్వేచ్ఛగా కిందికి పడుతున్న లిఫ్ట్ త్వరణం, భూమి గురుత్వ త్వరణం కంటే ఎక్కువగా ఉన్నట్లయితే..

[a > g]   w = m [g–a]

ఈ సందర్భంలో లిఫ్ట్ లోపల ఉన్న వ్యక్తి లిఫ్ట్ పై కప్పును ఢీకొంటాడు.

మాదిరి ప్రశ్నలు

1. పరావలయ మార్గంలో ప్రయాణిస్తున్న బాంబు మార్గ మధ్యలో విస్ఫోటనం చెందితే దాని ద్రవ్యరాశి కేంద్రం ప్రయాణించే మార్గం?
   1) వక్ర మార్గం 2) రుజు
   3) పరావలయం 4) దీర్ఘవృత్తాకారం
2. భ్రమణ చలనంలో ఉన్న వస్తువుకు ఉండే నిజమైన బలం?
   1) అభికేంద్ర బలం 2) అపకేంద్ర బలం
   3) విరూపకార బలం 4) బాహ్యబలం
3. భూమి చుట్టూ నిర్దిష్ట కక్ష్యలో పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహం నియంత్రణ కోల్పోతే ఏ మార్గంలో ప్రయాణిస్తుంది?
   1) వృత్తాకార మార్గానికి కోణీయంగా అవతలి వైపు
   2) వృత్తాకార మార్గానికి లంబంగా
   3) వృత్తాకార మార్గానికి సమాంతరంగా
   4) వృత్తాకార మార్గానికి 60 డిగ్రీల కోణీయంగా అవతలి వైపు
4. గమనంలో ఉన్న వాహన చక్రాల చలనం?
   1) సరళ హరాత్మక 2) రేఖీయ
   3) భ్రమణ 4) రేఖీయ, భ్రమణ

సమాధానాలు: 1) 3; 2) 1; 3) 1; 4) 4.

That exactly represents the relationship..

SYLLOGISMS

The questions on syllogisms are generally solved by using two methods:

1) Rules based method

2) Venn Diagram method

It is easy and preferable solving any kind of question by using Venn Diagram method.

Firstly, let us discuss how many types of statements are there.

1) All A's are B's

2) Some A' are B's

3) No A is B

4) Some A's are not B's

As you might have noticed above, there are four master statements of which two are affirmative statements and two are negative statements.

Sometimes, the given statements may look different. We have to observe the given statements for each question and find out under which of the above master statements they have to be treated.

Examples:

'Apple is Ball' is treated as 'All Apples are Balls'

'Many bats are cats' is considered as 'Some bats are cats'

'Cat is not Dog' is equivalent to 'No Cat is Dog'

'All Ears are not Fans' is understood as 'Some Ears are not Fans'

Venn Diagrams:

There are two kinds of diagrams..

1) Basic Diagram

2) Alternate Diagram

Basic Diagram: This diagram represents minimum relationship between the terms of the statement. Hence, the least possible relationship should be shown by minimum overlapping.

Alternate Diagrams: The Alternate Diagram/ Diagrams represent other possible ways of the extent of overlapping.

The master statements are represented in the form of venn diagrams as follows:

Checking the validity of conclusions:

There are two types of conclusions. Definite conclusions and Possible conclusions.

Let us discuss how to draw definite conclusions.











Based on the above diagrams we can draw the following definite conclusions for each statement.


As there are positive statements and negative statements even we have positive conclusions and negative conclusions.

Let us discuss how to draw the conclusions based on the given statements for each question.

The following points can be followed for easy understanding.

- Read the statements and try to find out whether any connecting terms are there between the statements.
- Draw the 'basic diagram' in a combined format that exactly represents the relationship of all the terms in the statements given.

Statements	Basic Diagram	Alternate Diagram1	Alternate Diagram2	Alternate Diagram3
All A's are B's				
Some B's are C's				
No C is D				
Some E's are not F's				



Syllogism means inference or deduction. Questions on syllogisms generally consist of two or three statements from which the conclusions are to be derived. The statements and conclusions given may vary from the commonly known facts. Hence, we should not look into the facts or reality of the statements given while deriving conclusions. We have to consider the given statements as true, though they may be abstract, and analyze them carefully in order to check whether the given conclusions can be logically derived from the statements.

BANK EXAMS

REASONING

Statement	Valid Definite conclusions	Conclusions which are definitely false
All A's are B's	Some B's are A's Some A's are B's ('some' is a part of 'all')	No A is B No B is A Some A's are Not B's
Some B's are C's	Some C's are B's	No C is B No B is C
No C is D	No D is C Some C's are Not D's Some D's are Not C's	All C's are D's All D's are C's Some C's are D's Some D's are C's
Some E's are Not F's	No definite conclusion	All E's are F's

NOW VERIFY THE VALIDITY OF THE GIVEN CONCLUSIONS

1. If Positive definite conclusion follows in the basic diagram, then, it is a VALID conclusion.
2. If Positive definite conclusion does not follow in the basic diagram, Then, it is NOT A VALID conclusion
3. If Negative definite conclusion does not follow in the basic diagram Then, it is NOT A VALID conclusion. But, verify whether COMPLEMENTARY PAIR is there.
4. We know that there are two Negative conclusions.

i) If negative definite conclusion **'No C is D'** follows in the basic diagram, then see whether **'Some C's are D's'** diagram can be drawn. If we are able to draw then it is NOT A VALID conclusion. If we are unable to draw then it is a VALID conclusion.

ii) If negative definite conclusion **'Some E's are Not F's'** follows in the basic diagram, then see whether **'All E's are F's'** diagram can be drawn. If we are able to draw then it is NOT A VALID conclusion. If we are unable to draw then it is a VALID conclusion


Note: We need not draw alternate diagrams to check the validity of Positive definite conclusions because when they follow in the minimum overlapping then they definitely follows in the maximum overlapping diagram (alternate diagrams).

MODEL QUESTIONS

1. Statements:

1) All Pens are cars

2) All cars are dogs




Now, based on this 'Basic Diagram' we can draw the following Conclusions:

1) All Pens are dogs
2) Some dogs are Pens
3) Some cars are Pens
4) Some dogs are cars

2. Statements:

All chairs are Red

No Red is Spoon



Now, based on this 'Basic Diagram' we can draw the following Conclusions:

1) Some Red are chairs
2) Some chairs are Red
3) No Spoon is Red
4) No chair is Red

Note: 'No Spoon is Red' is valid as we cannot draw alternate diag-ram' some spoons are Red'. Same is the case with 'No chair is Red'

COMPLEMENTARY PAIR

Sometimes certain pair of conclusions is given which are contradictory to each other.

For Instance, 'Some A's are B's 'contradicts 'No A is B'.

If 'Some A's are B's is true then 'No A is B' cannot be true at the same time and vice versa.

Similarly, 'All A's are B's' contradicts 'Some A's are NOT B's'

If 'All A's are B's' is true then 'Some A's are NOT B's' cannot be true at the same time and vice versa.

3. Statements:

1) Some cans are bottles

2) Some bottles are lids

Diagram-1





Diagram-2



Conclusions:

1) No can is lid
2) Some cans are lids

Explanation: In Diagram-1, 'No can is lid' is TRUE whereas 'Some cans are lids' is NOT TRUE. In Diagram-2, 'NO can is lid' is NOT TRUE whereas 'Some cans are lids' is TRUE.

Hence, we can conclude that 'Either 1 OR 2 follows'.

సాక్షి ప్లస్
గురువారం। 5-9-2024

బెజవాడ బతుకు చిత్రం

నాలుగు రోజులుగా నీళ్లలోనే జీవనం.. ఎటుచూసినా కనుచూపుమేరా నీరే... కానీ తాగేందుకు గుక్కెడు మంచినీళ్లు కరువు. పాలకోసం గుక్కపట్టి ఏడుస్తున్న పిల్లలు, మందులు లేక దైన్యంగా ఎదురుచూసే పెద్దలు, సరుకులన్నీ నీళ్లపాలు కావడంతో ఆకలి తీర్చుకునేందుకు సాయం కోసం ఎదురు చూపులు. అవకాశం ఉన్నచోట్ల అతి కష్టంమీద పిల్లల్ని, వృద్ధుల్ని తరలిస్తున్న దృశ్యాలు. ఆచూకీలేనివారి జాడకోసం బంధువుల వెతుకులాటలు, మార్చురీలో తమవారిని చూసి కుటుంబసభ్యుల ఆర్తనాదాలు.. ఇదీ బుధవారం విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితి.











సింగ్‌నగర్ ఏరియల్ వ్యూ



విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద చనిపోయిన వారి బంధువుల రోదన



సింగ్‌నగర్‌లో ఇంటిలో సామాన్లు శుభ్రం చేసుకుంటున్న మహిళ



నీట మునిగిన పాయకాపురం రైతుబజార్



డాబాకొట్టు సెంటర్ వద్ద నడుము లోతు నీటిలో నడుచుకుంటూ వస్తున్న బాధితులు





వాంబేకాలనీలో ఇంట్లో నీరు చేరడంతో రోడ్డు బయటే ఉన్న కుటుంబం



సింగ్‌నగర్‌లో వరద తగ్గడంతో సరుకులను శుభ్రం చేసుకుంటున్న దుకాణదారుడు